www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 9-7-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 84 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, శుక్లపక్షం; తిథి: తదియ ఉ. 6.09 తదుపరి చవితి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 7.53 తదుపరి మఖ; వర్జ్యం: రా. 9.04-10.49; దుర్ముహూర్తం: ఉ. 8.26-9.18, రా. 10.25-11.08; అమృతఘడియలు: ఉ. 6.09-7.53; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


SIDDHARTH INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY
Remember - even Core Engineering Graduates have a multitude of opportunities..
Entrepreneur
Opportunities even in Space and Defence sectors..
Skilled Technology Expert
4.5 LPA is not enough..
WE MAKE IT EASIER FOR YOU TO GET UPTO 40+ LPA SALARY
4.5+ LAKHS PER ANNUM
15+ LAKHS PER ANNUM
30+ LAKHS PER ANNUM
40+ LAKHS PER ANNUM
100% PLACEMENT ASSISTANCE
FEW OF OUR RECRUITERS
Infosys
tcs
IBM
wipro
ITC INFOTECH
TCL
HCL
Tech Mahindra
Capgemini
sure
Prodapt
Mphasis
Mindtree
BAHWAN CYBERTEK
TEST YANTRA
amazon
Cognizant
accenture
CONCENTRIX
virtusa
INNOEYE
HEXAWARE
KPIT
WHY SIDDHARTH...?
Need a Secure & High Package JOB
Placement Training from 1st Year itself. Top notch training MOUs with Multi National Companies.
Potential for 1000+ job opportunities by companies running on the campus.
Build your Own Business
Siddharth International Incubation Center nurtures the innovative ideas of the students and accommodates student STARTUP COMPANIES ₹ 7.3 Crores sanctioned by DST, Govt. of India. ₹ 10.5 Crores sanctioned under NIDHI-SSS. ₹ 2.5 Crores sanctioned under Accelerator Programme ₹ 25 Lakhs to ₹ 1 Crore through Seed Support System.
Research Centers
DYNED Lab and R&D Centre Laboratories set up by A.P. State Skill Development Centre. Research Laboratories on Cloud computing, Big Data, Automation Robotics, Cyber Security, SAP, Sales Force, Block Chain Technology, etc...
Students Achievement
2 Siddharth Students among 3 from India selected for GOOGLE I/O, California, USA. Siddharth Students attended Silicon Valley Meetup at Stanford University, California, USA. University Gold medals & "Prathibha Awards".
Our Students grabbed 1st prize at National Level IoT competition, IIT Varanasi(BHU) -TECHNEX.
Best Infrastructure
A/C Computer Laboratories with 2500 High Configured systems on a single floor. Digital & Virtual Classrooms.
Wi-Fi Campus, Hostel facility for Boys & Girls. 4000 seating Capacity A/C AUDITORIUM, GYM & Sports Facility.
EARN while LEARNING
A unique "Earn while Learning" scheme created by the Institute Five companies on the Campus running with the support of Final Year students.
DVG
Config USA
champs
eSoftLabs
dnd
HICORE
COLLABORATION WITH IIT-TIRUPATI
IIT TIRUPATI
Siddharth Institutions are under active consideration of IIT Tirupati for mentoring of its academic system of advanced learning and research.
INDUSTRY ACADEMIA PARTNERSHIP (IAP)
Programme is a new generation of Professional Education system in Science and Engineering. Siddharth Institutions tied up 34 Multi - National and International companies on Techno commercial Education that can make the students aware of contemporary needs and responsibilities with best Professional ability.
CENTERS OF EXCELLENCE
virtusa
Skill AP APSSDC
intel
IBM
DASSAULT SYSTEMES The 3DEXPERIENCE LAB
CMSEC
CM'S SKILL EXCELLENCE CENTER
Artificial Intelligence Machine Learning and Deep Learning Zonal Center, Civil & Mechanical Design Software Labs
SIEMENS TDS
1. DESIGN COMPUTER BASED TESTING LAB
2. HOME ELECTRONICS LAB
3. OFFICE ELECTRONICS LAB
4. HOME ELECTRICAL LAB
5. REFRIGERATION & AIR-CONDITIONING LAB
6. AUTOMOBILE TWO WHEELER LAB
7. AUTOMOBILE FOUR WHEELER LAB
OUR EMPLOYABILITY SKILLS & TRAINING FRAMEWORK
INTERNSHIPS, PROJECT WORK & INDUSTRY READINESS
CORPORATE TECHNICAL TRAINING ON (AI, IOT, ML, CLOUD COMPUTING, SAP CYBER SECURITY, ect...) & APTITUDE
SOFT SKILLS & PROGRAMMING COURSES IN JAVA & PYTHON
ENGLISH COMMUNICATION SKILLS
1st YEAR
2nd YEAR
3rd YEAR
4th YEAR
SMALL STEPS BIG LEAP!
TRAINING DELIVERED BY SOFTWARE PROFESSIONALS
ROBOTS
APSSDC-ECM CONVERGENCE TRAINING CENTER
(ADVANCED ROBOTIC LAB)
aps
APPLIED ROBOT CONTROL
Dr.K.Ashok Raju
Chairman
CONTACT FOR ADMISSIONS
+91 9396904599, 9704668399 www.sietk.org
KALYANI ADS

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నీట్ లీకేజీ సుస్పష్టం



- ఏ స్థాయిలో జరిగిందో ముందు గుర్తించాలి.. దాన్నిబట్టే మళ్లీ పరీక్షపై నిర్ణయానికి వీలు
- సామాజిక మాధ్యమాల ద్వారా పెద్దఎత్తున అందరికీ చేరితే రీ టెస్ట్ నిర్వహించాల్సిందే
- ఈ పరీక్ష పవిత్రత నిస్సందేహంగా దెబ్బతింది.. అందరికీ మళ్లీ పరీక్ష అంటే తీవ్ర నిర్ణయమే
- నీట్‌పై సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు.. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏపై ప్రశ్నల వర్షం
- దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని సీబీఐకి ధర్మాసనం ఆదేశం 2

మంగళవారం 9-7-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ

చెడ తిరుగుడు!

ఇరగదీసిన 'సీఎం సలహాదారు' ఇన్నోవా

- ఏప్రిల్ నెలలో 14,962 కిలోమీటర్లు
- సగటున రోజుకు 500 కి.మీ. ప్రయాణం
- ధనుంజయ రెడ్డి పేరుతో మంజూరు
- ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి వాడకం

ఎన్నికల ముందు ఎక్కడికి తిరిగారు?

డబ్బు మూటలు చేరవేసేందుకే వాడారా?

- ఇలా ఇంకెన్ని 'సీఎంవో' వాహనాలున్నాయి?
- విచారణతోనే అసలు విషయాలు బయటకు

మీకు సొంత కారు ఉందా? ఉంటే... రోజుకు ఐదొందల కిలోమీటర్లు తిరుగుతారా? ఒక రోజా.. రెండు రోజులూ కాదు! వరుసగా 30 రోజులు.. నిర్విరామంగా రోజూ 500 కిలోమీటర్ల చొప్పున తిరగగలరా? 'అంత రాచకార్యాలు మాకేముంటాయ్ బాస్! ఉన్నప్పటికీ మామూలు మనిషన్నవాడికి ఇంత తిరుగుడు సాధ్యం కాదు' అనేదే మీ సమాధానం కదూ! కానీ... గత ప్రభుత్వంలో 'అడ్వైజర్ టు సీఎం' పేరిట లీజుకు తీసుకున్న ఇన్నోవా కారు చెడ తిరుగుడు తిరిగింది. అది కూడా... ఎన్నికల సమయంలో, ఏప్రిల్ నెలలో! అది అంతలా ఎందుకు తిరిగింది? ఇందులో ఎవరు తిరిగారు? ఎవరు తిప్పారు? నోట్ల మూటలు చేర్చేందుకే దీనిని వాడారా? ఇవీ ఇప్పుడు తలెత్తుతున్న ప్రశ్నలు.



File No. GAD06-13021/858/2019-EVENTS SEC- D(PC)

Date: 01.05.2024

VEHICLE UTILIZATION CERTIFICATE

This is to certify that the INNOVA CRYSTA Vehicle Bearing No: AP 16 TJ 0001 was utilised by Advisor to CM. The above said vehicle was provided by M/S. SAILAJA CAR TRAVELS.

Log sheets enclosed here with (Period from 01/04/2024 to 30/04/2024)

Total K.M. Run during the Period: 14962KM

Bill No: 40/2024-25, Date: 01/05/2024, Rs 2,87,332/-

Signature of the PS to the Advisor

The Director,
Department of Protocol,
Block II, State Guest House,
Vijayawada, AP.

ఏపీ 16 టీజే 0001 ఇన్నోవా ఏప్రిల్ నెలలో 14,962 కిలోమీటర్లు తిరిగినట్లుగా నిర్ధారిస్తూ బిల్లుకు సలహాదారు కార్యాలయం ఇచ్చిన ధ్రువీకరణ పత్రం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఏపీ 16 టీజే 0001' అనే ఇన్నోవా ఏప్రిల్ నెలలో 14,962 కిలోమీటర్లు తిరిగింది. అంటే... సగటున రోజుకు 498.7 కిలోమీటర్లు. ఒక్కరోజు కూడా విరామంలేకుండా ఏప్రిల్ నెల మొత్తం ఈ ఇన్నోవా తిరుగుతూనే ఉంది. ఒక రోజు ఏకంగా 591 కిలోమీటర్లు తిరిగింది. ఈ ఇన్నోవాను ప్రొటోకాల్ విభాగం 'ముఖ్యమంత్రి సలహాదారు' ఆర్.ధనుంజయ రెడ్డికి కేటాయించింది. ధనుంజయ రెడ్డి ఉండేది విజయవాడలో! 'సలహాదారు' హోదాలో ప్రతి రోజూ తాడేపల్లిలోని జగన్‌ను కలిశారనుకున్నా... రానూపోనూ పాతిక కిలోమీటర్లు దాటదు!



మరి... రోజుకు సగటున 500 కిలోమీటర్లు ఎందుకు తిరిగినట్లు? అదీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా తిరగడమేమిటి? లాగ్‌షీట్‌లో ఏ రోజు ఎన్ని కిలోమీటర్లు తిరిగారన్న వివరాలు మాత్రమే ఉన్నాయి. కానీ... అందులో ఎవరు ప్రయాణించారు? ఎక్కడెక్కడ తిరిగారన్నది మాత్రం లేదు. 'వామ్మో.. ఇదేం తిరుగుడు' అని ఇప్పుడు అధికారులు విస్తుపోతున్నారు. ఆర్.ధనుంజయ రెడ్డి ఒకప్పుడు జగన్ పత్రికలో ఉద్యోగి! జగన్ అధికారంలోకి రాగానే సొంత పత్రికలోని ఉద్యోగులకు ప్రభుత్వంలో పునరావాసం కల్పించిన సంగతి తెలిసిందే. అలాగే... ధనుంజయ రెడ్డిని

మిగతా 11వ పేజీలో...



మంగళగిరిలో వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ షర్మిల, కేవీపీ. చిత్రంలో టీ-మంత్రులు భట్టి, పొంగులేటి

కడప నుంచే కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

ఉప ఎన్నిక వస్తే ఊరూరా తిరుగుతా: రేవంత్‌రెడ్డి

- ఏపీలో షర్మిలదే విపక్ష పాత్ర.. 2029లో ఆమే సీఎం
- ఇక్కడ బీజేపీ అంటే బాబు, జగన్, పవన్
- రాహుల్‌ను ప్రధాని చేయాలన్న వైఎస్ కోరిక తీరుద్దాం
- జయంతి సభలో తెలంగాణ ముఖ్యమంత్రి పిలుపు
- బీజేపీతో తెరవెనుక పొత్తు పెట్టుకున్నవారు వైఎస్ వారసులా?
- రాహుల్ గాంధీ భావి ప్రధాని: షర్మిల 12
- పీసీసీ సభకు తరలివచ్చిన నేతలు, తెలంగాణ మంత్రులు
- సోనియా, రాహుల్ ప్రత్యేక సందేశం

వేర్వేరుగా నివాళులు

- వైఎస్ సమాధి సాక్షిగా అన్నాచెల్లెళ్ల విభేదాలు మళ్లీ బహిర్గతం
- ఉదయాన్నే వచ్చి జగన్ నివాళి.. ఘాట్ వద్ద 15 నిమిషాలే
- కొడుకును చూసి విజయలక్ష్మి కన్నీరు.. పెద్దగా స్పందించని జగన్
- ఆ తర్వాత వచ్చి నివాళులర్పించిన పీసీసీ చీఫ్ షర్మిల 12

అందుబాటులోకి ఉచిత ఇసుక



- మధ్యంతర ఇసుక పాలసీ విడుదల.. జీవో 43 జారీ
- జగన్ హయాంలోని పాలసీల ఉపసంహరణ
- ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీలతో కాంట్రాక్టు రద్దు
- ఇకపై ప్రైవేటు అమ్మకాలు బంద్
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిపోల్లోనే ఇసుక
- బ్లాక్‌లో అమ్మితే కఠిన శిక్ష, జరిమానా 11

22 నుంచి అసెంబ్లీ.. ఓటాన్ అకౌంట్ మరో 4 నెలలు

అడ్మిషన్లలో అయోమయం

ఇంజనీరింగ్, డిగ్రీ కౌన్సెలింగ్‌పై అస్పష్టత

- ప్రారంభం కాని ఇంజనీరింగ్ ఆప్షన్లు.. 4 రోజులే గడువు
- వందకు పైగా డిగ్రీ కాలేజీలకు ఇంకా రాని అనుమతులు
- పాత అధికారులతోనే ఈ తిప్పలు 12

అక్టోబరు 3 నుంచి టెట్.. ఆగస్టు 3 వరకు దరఖాస్తులు

జగన్ అక్రమాస్తుల కేసులో..

నిమ్మగడ్డ ప్రసాద్‌కు చుక్కెదురు

2

క్వాష్ పిటిషన్ కొట్టేసిన టీ హైకోర్టు

సీబీఐ పేరుతో మాజీ ఎమ్మెల్యేకు టోకరా

వివిధ ఖాతాల నుంచి రూ.50 లక్షలు లూటీ 12

మెడ్‌టెక్ జోన్ మటాష్

- వైసీపీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం.. బాబు హయాంలో ఏర్పడిందన్న కారణంగా పక్కకు 12
- 'జోన్'ను సొంత జాగీరు చేసుకున్న ప్రైవేటు వ్యక్తి.. విశాఖ స్వామి, పూనం అండ
- సర్కారుకు ఆదాయం శూన్యం.. మంత్రి ముందు విషయాలు దాస్తున్న అధికారులు

జగన్ పాలన మరో ఎమర్జెన్సీ

- ఇందిరమ్మ చీకటి రోజులు గుర్తున్నట్టే వైసీపీ పాలనను కూడా జనం మరిచిపోరు 11
- బీజేపీ విస్తృతస్థాయి భేటీలో నేతల ఫైర్
- మోదీతోనే దేశాభివృద్ధి: కేంద్ర మంత్రి మురుగన్



ఉగ్రవాద దాడిలో గాయపడిన సైనికుడు

సైనిక వాహనంపై ఉగ్ర దాడి

» ఐదుగురు సైనికుల మృతి.. కశ్మీర్‌లోని కథువాలో ఘటన

» ముందు గ్రనేడ్ విసిరి.. వాహనం ఆగడంతో కాల్పులు

కథువా, జమ్మూ, జూలై 8: వరుస దాడులతో కశ్మీర్‌లో ఉగ్రవాదులు కలకలం రేపుతున్నారు. సోమవారం కథువా జిల్లా మాచేడి ప్రాంతంలో సైన్యం వాహనంపై పక్కా పథకం ప్రకారం కాల్పులకు పాల్పడ్డారు. మాచేడి-కిండ్లీ-మల్హార్ మార్గంలో పహారా కాస్తున్న సైనిక వాహనంపై తొలుత బడ్నోటా గ్రామం వద్ద గ్రనేడ్ విసిరారు. వాహనం ఆగిపోవడంతో కాల్పులు జరిపారు. దీంతో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దాడి అనంతరం సైనికులు ప్రతిఘటించడంతో ఉగ్రవాదులు సమీపంలోని అడవిలోకి పారిపోయారు. వారికోసం అదనపు బలగాలను రప్పించి గాలింపు చేపట్టారు. కాగా, ఆదివారం తెల్లవారుజామున రాజౌరీ వద్ద సైనిక శిబిరంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. సైనికులు ఎదురుకాల్పులు జరపడంతో పరారయ్యారు. కాగా, నెల రోజుల్లో కథువా జిల్లాలో నాలుగు ఉగ్ర దాడులు జరగడం గమనార్హం. కుల్గామ్ జిల్లాలోని రెండు గ్రామాల్లో శనివారం నుంచి ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయి. ఆరుగురు ఉగ్రవాదులు, ఇద్దరు సైనికులు మృతి చెందారు. కశ్మీర్‌లో వరుస ఉగ్రవాద దాడుల ఘటనల నేపథ్యంలో భారత సైన్యం తనిఖీలను విస్తృతం చేసింది. కుల్గామ్ జిల్లా చిన్నిగామ్ ఫ్రీసల్ గ్రామంలో ఓ ఇంట్లోనే ఉగ్రవాదులు బంకర్ ఏర్పాటు చేసుకున్న సంగతి ఈ సందర్భంగా వెలుగులోకి వచ్చింది. శనివారం ఇక్కడ ఎన్‌కౌంటర్ జరగ్గా నలుగురు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులు హతమయ్యారు. మరోవైపు గత నెలలో పర్యటకు బస్సుపై జరిగిన ఉగ్ర దాడి వెనుక లష్కరే తొయిబా ఉగ్రవాది సైపుల్లా సాజిద్ ఉన్నట్లు తేలింది.

నెలసరి సెలవులు మంచిదే కానీ.. అది మహిళలకే నష్టం కలిగించవచ్చు: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 8: మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులు తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నెలసరి సెలవులు ఇవ్వాలన్న నిర్ణయాన్ని సమర్థిస్తూనే.. దానివల్ల మహిళలకు ఉద్యోగావకాశాలు దూరం కావొచ్చని, ఇది వారికి నష్టం కలిగించొచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. వాస్తవానికి ఇది ప్రభుత్వ విధానపరమైన అంశమని.. దీనిలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది. ప్రస్తుతం దేశంలో రెండు రాష్ట్రాలు మహిళలకు నెలసరి సెలవులు మంజూరు చేస్తున్నాయని, మిగతా రాష్ట్రాలు కూడా దీన్ని అమలుచేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై కోర్టు సోమవారం విచారణ జరిపింది. 'నెలసరి సెలవులు తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని యాజమాన్యాలను బలవంతం చేస్తే అది మహిళలకు నష్టం కలిగించవచ్చు. మహిళలను ఉద్యోగాల్లో నియమించుకునే అవకాశాలు తగ్గిపోవచ్చు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రస్తుతం కేరళ, బిహార్‌లో మాత్రమే మహిళలకు నెలసరి సెలవులు ఇస్తున్నారు.

తండ్రీ కూతుళ్ల బంధంపై విషం

» లైంగిక కోణంలో చూస్తూ దారుణ వ్యాఖ్యలు చేసిన

» యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు, మరో నలుగురు

» వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్టు వెల్లడించిన డీజీపీ

» తొలుత ఆ వీడియోపై స్పందించిన హీరో సాయిధరమ్

హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఓ చిన్నారి తన తండ్రితో ఆడుకుంటున్న వీడియో చూస్తే ఎవరికైనా ముచ్చటేస్తుంది! కానీ.. ప్రణీత్ హన్మంతు అనే ప్రముఖ యూట్యూబర్, అతడితోపాటు మరో ముగ్గురు కలిసి.. ఆ వీడియోను వికృతమైన లైంగిక కోణంలో వక్రదృష్టితో చూస్తూ సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా.. సోషల్ మీడియా వేదికగా దారుణ వ్యాఖ్యలు చేశారు. వారిపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రణీత్‌హన్మంతు బృందం వీడియో చూసిన హీరో సాయిధరమ్ తేజ్.. తొలుత ఈ విషయాన్ని ట్విటర్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. సోషల్ మీడియా ప్రపంచం నిర్దాక్షిణ్యంగా, ప్రమాదకరంగా మారిందని.. దాన్ని నియంత్రించడం కష్టం కాబట్టి తమ పిల్లల ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇలాంటి రాక్షసులపై కఠినచర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం హీరో మంచు మనోజ్ కూడా అదే స్థాయిలో తన ఎక్స్ ఖాతాలో సదరు యూట్యూబర్‌పై విరుచుకుపడ్డారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులతో పాటుగా టెక్సస్ అధికారులు, యుఎస్ రాయబార కార్యాలయాన్ని ఆయన ట్యాగ్ చేసి ప్రణీత్ హన్మంతుపై చర్య తీసుకోవాలని కోరారు. హాస్యం పేరిట సామాజిక మాధ్యమాలలో ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్న అతడి ప్రవర్తన అసహ్యకరమైనది మాత్రమే కాక, ప్రమాదకరం కూడా అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే అంశంపై హీరో నారా రోహిత్ కూడా ప్రభుత్వ అధికారులను ట్యాగ్ చేస్తూ యూట్యూబర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ట్వీట్ చేశారు. దీంతో ఆ యూట్యూబర్ల నిర్వాకం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారు. చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, సదరు యూట్యూబర్‌పై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రణీత్ హన్మంతుతో పాటు మిగతావారిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఎఫ్ఐఆర్ దాఖలు చేశామని.. నిందితులపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని డీజీపీ రవిగుప్తా 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ఏపీ పోలీసులతోనూ సమన్వయం చేసుకుంటున్నామని మహిళా భద్రత విభాగం అధికారులు తెలిపారు. ఇక.. హాస్యం కోసం సోషల్ మీడియాను దుర్వినియోగం చేసేవారిపై చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఈ తరహా పోస్టులు పెట్టేవారిని పోలీసులు నిరంతరం గమనిస్తూనే ఉంటారని ఆమె తెలిపారు. చిన్నారుల భద్రత, సరైన పద్ధతిలో సోషల్ మీడియా వినియోగంపై పోలీసుల ద్వారా అవగాహన కల్పించడానికి చర్యలు చేపట్టామని 'ఎక్స్' వేదికగా తెలిపారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి ఖుష్బూ కూడా దీనిపై స్పందించారు. "ఇదంతా వారు ఏమాత్రం సిగ్గు, భయం లేకుండా సోషల్ మీడియా వేదికగా చేయడం. ఈ వ్యవహారంపై కఠినచర్యలు తీసుకోవాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణను కోరుతున్నాను" అని ఆమె ట్వీట్ చేశారు.

తప్పు చేశాను..

తండ్రీకూతుళ్ల వీడియోపై తాము చేసిన నీచమైన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. ఈ వివాదానికి మూలమైన ప్రణీత్ హన్మంతు బేషరతు క్షమాపణలు చెప్పాడు. తాను కావాలని అలా మాట్లాడలేదని.. హాస్యం చేద్దామనుకుంటే అది గీత దాటి తప్పుగా వెళ్లిందని సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. తన కుటుంబానికి దీనితో ఎలాంటి సంబంధం లేదని, దయచేసి వారిని దీనిలోకి లాగొద్దని వేడుకున్నాడు. తాను ఓ మంచి కొడుకు కాలేకపోయి ఉండొచ్చుగానీ.. వారు ప్రతి పిల్లవాడూ కోరుకునేటటువంటి మంచి తల్లిదండ్రులే అని పేర్కొన్నాడు. కాగా.. తన సినిమా ప్రమోషన్‌లో భాగంగా గతంలో ప్రణీత్ హన్మంతుకు ఇంటర్వ్యూ ఇచ్చిన హీరో కార్తికేయ, 'ఎక్స్' వేదికగా క్షమాపణలు చెప్పారు. 'సినిమా ప్రచారంలో భాగంగానే అతడికి ఇంటర్వ్యూ ఇచ్చాను. అందుకు ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నాను' అని కార్తికేయ పేర్కొన్నారు. అలాగే.. ఇటువంటి నీచమైన స్వభావం కలిగిన ప్రణీత్ హన్మంతుకు తన 'హరోం హర' సినిమాలో భాగం చేసుకున్నందుకు అసహ్యం వేస్తోంది అంటూ హీరో సుధీర్ క్షమాపణలు చెప్పారు. మరో హీరో విశ్వక్‌సేన్ కూడా దీనిపై స్పందించారు. నోటికొచ్చినట్లు అసభ్యకరంగా మాట్లాడి ఇతరులను బాధపెట్టడం స్వేచ్ఛ అనిపించుకోదని.. ఇలాంటి క్రూరులతో కలిసి సమాజంలో బతుకుతున్నందుకు బాధగా ఉందని ట్వీట్ చేశారు.

నీట్ లీకేజీ.. సుస్పష్టం

» ఏ స్థాయిలో జరిగిందో ముందు గుర్తించాలి

» దాన్ని బట్టే మళ్లీ పరీక్షపై నిర్ణయానికి చాన్స్

» నీట్‌పై సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు



నీట్ లీక్‌పై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇండియా కూటమి యువజన విభాగాల నిరసన ప్రదర్శన


న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నీట్ పేపర్ లీక్ అయ్యిందనేది స్పష్టమైందని, అయితే.. ఏ స్థాయిలో జరిగిందో, ఆ ప్రశ్నాపత్రం ఎంతమందికి చేరిందో గుర్తించాల్సిన అవసరం ఉన్నదని దేశ సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయ పడింది. ఆ అంశాలను బట్టే పరీక్షను మళ్లీ నిర్వహించాలా? వద్దా? అనేది నిర్ణయించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నీట్-యూజీ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించడం ఆఖరు ప్రత్యామ్నాయం మాత్రమేనని తేల్చిచెప్పింది. ప్రశ్నపత్రం సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున లీక్ అయినా రీ టెస్టుకు ఆదేశించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నీట్ నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకేజీకి, పరీక్ష రద్దుకు సంబంధించి దాఖలైన పలు వ్యాజ్యాలపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర సర్కారుపైన, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పైన ప్రశ్నల వర్షం కురిపించింది. "పేపర్ లీక్ ఎలా జరిగింది? మొదట ఎక్కడ జరిగింది? ప్రశ్నపత్రాలను నిందితులకు చేరవేసిన విధానం ఏమిటి? పేపర్ లీకేజీకి, పరీక్షకు మధ్య ఎంత సమయం ఉంది? పరీక్ష మొత్తాన్ని ప్రభావితం చేసే స్థాయిలో జరిగిందా? పేపర్ లీకేజీ ద్వారా లబ్ధి పొందిన విద్యార్థులను పూర్తిస్థాయిలో గుర్తించడం సాధ్యమేనా? పేపర్ లీకేజీ వ్యవహారంలో నిందితులను గుర్తించేందుకు తీసుకున్న చర్యలేంటి?" అంటూ కేంద్ర ప్రభుత్వంపైన, ఎన్‌టీఏపైన సీజేఐ ప్రశ్నల వర్షం కురిపించారు. "పేపర్ లీక్ అయినప్పటి నుంచి పరీక్ష జరిగేటప్పటికి తక్కువ సమయమే ఉందని తేలితే.. నీట్‌ను రద్దు చేసి మళ్లీ పరీక్ష పెట్టాలనే నిర్ణయానికి రాలేని పరిస్థితి ఏర్పడుతుంది" అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. "లీకేజీ ఒకవేళ సామాజిక మాధ్యమాల ద్వారా జరిగి ఉంటే పేపర్ విస్తృతంగా వ్యాపించే అవకాశం ఉంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా.. కేంద్రానికి, ఎన్‌టీఏకి కొన్ని ప్రశ్నలు సంధించి, వాటికి సమాధానాలు ఇవ్వాలని కోరుతూ తదుపరి విచారణను గురువారానికి (జూలై 11) వాయిదా వేశారు. అలాగే, నీట్ అక్రమాలపై దర్యాప్తు ఏ దశలో ఉందో తెలుపుతూ బుధవారానికల్లా నివేదిక ఇవ్వాలని సీబీఐని ఆదేశించారు.

సందేహమే లేదు..

"ఒక్కటి మాత్రం సుస్పష్టం. లీకేజీ జరిగింది. ఈ పరీక్ష పవిత్రత దెబ్బతిందన్న విషయంలో ఎలాంటి సందేహానికీ తావు లేదు. అయితే.. లీక్ ఏ స్థాయిలో జరిగిందన్నదే ప్రశ్న" అని విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. తప్పు చేసినవారిని పట్టుకోవాలంటే.. ముందు ఎక్కడెక్కడ లోపాలున్నాయో, తప్పులు జరిగాయో గుర్తించాలని పేర్కొంది. అలాంటివారిని గుర్తించగలిగితే.. వారికి మళ్లీ పరీక్ష పెట్టడం తప్పనిసరి కావొచ్చని అభిప్రాయపడింది. అంతే తప్ప అందరు అభ్యర్థులకూ మళ్లీ పరీక్ష పెట్టడం చాలా కష్టంతో కూడుకున్న పని, తీవ్రమైన నిర్ణయం అవుతుందని స్పష్టం చేసింది. "మళ్లీ పరీక్ష పెట్టాలనే నిర్ణయం తీసుకోవడానికి ముందు.. లీక్ ఎలా జరిగిందో మనం తెలుసుకోవాలి. ఇంకోసారి పరీక్షకు హాజరు కావాలని 23 లక్షల మందిని అడగడం చాలా కష్టం" అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా.. నీట్ పరీక్షకు సంబంధించి నిగ్గు తేల్చాల్సిన అంశాలు కొన్నింటిని ధర్మాసనం గుర్తించింది. అవేంటంటే..

- ఈ ఏడాది 720కి 720 మార్కులు వచ్చిన విద్యార్థులు మునుపెన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారిలో గ్రేస్ మార్కుల వల్ల ప్రయోజనం పొందినవారు ఎంతమంది?
- ఒక సెంటర్‌లో పరీక్ష రాయడానికి రిజిస్టర్ చేసుకుని.. ఆ తర్వాత పరీక్షా కేంద్రాన్ని దూరంగా ఉన్న మరోచోటుకు మార్చుకుని, ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థులు ఎందరు?
- నీట్‌లో అసాధారణంగా ఎక్కువ మార్కులు పొంది.. పన్నెండో తరగతిలో మాత్రం ఆ స్థాయిలో సామర్థ్యాన్ని చూపని విద్యార్థులు ఎవరు? (అయితే.. నీట్‌కు సిద్ధమైనంత కఠినంగా బోర్డు పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కారని ఈ సందర్భంగా కోర్టు అభిప్రాయపడింది).
- ఒక సబ్జెక్టులో అసాధారణంగా ఎక్కువ మార్కులు పొంది.. మరో సబ్జెక్టులో అతి తక్కువ మార్కులు పొందిన విద్యార్థులెవరు?

..అనే అంశాలపై దృష్టి సారించాలని పేర్కొంది. అయితే, ఒక్కచోట (పట్నాలో) మినహా పేపర్ మరెక్కడా లీక్ కాలేదని సొలిసిటర్ జనరల్ పేర్కొన్నారు. ఆ ఒక్కచోట కూడా కేసు దర్యాప్తులో ఉందని కోర్టుకు విన్నవించారు. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం కోర్టు.. పేపర్ లీక్ విస్తృతంగా జరిగిందా? ఆ లీకేజీ.. పరీక్ష నిర్వహణ ప్రక్రియ విశ్వసనీయతనే దెబ్బతీసిందా? ఏ తప్పూ చేయని విద్యార్థులను, తప్పు చేసి లబ్ధి పొందిన విద్యార్థులను వేరు చేయడం సాధ్యమేనా? ..అనే అంశాలను తాము పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. పరీక్ష పవిత్రతనే దెబ్బతీసే స్థాయిలో లీక్ జరిగి.. తప్పు చేసిన విద్యార్థులను గుర్తించలేని పరిస్థితి ఉంటే మాత్రం మళ్లీ పరీక్ష నిర్వహించక తప్పదని అభిప్రాయపడింది. అదే సమయంలో.. పేపర్ లీకేజీ కొన్ని ప్రాంతాలకే పరిమితమై, తప్పు చేసినవారిని గుర్తించగలిగితే 23 లక్షల మందికి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించడం అనుచితమే అవుతుందని పేర్కొంది.



ఈ వివరాలు ఇవ్వండి..

ఈ కింది అంశాలపై పూర్తివివరాలు సమర్పించాలంటూ కోర్టు ఎన్‌టీఏని ఆదేశించింది.

- పేపర్ ఎలా లీక్ అయ్యింది? అసలు మొట్టమొదటిగా పేపర్ ఎక్కడ లీక్ అయ్యింది?
- ఏయే ప్రాంతాల్లో లీకేజీ జరిగింది? ఎలా వ్యాప్తి చెందింది?
- పేపర్ లీక్ అయిన సమయానికి పరీక్ష జరిగిన సమయానికి మధ్య ఎంత తేడా ఉంది?
- లీక్ జరిగిన పరీక్షా కేంద్రాలు/నగరాలను గుర్తించడానికి ఎన్‌టీఏ తీసుకున్న చర్యలేమిటి?
- లీకేజీ వల్ల లబ్ధి పొందినవారిని ఎలా గుర్తిస్తున్నారు?
- ఇప్పటివరకూ అలాంటి అభ్యర్థులు ఎంతమందిని గుర్తించారు?

..అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది. అనుమానిత కేసులను గుర్తించేందుకు డేటా ఎనలిటిక్స్‌ను వాడే అవకాశం ఉందేమో పరిశీలించాలని కేంద్రానికి, ఎన్‌టీఏకి సూచించింది. అది సాధ్యమైతే తప్పుచేసినవారిని గుర్తించవచ్చని అభిప్రాయపడింది. అలాగే, నీట్ కౌన్సెలింగ్ పరిస్థితి ఏమిటో తెలపాలని ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా నీట్ పరీక్ష పవిత్రతను కాపాడేందుకు.. సబ్జెక్ట్ నిపుణులతో కమిటీ ఏర్పాటు సహా పలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది.

ఆ వివరం చెప్పొద్దు..

విచారణ సందర్భంగా కేంద్రానికి, ఎన్‌టీఏకి ధర్మాసనం పలు ప్రశ్నలను సంధించింది. "ప్రశ్నపత్రాన్ని ఒకరే తయారు చేస్తారా? లేక ఎక్కువ మందా? ప్రింటింగ్ ప్రెస్ ఏది? ఆ ప్రశ్నపత్రాలను ప్రింటింగ్ ప్రెస్‌కి ఎన్‌టీఏ ఎప్పుడు పంపింది? ప్రింటింగ్ ప్రెస్‌కి పంపడానికి చేసిన రవాణా ఏర్పాట్లు ఏంటి' అని పలు ప్రశ్నలు సంధించారు. దీనికి ఎన్‌టీఏ తరఫు న్యాయవాది.. ప్రశ్నపత్రాన్ని నిపుణుల బృందం సిద్ధం చేస్తుందని తెలిపారు. ప్రింటింగ్ ప్రెస్ ఇక్కడే ఉందని న్యాయవాది చెబుతుండగా.. సీజేఐ జోక్యం చేసుకుని.. "ప్రింటింగ్ ప్రెస్ ఎక్కడ ఉందో చెప్పనవసరం లేదు. ఎందుకంటే అదెక్కడ ఉందో తెలిస్తే వచ్చే ఏడాది మళ్లీ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. అయితే.. ప్రింటింగ్ ప్రెస్‌కు ఎలా పంపించారు, ఏ కస్టడీలో ఉంచారు? ప్రింట్ అయిన తర్వాత మళ్లీ ఎన్‌టీఏకి ఎలా పంపిస్తారో మాత్రం చెప్పండి ?" అన్నారు.

23 లక్షల జీవితాలతో..

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ 23 లక్షల కుటుంబాలతో ముడిపడిన అంశమని విచారణ సందర్భంగా సీజేఐ వ్యాఖ్యానించారు. అందుకే ఈ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాకే తీర్పు ఇస్తామని స్పష్టం చేశారు. "పేపర్ ఎంతమందికి లీక్ అయింది? అందులో ఎంతమంది ఫలితాలను నిలిపివేశారు? వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో మేము తెలుసుకోవాలని అనుకుంటున్నాం. ఒకవేళ ప్రభుత్వం పరీక్షను రద్దు చేయలేకపోతే, లీకేజీ ద్వారా ప్రయోజనం పొందినవారిని గుర్తించడానికి ప్రభుత్వం ఏం చేస్తోంది?" అని ప్రశ్నించారు. పరీక్షకు మూడు గంటల ముందే ప్రశ్నపత్రం లీకేజీ జరిగిందని ఎన్‌టీఏ న్యాయవాది తెలపగా.. సమగ్ర నివేదికను సమర్పించాలంటూ కేంద్రంతోపాటు ఎన్‌టీఏని ఆదేశించారు. నీట్ లీకేజీపై దర్యాప్తు ఎంతదాకా వచ్చిందో నివేదిక అందించాలని సీబీఐని ఆదేశించి.. విచారణను గురువారానికి వాయిదా వేశారు.



నేను మీ సోదరుడినవుతా

'మణిపూర్' బాధితులతో రాహుల్ గాంధీ



మణిపూర్‌లోని చురాచాంద్‌పూర్ పునరావాస కేంద్రంలో రాహుల్

ఇంఫాల్, జూలై 8: 'నేను మీ సోదరుడిగా ఇక్కడకు వచ్చాను. మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు మీతో కలిసి పనిచేస్తా' అని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మణిపూర్‌లో అల్లర్లు చెలరేగిన తర్వాత తానిక్కడకు రావడం మూడోసారని, పరిస్థితి కొంత మెరుగుపడి ఉంటుందని భావించానని, కానీ నిరాశే ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న 'మణిపూర్ అల్లర్ల' బాధితులను రాహుల్ సోమవారం పరామర్శించారు. జిరిబమ్, చురాచంద్‌పూర్ జిల్లాలోని శిబిరాలకు వెళ్లిన రాహుల్ అక్కడి వారితో మాట్లాడారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యటించి, బాధితులకు ఓదార్పు దక్కేలా చూడాలని ప్రధాని మోదీని కోరుతున్నానని, ఇక్కడ శాంతి నెలకొనేందుకు తాము చేయగలిగిందంతా చేస్తామని రాహుల్ స్పష్టం చేశారు. 'ప్రధాని రాష్ట్రంలో పర్యటించాలి. ప్రజల ఆవేదనను స్వయంగా వినాలి. అప్పుడే వారికి కొంత ఊరట లభించవచ్చు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇక్కడి ప్రజల బాగోగులపై రాహుల్‌కున్న చిత్తశుద్ధికి ఈ పర్యటనే నిదర్శనమని కాంగ్రెస్ తన 'ఎక్స్' సందేశంలో పేర్కొంది. ఈ సందర్భంగా రాహుల్‌తో ఒక బాలిక మాట్లాడుతూ ప్రధాని, రాష్ట్ర సీఎం తమ ప్రాంతాలకు ఒక్కసారి కూడా రాలేదని, తమ దుస్థితిని పార్లమెంట్‌లో చర్చకు తేవాలని కోరిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మేఘచంద్ర తెలిపారు. కాగా, గత ఏడాది మే నుంచి మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో దాదాపు 200 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. నిరాశ్రయులైన వేలాది మందిని పునరావాస శిబిరాలకు తరలించారు.

రాహుల్ సరిగానే మాట్లాడారు!

న్యూఢిల్లీ, జూలై 8: ఇటీవల లోక్‌సభలో రాహుల్ గాంధీ 'హిందువులు హింసాత్మకులు' అని వ్యాఖ్యానించినట్టు అధికార పక్షం తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ నేపథ్యంలో తాజాగా జ్యోతిర్మఠం 46వ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద రాహుల్‌ను సమర్థించారు. "రాహుల్ గాంధీ పూర్తి ప్రసంగాన్ని మేం చాలా శ్రద్ధగా విన్నాం. హిందూమతం హింసను తిరస్కరిస్తుందన్న విషయాన్ని ఆయన చాలా గట్టిగా నొక్కి చెప్పారు" అని శంకరాచార్య పేర్కొన్నారు.

అసోం వరద బాధితులను తక్షణం ఆదుకోవాలి: రాహుల్

సిల్‌చార్: 'అసోం ప్రజలకు అండగా ఉంటాను. పార్లమెంట్‌లో వారి తరఫున పోరాడే సైనికుడిలా నిలబడతాను. కేంద్ర ప్రభుత్వం తక్షణం వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకోవాలి' అని రాహుల్ తన 'ఎక్స్' సందేశంలో పేర్కొన్నారు. వరదల్లో మునిగిపోయిన ప్రజలకు ఊరట కలిగించేలా కేంద్రం వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 24 లక్షల మందిపై వరదలు ప్రభావం చూపాయని, 53 వేల మంది నిరాశ్రయులయ్యారని, 60మంది ప్రాణాలను కోల్పోయారని రాహుల్ ఆవేదన వ్యక్తంచేశారు.

పర్యావరణహితంగా ఉత్సవాలు

» మట్టి వినాయకుడిని పూజించేలా అవగాహన: పవన్



అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితంగా వేడుకలు, ఉత్సవాలు చేసుకుంటే మేలని, వినాయక చవితికి మట్టి విగ్రహాలను పూజించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన చేపట్టిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలపై వరుసగా సమీక్షలు నిర్వహిస్తూ ప్రజా ప్రయోజనాలు, అభివృద్ధి, అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు నిర్మాణాత్మక సూచనలు, అందుకు అనుగుణంగా ఆదేశాలిస్తున్నారు. ఆదివారం మంగళగిరిలో పవన్‌కల్యాణ్ నివాసంలో ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, పర్యావరణ ప్రేమికుడు విజయరామ్ కలిశారు. పర్యావరణానికి హాని చేయని విధంగా వస్తువుల వినియోగాన్ని పెంచేందుకు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన గోవింద భోగ్, రత్న చోడి, మాప్పిళ్లై సాంబ తదితర బియ్యం రకాలను చూపించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పర్యావరణహితమైన వస్తువుల వాడకాన్ని మన వేడుకలు, ఉత్సవాల్లో వాడితే మేలన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మట్టితో చేసిన వినాయక విగ్రహాలు పూజించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు.

విశ్వాస పరీక్ష నెగ్గిన హేమంత్ సోరెన్ సర్కారు

రాంచీ, జూలై 8: జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో నెగ్గింది. విపక్ష ఎమ్మెల్యేలు వాకౌట్ చేసి వెళ్లిపోయిన తర్వాత జరిగిన ఓటింగ్‌లో సోరెన్ సర్కారుకు అనుకూలంగా, విశ్వాస పరీక్షకు మద్దతుగా 45 మంది ఎమ్మెల్యేలు ఓటు వేశారు. బీజేపీకి చెందిన 24 మంది సభ్యులు, ఏజేఎస్‌యూకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు ముందు వాకౌట్ చేశారు. కాగా, మాజీ సీఎం చంపయి సోరెన్, మరో పది మంది హేమంత్ సోరెన్ కేబినెట్‌లో మంత్రులుగా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు.

జగన్ అక్రమాస్తుల కేసులో..

నిమ్మగడ్డ ప్రసాద్‌కు చుక్కెదురు

క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జగన్ అక్రమాస్తులకు సంబంధించిన వాన్‌పిక్ కేసులో నిందితుడిగా ఉన్న నిమ్మగడ్డ ప్రసాద్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తనపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టేయాలని పేర్కొంటూ ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు సోమవారం కొట్టేసింది. ప్రకాశం-గుంటూరు జిల్లాల మధ్య 'వాడరేవు నిజాంపట్నం పోర్ట్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ (వాన్‌పిక్) ఏర్పాటుకు రాస్-అల్-ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (రాకియా)ను ముందుపెట్టి 2008లో ర్యాక్, ఉమ్మడి ఏపీ మధ్య ఎంవోయూ జరిగేలా నిమ్మగడ్డ ప్రసాద్ చేశారని.. అప్పటి కేబినెట్‌ను తప్పుదోవ పట్టించడం ద్వారా 28 వేల ఎకరాలు దక్కించుకునేలా రాయితీ ఒప్పందం రూపొందించారని సీబీఐ కేసు నమోదు చేసింది. ప్రాజెక్టు పేరిట నిమ్మగడ్డకు చెందిన వాన్‌పిక్ ప్రాజెక్ట్స్‌కు భారీగా భూములు దక్కేలా చేయడంతోపాటు ర్యాక్ పాత్రను నామమాత్రం చేశారని.. జగన్ కంపెనీల్లో రూ.850 కోట్ల పెట్టుబడి పెట్టడం ద్వారా జగన్ అండదండలతో ఏపీ ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు, ఉచితాలు పొందారని.. అప్పటి ప్రభుత్వ శాఖలను, అధికారులను మేనేజ్ చేశారని చార్జిషీట్‌లో పేర్కొంది. జగన్ అందించిన సహాయ సహకారాలకు లంచంగా నిమ్మగడ్డ ఆయన కంపెనీలకు రూ.850 కోట్లు మళ్లించారని.. వాటిని పెట్టుబడులుగా చిత్రీకరించారని.. ఇదంతా క్విడ్ ప్రో కోలో భాగమని తెలిపింది. సీబీఐ కేసును కొట్టేయాలని నిమ్మగడ్డ 2021లో హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. 'జగన్ కంపెనీల్లో పిటిషనర్ అయిన నిమ్మగడ్డ ప్రసాద్ పెట్టిన పెట్టుబడులు క్విడ్ ప్రో కోలో భాగమా.. కాదా? దానిని లంచంగా భావించాలా అనే అంశాలు విచారణలోనే తేలాల్సి ఉంటుంది. నిమ్మగడ్డ కంపెనీని తమ భాగస్వామి అని రాకియా ప్రకటించకముందే ఏపీ ప్రభుత్వం-రాకియా మధ్య ఎంవోయూ జరిగే సందర్భంగా నిమ్మగడ్డ అక్కడ ఉన్నారని సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొంది. నిజంగా నిమ్మగడ్డ ఒప్పందం జరిగే సందర్భంగా ఉన్నారా లేదా? ఉంటే క్విడ్ ప్రో కోలో భాగంగానే ఉన్నారా అనే విషయం ట్రయల్‌లో తేలాల్సి ఉంటుంది. రెండు ప్రభుత్వాల మధ్య జరిగిన ఎంవోయూలో భాగంగానే వాన్‌పిక్ ప్రాజెక్టు కేటాయించారని.. రాయితీ ఒప్పందంలో భాగంగానే భూములు కేటాయించారు తప్ప.. అదనపు ప్రయోజనం ఏమీ లేదని పిటిషనర్ పేర్కొంటున్నారు. అయితే ఎంవోయూ, రాయితీ ఒప్పందాన్ని వివరణాత్మకంగా పరిశీలిస్తేనే ఆరోపణలు నిజమో కాదో తేలుతుంది. సీబీఐ ఆరోపణలు కేవలం వాన్‌పిక్ ప్రాజెక్టులో జరిగిన ఆర్థిక అక్రమాలకు మాత్రమే పరిమితం కాలేదు.. జగన్ కంపెనీల్లో నిమ్మగడ్డ లంచాలను పెట్టుబడుల రూపంలో పెట్టారని చార్జిషీట్ వెల్లడిస్తోంది. వాన్‌పిక్ ప్రాజెక్టు, అలాగే శంషాబాద్‌లో భూముల కేటాయింపు కేవలం యాదృచ్ఛికంగా జరిగాయా.. లేక విస్తృతమైన కుట్రలో భాగంగా జరిగాయా అన్న విషయం ట్రయల్‌లో తేలాల్సి ఉంటుంది. దురుద్దేశంతో క్రిమినల్ కేసు పెట్టారన్న పిటిషనర్ ఆరోపణలను మేం ఆమోదించడం లేదు. అలాగే కేసు పెట్టడానికి తగిన ఆధారాలు, కారణాలు లేవన్న వాదనను సైతం తిరస్కరిస్తున్నాం. మరోవైపు.. కంపెనీ చేసిన తప్పులకు చైర్మన్ అయిన తనను నిందితుడిగా చేర్చడం చెల్లదని.. 'సునీల్ భారతి మిట్టల్ వర్సెస్ సీబీఐ' కేసును పిటిషనర్ ఉదహరిస్తున్నారు. కానీ ప్రస్తుత కేసులో నిమ్మగడ్డ పాత్రపై చాలా స్పష్టమైన ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేక ఆరోపణలున్నప్పుడు కంపెనీ వ్యవస్థాపకులను నిందితులుగా చేర్చవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కంపెనీ తప్పులకు తాను బాధ్యుడిని కాదని పిటిషనర్ తప్పించుకోలేరు. సీబీఐ కోర్టు చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునేటప్పుడు ఆలోచించలేదనే వాదన సైతం ఆమోదయోగ్యం కాదు. నిమ్మగడ్డ పిటిషన్‌ను కొట్టేస్తున్నాం' అని తీర్పులో పేర్కొంది.

ఒక్కో పిటిషన్‌లో ఒక్కోలా..

ప్రస్తుత క్వాష్ పిటిషన్‌లో.. కంపెనీ చేసిన తప్పులకు చైర్మన్ బాధ్యుడు కాదని నిమ్మగడ్డ ప్రసాద్ చేసిన వాదనను తెలంగాణ హైకోర్టు తోసిపుచ్చింది. ఇదే చార్జిషీట్‌లో వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ కంపెనీ సైతం నిందితుల జాబితాలో ఉండగా.. రెండేళ్ల క్రితం కంపెనీపై కేసును హైకోర్టు కొట్టేసింది. అప్పుడు చైర్మన్ తప్పులకు కంపెనీని బాధ్యురాలిని చేయడం కరెక్ట్ కాదనే వాదనతో ఏకీభవించిన కోర్టు కంపెనీపై కేసు కొట్టేసింది. దీనిని వ్యతిరేకిస్తూ సీబీఐ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. తాజాగా కంపెనీ తప్పులకు యజమానిని బాధ్యుడిగా చేయడం చెల్లదని నిమ్మగడ్డ పేర్కొన్నారు. కంపెనీ తప్పులకు చైర్మన్ బాధ్యుడు కాదని.. చైర్మన్ తప్పులకు కంపెనీ బాధ్యత లేదని రెండు పిటిషన్లలో ఆయన వేర్వేరు వాదనలు వినిపించడం విశేషం.

టీటీడీలో ధర్మారెడ్డి, భూమన అక్రమాలు

- సీఐడీ లేదా విజిలెన్స్‌తో విచారణ చేపట్టాలి
- బడ్జెట్ పరిమితిని భారీగా పెంచి అవినీతి
- శ్రీవాణి టికెట్ల సొమ్ము ఎలా ఖర్చు చేశారో లెక్కల్లేవు
- గెస్ట్‌హౌస్‌లకు భూముల కేటాయింపుల్లో సుప్రీం మార్గదర్శకాల ఉల్లంఘన
- సీఎస్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకు అప్పటి టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి భారీగా అక్రమాలకు తెగబడ్డారని, వారిపై సీఐడీ లేదా విజిలెన్స్‌తో విచారణ జరిపి అక్రమాలను వెలికి తీయాలని తెలుగుదేశం పార్టీ నేతలు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రాజశేఖర్‌రెడ్డి మాదిరిగానే నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్ అధికారికి కాకుండా ధర్మారెడ్డిని జేఈఓగా, తర్వాత ఈఓగా జగన్ ప్రభుత్వం నియమించిందన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునే బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో తనకున్న పరిచయాలను దుర్వినియోగం చేస్తూ ఎన్నికల సమయంలో వైసీపీకి విరాళాల సేకరణకు మార్గంగా ధర్మారెడ్డి వ్యవహరించారని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ సీఎస్‌ను కలిసి వివరించారు. తిరుమలలో గెస్ట్‌హౌస్‌లకు కేటాయించే భూముల్లో కూడా ధర్మారెడ్డి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించలేదన్నారు. పర్ణిచర్ల మార్పు పేరుతో రూ.కోట్లు పక్కదారి పట్టించారని, భక్తులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నా... జగన్‌పై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, వైసీపీ రాజకీయ వ్యవహారాలు చక్కబెట్టేందుకు ధర్మారెడ్డి ఢిల్లీకి తరచూ వెళ్తుండేవారని పేర్కొన్నారు. ధర్మారెడ్డి మొబైల్ ఫోన్ కాల్ డేటాను పరిశీలిస్తే క్రిమినల్ కేసుల్లో జగన్‌ను కాపాడేందుకు ఢిల్లీలో ఆయన రాజకీయ ప్రమేయం, కుతంత్రాలు స్పష్టంగా తేటతెల్లమయ్యాయని తెలిపారు. రూ.2 కోట్ల విలువ గల డైమండ్ వాచ్‌ను హైకోర్టు జడ్జికి ఆఫర్ చేశారనే వదంతులు కూడా ధర్మారెడ్డిపై ఉన్నాయని గుర్తు చేశారు. బడ్జెట్ పరిమితిని అధిగమించి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రూ.475 కోట్లకు పెంచగా.. అనంతరం చైర్మన్ అయిన కరుణాకర్‌రెడ్డి భారీగా రూ.1772 కోట్లకు పెంచి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. శ్రీవాణి టికెట్లు పేరుతో రూ.10,500 వసూలు చేసి, ఆ డబ్బులు ఏ రకంగా ఖర్చు చేశారో చూపించలేదన్నారు. ఎవరు టీటీడీకి విరాళాలు ఇచ్చినా అవి శ్రీవాణి ట్రస్ట్ అకౌంట్‌లోకి జమవ్వడంతో టీటీడీ బోర్డు అనుమతి లేకుండానే ఏ పనైనా చేసుకునేలా అవకాశం కల్పించారని తెలిపారు. పద్మావతి ఆసుపత్రి, బాలాజీ ఇన్‌స్టిట్యూట్, స్విమ్స్ కార్డియో న్యూరో బ్లాక్ నిర్మాణాల్లో కూడా భారీ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఆసుపత్రుల నిర్మాణానికి రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లు విరాళం ఇచ్చే భక్తులకు 531 ఉదయాస్తమాన సేవా టికెట్లు ఇచ్చి భారీ కుంభకోణానికి తెరలేపారన్నారు. రూ.200 కోట్లతో తిరుమలలో కర్ణాటక ప్రభుత్వ యాత్రా సముదాయం నిర్మాణం విషయంలో అనుమతుల కోసం టీటీడీ కర్ణాటక ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిందన్నారు. వైసీపీ హయాంలో తిరుమలలో గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం, విరాళాలు, వ్యక్తిగత దాతల విషయాల్లో టీటీడీ పూర్తిగా భిన్నమైన పద్ధతిని అవలంబించిందని చెప్పారు. తిరుమల కాంప్లెక్స్ 5 నిర్మాణంలో రూ.98కోట్లు కమీషన్ల రూపంలో పక్కదారిపట్టాయన్నారు. వైసీపీ బడా నాయకుల సిఫార్సు చేసిన వారినే టీటీడీలో సలహాదారులుగా, ఉద్యోగులుగా ధర్మారెడ్డి నియమించారని వివరించారు.

లక్ష చేతిలో పెట్టి కిడ్నీ కాజేశారు..!



కిడ్నీ ఆపరేషన్ గాయాన్ని చూపుతున్న మధుబాబు

- తొలుత రూ.30 లక్షలు ఇస్తామని ఒప్పందం
- ఆపరేషన్ చేసి కిడ్నీ తీసుకున్నాక అంతే సంగతులు
- డబ్బుల కోసం నిలదీస్తే చంపేస్తామని బెదిరింపులు
- విజయవాడలో కిడ్నీ రాకెట్ ముఠా ఆగడాలు
- న్యాయం కోరుతూ గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు

గుంటూరు, జూలై 8: ఆర్థిక ఇబ్బందులు... అప్పుల బాధలు... లోన్ యాప్ వేధింపులను ఆసరాగా చేసుకుని కిడ్నీ రాకెట్ ముఠా ఓ నిరుపేద యువకుడిని మోసం చేసింది. కిడ్నీ దానం చేస్తే రూ.30 లక్షలు ఇస్తామని ఆశ చూపించి.. లక్ష రూపాయలు చేతిలో పెట్టి కిడ్నీ కొట్టేసింది. పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన ఈ ఈ కిడ్నీ రాకెట్ వ్యవహారం విజయవాడలో వెలుగుచూడగా.. బాధితుడు సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీని ఆశ్రయించాడు. మధుబాబు ఫిర్యాదు మేరకు.. పల్నాడు జిల్లా దాచేపల్లి ప్రాంతానికి చెందిన గార్లపాటి మధుబాబుకు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. శైలు అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్న మధు ఆ తర్వాత కాపురాన్ని గుంటూరుకు మార్చాడు. వీరికి 9 ఏళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. మధుబాబు గుంటూరులో కూరగాయల వ్యాపారం, నూడిల్స్ బండి నడిపాడు. వ్యాపారాల్లో నష్టాలు వచ్చాయి. కరోనా సమయంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. రూ.8 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. లోన్ యాప్‌ల్లోనూ అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో ఫేస్‌బుక్‌లో కిడ్నీ డోనర్ కావాలనే ప్రకటన మధుబాబును ఆకర్షించింది. దీంతో తన కిడ్నీ దానం చేసి వచ్చిన సొమ్ముతో అప్పులు తీర్చేసుకోవచ్చని ఆశపడ్డాడు. కిడ్నీ దానం చేసేందుకు ఫేస్‌బుక్ లింక్‌పై నొక్కాడు. కొద్దిరోజుల తర్వాత బాషా (9390003970) అనే వ్యక్తి ఫోన్ చేసి మధ్యవర్తి వెంకట్ నంబర్ (8899269999) ఇచ్చాడు. దీంతో మధుబాబు ఆ నంబర్‌కు కాల్ చేశాడు. బి-పాజిటివ్ బ్లడ్ గ్రూపు ఉన్న వ్యక్తి కిడ్నీ దానం చేస్తే రూ.30 లక్షలు వరకు ఇప్పిస్తానని వెంకట్ చెప్పాడు. రోగి బావ అయిన నిమ్మకాయల సుబ్రహ్మణ్యంను పరిచయం చేసి ఆన్‌లైన్ ద్వారా కొద్దిపాటి డబ్బు పంపి నమ్మకం కలిగించాడు. కిడ్నీ దానం చేయాలంటే సమీప బంధువై ఉండాలని చెప్పి మధుబాబుతో పాటు ఆయన సంబంధీకులందరి ఆధార్ కార్డులు, ఇతర వివరాలను మార్పించాడు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను కూడా సిద్ధం చేశాడు. తన ఇష్టపూర్వకంగానే కిడ్నీ దానం చేస్తున్నానని మధుబాబుతో చెప్పిస్తూ.. వెంకట్, కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసే 'శరత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ' ఆస్పత్రి వైద్యుడు జి.శరత్‌బాబు కలిసి వారికి అవసరమైన విధంగా వీడియోలు తీసుకున్నారు.

ఎడమ కిడ్నీ అని చెప్పి...

జూన్ 10న మధుబాబును ఆస్పత్రిలో చేర్చుకుని.. 15న కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. తొలుత ఎడమ పక్క కిడ్నీ తీసుకుంటామని చెప్పిన వైద్యుడు ఆపరేషన్ సమయంలో కుడివైపు కోత పెట్టడంతో ఆపరేషన్ సమయంలోనే మధుబాబు ప్రశ్నించాడు. కానీ.. డాక్టర్ అతన్ని దూషించి బెదిరించాడు. ఆపరేషన్ పూర్తయ్యాక పరిశీలించగా తన కుడివైపు కిడ్నీ తీసి కేతినేని వెంకటస్వామి అనే వ్యక్తికి అమర్చారని మధుబాబు చెప్పారు. గతేడాది నవంబరులో తాను పరిచయమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో ఫోన్ పే ద్వారా రూ.59,500 ఇచ్చారని, ఆస్పత్రిలో చేరే సమయంలో రూ.50 వేలు ఇచ్చారని, ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే సమయంలో తనకు రావలసిన మొత్తం ఇవ్వాలని అడిగితే.. నీకు ఇష్టమయ్యే కదా కిడ్నీ ఇచ్చావు' అన్నారు. గట్టిగా అడిగితే "ఏం చేస్తావురా.. నీకు డబ్బులు రావు, ఏం పీక్కుంటావో పీక్కో.. దిక్కున్న చోట చెప్పుకో. కిడ్నీ తీసిన వాళ్లం.. నీ ప్రాణం తీయడం పెద్ద లెక్కా.. చంపేస్తాం' అని బెదిరించారు. తనను మోసం చేసిన బాషా, వెంకట్, సుబ్రహ్మణ్యం, డాక్టర్ శరత్‌బాబు, వెంకటస్వామిలపై చట్టం ప్రకారం చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని మధుబాబు వాపోయాడు. విజయవాడలోని శరత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీఆస్పత్రి, దానికి అనుబంధంగా ఉండే మరో ఆస్పత్రిలోనూ ప్రతినెలా 5-10 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నారని తెలిసిందని చెప్పాడు.

విజయవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో కిడ్నీ రాకెట్ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. గతంలో స్వర ఆసుపత్రిపై ఆరోపణలు రాగా, తాజాగా శరత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రిపై ఆరోపణలు వచ్చాయి. తన నుంచి కిడ్నీ తీసుకుని మోసం చేశారని గార్లపాటి మధుబాబు గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ ఆరోపణలను డాక్టర్ శరత్‌బాబు ఖండించారు. కేతినేని వెంకటస్వామికి గత నెలలో కిడ్నీ మార్పిడి చేశామని, ప్రభుత్వ నిబంధనలు పాటించి, ఆరోగ్యశ్రీ పథకంలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఈ ఆపరేషన్ చేశామని చెప్పారు. అవయవదానంలో ఆర్థిక లావాదేవీలకు అవకాశం ఉండదన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల నుంచి అనుమతి వచ్చాకే రోగి కుటుంబ మిత్రుడైన మధుబాబు కిడ్నీని వెంకటస్వామికి అమర్చామని చెప్పారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చేశాం

- ఆరోపణలను ఖండించిన డాక్టర్ శరత్‌బాబు

బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రికి భారీ వితరణ

- రూ.కోటి ఆస్తి రాసిచ్చిన ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్
- సీఎం చంద్రబాబుకు పత్రాల అందజేత



రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.రమాదేవి పంపిన రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వెదురుకుప్పం, జూలై 8: బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఓ ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కోటి రూపాయల విలువైన ఆస్తిని వితరణ చేశారు. ఆ పత్రాలను ఆమె సంరక్షకుడు సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అందజేశారు. తెనాలికి చెందిన పి.రమాదేవి(82) శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆమె ముగ్గురు కుమారులు ఆంధ్ర మెడికల్ కళాశాలలో చదువుకుని అమెరికాలో స్థిరపడ్డారు. రమాదేవి ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో ఆమె బెంగళూరులో తనకు ఉన్న కోటి రూపాయల విలువైన ఆస్తిని బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రికి విరాళంగా ఇచ్చేశారు. ఆ పత్రాలను సోమవారం చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం సీఆర్‌కండ్రిగకు చెందిన ఆమె సంరక్షకుడు పేట చూడామణి రెడ్డి, అదే గ్రామానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సీతా దయాకర్‌రెడ్డి, అమరావతి సచివాలయ క్యాంటీన్ ఇన్‌చార్జి పేట ప్రతాప్ రెడ్డిలతో కలిసి అమరావతిలో సీఎం చంద్రబాబుకు అందజేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు 9 కర్ణాటక ఏనుగులు

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల రిజర్వు ఫారెస్టు ప్రాంతానికి శిక్షణ పొందిన 9 ఏనుగులను పంపేందుకు కర్ణాటక రాష్ట్ర అటవీశాఖ అంగీకరించింది. నల్లమల అటవీ సంపద, వన్యప్రాణులను దుండగుల నుంచి రక్షించుకునేందుకు శిక్షణ పొందిన ఏనుగుల ద్వారా పర్యవేక్షించాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు కర్ణాటక అటవీశాఖకు విన్నవించారు. స్పందించిన కర్ణాటక అటవీశాఖ అధికారులు 9 ఏనుగులను ఇవ్వాలని నిర్ణయించారు.

చురుగ్గా నైరుతి.. కోస్తాకు భారీ వర్షసూచన

- అల్పపీడనంగా మారనున్న ఉపరితల ఆవర్తనం?

విశాఖపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు ఆనుకుని పశ్చిమ మధ్య వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మీద నుంచి తూర్పు, పడమరగా ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో రుతుపవన ద్రోణి తూర్పుభాగం రాయపూర్, కళింగపట్నం మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించింది. దీంతో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారాయి. సోమవారం అనేకచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు, కోస్తాలో కొన్నిచోట్ల భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న ఆవర్తనం ఉత్తర ఒడిశా వైపు పయనించే క్రమంలో రానున్న రెండు రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాగా, ప్రతికూల వాతావరణం కారణంగా సోమవారం విశాఖకు వచ్చి వెళ్లాల్సిన రెండు విమానాలు రద్దయినట్లు అధికారులు ప్రకటించారు.

రూ.160కే కిలో కందిపప్పు!

- కిలో బియ్యం రూ.48.. స్టీమ్డ్ రైస్ రూ.49
- 11 నుంచి రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయం
- రైస్‌మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో మంత్రి నాదెండ్ల చర్చలు
- ఆగస్టు నుంచి రేషన్‌కార్డుదారులకు రాయితీ కందిపప్పు

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో కిలో కందిపప్పు రూ.160కే లభించనుంది. కిలో బియ్యం రూ.48కు, స్టీమ్డ్ రైస్ కిలో రూ.49 చొప్పున విక్రయించనున్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో అసాధారణంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం విజయవాడలోని పౌరసరఫరాల ప్రధాన కార్యాలయంలో రైస్‌మిల్లర్లు, హోల్‌సేల్ డీలర్లు, ఎగుమతిదారులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. బియ్యం, కందిపప్పు ధరలు తగ్గించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. పౌరసరఫరాల కమిషనర్ సిద్ధార్థ జైన్, పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండ్యన్ కూడా చర్చల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.181 ఉండగా.. రైతు బజారుల్లో రూ.160కు విక్రయించేందుకు వ్యాపారులు అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. అలాగే స్టీమ్డ్ బియ్యం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 55.85 ఉండగా, రైతుబజార్లలో రూ.49కు, ముడి బియ్యం కిలో రూ.52.40 ఉండగా.. రైతుబజార్లలో రూ.49కు విక్రయించడానికి వర్తకులు అంగీకరించారని మంత్రి వివరించారు. ఈనెల 11వ తేదీ నుంచి రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా వీటి విక్రయానికి తగిన ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాల్లోనూ ప్రత్యేక యంత్రాంగం

జిల్లాస్థాయిల్లో కూడా ధరల నియంత్రణపై చర్చించేందుకు రైస్‌మిల్లర్లు, డీలర్లు, టోకు వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలని పౌరసరఫరాల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ధరలు తగ్గించేలా వారిని ఒప్పించే బాధ్యతలను జిల్లాల్లో పౌరసరఫరాల అధికారులకు అప్పగించాలని నిర్ణయించింది. దీంతో పౌరసరఫరాలశాఖ కమిషనర్ సిద్ధార్థజైన్ ఈనెల 5వ తేదీన అన్ని జిల్లాల డీఎస్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారి నేతృత్వంలోనే అన్ని జిల్లాల్లో ధరల పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రేషన్‌కార్డుపై రూ.67కే కిలో కందిపప్పు..

రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌కార్డుదారులకు వచ్చే నెల నుంచి క్రమం తప్పకుండా సబ్సిడీపై కందిపప్పు సరఫరా చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంతో పేదలకు రాయితీపై రూ.67కే కిలో కందిపప్పు లభించనుంది. చక్కెర కూడా కార్డుదారులందరికీ ప్రతి నెలా అందించనుంది.

'అల్ట్రాటెక్' మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు

- తీవ్రంగా గాయపడిన వారికి రూ.25 లక్షలు
- సీఎం కార్యాలయ చొరవతో మెరుగైన పరిహారం
- మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత



మృతుడి కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట రూరల్, తాడేపల్లి టౌన్, జూలై 8: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట సమీప బూదవాడ గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో బ్రాయిలర్ పేలిన ఘటనలో మృతిచెందిన వెంకటేశ్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ చొరవతో రూ.50 లక్షల పరిహారం అందింది. ఈమేరకు కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సోమవారం చెక్కును భార్య త్రివేణి పేరిట కుటుంబ సభ్యులకు అందించారు. నష్టపరిహారం విషయంలో సీఎం కార్యాలయం జోక్యం చేసుకుని బాధితులకు మెరుగైన పరిహారం అందించేలా చూడాలని సూచించడంతో కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే రంగంలోకి దిగారు. కర్మాగారం యాజమాన్యంతో మాట్లాడి మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఇచ్చేలా ఒప్పించారు. ఈ సందర్భంగా కర్మాగారంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు జరిగిన నష్టం పూడ్చలేనిదని, కంపెనీ యాజమాన్యంతో చర్చించి మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, ఒకరికి ఉద్యోగం, పిల్లలకు 12వ తరగతి వరకు విద్య అందించేలా ఒప్పించామని తెలిపారు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారికి రూ.25 లక్షలతో పాటు పూర్తిగా కోలుకునే వరకు ఉచిత వైద్యం, గాయపడిన వారికి రూ.5 లక్షల నష్టపరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు.

కలెక్టర్ సీరియస్


కర్మాగార సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందించటం లేదని, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా 15 కుటుంబాల్లో విషాదం నెలకొందని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురావటంతో ఆమె తీవ్రంగా స్పందించారు. కంపెనీ అధికారులు, యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్మాగారాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి లోపాలు ఉంటే చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సారథ్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని, అంతేకాకుండా సీఎస్ఆర్ నిధులతో గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనలో బాధిత కుటుంబాలతో పాటు గ్రామస్థులందరి కోసం మంగళవారం నుంచి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మిక మంత్రి పరామర్శ

మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అల్ట్రాటెక్ బాధితులను రాష్ట్ర కార్మిక, కర్మాగార బాయిలర్స్ అండ్ వైద్య బీమా సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఘటనపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మొత్తం 16 మంది గాయపడ్డారని తెలిపారు. మృతుడు ఆవుల వెంకటేష్ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు వెల్లడించారు. కార్మికులకు ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి పథకాలను ఫ్యాక్టరీ వర్తింపజేస్తున్నదీ లేనిదీ విచారించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన వారిలో స్వామి, అర్జునరావు, గోపినాయక్ పరిస్థితి విషమంగా వుందని వైద్యులు తెలిపినట్టు పేర్కొన్నారు. నష్టపరిహారంపై సీఎం చంద్రబాబు త్వరలోనే నిర్ణయం తీసుకుంటారన్నారు. మంత్రివెంట రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ శేషగిరిబాబు పాల్గొన్నారు.

డ్రైవర్ నిద్రమత్తుకు ముగ్గురు బలి

- ట్రాలీ లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- ఇద్దరు మహిళలు, బాలుడు మృతి
- డ్రైవర్, మరో చిన్నారికి తీవ్రగాయాలు
- ఏలూరు జిల్లాలో ఘటన



ప్రమాద దృశ్యం

ద్వారకా తిరుమల, జూలై 8 : ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. మృతులలో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి ఉండగా డ్రైవర్, మరో చిన్నారి తీవ్ర గాయాలపాలయ్యారు. ఆగి ఉన్న ట్రాలీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఈ విషాదం చోటు చేసుకుంది. డ్రైవర్ అతివేగం, నిద్రమత్తు ఈ ప్రమాదానికి కారణంగా చెబుతున్నారు. భీమడోలు సీఐ బీటీ రవికుమార్, స్థానికులు తెలిపిన వివరాలు...తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు మండలం రాజవోలుకు చెందిన రాచబత్తుని భాగ్యశ్రీ (27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నిమిత్తం ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు తన ఇద్దరు పిల్లలు నాగ షణ్ముఖ (4), నాగ నితిన్‌కుమార్ (3), భీమవరానికి చెందిన తన తల్లిదండ్రులైన బొమ్మా నారాయణరావు, బొమ్మా కమలాదేవి (55)తో కలసి వెళ్లారు. భాగ్యశ్రీ భర్త నాగార్జున హైదరాబాద్‌లో ఉంటూ ఓ ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీ ఎండీగా పనిచేస్తున్నారు. భర్త నాగార్జున వద్దకు రెండు రోజుల క్రితం వెళ్లిన భాగ్యశ్రీ ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి స్వగ్రామమైన రాజవోలుకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో విజయవాడలో తండ్రి నారాయణరావు వ్యక్తిగత పనిమీద దిగిపోయారు. వీరు ప్రయాణిస్తున్న కారు లక్ష్మీనగర్ వద్దకు చేరుకోగా....చెన్నై నుంచి కాకినాడకు మిషనరీ లోడుతో వెళ్తూ రోడ్డుపక్కన ఆపిఉన్న ఓ భారీ ట్రాలీ వాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా ఢీకొంది. కారు ట్రాలీ కిందకు దూసుకుపోయి తుక్కుతుక్కయింది. ఈ ప్రమాదంలో భాగ్యశ్రీ, కమలాదేవి, నితిన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన కొవ్వూరు మండలం వాడపల్లికి డ్రైవర్ దివి దుర్గావంశీ, చిన్నారి నాగషణ్ముఖ ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి పరిశీలించారు. ఎస్ఐ జి.సతీష్ నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దల మార్గదర్శకంలో ముందుకెళ్తా

- జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన మండలిలో గతంలో పని చేసిన పెద్దల మార్గదర్శకంలో ముందుకెళ్తానని జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ అన్నారు. మండలిలో ప్రశ్నోత్తరాలు, చర్చలపైనా అధ్యయనం చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే కోటాలో జనసేన పార్టీ తరఫున ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా సోమవారం అమరావతిలోని శాసనసభ కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్ విజయరాజు నుంచి ఆయన ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. హరిప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

డ్రగ్స్‌పై కమిటీ వేస్తే ఎందుకంత ఉలుకు?

- కాకాణికి ఎమ్మెల్యే సోమిరెడ్డి కౌంటర్

నెల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నియంత్రణకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకొని అదనపు డీజీపీలతో కమిటీ వేయాలని నిర్ణయిస్తే వైసీపీ నేతలకు ఎందుకంత ఉలుకు అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తట్టుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో కాకాణి కారు స్టిక్కర్ ఉన్న వాహనం పట్టుబడిందని, ఆ భయంతోనే కాకాణి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు విభజన సమస్యలను పట్టించుకోని వైసీపీ నేతలు, ఇప్పుడు కారుకూతలు కూస్తున్నారని సోమిరెడ్డి ధ్వజమెత్తారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

లీపెన్‌కు బ్రేక్

కెరటం లేచిన తీరు చూస్తే ఉవ్వెత్తున ఎగిసిపడుతుందనిపించింది కానీ, తీరం తాకకముందే విరిగిపోయింది. దీన్నే ఫ్రెంచి జీవనసరళిలోకి అనువదించి చెబితే, షాంపేన్ బిరడా ఉవ్వెత్తున ఎగిరింది కానీ, నురగ మాత్రం పొంగ లేదు. ఫ్రెంచి తీవ్రమితవాద పార్టీ నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్) పరిస్థితి అట్లాగే ఉంది. మరైన్ లీపెన్ నాయకత్వంలోని ఆ పార్టీ ఫ్రాన్స్ సాధారణ ఎన్నికలలో ప్రభంజనం సృష్టిస్తుందని అంతా అంచనా వేశారు. కానీ, ఫలితాలలో మూడో స్థానం దగ్గరే ఆగిపోయింది. ఫ్రెంచి చరిత్రకు, సంస్కృతికి భిన్నమైన ఫాసిస్టు పోకడలు కలిగిన పార్టీ అధికారంలోకి రాకుండా నిలువరించామని, తీవ్రవాద వామపక్ష కూటమి, ఇంతదాకా అధికారంలో ఉన్న మధ్యేవాద కూటమి సంతోషిస్తున్నాయి. తమది వాయిదాపడిన విజయమే తప్ప, ఇది ఓటమి కాదు అంటూ లీపెన్ నిబ్బరంగా ఉన్నారు.

నెలరోజుల కిందట యూరోపియన్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికలలో ఫ్రాన్స్ నుంచి లీపెన్ పార్టీ 31 శాతం ఓట్లతో ఘనవిజయం సాధించింది. ఫ్రెంచి అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మేక్రాన్ నాయకత్వం వహిస్తున్న కూటమికి 15 శాతం కంటె తక్కువ ఓట్లు వచ్చాయి. మరింత ప్రమాదం రాకముందే జాగ్రత్తపడదామనుకున్నారో, మరే కారణమో కానీ, గత జూన్ 9 నాడు మేక్రాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలు ప్రకటించారు. జూన్ 30 నాడు మొదటి రౌండు 76 స్థానాలకు పోలింగ్ జరగగా, జూలై 7 ఆదివారం నాడు రెండో రౌండులో 501 స్థానాలకు పోలింగ్ జరిగింది. మొదటి దశ పోలింగ్ తీరు నేషనల్ ర్యాలీ పార్టీకి అనుకూలంగా జరిగినట్టు, 33 శాతం కంటె అధికంగా ఓట్లు ఆ పార్టీ పొందినట్టు తెలియగానే, దేశంలోని మధ్యేవాదులు, వామపక్షీయులు కలవరం చెందారు. రెండో దశ ఓటింగ్ కూడా అదే తీరుగా ఉంటే, దేశం తీవ్ర మితవాదుల చేతిలోకి పోవడం ఖాయమని భయపడ్డారు. అందుకని, మధ్యేవాద, వామపక్షీయుల మధ్య అవగాహన కుదిరిందని, ముక్కోణ పోటీని ద్విముఖ పోటీగా మార్చడానికి దాదాపు 200 మంది అభ్యర్థులు విరమించుకోవడం దాన్ని సూచిస్తుందని పరిశీలకులు చెబుతున్నారు. రెండో దశలో గాలిమార్పు కారణంగా, అంతిమ ఫలితాలు భిన్నంగా వచ్చాయి. వామపక్ష కూటమికి 182 స్థానాలు, మేక్రాన్ నాయకత్వంలోని మధ్యేవాద కూటమికి 163 సీట్లు, లీపెన్ పార్టీకి 143 స్థానాలు లభించాయి. ఏ ఒక్క పార్టీకి, కూటమికి మెజారిటీ రాలేదు. మేక్రాన్ కూటమి, వామపక్ష కూటమితో మొత్తంగానో, అందులోని కొన్ని పక్షాలతోనో అవగాహన కుదుర్చుకుంటే తప్ప కొత్త ప్రభుత్వం ఏర్పడదు. కొత్తప్రభుత్వం ఏర్పడడానికి చాలా కాలం పట్టవచ్చునని, అంతదాకా ప్రస్తుత ప్రధానమంత్రి గేబ్రియల్ అట్టల్‌ను కొనసాగవలసిందిగా అధ్యక్షుడు మేక్రాన్ కోరుతున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షపదవికి 2027లో తిరిగి ఎన్నికలు జరుగుతాయి. గత మూడు పర్యాయాలుగా పోటీ పడి ఓడిపోయిన లీపెన్, ఈసారి తప్పనిసరిగా విజయం సాధించగలనని, అందుకు తగ్గ సూచనలు ప్రస్తుత ఎన్నికలు ఇచ్చాయని చెబుతున్నారు.

ఫ్రాన్స్ ఎన్నికల ఫలితాలు అనేక దేశాలలో ఇటీవల వ్యక్తమైన ధోరణులను స్ఫురింపజేస్తున్నాయి. లీపెన్ ఓడిపోయింది, తక్కిన రెండు కూటములు కుమ్మక్కు కావడం వల్లనా, లేక, ఆమె పార్టీ ఇచ్చిన నినాదాలలో అహంకారం ధ్వనించినందునా? అన్న చర్చ కూడా జరుగుతోంది. అబ్ కీ బార్ చార్ సౌ పార్ అంటూ భారత్‌లో ఒకపార్టీ ప్రచార నినాదం ఇచ్చినట్టుగానే, యుకె ఎన్నికల్లో లేబర్ పార్టీ సూపర్ మెజారిటీ నినాదాన్ని ఇచ్చింది. భారత్‌లో పని చేయలేదు కానీ, యుకెలో లేబర్ పార్టీ లక్ష్యాన్ని సాధించింది. ఫ్రాన్స్‌లో లీపెన్ తిరుగులేని మెజారిటీ అన్న నినాదాన్ని ప్రచారంలో పెట్టింది. తమ విజయం ఖాయమన్న ధోరణి ఆ పార్టీ ప్రచారంలోను, నాయకుల సరళిలోనూ అమితంగా వ్యక్తం కావడం ఓటర్లను విముఖం చేసిందని, మొదటి దశ ప్రచారాన్ని చూశాక, రెండో దశ నిర్ణయం మారిందని అంటున్నారు. నిజానికి, మేక్రాన్ నాయకత్వంలోని అధికార కూటమి మీద ప్రజల్లో వ్యతిరేకత బాగా పెరిగింది. అది ఈయూ ఎన్నికలలోనే వ్యక్తమైంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి నినాదాల వారసత్వం ఉన్న ఫ్రాన్స్, రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఫాసిజం దాడులకు తీవ్రంగా నష్టపోయిన ఫ్రాన్స్, తన దేశంలో ఒక ఫాసిస్టు పార్టీని అధికారంలోకి తేవడం అవమానకరమని అధికసంఖ్యాకులు భావించడం వల్ల కూడా లీపెన్ పార్టీకి మొదట ఉధృతంగా కనిపించిన ఆదరణ, తరువాత వెనుకపట్టుపట్టి ఉండవచ్చునని విశ్లేషకులు చెబుతున్నారు. ఇంగ్లండులో కూడా తీవ్ర మితవాద పార్టీ రిఫామ్ యుకె నాలుగు స్థానాలకే పరిమితం కావడం అక్కడి ప్రజాస్వామ్యవాదులకు ఊరట కలిగించింది. అయితే, రెండు దేశాలలోనూ, తీవ్ర మితవాద పార్టీలకు గణనీయంగా ఓట్లు వచ్చాయి. ఈ ధోరణి పెరుగుదల దిశగానే ప్రయాణిస్తోంది. యుక్తియుతంగా ఓటు చేయడం వల్ల ఫ్రాన్స్ రెండో దశలో ఫలితాలు తారుమారయ్యాయి. అటువంటి సందర్భం భారత్‌లో కూడా 1991 ఎన్నికల్లో కూడా జరిగింది. కాకపోతే, ఆనాటి సందర్భం వ్యూహంతో కాక, ఒక విషాదంతో, సానుభూతి ఓటింగ్‌తో ముడిపడింది. అనేక దశల పోలింగ్ నడుమ రాజీవ్ గాంధీ హత్య జరగకపోతే, ఆ ఎన్నికల్లోనే బీజేపీ విజయం సాధించి ఉండేది.

యుకెలో అయినా, ఫ్రాన్స్‌లో అయినా, దేశంలోని సామాజికార్థిక సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తే తప్ప, అక్కడ త్వరలోనే తీవ్రవాద రైటిస్టులు అధికారంలోకి వచ్చే అవకాశం ఎంతైనా ఉంది. ఇప్పుడు వామపక్షాలకు ఫ్రాన్స్ ప్రజలు పెద్దపీట వేశారని సంతోషించేవారు, లీపెన్ ఆత్మవిశ్వాసాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తపడాలి.

బంజారాల తొలి పండుగ

గిరిజనులు ప్రకృతిని నమ్ముకొని బతుకుతున్న అమాయకులు. ప్రతికూల పరిస్థితుల మధ్య తమ సంస్కృతీ సంప్రదాయాలను, కళలను, మౌఖిక సాహిత్యాన్ని కాపాడుకుంటున్నారు. ప్రకృతిని పూజించడం, ప్రేమించడం గిరిజనుల ప్రత్యేకత. పండుగ సందర్భాల్లో పశువులను అలంకరించి, వాటికి పేర్లు పెట్టి, మనుషులతో సమానంగా ప్రేమగా చూసుకుంటారు. చరిత్ర ఉనికిని మొదలు కొని నేటి వరకు లంబాడీలకు పశుసంపదే జీవనాధారం. వారి ఆర్థిక వ్యవస్థ వారి పశుసంపదపై ఆధారపడి ఉంటుంది. అందు వలనే బంజారా సమాజం పశుసంపద వృద్ధి కోసం కొండ ప్రాంతాలలో, అడవి ప్రాంతాలలో, పశుగ్రాసం, నీరు ఎక్కువగా లభించే ప్రాంతాలలో తండాలు ఏర్పాటు చేసుకుంటారు. పశువుల ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధి కోసం ప్రతి ఏటా పునర్వసు కార్తెలో గిరిజన తండాల్లో సీత్ల పండుగను బంజారాలు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. బంజారాల తొలి పండుగ సీత్లా పండుగ. వర్షాకాలంలో పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా, తండ ప్రజలు ఎలాంటి అంటువ్యాధుల బారిన పడకుండా తమను సీత్లా భవాని రక్షిస్తుందని గిరిజన లంబాడీల విశ్వాసం.

పంటలు సమృద్ధిగా పండాలని, పాడి పశువులు క్షేమంగా ఉండాలని సీత్ల తల్లికి మొక్కులు తీర్చుకొని, సప్త మాతృకలైన మేరామా, తొల్జా, మంత్రాల్, కంకాళీ, హింగ్లా, ద్వాల్గర్, సీత్ల భవానీలను పూజిస్తారు. గిరిజన లంబాడీల సంస్కృతీ సంప్రదాయాలకు సీత్లా పండుగ ప్రతీకగా నిలుస్తుంది. తెలుగు వారి పండుగలు ఉగాదితో ఏ విధంగా ప్రారంభమవుతుందో, బంజారా పండుగలు సీత్ల పండుగతో ప్రారంభమవుతాయి. లంబాడీలు తీజ్, దసరా, దీపావళీ, హోలీ, ఉగాది, తుల్జా భవాని పండుగలను కూడా జరుపుకుంటారు. నిరంతరం శ్రమించే లంబాడీలకు వారి పండుగలు, ప్రదర్శన కళలు సేదతీర్చడానికి ఉపయోగపడతాయి. సీత్లా పండుగ నిర్వహణ తండా బయట తూర్పు దిక్కున జరుగుతుంది. సీత్లా మాత ప్రతిమ మధ్య భాగంలో ఉండేలా మిగతా భవానీలను ఇరువైపులా ఒక వరుసలో ప్రతిష్టిస్తారు.



పండుగకు ఒకరోజు ముందు జొన్నలు, పప్పుధాన్యాలతో వండిన ఘుగ్రీ (గుగ్గిళ్ళు), లాప్షి (పాయసం)ని పెళ్లికాని యువతుల చేత సప్త దేవతలకు నైవేద్యంగా చెల్లిస్తారు. తండవాసులు మేళ తాళాలతో కోళ్ల, గొర్రెపోతులు, మేకపోతులతో బోనాలు ఎత్తుకొని తండా నుంచి బయలుదేరతారు. మగవారు డప్పు వాయిస్తుండగా వాయిద్యానికి అనుగుణంగా బంజారా స్త్రీలు కాళ్ళు, చేతులు ముందుకు వెనకకు కదుపుతూ వలయాకారంలో తిరుగుతూ నృత్యాలు చేస్తారు. వనదేవతలను కీర్తిస్తూ పాటలు పాడుతారు. గొర్రెపోతులను దేవతలకు బలి ఇచ్చి, గొర్రెపోతుల పొట్టలోని పేగులను బయటకు తీసి, ఏడుగురు భవానీల ప్రతిమల నుంచి లుంకడియా ప్రతిమ వరకు నేలపై పరిచి, యువతుల చేత నీటితో జలాభిషేకం చేయిస్తారు. ఆ పేగుల పైనుండి పశువులు, గొర్రెలు, మేకలను దాటిస్తారు. అందువల్ల సీత్లా పండుగను దాటుడు పండుగ అని కూడా అంటారు.

తండాల్లో దేవుళ్లకు గుడి గోపురాలు కట్టించి పూజించే సంప్రదాయం లంబాడీలకు లేదు. కానీ ఇటీవల కాలంలో తండాలలో వివిధ రకాల పేర్లతో దేవుళ్ళ గుళ్ళు నిర్మించడం మొదలైంది. ఇలా తండా ప్రజలు తమ సాంప్రదాయ పండుగలను నిర్వహించుకుంటూ మిగతా పండుగలను కూడా జరుపుకోవడం వలన ఆర్థిక భారం పెరుగుతున్నది. అంతేకాకుండా కొత్త ఆచారాలు, పండుగలు, సాంప్రదాయాలు వివిధ పేర్లతో గిరిజన తండాలోకి ప్రవేశించి తండా సంస్కృతిని ధ్వంసం చేస్తున్నాయి. పండుగ నిర్వహణకు అయ్యే ఖర్చు కంటే ఆ సందర్భంగా బంజారా ప్రజలు మద్యం పైన చేసే ఖర్చు ఎక్కువగా ఉంటున్నది. ఫలితంగా ఆరోగ్యపరంగా, ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నారు. ఇది గిరిజన బంజారా సమాజాన్ని పొదుపు వైపు ప్రోత్సహించటం లేదు. వాళ్ల వ్యవసాయం పైన చేసే పెట్టుబడి, విద్య, వైద్యం పైన చేసే ఖర్చు కన్నా ఒక కుటుంబం ఒక సంవత్సర కాలంలో మద్యం, ధూమపానంపై చేసే ఖర్చు ఎక్కువగా ఉంటున్నది. గతంలో తండా పెద్దలు కూర్చొని ఏ కార్యమైనా, పండుగైనా, పెళ్లయినా, పంచాయతీ అయినా సామూహికంగా పరిష్కరించుకునే సాంప్రదాయం ఉండేది. కానీ ఇప్పుడు తండాల్లో ఆ సంస్కృతి నశించిపోయింది. తండాలోని ప్రజలు ఉద్యోగ ఉపాధి కోసం, ఉన్నత చదువుల కోసం పట్టణాలకు వలస వెళ్లడం ద్వారా తండా ప్రజల్లో చైతన్యం కొరవడింది. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడంలోనూ తండావాసులు సతమతమైపోతున్నారు. తండాలో మద్యపానాన్ని నిషేధించవలసిన అవసరం ఉంది.

బంజారా జాతిలో ఉన్న మేధావులు, విద్యావంతులు, వ్యాపారస్థులు, ఉద్యోగస్తులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుకుంటున్న గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను కాపాడే బాధ్యతను తీసుకొని వాటి ప్రాధాన్యతను భవిష్యత్ బంజారా తరానికి అందించే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఈ సీత్లా పండుగను జూలై 9వ తారీఖున జరుపుకోవాలని గిరిజన మత పెద్దలు, సాహితీవేత్తలు, విద్యావంతులు కోరుకుంటున్నారు.

• డా. వల్యా లునావత్
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎకనామిక్స్

సంపద పన్నుతో కులాల జాతకం మారుతుందా?



సంపదలు, ఆస్తులపై పట్టును వదులుకోవటం ఏ వర్గమూ అంత తేలికగా అంగీకరించదు. ఎన్నో సంఘర్షణలు, ఎన్నో ఒత్తిడులు తలెత్తితే కానీ సంపద పునఃపంపిణీకి అడుగులు పడవు. గత రెండు వందల ఏళ్ల ప్రపంచ చరిత్ర చెప్పే నిజం అదే. అయితే బలంగా వేళ్లూనుకున్న రాజకీయ ప్రజాస్వామ్యం కొన్ని సందర్భాల్లో అసాధ్యాలను సుసాధ్యాలు చేయగలదు! భారత్ కూడా అందుకు మినహాయింపు కాదేమో!

సంపద చుట్టూ మానవ చరిత్ర తిరిగింది. దాని పంపకంలో అసమానతలు వర్గాలను సృష్టించాయి. వాటి మధ్య తలెత్తిన సంఘర్షణలు సమాజాన్ని కుదిపేశాయి. సమాజ గమనాన్ని కొత్తదారులు పట్టించాయి. వెతికితే వేల ఏళ్ల చరిత్రలో అలాంటి దారులెన్నో కన్పిస్తాయి. అసమానతలను సమర్థిస్తూనో, విమర్శిస్తూనో ఎన్నో సిద్ధాంతాలు వచ్చాయి. నిశితంగా చూస్తే మత, తాత్విక భావాలన్నీ కూడా అసమానతలను వివరించటానికో, విమర్శించటానికో పుట్టినట్లు కనిపిస్తాయి. అందుకే సంపద సృష్టి, పంపిణీలు చుట్టూ వివాదాలు చెలరేగుతూనే ఉంటాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా సంపద పంపిణీ చుట్టూనే ప్రచారం హోరెత్తింది. హిందువుల సంపదను ముస్లింలకు పంచటానికే కాంగ్రెస్ కంకణం కట్టుకుందని ప్రధాని మోదీ ఆరోపించారు. వారసత్వంగా వచ్చే ఆస్తులపై పన్నులు వేసే దురాలోచనను ఆ పార్టీ చేస్తోందనీ విమర్శించారు. తనకు అలాంటి ఆలోచనే లేదంటూ కాంగ్రెస్ పార్టీ తిప్పికొట్టినా ఇటీవల కాలంలో సంపద పంపిణీ గురించి ఎక్కువగా మాట్లాడింది ఆ పార్టీనే. రాజకీయంగా ఇతర అస్త్రాలు పనిచేయనప్పుడు సంపద పునఃపంపిణీ గురించి స్మరించటం అన్ని పార్టీలకు అలవాటే. దీనికి కాంగ్రెస్ మినహాయింపు కాదు. అయితే ఒకటి మాత్రం ప్రస్తుతం మన రాజకీయాల్లో స్పష్టంగా కనపడుతోంది. సంపద పునఃపంపిణీ అనేది జనాకర్షణ నినాదంగా మారింది. అన్ని పార్టీలకూ ఇది విస్మరించలేని విధానంగా పరిణమించింది. దీనికి ప్రత్యేకమైన కారణమూ ఉంది. ఏ ప్రజాస్వామ్య దేశంలో లేనంత స్థాయిలో సంపద, ఆదాయ పంపిణీల్లో అసమానతలు భారత్‌లో ఏర్పడ్డాయనీ నిరూపించే గణాంకాలు ఇటీవల బాగా వెలుగులోకి వస్తున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా అసమానతలను విశ్లేషించటంలో ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెటీ, ఆయన సహచర బృందం ఎంతో కృషి చేస్తోంది. ఆదాయం, సంపదల్లో అసమానతలు.. భారత్‌లో గతంలో ఎన్నడూ లేని రీతిలో విపరీతంగా పెరిగిపోయాయని పేర్కొంటూ ఈ ఏడాది మార్చి 18న ఒక నివేదికను విడుదల చేసింది. దీనికి కొనసాగింపుగా మే నెలలో మరో చిన్న నివేదికను ప్రచురించింది. ఇందులో కులానికీ సంపద, ఆదాయ అసమానతలకూ మధ్యనున్న సంబంధాన్ని విశ్లేషించారు. భారత్‌కు సంబంధించి ఫోర్బ్స్ మ్యాగజీన్ ఏటా ప్రచురించే బిలియనీర్ల జాబితాతో పాటు జాతీయ గణాంకాల కార్యాలయం నిర్వహించే 'డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వేను' (ఏఐడీఐఎస్) ఆధారం చేసుకుని ఎగువ, వెనుకబడిన, దళిత, గిరిజన కులాల దగ్గరున్న సంపద లెక్కలను వివరించారు. ఫోర్బ్స్ ప్రచురించిన 100 మంది బిలియనీర్ల (100 కోట్ల డాలర్ల సంపద కలిగినవారు) జాబితాలోని వ్యక్తుల ఇంటి పేర్లను విశ్లేషించి ఎవరు ఏ కులానికి చెందుతారో నిర్ధారించారు. అట్లా 2022–2023 నాటి ఫోర్బ్స్ జాబితాను పరిశీలిస్తే అందులో 90 శాతం మంది అగ్రకులాలకు చెందిన వారే ఉన్నారు. వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) చెందిన వారు 10 శాతం లోపే ఉన్నారు. షెడ్యూల్డు కులాలకు (ఎస్సీ) చెందినవారు 2.6 శాతం ఉండగా గిరిజనులకు (ఎస్టీలు) అసలు చోటే దక్కలేదు. ఇక 2018–2019 నాటి ఏఐడీఐఎస్ ప్రకారం చూస్తే కాస్త భిన్నమైన సామాజిక చిత్రం కనపడింది. అగ్రకులాల జనాభా 25 శాతం ఉందనుకుంటే వారి దగ్గరున్న సంపద మాత్రం 55 శాతం వరకూ ఉంది. ఓబీసీల దగ్గర 35 శాతం సంపద ఉంటే ఎస్సీ, ఎస్టీల దగ్గర వారి జనాభాతో పోల్చితే సగం శాతం మాత్రమే ఉంది. అంటే 10 శాతానికి కాస్త అటూ ఇటూగా ఉంటుందని అనుకోవచ్చు.

సామాజికంగా కులాల హెచ్చుతగ్గుల స్థితికీ సంపదలో వాటికి ఉన్న వాటాలకు మధ్య సంబంధం స్పష్టంగా ఉందనీ పై గణాంకాల వల్ల తెలుస్తోంది. మొత్తంగా సమాజాన్ని నాలుగు కుల సమూహాలుగా చూస్తే ఇందులో ఎటువంటి సందేహం కలగదు. అయితే విడివిడిగా ఒక్కో కులాన్ని నిర్దిష్టంగా పరిశీలిస్తే మరో కఠిన వాస్తవం కనపడుతుంది. చాలా కులాల్లో సంపదతో ముడిపడిన వర్గాలు తలెత్తటం, వాటి మధ్య తేడాలు పెరగటమూ బాగా జరుగుతోంది. అందుకే ఒక తరహా ఆర్థిక అంశాల చుట్టూ ఒక కులం వారందరినీ సమీకరించే ప్రయత్నాలు అనుకున్న రీతిలో ముందుకు పోలేని దృశ్యాలే ఎక్కువ. అలాగే కులంలోని వారందరినీ ఒక గాటన కట్టి తారతమ్యాలు పట్టించుకోకుండా పదవులు, ఉద్యోగాల్లో ఎక్కువ వాటా కావాలని కోరే ఉద్యమాలను ఆర్థిక హెచ్చుతగ్గులు చాలా చోట్ల నిలువరిస్తున్నాయి. కులాల అంతర్గత పరిస్థితులపై సరైన గణాంకాలుంటే చాలా విషయాలపై స్పష్టత వస్తుంది. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలను నిర్దిష్టంగా ఎవరికి వర్తింపచేయాలో తేల్చవచ్చు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రతి కుటుంబానికి చెందిన ఆస్తులు, ఆదాయ గణనకు సామాజిక–ఆర్థిక సర్వే చేపట్టాలన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. పికెటీ బృందం కూడా ఇదే భావాన్ని వ్యక్తం చేసింది. సంపద, ఆదాయాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న గణాంకాలు చాలా లోపభూయిష్టమైనవి. వెల్లడైన ఆస్తుల కంటే దాచేసినవే ఎక్కువ.



■ రాహుల్ కుమార్

భారత్‌లో బిలియనీర్ రాజ్ నడుస్తోందంటూ పికెటీ బృందం మార్చి నివేదికలో వ్యాఖ్యానించటం పెద్ద వివాదాన్నే సృష్టించింది. ముఖ్యంగా 2014 నుంచి అసమానతలు ఇంకా ఎక్కువయ్యాయని గణాంకాల ప్రాతిపదికన వివరించటంతో ప్రభుత్వ ఆర్థిక విధానాలను సమర్థించే వారి నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. పికెటీ బృందం వీటన్నిటినీ పరిశీలించి వాటిలో పసలేదనీ తేల్చింది. దీనికే పరిమితం కాకుండా అసమానతలను తగ్గించటానికి కొన్ని కీలక ప్రతిపాదనలు చేసింది. ఒక శాతం జనాభా చేతుల్లో 40 శాతం సంపద పోగుపడిందన్న విషయం పికెటీ బృందం ఇప్పటికే చాలాసార్లు ప్రస్తావించింది. 1980ల నాటికి ఈ పరిస్థితి లేదు. అప్పటికి వీరి చేతుల్లో ఉన్న సంపద 12.5 శాతం మాత్రమే. ఆదాయంలోనూ ఇదే పరిస్థితి కనపడుతుంది. 1980ల నాటికి 1 శాతం జనాభాకు ఆదాయంలో 7.3 శాతం ఉంటే అది 2022–2023 నాటికి 22.6 శాతానికి పెరిగింది. 46 కోట్ల వయోజనుల చేతుల్లో ఉన్న మొత్తం సంపదతో పోల్చితే పదివేల మంది ధనికుల చేతుల్లో సంపద మూడు రెట్లు ఎక్కువగా ఉంది.

అసమానతల్లో మనం అగ్రగాములం అయ్యాం. విశ్వగురువుగా మారాం. మరి దీనికి విరుగుడు ఏమిటి? పికెటీ బృందం న్యాయబద్ధంగా పన్నును(టాక్స్ జస్టిస్) విధించటాన్ని ఒక పరిష్కారంగా చూపించింది. ముందుగా కేవలం ధనిక వర్గానికి చెందిన 0.4 శాతం మందిపై సంపద, వారసత్వ పన్నులను విధిస్తే రెండు రకాల ప్రయోజనాలు కలుగుతాయని చెప్పింది. ఒకటి: దీంతో అసమానతలు కొంతవరకూ కట్టడి చేయొచ్చు. రెండు: విద్య, వైద్యం, సామాజిక భద్రత, సంక్షేమ రంగాలకు కావాల్సిన నిధులను గణనీయంగా పెంచుకోవచ్చు. సంపద కలిగిన వ్యక్తి మరణించినప్పుడే వారసత్వ పన్నును విధించగలుగుతాం. కాబట్టి దీని పరిధి పరిమితం. అందుకే సంపదపై పన్నును విధించటమే కీలకం. 99.96 శాతం జనాభాపై ఎటువంటి భారం లేకుండా కేవలం 0.4 శాతం మందిపై సంపద పన్నును విధిస్తే వచ్చే ఆదాయం పికెటీ బృందం అంచనా ప్రకారం చాలా ఎక్కువే ఉంటుంది. మొదటగా కనీస స్థాయిలో 10 కోట్ల సంపద దాటిన వారిపై రెండు శాతం సంపద పన్నునీ, 33 శాతం వారసత్వ పన్నునీ విధిస్తే జీడీపీ విలువలో 2.7 శాతం విలువకు సమానమైన అదనపు ఆదాయం వస్తుంది. 2023–24లో మన జీడీపీ విలువ (ప్రస్తుత ధరల ప్రకారం) 295.36 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇందులో 2.7 శాతమంటే ఎనిమిది లక్షల కోట్లకు కాస్త తక్కువగా ఆదాయం లభిస్తుంది. ఇది చాలదనుకుంటే మరో రెండు స్థాయిల్లో సంపద, వారసత్వ పన్నులను ప్రతిపాదించారు. నికర సంపద 100 కోట్లు దాటిన వారిపై 2–4 శాతం పన్నులను విధిస్తే జీడీపీ విలువలో 4.6 శాతం ఆదాయం వస్తుందనీ అదే 3–5 శాతం విధిస్తే 6.1 శాతం ఆదాయం లభిస్తుందనీ తేల్చారు.

పికెటీ బృందం ప్రతిపాదించిన విధంగా 0.4 శాతం జనాభాపై పన్నులు విధించగలిగితే విద్య, వైద్యం, సామాజిక సంక్షేమం, పౌరసదుపాయాలపై ఖర్చు బాగా పెరిగి కొన్నేళ్లలోనే మన మానవాభివృద్ధి చిత్రమే మారిపోతుంది. ఇదే జరిగితే ప్రధానంగా కింది, మధ్య కులాలు బాగా లబ్ధిని పొందుతాయి. కులతత్వ ఆలోచనలూ తగ్గే అవకాశం ఉంటుంది. సామాజికపరమైన అంతరాలను తగ్గించటంలో విద్యావ్యాప్తి ప్రభావం అన్నిటికంటే ఎక్కువగా ఉంటుంది. ప్రపంచీకరణ వల్ల తలెత్తున్న పోటీ వాతావరణంలో అవకాశాలు దక్కించుకోటానికి నాణ్యమైన విద్య నైపుణ్యాలు ఎంతో కీలకమైనవి. ఈ రెండూ కింది కులాల్లోని అర్హులకు తగిన స్థాయిలో దక్కకపోవటమే అభివృద్ధికి ఆటంకంగా ఉంది.

ఈ దిశగా చర్యలు లేకుండా ఆదాయ, సందద అసమానతలు మరింతగా పెరగనిస్తే తలెత్తే నాలుగు విపరిణామాలు ప్రధానంగా చెప్పుకోవచ్చు. 1) విపరీత ఆదాయ అంతరం పేద, మధ్య తరగతి కొనుగోలు శక్తిని విపరీతంగా తగ్గిస్తుంది. ఉత్పత్తులకు తగినంత గిరాకీ ఉండదు. దీంతో ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక ప్రగతి మందగిస్తుంది. 2) విపరీత అసమానతలకు లోనవుతున్న ప్రజలు అసంతృప్తి, ఆగ్రహాలతో రగలిపోతూ రాజకీయ–సామాజిక అస్థిరతలకు కారణమవుతారు. 3) ఫలితంగా దాంబిక జనాకర్షణ నినాదాలతో నియంతృత్వ పోకడలు గల రాజకీయ నేతలు అధికారాన్ని చేజిక్కించుకునే ప్రమాదం పెరుగుతుంది. 4) విపరీత సంపద కేంద్రీకరణ ప్రభుత్వంపై కొద్ది మంది ధనికుల అనుచిత ప్రభావాన్ని నెరపటానికి కారణమవుతుంది.

మరి.. 0.4 శాతం ప్రజలపై సంపద పన్నుని విధించటానికి రాజకీయ పార్టీలు సంసిద్ధంగా ఉన్నాయా? అని ప్రశ్నించుకుంటే అవునని చెప్పుకొనే పరిస్థితి లేదు. చాలా రాజకీయ పార్టీల్లో కీలక స్థానాలను 0.4 శాతం నుంచి వచ్చినవారే క్రమేపీ ఆక్రమిస్తున్నారు. సంపదలు, ఆస్తులపై పట్టును వదులుకోవటం ఏ వర్గమూ అంత తేలికగా అంగీకరించదు. ఎన్నో సంఘర్షణలు, ఎన్నో ఒత్తిడులు తలెత్తితే కానీ సంపద పునఃపంపిణీకి అడుగులు పడవు. గత రెండు వందల ఏళ్ల ప్రపంచ చరిత్ర చెప్పే నిజం అదే. అయితే బలంగా వేళ్లూనుకున్న రాజకీయ ప్రజాస్వామ్యం కొన్ని సందర్భాల్లో అసాధ్యాలను సుసాధ్యాలు చేయగలదు! భారత్ కూడా అందుకు మినహాయింపు కాదేమో!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ప్రయోగాలకు ఇది సమయం కాదు

కారణాలు ఎన్ని వున్నా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవటం కార్పొరేట్ సంస్థల విజయ రహస్యం. ఏ సంస్థ అయినా సరికొత్త ఆలోచనలతో నూతన నిర్ణయాలతో ముందడుగు వేస్తుంది. ఆ క్రమంలో ఆ సంస్థ యజమాని నుంచి అట్టడుగు స్థాయిలో పనిచేసే చిరుద్యోగి వరకు భావజాల మార్పిడి సక్రమంగా జరగాలి. అప్పుడే ఆ సంస్థ యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తాయి. అందుకోసం కార్పొరేట్ సంస్థలు వివిధ సమయాలలో ప్రయోగాలు చేస్తుంటాయి. ఏ సంస్థ అయినా లాభాల బాటలో ఉన్నప్పుడే ప్రయోగాలు చేపడుతుంది. క్లిష్ట పరిస్థితుల్లో వున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లో ప్రయోగాల జోలికి పోదు. ఎందుకంటే సంస్థ లాభాల బాటలో ఉన్నప్పుడు చేపట్టిన ప్రయోగాలు వికటించినా సంస్థ మనుగడపై అంతగా ప్రభావం చూపదు. సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిస్థితి కూడా కార్పొరేట్ సంస్థలను తలపిస్తుంది. రాష్ట్రం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ స్థితిలో ఒక కార్పొరేట్ సంస్థకు సీఈఓ తరహాలో పనిచేసే నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన తీసుకునే నిర్ణయాలు కేవలం ప్రభుత్వం ముందుకు సాగటానికి పనికి వచ్చేవిగా మాత్రమే గాక రాష్ట్ర, భావితరాల భవిష్యత్‌కు ఉపకరించేవిగా ఉండాలి. ఈ స్థితిలో పాలనలో ప్రయోగాలు చేపట్టే సాహసానికి పూనుకోకూడదు. పాలనలో నూతనత్వం ప్రభుత్వ పనితీరు మరింతగా మెరుగుపడేదిగా ఉండాలి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తూ తనదైన ముద్ర వేశారు. యువతకు, సామాజిక సమతుల్యతకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. ఆ క్రమంలో సమర్థత కొంతమేర మరుగున పడిపోతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకరకంగా చంద్రబాబు సాహసంతో కూడిన ప్రయోగం చేస్తున్నారు. అనుకోని అవాంతరాలు లేదా అనూహ్య పరిణామాల కారణంగా ఆ ప్రయోగం వికటిస్తే అందుకు రాష్ట్రం భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని చంద్రబాబు తన మేధోశక్తిని రంగరించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుంది.

రానున్న మూడు సంవత్సరాల పాటు పాలనలో ఏ విధమైన అపశృతులూ చోటు చేసుకోకుండా ఉంటే రాష్ట్ర భావితరాల భవిష్యత్‌తో పాటు తెలుగుదేశం పార్టీకి సైతం మరో మూడు దశాబ్దాల పాటు జవసత్వాలు చేకూరతాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని చంద్రబాబు తన ఆలోచనా పరంపరను, భావజాలాన్ని సరిగ్గా గ్రహించి అమలు జరపగలిగే 'డొమైన్ ఎక్స్‌పర్ట్' సహకారాన్ని తీసుకోవాలి. ఆ విధంగా వివిధ రంగాలలో నిపుణులు, అనుభవజ్ఞులైన వారి సహకారం చంద్రబాబు చేపట్టే ప్రయోగాలకు ఒక ఉత్ప్రేరకంగా పనిచేసి త్వరితగతిన సత్ఫలితాలు ఇచ్చేందుకు మార్గం సుగమమవుతుంది. అయితే ఇప్పటికిప్పుడు 'డొమైన్ ఎక్స్‌పర్ట్' లభ్యం కావటం కష్టమే. అన్నిరంగాలలో ఆ తరహా నిపుణులను గుర్తించి, వారిని రాష్ట్రంలో పనిచేసేందుకు ఒప్పించాలంటే కనీసం రెండేళ్ల సమయం పడుతుంది. కనీసం మూడేళ్ల పాటు రాష్ట్రానికి 'డొమైన్ ఎక్స్‌పర్ట్'ల సహకారం అనివార్యం. ఈలోగా స్థానికంగా అందుబాటులో ఉండే నిపుణుల సేవలు మధ్యంతర ఏర్పాటుగా ఉపయోగించుకునే వీలుంది.

చంద్రబాబు సుదీర్ఘ రాజకీయ అనుభవంలో వివిధ రంగాలలో నిపుణులైన వారు ఎంతో మంది తారసపడి ఉండవచ్చు. అటువంటి వారిని గుర్తించి, ఒక్కొక్కరికి రెండు లేదా మూడు ప్రభుత్వ శాఖలకు ఒక ప్రత్యేక అధికారిగా లేదా సలహాదారునిగా నియమించి తాత్కాలిక ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రస్తుతం మంత్రివర్గంలో నారా లోకేష్ మినహా అత్యధికులకు కేటాయించిన శాఖలపై ఏ మాత్రం అవగాహన లేదు. లోకేష్ గతంలోనూ మంత్రిగా పనిచేసి తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. తాను చేపట్టిన మంత్రిత్వ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డులు తీసుకువచ్చారు. ఆ స్థాయిలో ప్రతిభ కనబరిచేవారు మంత్రివర్గంలో ఎంతమంది ఉన్నారనే విషయం కొద్దికాలం వేచిచూసిన అనంతరం తెలుస్తుంది. అప్పటివరకు వేచి చూసిన తర్వాత ఏదైనా పొరపాటు జరిగిందని గుర్తిస్తే, దానిని సరిదిద్దుకునే సమయం, అవకాశం ఉండదు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని చంద్రబాబు ఈ రాష్ట్రానికి కార్పొరేట్ సంస్థ సీఈఓ తరహాలో యోచన చేసి 'డొమైన్ ఎక్స్‌పర్ట్'లు సమకూరేవరకు, తన పాలనా సమయంలో గుర్తించిన నిపుణుల సహకారం తీసుకోవలసిన అవసరం ఉంది.

○ ఎస్.ఎస్ ప్రసాద్
పాత్రికేయుడు

అభివృద్ధితోనే వలస జీవనానికి విముక్తి!

ఎన్ని అధునాతన వ్యవసాయ పద్ధతులు వచ్చినా, ఉత్తరాంధ్ర ప్రజలు ఎదుగూ బొదుగూ లేని జీవితాలను అనుభవిస్తున్నారు. ఇక్కడ జీవనదులు ఉన్నా సరైన నీటిపారుదల సదుపాయాలు లేక వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయి. పోలవరం ప్రాజెక్టు జలాలు ఈ ప్రాంత దాహార్తిని కొంతవరకు తీరుస్తాయి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఈ ప్రాంత సేద్యానికి అవసరమయ్యే నీటిని సమకూరుస్తుంది. కానీ ఇవి పూర్తయ్యేది ఎప్పటికో?



ఉత్తరాంధ్ర సహజ వనరులకు నిలయమైన ప్రాంతం. అయితే ఇక్కడి సహజ వనరుల వినియోగానికి ప్రభుత్వాల నుంచి సహకారమందక ఈ ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారాయి. వ్యవసాయం దండగగా మారి, అనివార్యంగా వీరు వేరే ప్రాంతాలకు తరలిపోతున్నారు. అక్కడ కూలీలుగా బతుకు వెళ్లదీస్తున్నారు. ఎన్ని అధునాతన వ్యవసాయ పద్ధతులు వచ్చినా, ఎదుగూ బొదుగూ లేని జీవితాలను అనుభవిస్తున్నారు. ఇక్కడ జీవనదులు ఉన్నా సరైన నీటిపారుదల సదుపాయాలు లేక వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయి. పోలవరం ప్రాజెక్టు జలాలు ఈ ప్రాంత దాహార్తిని కొంతవరకు తీరుస్తాయి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఈ ప్రాంత సేద్యానికి అవసరమయ్యే నీటిని సమకూరుస్తుంది. కానీ ఇవి పూర్తయ్యేది ఎప్పటికో? ఇంకా తరచూ తుఫానుల ప్రభావం, ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలతో పండిన పంటలు నాసిరకంగా తయారై మార్కెట్లో గిరాకీ కోల్పోతున్నాయి. కమతాల కొరత, ఏటా వ్యవసాయ శాఖ అందిస్తున్న రాయితీలు పొందలేకపోవడంతో పాటు అసలు ప్రభుత్వం ఏం రాయితీలు ఇస్తున్నదో కనీస అవగాహన లేని అమాయకులు ఉత్తరాంధ్రులు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వద్ద అప్పుచేసి వడ్డీలకు వడ్డీలు కడుతూ జీవనం సాగిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పట్టణాలకు వలస పోతున్నారు.

ఈ వలస పోవడం ఈనాటిది కాదు. శతాబ్దానికి పైబడి జరుగుతున్న వ్యవహారం. మొదట్లో రంగూన్ లాంటి ప్రాంతానికి, తరువాత కోస్తాలో ఆనకట్టల నిర్మాణానికి ఈ ప్రాంత వాసులు వలస వెళ్లేవారు. తదనంతరం హైదరాబాద్, చెన్నై లాంటి పట్టణాలకు తాపీ మేస్త్రిలుగా, భవన నిర్మాణ కూలీలుగా వలస వెళ్లారు. అంటే ఎన్నో తరాలుగా ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందిన ప్రాంతాల వైపు పయనమౌతున్నారు. కొందరు ఒక సంవత్సరం కాలంలో కొన్ని నెలలు ఉండి తిరిగి వస్తుంటారు. మరికొందరు మాత్రం అక్కడ కొన్ని దశాబ్దాలుగా స్థిర నివాసం ఏర్పరచుకొని అనేక ఇడుములు పడుతున్నారు. వలస వెళ్లి స్థిరనివాసం ఏర్పరుచుకున్నవారు స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి షెడ్యూల్ కులాల, తెగల, వెనుకబడిన కులాల రిజర్వేషన్ ధృవపత్రాలు పొందడానికి ఎదురు చూస్తున్నారు. అందుకు పలు ప్రాతినిధ్యాలు, పోరాటాలు చేసారు, ఇంకా చేస్తున్నారు.


ఇక్కడ పండిన పంటల, అటవీ, తీరప్రాంత ఉత్పత్తుల పరిశ్రమల స్థాపనే ధ్యేయంగా ఉద్యమాలు రావాలి. గతంలో జనుము, పంచదార, వంట నూనెల పరిశ్రమలు నెలకొల్పారు. కానీ అవి ఇండస్ట్రియల్ సిక్ పేరిట నేడు మూతపడ్డాయి. ఇప్పుడు వ్యవస్థీకరించబడుతున్న ఆహారోత్పత్తుల పరిశ్రమలలో స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు లేవు. స్వతహాగా ఉద్యమ నేపథ్యం కలిగిన ప్రజలు కావడంతో కొన్నాళ్ల క్రితం జరిగిన గంగవరం పోర్టు ఉద్యమం లాంటివి మరలా పెద్దయెత్తున పెల్లుబికే అవకాశం ఉంటుందని భావిస్తూ, పెత్తందారీ, పెట్టుబడి వర్గాల యాజమాన్యం ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదు. ఇక్కడ నెలకొల్పబడిన అతిపెద్ద ఇనుము ఉక్కు కర్మాగారం విశాఖ స్టీల్. ఇప్పటికీ పూర్తిస్థాయి విస్తరణ, ఉత్పత్తి సామర్థ్యం లేకుండా పనిచేస్తున్నది. అంతో ఇంతో ఈ ప్రాంత ప్రజల నిరుద్యోగిత తగ్గుదలకు ప్రధాన భూమిక వహించే పరిశ్రమ ఇది. దాన్ని ఇప్పుడున్న ప్రభుత్వాలు ప్రైవేట్ పరం చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇటీవల గిరిజనుల అటవీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే చట్టాలు వస్తున్నాయి. అందువల్ల బాక్సైట్, మాంగనీస్ గనుల పేరిట అడవులలో తవ్వకాలు చేపట్టడంతో అడవిపుత్రుల మనుగడ ప్రమాదకర స్థితిలో ఉంది. ఈ ప్రాంత మత్స్యకారుల చేపల వేటకు అవసరమయ్యే జెట్టీలు, ఓడరేవులు ఇక్కడ లేవు. దాంతో అనివార్యంగా వీరు గుజరాత్ లాంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ సమస్యలన్నీ తీరాలంటే ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీలు, సదుపాయాలు ప్రభుత్వాలు కల్పించాలి.

ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద పట్టణం విశాఖపట్నం. ఎంతో కొంత పారిశ్రామిక వాతావరణం గల నగరమిది. విద్యా వైద్య సంస్థలు ఉన్న పట్టణం కూడా. ఉత్తరాంధ్ర ప్రజలు విద్య, వైద్యానికి ఈ పట్టణమే ఆసరాగా నిలుస్తున్నది. ఉత్తరాంధ్ర ఆరు జిల్లాలతో పాటు, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు కూడా ఈ పట్టణం పైనే ఆధారపడతారు. సంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులతో పాటు, అసంఘటిత రంగంలో లక్షలాది మంది కార్మికులు నిత్యం ఈ పట్టణంలోనే తమ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. అలాంటి పట్టణం నేడు వెలవెలబోతున్నది. ఎందుకంటే, ఈ పట్టణానికి ఎటువంటి అధికారిక హోదా లేకపోవడమే. మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే, ఈ పట్టణాన్ని ఇతర ప్రాంతాల ఆధిపత్య వర్గాలు తమ తమ ఆర్థిక మూలాలతో ఆక్రమించుకున్నాయి. వారు వివిధ వ్యాపార సంస్థలు నెలకొల్పి ఈ ప్రాంత అస్తిత్వంపై అజమాయిషీ కొనసాగిస్తున్నారు.

ఈ పట్టణాన్ని ఆర్థిక రాజధానిగా చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం పూనుకుంది. ఆర్థిక రాజధాని అయితే ఈ ప్రాంత ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులు చక్కబడతాయి. ప్రధానంగా ఎన్నో ఏళ్లుగా పీడిస్తున్న వలస సమస్య తగ్గుముఖం పడుతుంది. మరికొన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, దిగ్గజ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కార్పొరేట్ సంస్థలు స్థాపించబడతాయి. పెద్ద ఎత్తున ఐటీ, కంప్యూటర్ రంగాల నిపుణులకు ఉపాధి దొరుకుతుంది. వివిధ రవాణా మార్గాలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. దాంతో ఈ ప్రాంత ప్రజలకు విశాఖపట్నంతో అనుసంధానమేర్పడుతుంది. తద్వారా సామాన్యులకు జీవనోపాధి లభిస్తుంది. దీంతో పాటు ప్రభుత్వం ఈ ప్రాంత సహజ వనరుల వినియోగానికి తగిన ఏర్పాట్లు చేస్తే ఈ ప్రాంతం దీర్ఘకాలిక అభివృద్ధి చెందుతుంది. దాంతో హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, భిలాయ్, రూర్కెలా, రాయిపూర్, భివాండీ, సూరత్, అహ్మదాబాద్ మొదలైన ప్రాంతాలలో నివసించే ఈ ప్రాంత ప్రజలు తిరుగుముఖం పడతారు. ఉత్తరాంధ్ర ప్రజల వలస జీవనాన్ని చెక్ పెట్టేది విశాఖపట్నం నగర అభివృద్ధే. అదంతా భారత్‌కి ముంబాయిలా, ఆంధ్రాకు విశాఖ ఆర్థిక రాజధానిగా రూపాంతరం చెందడంలోనే ఉంటుంది.

■ పిల్లా తిరుపతిరావు



పట్టిసీమతో సిరుల సీమగా కృష్ణాడెల్టా

జలవనరులశాఖ మంత్రి రామానాయుడు



పవిత్ర సంగమం వద్ద కృష్ణా - గోదారమ్మలకు జలహారతి ఇస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే రాము, దేవినేని ఉమా

ఇబ్రహీంపట్నం, జూలై 8 : పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాను సిరుల సీమగా మార్చి డెల్టా ప్రజలను వలస కష్టాల నుంచి బయటపడేసే దార్శనికుడు సీఎం చంద్రబాబు అని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణమ్మలో కలిసిన గోదావరి జలాలకు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద ఆయన సోమవారం మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూలు జల్లి చీరె సారె సమర్పించి జలహారతి ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 24 పంపుల్లో 17 పంపుల ద్వారా 6,100 క్యూసెక్కుల నీరు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. 2015 - 19 మధ్య కాలంలో 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే రైతులకు రూ.50 వేల కోట్ల ఆదాయం సమకూరిందంటే అసలైన సంపద సృష్టి ఎలా జరిగిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్ (రాజా), చెన్నుబోయిన చిట్టిబాబు, చనమోలు నారాయణ, షైలా సైదులు, రావి ఫణి, పీతా శ్రీనివాసరాజు, ఈఎస్‌సీ సి.నారాయణ రెడ్డి, సలహాదారులు వెంకటేశ్వరరావు, ఎస్ఈలు టీజేహెచ్ ప్రసాదబాబు, ఉమామహేశ్వరరావు, పి.వి.ఆర్ కృష్ణారావు, పాల్గొన్నారు.

• రాజశేఖరరెడ్డికి నివాళి

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి కార్యక్రమం మంగళగిరిలోని సీకే ఫంక్షన్ హాలులో సోమవారం జరిగింది. తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సీపీఐ నేత నారాయణ, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల, కేవీపీ రామచంద్రరావుతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు వైఎస్‌కు నివాళి అర్పించారు.



తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న షర్మిల

ఆర్టీఏ కేసులు ఇక ట్రాఫిక్‌కు...

విజయవాడలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు

రోడ్డు ప్రమాదాల కేసులు ట్రాఫిక్ విభాగానికి బదలాయింపు

ఐదో ట్రాఫిక్ స్టేషన్‌లో తొలుత అమలు

విజయవంతమైతే నగరంలో అమలు చేయనున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): రోడ్డు ప్రమాదం కేసులను ట్రాఫిక్ విభాగానికి అప్పగించాలని అధికారులు భావిస్తున్నారా? ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తోపాటు ప్రమాదం కేసులను దర్యాప్తు చేయగలరా లేదా అన్న అంశాన్ని పరిశీలిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇప్పటి వరకు శాంతిభద్రతల విభాగం పరిధిలో ఉన్న రోడ్డు ట్రాఫిక్ యాక్సిడెంట్ (ఆర్టీఏ) కేసులను ట్రాఫిక్ విభాగానికి అప్పగించాలని భావిస్తున్నారు. ఇప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. హెల్మెట్ ధారణ లేనివారికి జరిమానాలు విధించడం, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం వంటి విధులను నిర్వహిస్తున్నారు.

ఎందుకు ఇలా?

విజయవాడ నగరంలో రోడ్డు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్కో ప్రమాదం వెనుక ఒక్కో కోణం ఉంటుంది. అతివేగంతో కొంతమంది ప్రాణాలు కోల్పోతుంటే, మద్యం మత్తులో వాహనాలు నడిపి మరికొందరు చనిపోతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ఇంకొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య ఒక చిక్కుముడిలా మారుతోంది. అధికారులు ఎన్ని ప్రణాళికలు అమలు చేసినా ట్రాఫిక్ సాఫీగా సాగడం లేదు. మరోపక్క శాంతిభద్రతల పోలీసులపై పని ఒత్తిడి పెరుగుతోంది. బందోబస్తులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పటి వరకు శాంతిభద్రతల పోలీసులు దర్యాప్తు చేస్తున్న రోడ్డుప్రమాద కేసులను ట్రాఫిక్ పోలీసులకు అప్పగించాలని పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ నిర్ణయించారు. దీన్ని ప్రయోగాత్మకంగా ఐదో ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో అమలు చేస్తున్నారు. కృష్ణలంక నుంచి బెంజ్‌సర్కిల్ వరకు, బెంజ్‌సర్కిల్ నుంచి మాచ వరం వరకు ఉన్న ప్రాంతం ఐదో ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో ఉంటుంది. ఈ మొత్తం పరిధిలో ఎక్కువగా జాతీయ రహదారి ఉంటుంది. ఈ స్టేషన్ పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును ఆ స్టేషన్ అధికారు లకు అప్పగించారు. ట్రాఫిక్ పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్‌తోపాటు ఈ ప్రమాద కేసులను దర్యాప్తు చేస్తారా లేదా అన్న అంశాన్ని పరిశీలిస్తారు. ఈ ప్రయోగం ఇక్కడ విజయవంతం అయితే మిగిలిన స్టేషన్లలో అమలు చేయాలని నిర్ణయించారు.



కీసర స్టాక్ యార్డు దగ్గర ఇసుక కోసం 4 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ - 65పై బారులు తీరిన వాహనాలు

తొలిరోజు మల్లగుల్లాలు

ఇసుక పథకం అమలు రోజున జిల్లా యంత్రాంగం గందరగోళం

ఉచిత ఇసుక పథకం అమలు రోజున అధికార యంత్రాంగం గందరగోళానికి గురైంది. జీవో వచ్చేంత వరకు అధికార యంత్రాంగం పంపిణీ ప్రక్రియను ప్రారంభించకపోవటంతో ఇసుక కోసం వచ్చినవారు ఇబ్బందులు పడ్డారు. సోమవారం స్టాక్ యార్డుల దగ్గర వాహనాలు కిలోమీటర్ల కొద్దీ బారులు తీరాయి. ఉచిత ఇసుక కోసం ట్రాక్టర్లు, లారీలు, పెద్ద టిప్పర్లు స్టాక్ యార్డులకు వచ్చాయి. యార్డుల్లో ఇసుక పంపిణీ చేపట్టకపోవటంతో ఈ వాహనాలన్నీ జాతీయ రహదారుల వెంబడి నిలిపేశారు.

జీవో కోసం వేచి చూసిన అధికారులు

- రాత్రి 7 గంటల వరకు కూడా ప్రారంభం కాని పంపిణీ
- ఇసుక డిపోలకు భారీగా వాహనాల రాక
- స్టాక్ యార్డుల్లో ఇసుక నిల్వలు మాయం
- ఐదేళ్ల నిరీక్షణ తర్వాత ప్రజలకు తగ్గిన ఇసుక భారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల): అధికార యంత్రాంగం తగిన ముందస్తు సన్నద్ధత లేకుండా సోమవారం ఉదయం ఆరు గంటల నుంచే ఇసుక లోడింగ్ ప్రారంభమవుతుందని ప్రకటించడంతో కీసర స్టాక్ యార్డు దగ్గరకు పెద్ద ఎత్తున వినియోగదదారులు ట్రాక్టర్లు, లారీలతో రావటం ప్రారంభమైంది. విజయవాడ, ఇబ్రహీంపట్నం, నందిగామ, కంచికచర్ల తదతర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీలు వచ్చాయి. ప్రభుత్వం మౌఖికంగా ఆదేశించినా.. జీవో వచ్చేంత వరకు స్టాక్ యార్డులో ఇసుక లోడింగ్ ప్రారంభించ లేదు. జీవో వచ్చిన తర్వాత కూడా సాయంత్రం 6.30 గంటలు దాటినా ఇసుక పంపిణీని చేపట్టలేకపోయారు. ఎన్టీఆర్ జిల్లాలో పెద్ద మొత్తంలో కీసర స్టాక్‌యార్డులోనే ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇక్కడ కూడా ప్రారంభం కాకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్టాక్‌యార్డులోనే మైనింగ్, రెవెన్యూ, సెబ్, పోలీస్ అధికారులు ఇలా అంతా సాయంత్రం వరకు యార్డు దగ్గరే నిరీక్షించారు తప్పితే ఇసుక పంపిణీకి చర్యలు తీసుకోలేకపోయారు. జిల్లా వ్యాప్తంగా మిగిలిన యార్డుల్లో చూస్తే అల్లూరుపాడు, అనుమంచిపల్లి, పోలంపల్లిలలో పంపిణీ ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదు. కొద్ది నిమిషాల్లో మంత్రి కొల్లు రవీంద్ర వస్తున్నారంటూ గంటల తరబడి వినియోగదారులు, రవాణా వాహనాల సిబ్బందిని వేచి చూసేలా చేశారు.

• స్టాకు యార్డుల్లో ఇసుక మాయం

స్టాకు యార్డుల్లో ఇసుక చాలా వరకు మాయమైందన్న ఆరోపణలు వస్తున్నాయి. నందిగామ డివిజన్ పరిధిలో కంచికచర్ల మండలంలోని కీసర, మోగులూరు, నందిగామ మండలంలోని కంచల, మాగల్లు, చందర్లపాడు మండలంలోని కొడవటికల్లు, వత్సవాయి మండలంలోని పోలంపల్లి, అల్లూరుపాడు, జగ్గయ్యపేట మండలంలోని అనుమంచిపల్లి గ్రామాల పరిధిలో మొత్తం ఎనిమిది ఇసుక స్టాకు యార్డులు ఉన్నాయి. వీటిలో కీసర, మోగులూరు యార్డుల్లో భారీగా ఇసుక నిల్వలు ఉన్నాయి.

• స్టాక్ ఇసుక అక్రమార్కుల పరం

మేలో ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో యార్డుల దగ్గర పెద్దగా నిఘా లేకపోవటంతో మే నెల ప్రారంభంలో అక్రమార్కుల కళ్లు స్టాక్ యార్డులపై పడ్డాయి. ఎలాంటి అనుమతులూ లేకుండానే జేసీబీలతో లారీలకు, ట్రాక్టర్లకు లోడింగ్ చేసి, ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వస్తున్నాయి. పోలింగ్ ముగిసిన తర్వాత కూడా ఇసుక లూటీ జరుగుతూనే ఉండటంతో తెలుగుదేశం నాయకులు ఆందోళనకు కూడా దిగారు.

• ఐదేళ్ల ఇసుక కష్టాలకు తెర

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండెక్కి కూర్చున్న ఇసుక ధరలతో బెంబేలెత్తిన ప్రజలకు ఉపశమనం లభించినట్టు అయింది. తొలిరోజు కావటంతో సోమవారం పంపిణీలో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నా మంగళవారం నుంచి మాత్రం ప్రజలకు పూర్తి స్థాయిలో పంపిణీ చేపట్టనున్నారు. వినియోగదారులు తమ ఫోన్ నెంబర్ చెప్పటంతో పాటు, ఆధార్ కార్డును ఆధారంగా చేసుకుని రోజుకు 20 టన్నుల ఇసుకను అందిస్తారు. అన్ని స్టాక్ యార్డుల్లో కలిపి మొత్తం 5.54 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్టుగా అధికారులు ప్రకటించారు. రవాణా ధరలు విషయానికి వస్తే ఇంకా మరింత స్పష్టత రావాల్సి ఉంది. జిల్లా అతి పెద్ద స్టాక్ యార్డు అయిన కీసర నుంచి విజయవాడకు పది చక్రాల లారీకి రూ.6 వేలు కిరాయి వసూలు చేయనున్నారు. అదే ఇబ్రహీంపట్నం అయితే రూ. 4500 - 5000 మధ్యన ఉంటుంది.

హద్దు దాటితే పెనాల్టీలు తప్పవు

ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కొరడా ఘళిపించబోతోంది. దీనికోసం భారీగా పెనాల్టీలను విధించేందుకు సిద్ధమైంది. వేబిల్లులు లేకుండా, ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తూ వాహనాలు పట్టుబడితే ఇక నుంచి అధికారులు భారీగా పెనాల్టీలు విధించనున్నారు. ట్రాక్టరుకు మొదటిసారి రూ.పది వేలు, రెండోసారి పట్టుబడితే రూ.10,001 నుంచి రూ.20 వేల వరకు, పది టైర్ల లారీకి రూ.25 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.25,001 నుంచి రూ.50 వేల వరకు, పది టైర్లు పైబడిన లారీలకు, యంత్రాలకు మొదటిసారి రూ.50 వేలు, రెండోసారి పట్టుబడితే రూ. 50,001 నుంచి రూ.లక్ష వరకు పెనాల్టీ విధించనున్నారు.

ప్రాణం కంటే.. ఇసుక ముఖ్యమా!

- అల్ట్రాటెక్ పేలుడు ఘటనలో రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టర్ ఫైర్
- తహసీల్దార్, నందిగామ ఆర్డీవోలపై తీవ్ర ఆగ్రహం

6లో..



తొలుత తాగునీరు..

ఆ తర్వాతే సాగు నీరు విడుదల



- తూర్పు, పశ్చిమ డెల్టాల్లో తాగునీటికి మొదటి ప్రాధాన్యం
- ప్రకాశం బ్యారేజీకి చేరిన 'గోదావరి'
- రెండు డెల్టాల కాల్వలకు రేపు తాగునీరు విడుదల
- 'తూర్పు'లో 547... 'పశ్చిమ'లో 127 చెరువులు
- చెరువుల్లో కనిపించని చుక్కనీరు
- పది రోజులపాటు తాగునీటి అవసరాలకు విడుదల

తాగునీటి అవసరాలు తీరుస్తారా? సాగునీటిని విడుదల చేసి సహకరిస్తారా? జలవనరుల శాఖ అధికారుల ముందు ఉన్న ప్రశ్న ఇది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణా నదికి చేరడంతో అవసరాలు కత్తిమీద సాములా మారుతున్నాయి. అటు పులిచింతల ప్రాజెక్టులోనూ, ఇటు ప్రకాశం బ్యారేజీలోనూ నీటి నిల్వలు అంతంతమాత్రంగా ఉన్నందున పైనుంచి వస్తున్న పట్టిసీమ నీటితో ఈ నీటి సంవత్సరాన్ని ముందుకు నడిపించాలని అధికారులు భావిస్తున్నారు. గోదావరి జలాలు సోమవారం ప్రకాశం బ్యారేజీని తాకాయి. దీంతో తొలుత కాలువల ద్వారా తాగునీటిని విడుదల చేయాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. పది రోజులపాటు ఈ ప్రణాళికను అమలు చేయాలని భావిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత సాగునీటి అవసరాలకు ప్రణాళికలను రూపొందించాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ప్రతి ఏడాదీ ప్రకాశం బ్యారేజీ నుంచి తూర్పు ప్రధాన, పశ్చిమ ప్రధాన కాలువ ద్వారా జూన్‌లోనే తాగు, సాగు నీటిని విడుదల చేసేవారు. గడచిన నీటి సంవత్సరంలో ఎల్‌నినో ప్రభావంతో ఈ ప్రణాళిక మొత్తం పటాపంచలైంది. తాగునీటి, సాగునీటి అవసరాలకు వేర్వేరుగా నీటిని విడుదల చేశారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చెరువులను నింపుకోవడానికి నీటిని ఇచ్చారు. తూర్పు డెల్టా కాల్వల కింద 547 చెరువులు ఉన్నాయి. ఈ చెరువులన్నీ కృష్ణా జిల్లాలో ఉన్నాయి. పశ్చిమ డెల్టా కాలువ కింద 127 చెరువులు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి ఈ చెరువులన్నీ నిండుకుండలా ఉండేవి. ఎల్‌నినో ప్రభావంతో గడచిన వర్షాకాలంలో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు ఎండిపోయాయి. వాటిలోకి చుక్కనీరు చేరలేదు. చివరికి జలవనరుల శాఖ అధికారులు పులిచింతల నుంచి నీటిని ప్రకాశం బ్యారేజీకి విడుదల చేశారు. ఇక్కడి నుంచి రెండు దఫాలుగా తాగునీటికి నీటిని విడుదల చేశారు. గడచిన ఏడాది జూన్‌లో ఒకసారి తాగునీటిని విడుదల చేసిన అధికారులు, ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండోసారి తాగునీటిని విడుదల చేశారు. అటు పశ్చిమ, ఇటు తూర్పు డెల్టా పరిధిలో ఉన్న చెరువులను నింపడానికి సుమారుగా పది టీఎంసీల నీరు అవసరమవుతుందని అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో చెరువులు పూర్తిగా నిండుతాయని అధికారులు భావించారు. ప్రస్తుతం ల్యానినో ప్రభావం నడుస్తున్నా, రుతుపవనాలు తాకినా వర్షాలు పూర్తిస్థాయిలో కురవడం లేదు. దీంతో నదుల పరిస్థితి దారుణంగా ఉంది. చెరువులు చుక్కనీరు లేని దుస్థితికి చేరుకున్నాయి.

• పదిరోజుల పాటు...

సాగునీటి అవసరాల కంటే ముందుగా తాగునీటి అవసరాలు తీర్చాలని అధికారులు యోచిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి పట్టిసీమ ద్వారా రోజుకు 6వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ నీటిని ముందుగా చెరువులు నింపడానికి ఇవ్వాలని నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువల ద్వారా బుధవారం నీటిని విడుదల చేస్తామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. కాలువల ద్వారా పది రోజులపాటు తాగునీటి అవసరాలు తీర్చడానికి ఈ నీటిని విడుదల చేస్తారు. సాగునీటి అవసరాలకు ఎప్పుడు నీటిని విడుదల చేయాలన్న అంశంపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో సమావేశమై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. జలవనరుల శాఖ అధికారులతో మంత్రి విజయవాడలో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు సమాచారం. చెరువులన్నీ పూర్తిగా నిండిన తర్వాత సాగునీటిని ఇవ్వడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కన్నీటి వీడ్కోలు!

అల్ట్రాటెక్ కర్మాగారం ప్రమాదంలో మృతిచెందిన వెంకటేశ్ అంతిమ యాత్ర

- కొడుక్కి తండ్రి దహన సంస్కారాలు
- బాధిత కుటుంబ సభ్యులకు కలెక్టర్, ఎమ్మెల్యే ఓదార్పు



అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు



వెంకటేశ్ కుమార్తెలు వర్షిణీ, తేజస్వీ

జగ్గయ్యపేట రూరల్, జూలై 8 : కుటుంబానికి జీవనాధారంగా ఉంటాడనుకున్న కొడుకు అర్థంతరంగా ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకోవడంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. పక్షవాతంతో బాధపడుతున్న తండ్రి కొడుకు దహన సంస్కారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అల్ట్రాటెక్ సిమెంటు కర్మాగారం ప్రమాద ఘటనలో మృతి చెందిన వెంకటేశ్ కుటుంబం ఒంటరిదైంది. ఆకుల వెంకటేశ్ మృతదేహాన్ని - మిగతా 6లో

గ్రామస్తులపై లాఠీచార్జి

అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కుటుంబ సభ్యులతో కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, డీసీపీ శ్రీనివాసరావు సోమవారం కర్మాగారంలో ముఖాముఖి మాట్లాడారు. కుటుంబాల నేపథ్యం వారి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశానికి ముందు కర్మాగారం ప్రమాదంలో క్షతగాత్రులు, మృతుని కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు పెద్దఎత్తున బైకులు, ట్రాక్టర్‌లతో కంపెనీ వద్దకు వెళ్లారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రధాన గేట్లను మూసేయటంతో ఆగ్రహించిన వారు ట్రాక్టర్‌లతో ఢీకొట్టి ప్రాంగణంలోకి పరుగులు పెట్టారు. కర్మాగార రక్షణకు మోహరించిన పోలీసులపై ఆగ్రహించిన గ్రామస్థులు పోలీసులపై రాళ్ల దాడి చేశారు. పోలీసులు లాఠీలకు పనిచెప్పడంతో పలువురు గాయపడ్డారు. కర్మాగార ప్రమాదంలో బాధితుల పక్షాన సమస్య పరిష్కారానికి వచ్చిన తమను పోలీసులు ఇష్టారాజ్యంగా దాడి చేసి చితకొట్టారని గ్రామస్థులు గోపి, మోహన్, అంజనేయులు ఆరోపించారు. గ్రామస్థుల దాడిలో నందిగామకు చెందిన ఇద్దరు సీఐలు, విజయవాడకు చెందిన మరో ఇద్దరు సీఐలకు గాయాలయ్యాయని సీఐ జానకిరామ్ తెలిపారు. పరిస్థితి గమనించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపారు.



దుర్గమ్మకు సారె సమర్పించిన భక్త బృందాలు

దుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పణ

వన్‌టౌన్, జూలై 8 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు జరుగుతున్న ఆషాఢమాస ఉత్సవాల క్రమంలో సోమవారం 723 మంది భక్తులు సారె సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కనకదుర్గ లలితా పారాయణ బృందానికి చెందిన 400 మంది, వివిధ ప్రాంతాలకు చెందిన పలు భక్త బృందాలకు చెందిన మరో 323 మంది సారె సమర్పించారు. పట్టుచీరలు, సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గాజులు, తీపి పదార్థాలను అమ్మవారికి సమర్పించారు, మహామండపంలోని 6వ అంతస్తులో ప్రత్యేక అర్చనల అనంతరం ఆశీస్సులు అందుకున్నారు.

విమానాశ్రయానికి ప్రముఖుల తాకిడి



కేంద్రమంత్రి మురుగన్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

గన్నవరం(ఉంగుటూరు) జూలై 8 : పలువురు రాజకీయ ప్రముఖుల రాకపోకలతో సోమవారం గన్నవరం విమానాశ్రయంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ కేశినేని చిన్ని హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ్నుంచి రోడ్డు మార్గాన విజయవాడ బయలుదేరి వెళ్లారు. కాగా కేంద్ర బ్రాడ్‌కాస్టింగ్ అండ్ ఇన్‌ఫర్మేషన్ శాఖామంత్రి ఎల్.మురుగన్ చెన్నై నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. పలువురు బీజేపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో రాజమండ్రిలో జరిగే బీజేపీ కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ప్రత్యేక విమానాల్లో గన్నవరం చేరుకున్నారు. వారికి స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీశ్రేణులతో విమానాశ్రయం కోలాహలంగా మారింది. మాజీ సీఎం వైఎస్ జగన్, భారతి దంపతులు ఇడుపులపాయనుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా వారికి వైసీపీ శ్రేణులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో తాడేపల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కుటుంబసమేతంగా కడపనుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా వారికి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో ఆమె మంగళగిరికి బయలుదేరి వెళ్లారు. తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన వెంట ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దానం నాగేంద్ర, జైపాల్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్, ఫ్రాంక్లిన్ కె.సునీల్ తదితరులు వున్నారు. వీరంతా మంగళగిరికి రోడ్డుమార్గంలో బయలుదేరి వెళ్లారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెస్తాం : రఘువీరా



గన్నవరం(ఉంగుటూరు), జూలై 8 : రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. దివంగత మాజీముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్‌నుంచి గన్నవరం చేరుకున్న ఆయన విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలన్నదే వైఎస్ చివరి కోరిక అని, దాన్ని నెరవేర్చేందుకు కాంగ్రెస్‌పార్టీలో వున్న నాయకులందరూ సమష్టిగా కృషిచేస్తున్నామన్నారు. మరో ఐదేళ్లలో వైఎస్సార్ ఆశయం నెరవేరుతుందన్న ఆయన రాష్ట్రానికి ప్రత్యేకహోదా రాహుల్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు గతం కంటే పెరిగిందన్నారు. అనంతరం రోడ్డు మార్గంలో మంగళగిరికి బయలుదేరి వెళ్లారు.

ఉచిత ఇసుక విధానం అభినందనీయం

- వైసీపీ ఇసుక అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి
- విభజన పంపకాల్లో రాష్ట్రానికి న్యాయం జరగాలి
- ప్రత్యేక హోదా తెచ్చే పార్టీతో కలిసి పనిచేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కె.రామకృష్ణ



మచిలీపట్నం టౌన్, జూలై 8 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఇసుక పాలసీ వల్ల భవన కార్మికులకు పని దొరుకుతుందని, ఇది శుభ పరిణామమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కె.రామకృష్ణ అన్నారు. ఆదివారం మచిలీపట్నంలో మోదుమూడి శ్రీహరిరావు సంస్మరణ సభకు హాజరైన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో అక్రమ మైనింగ్‌లో వేలకోట్లు దోచుకున్న నేతలపై చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతితో పాటు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్ర నిధులు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఏపీలోపి ఐదు గ్రామాల విలీనంపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మంచి నిర్ణయం తీసుకునేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. విభజన ఆస్తుల పంపకంలో వేలకోట్ల ఆస్తులు ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సి ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రత్యేక హోదా లక్ష్యంగా ఉన్న ఏ పార్టీతోనైనా కలిసి పనిచేస్తామన్నారు. ఖరీఫ్ ప్రారంభమైన దృష్ట్యా సీఎం చంద్రబాబు ప్రకటించిన వాగ్దానం మేరకు రైతులకు సాయం అందించాలన్నారు.

తెలంగాణా ముఖ్యమంత్రికి స్వాగతం



కృష్ణలంక : దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలలో పాల్గొనేందుకు సోమవారం నగరానికి వచ్చిన తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ జి.సృజన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

కొండపల్లి బొమ్మల కళాకారులకు చేయూత..

- మంత్రి సవిత



కొండపల్లి బొమ్మల కళాకారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఇబ్రహీంపట్నం, జూలై 8 : కొండపల్లి బొమ్మల కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సంజీవ రెడ్డి సవిత అన్నారు. కొండపల్లి బొమ్మల కాలనీలో సోమవారం ఆమె పర్యటించారు. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొండపల్లి కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొండపల్లి బొమ్మలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతారన్నారు. కొండపల్లి కోట వద్ద బొమ్మల విక్రయానికి చర్యలు తీసుకుంటామన్నారు. వసతిగృహంలో 8, 9 తరగతులలో 40 సీట్ల చొప్పున పెంపునకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టుకుదురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన వెనిగండ్ల



గుడివాడ : రాష్ట్ర రాజధాని అమరావతితో పాటు గుడివాడ అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో చంద్రబాబును కలిసి సమస్యలను విన్నవించారు. జాతీయ రహదారుల పరిధిలో ఉన్న గుడివాడలోని బైపాస్‌రోడ్ల అభివృద్ధికి, ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని అన్ని ప్రధాన రహదారులు, గుడివాడలో ఐటీ సెజ్ ఏర్పాటు తదితర వినతులను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించినట్టు వెనిగండ్ల తెలిపారు.

ప్రాణం కంటే.. ఇసుక ముఖ్యమా!

- అల్ట్రాటెక్ పేలుడు ఘటనలో రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టర్ ఫైర్
- తహసీల్దార్, నందిగామ ఆర్డీవోలపై తీవ్ర ఆగ్రహం



రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

ఆంధ్రజ్యోతి, విజయవాడ : అంత పెద్ద సంఘటన జరిగితే కనీసం బాధ్యత లేదా.. ప్రజల ప్రాణాలను కాపాడటానికి రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి.. అధికారులు త్వరగా స్పందించి ఉంటే ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు.. రెవెన్యూ అధికారులు తగిన విధంగా స్పందించలేదు.. ఘటన సమయంలో ఉచిత ఇసుక పంపిణీకి సంబంధించి అధికారులతో సమావేశమైనట్టు తహసీల్దార్ చెప్పే ప్రయత్నం చేయగా.. మీకు ఇసుక ముఖ్యమా? ప్రజల ప్రాణాలు ముఖ్యమా.. అంటూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ నిప్పులు చెరిగారు.

అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలుడు ఘటనలో అలసత్వం వహించిన రెవెన్యూ అధికారులపై కలెక్టర్ సృజన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బూదవాడలోని ఫ్యాక్టరీ ప్రమాదం పట్ల రెవెన్యూ యంత్రాంగం తగిన విధంగా స్పందించకపోవటం పట్ల ఆమె సీరియస్ అయ్యారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడటానికి, బాధితుల కుటుంబసభ్యులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకోవటంతో పాటు, యాజమాన్యం నుంచి తగిన సహాయ, సహకారాలను అందించేందుకు సోమవారం కలెక్టర్ సృజన జగ్గయ్యపేట వచ్చారు. ఈ క్రమంలో స్థానిక తహసీల్దార్ సరిగా స్పందించకపోవటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమాచారం తెలపకపోవటం పట్ల కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినపుడు కనీసం అప్రమత్తంగా కూడా లేకపోవటంపై కలెక్టర్ మండిపడ్డారు. నందిగామ ఆర్డీవో తీరుపైనా కలెక్టర్ సీరియస్ అయ్యారు. అంత పెద్ద సంఘటన జరిగితే కనీసం బాధ్యత లేదా.. అని జేసీ సంపత్ కుమార్ ఎదుట కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఒకనాక దశలో ఇక్కడ ఎవరైనా ఉన్నారా.. చచ్చిపోయారా.. అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అనంతరం బాధితులతో, కంపెనీ యాజమాన్యంతో, స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు నిర్దేశించి విజయవాడ బయలుదేరారు.

పోలీసుల తీరుపైనా ఆగ్రహం..

నందిగామ : బూదవాడ సిమెంటు పరిశ్రమలో పేలుడు ఘటనలో ఆందోళన చేస్తున్న బాధితులపై పోలీసులు లాఠీచార్జి చేయడంపై కలెక్టర్ సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో ఉండి కూడా లాఠీ చార్జి వరకూ పరిస్థితిని ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. బాధితులపై దాడి చేయడం దారుణమన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

కన్నీటి వీడ్కోలు!

(5వ పేజీ తరువాయి)



మృతుడి భార్య కన్నీటి పర్యంతం

సోమవారం విజయవాడలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందించారు. మధ్యాహ్న సమయంలో బూదవాడకు చేరుకున్న మృతదేహాన్ని కడసారి చూపునకు ఇంటికి చేర్చారు. అంతిమయాత్రలో బంధువులు, గ్రామస్తులు పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. పక్షవాతంతో బాధపడుతున్న తండ్రి వీరయ్య కుమారుడి మృతదేహానికి నివ్వంటిస్తూ విలపించారు.

వెంకటేశ్ కుటుంబ పరిస్థితి ఇదీ..

వెంకటేశ్ తండ్రి వీరయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. తల్లి రమాదేవి వృద్ధురాలు. భార్య త్రివేణి, పిల్లలు వర్షిణి, తేజస్వీ. వీరందరికీ వెంకటేశ్ ఒక్కడే ఆధారం. చిన్నపాటి రేకుల షెడ్డులో ఈ కుటుంబం జీవనం సాగిస్తోంది. వెంకటేశ్ తండ్రి వీరయ్య మాట్లాడుతూ ముదిమి వయసులో అండగా ఉంటాడనుకున్న కుమారుడు మృత్యువాత పడటంతో తమకు దిక్కుతోచడం లేదన్నారు. చిన్నారులు, కోడలను ఎలా ఓదార్చాలో.. వారిని ఎలా పోషించాలో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్ భార్య త్రివేణి ఏకధాటిగా రోదిస్తూనే ఉంది.

కంటిచూపు కోల్పోయిన కొడుకును ఎలా పోషించాలి

సిమెంట్ కర్మాగారం ప్రమాదంలో చూపు కోల్పోయిన దారావత్ వెంకటేశ్వర్లుది మరో విషాదం. ఈయనకు వృద్ధురాలైన తల్లి, భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరందరికీ వెంకటేశ్వర్లే ఆధారం. కంటిచూపు కోల్పోవడంతో ఇకపై కుటుంబ పోషణ ఎలా అని తల్లి, భార్య వాపోతున్నారు. కంటిచూపు కోల్పోయిన కుమారునితో తమ జీవనం ఎలా సాగుతుంది అంటూ వృద్ధురాలైన తల్లి చిలకమ్మ విలపించారు.

ఉదయభానును అడ్డుకున్న పోలీసులు

బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార ప్రమాదంలో గాయపడిన కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు గ్రామానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానును రెవెన్యూ పోలీసులు సోమవారం గ్రామంలోకి రాకుండా అడ్డగించారు. నియోజకవర్గంలో నాకు 90 వేల ఓట్లు వచ్చాయని, ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబాలను పరామర్శించకుంటే తనపై మరోలా ప్రచారం జరుగుతుందని, బాధితులను పరామర్శించాలని పట్టుబట్టినా ప్రస్తుతం కలెక్టర్, ఎమ్మెల్యేలు, బాధిత కుటుంబాలు, యాజమాన్యంతో సంప్రదింపులు జరుగుతున్నాయని జేసీ సంపత్‌కుమార్ తెలిపారు. వారు వెళ్లిన తరువాత రావాలని అధికారులు సూచించటంతో ఉదయభాను వారిపై ఆగ్రహం వ్యక్తం చేసి వెనుదిరిగారు.

ప్రమాణాలు పాటించాల్సిందే

- ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు
- ప్రత్యేక కమిటీతో పరిశ్రమల్లో తనిఖీలు : కలెక్టర్ సృజన

విజయవాడ లీగల్, జూలై 8 : పరిశ్రమల్లో కార్మికుల భద్రత, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ తదితరాలకు సంబంధించి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన స్పష్టం చేశారు. అల్ట్రాటెక్ కర్మాగారంలో ప్రమాదం నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జేసీ పి.సంపత్‌కుమార్‌తో కలిసి పరిశ్రమలు, కర్మాగారాలు, కాలుష్య నియంత్రణ, విపత్తుల నిర్వహణ, కార్మిక



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిశ్రమల్లో అత్యున్నత భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పని ప్రదేశాలను అత్యంత సురక్షితంగా వుండేలా చూడాలని, చిన్నపాటి నిర్లక్ష్యం పెను విపత్తుకు దారితీయొచ్చనే విషయాన్ని గుర్తించి పరిశ్రమలు మార్గదర్శకాలను పాటించేలా పర్యవేక్షణ వుండాలన్నారు. హానికర రసాయనాల నిల్వ, వినియోగం తదితర కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమలతో పాటు ప్రమాదాలకు ఆస్కారమున్న పరిశ్రమలకు తక్షణం నోటీసులు జారీచేయాలని, నాలుగు రోజుల్లో నిర్వహణ పరంగా నిపుణులతో అంతర్గత తనిఖీలు చేయించుకొని, నిర్వహణ, భద్రతపరంగా ధ్రువీకరణ పత్రాలు అందించేలా ఆదేశాలివ్వాలన్నారు. అనంతరం జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ దశల వారీగా అన్ని పరిశ్రమల్లోను తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కార్మికుల భద్రతతో పాటు సంక్షేమానికి సంబంధించి నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాల్సిందేనని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జీఎం డీఐసీ ఎ.సుధాకర్ పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ ఎం.శివకుమార్‌రెడ్డి, ఉప కార్మిక కమిషనర్ సీహెచ్ ఆశారాణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ గీతాంజలి శర్మతో కలిసి ప్రజలనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాలనుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు వస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అధికారులు సానుకూలంగా వ్యవహరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 152అర్జీలను వచ్చాయి. బాపులపాడు మండలం మడిచర్ల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు తనకు నూరుశాతం వైకల్యం ఉందని, నెలకు రూ.15వేల పింఛను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు. బంటుమిల్లి మండలం ముదాలపల్లెకు చెందిన జన్ను వీరఅర్జున అనే రైతు రామవరపుమోడిగ్రామంలో తనకు సాగు భూమి ఉందని, అక్కడ ఓఎన్‌జీసీ రిగ్ ద్వారా విడుదల చేసే రసాయనాల కారణంగా తన పంట దెబ్బతిందని, తనకు పంటనష్టపరిహారం ఇప్పించాలని అర్జీ అందజేశారు. ఎన్నికల సమయంలో తీసిన ఫోటోగ్రఫీ, వీడియో గ్రఫీ బిల్లులు చెల్లించాలని కలెక్టర్ బాలాజీకి సోమవారం వీడియోగ్రాఫర్లు వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యను ఉన్నతాధికారులకు తెలిపామని, బడ్జెట్ రాగానే బిల్లులు సమర్పిస్తామన్నారు. తన స్థలంలో కొంత భాగం బలవంతంగా ఆక్రమించేందుకు స్థానికులు బెదిరిస్తున్నారని గూడూరు మండలం రామరాజుపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు దేసు మల్లమ్మ మొరపెట్టుకుంది. సోమవారం జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్, డీఎల్పీవో జ్యోతిర్మయిని వృద్ధురాలు కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. దౌర్జన్యంగా తన స్థలంలో కొంత భాగం ఇచ్చేయమంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటిష్టంగా స్టాప్ డయేరియా ..

1వతేదీనుంచి ఆగస్టు 31వతేదీవరకు జిల్లాలో చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం మునిసిపల్ కమిషనర్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ పంచాయతీరాజ్ విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లీన్ చేయడంతో పాటు, తాగునీటి పైపులైన్‌ల లీకేజీలు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో ఎమినిటీస్ సెక్రటరీలు, ఇంజనీర్‌లు ఈ పనిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీపీవో నాగేశ్వరనాయక్, ఆర్‌బ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, మచిలీపట్నం, గుడివాడ, తాడిగడప మునిసిపల్ కమీషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

15 నుంచి స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వృత్తినైపుణ్య కోర్సులకు ఉచిత శిక్షణ

ఉంగుటూరు, జూలై 8 : కృష్ణాజిల్లా స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని యూనియన్‌బ్యాంక్ గ్రామీణ స్వయంఉపాధి ఉచితశిక్షణాసంస్థ(యూబీఆర్‌ఎస్‌ఈటీఐ)లో ఈనెల 15నుంచి ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ(30రోజులు), మహిళా టైలరింగ్(30రోజులు), సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీసెస్(30రోజులు)పై ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని నిరుద్యోగయువతకు ఉచిత శిక్షణా తరగుతులు ప్రారంభిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, తెల్లరేషన్ కార్డు కలిగి, 18నుంచి 45సం.ల మధ్య వయసు, తెలుగులో చదవటం, రాయటం వచ్చిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు పైన తెలిపిన కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులని చెప్పారు. శిక్షణా కాలంలో అభ్యర్థులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. అభ్యర్థులకు సర్టిఫికెట్లు, కోర్సులకు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా అందించడంతోపాటు, వారి ఉపాధికి అవసరమైన సహాయసహకారాలు పూర్తిస్థాయిలో అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు, రేషన్, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల నకళ్లతో ఈనెల 15వతేదీలోగా నేరుగా శిక్షణాకేంద్రానికి విచ్చేసి పేర్లను నమోదుచేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 6304254730, 9951920120, 9962512337, 9440772382 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు..

ఉచిత ఇసుక అమలుకు చర్యలు తీసుకోండి

- జేసీ గీతాంజలి శర్మ



అధికారులతో మాట్లాడుతున్న కృష్ణా జేసీ

మచిలీపట్నం,జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుకవిధానాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. జేసీ ఛాంబరులో సోమవారం వివిదశాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుకవిధానం అమలులో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అధికారులు తూచా తప్పకుండా పాటించాలన్నారు. కృష్ణానదిలో అనధికార ఇసుక తవ్వకాలను అరికట్టాలన్నారు. ఇందుకోసం కీలకమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. ఇసుకరీచ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుతోపాటు, రెవెన్యూడివిజన్ స్థాయిలో కమాండింగ్ కంట్రోల్ రూమ్‌లను, డివిజన్, మండలస్థాయిలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ జి వెంకటేశ్వరరావు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం వాణి, పి పద్మావతి, డి రాజు, గనులశాఖ ఏడీ ప్రతాపరెడ్డి, డీపీవో నాగేశ్వరనాయక్, ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ జి గంగాధరరావు, భూగర్భజలాలు, రవాణా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్ : జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లోని విద్యార్థులు చేపట్టబోయే ప్రాజెక్టుల వివరాలను తెలియ చేయాలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ జాకీర్ అహమ్మద్ 7386311633కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.



బాధితుల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, ఎంపీ కేశినేని చిన్ని

పేలుడు ఘటన దురదృష్టకరం

- మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం
- ఎంత ఖర్చయినా బాధితులకు మెరుగైన వైద్యం
- మంత్రి సుభాష్, ఎంపీ కేశినేని చిన్ని వెల్లడి

గొల్లపూడి, జూలై 8 : జగ్గయ్యపేట బోదవాడలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో పేలుడు ఘటన దురదృష్టకరమని, మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం అంగీకరించినట్టు రాష్ట్ర కార్మిక, కర్మాగార, బ్రాయిలర్స్, వైద్య బీమా సేవలశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆయన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి సోమవారం మణిపాల్, గొల్లపూడి ఆంధ్రా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఈసందర్భంగా మంత్రి సుభాశ్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ, బాధితులకు మెరుగైన వైద్యం కోసం ఎంత ఖర్చుకైనా వెనకాడవద్దని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎం.ఎస్ బేగ్, జంపాల సీతారామయ్య, శావల దేవదత్, కొట్టారు సత్యనారాయణ, కార్మికశాఖ కమిషనర్ ఎం.శేషగిరి బాబు, ఆర్డీవో బి.హెచ్ భవానీశంకర్, డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ. కోటి ఇవ్వాలి

- సీపీఐ నేత దోనేపూడి శంకర్ డిమాండ్

గొల్లపూడి : అల్ట్రాటెక్ ప్రమాద ఘటనలో మృతి చెందిన ఆవుల వెంకటేశ్ కుటుంబానికి ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం కలిపి రూ.కోటి పరిహారం ఇవ్వాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన సోమవారం పరామర్శించారు. 80 శాతం గాయాలతో మృత్యువుతో పోరాడుతున్న శివన్నారాయణ పరిస్థితి చూసి చలించిపోయారు. 60 శాతం గాయపడిన వారికి రూ.50 లక్షలు అందించాలన్నారు. ఆయన వెంట ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, అంబోజి శివాజీ, లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



గంజాయి నిందితులతో పోలీసు అధికారులు

కిలోన్నర గంజాయి స్వాధీనం

- ఏడుగురి అరెస్టు

పమిడిముక్కల, జూలై 8 : లంకపల్లి శివారు అప్పారావుపేట కరకట్టపై గంజాయి కలిగి ఉన్న ఏడుగురిని సోమవారం అరెస్టుచేసి వారివద్ద నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు పమిడిముక్కల సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లంకపల్లి కరకట్టపై గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై కె.శ్రీనివాస్, సిబ్బందితో దాడిచేసి నాగాయలంకకు చెందిన కొక్కిలిగడ్డ కృష్ణవంశీ, వణుకూరుకు చెందిన షేక్ ఆలీబాబ, ఈడ్పుగల్లుకు చెందిన షేక్ సైదా(పండు), పమిడిముక్కలకు చెందిన బండ్రపల్లి అవినాశ్, అప్పారావుపేటకు చెందిన చీకుర్తినాని, రాగాల మధుకిషోర్, ముళ్లపూడి వెంకటేశ్వరరావులను అరెస్టుచేసి గంజాయి స్వాధీనం చేసుకునట్టు తెలిపారు. ద్విచక్రవాహనం, రూ.500 నగదు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్టు తెలిపారు. మద్దూరుకు చెందిన తలారి వివేక్ పరారీలో ఉన్నట్టు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గురజాడ డొంకరోడ్డులో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టుచేసి వారి నుంచి రూ. 60,320 నగదు పది సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్టు పమిడిముక్కల ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

జోగి అనుచరులపై చర్యలు తీసుకోవాలి

- కృష్ణా జిల్లా వాసి ఫిర్యాదు

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్ అనుచరుడి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా చినగొల్లపాలేనికి చెందిన ఏలూరి రంగబాబు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అమరావతి సచివాలయంలో రెవెన్యూ మంత్రి, ఉన్నతాధికారులను కలిసేందుకు వచ్చిన రంగబాబు మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి జోగి రమేష్ అనుచరుడు శ్రీనివాసరెడ్డి తమ పూర్వార్జిత భూమిని అధికారులతో మేనేజ్ చేసి, వివాదాస్పద భూమి కింద పెట్టించారని ఆరోపించారు. ఈ సమస్య పరిష్కరించడానికి రూ.15లక్షలు డిమాండ్ చేశారని, ఇవ్వకపోవడంతో ఇప్పుడు ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదిస్తున్నట్టు తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

వత్సవాయి : లింగాలలో అక్రమంగా డంప్ చేసిన 700 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. నల్లగొండ జిల్లా కోదాడ డీఎస్పీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా ఆంధ్రాకు పీడీఎస్ బియాన్ని తరలిస్తుండగా అన్నవరం గ్రామానికి చెందిన సాంబశివరావును, జగ్గయ్యపేటకు చెందిన కోటేశ్వరరావును పోలీసులు కోదాడలో పట్టుకున్నారు. సమాచారం మేరకు బోర్డర్‌లోని లింగాల సమీపంలో గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన 1,400 (50 కిలోల బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏపీ అధికారులు తెలంగాణ పోలీసులకు బియ్యాన్ని స్వాధీనం చేశారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించనున్నట్టు తెలిపారు. లింగాలకు చెందిన నరసింహారావుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, జూలై 8: విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రంలో పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలిండియా రేడియో ఫీడర్ పరిధిలోని రెడ్ సర్కిల్ ఏరియా, గిరిపురం, స్టేడియం రోడ్డు, బందరు రోడ్డు, పోలీసు కమాండ్ కంట్రోల్ ఆఫీసు ఏరియా, ఆర్ అండ్ బీ కాంప్లెక్స్, వ్యాస్ కాంప్లెక్స్, మాంటిస్సోరి కళాశాల రోడ్డు, సబ్ కలెక్టర్ కార్యాలయం, పున్నమితోట, రైల్వే క్వార్టర్స్, పాస్‌పోర్టు కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. సూర్యారావుపేట సెక్షన్ పరిధిలో ప్రకాశం రోడ్డు, డోర్నకల్ రోడ్డు, స్టేట్ గెస్ట్‌హౌస్, సీఎస్ఐ చర్చి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసు, పోలీసు ఇంటెలిజెన్స్ ఆఫీస్, రైల్వే క్లబ్ ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.



లెనిన్ సెంటర్‌లో ఆక్రమణల తొలగింపు

గవర్నర్‌పేట, జూలై 8: లెనిన్ సెంటర్‌లోని విజయా మిల్క్ పార్లర్ ఎదురుగా ఉన్న పూల కొట్లను సోమవారం నగర పాలక సంస్థ అధికారులు తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న కారణంగా వీటిని వెంటనే తీసివేయాలని నిర్వాహకులకు ఉదయం నోటీసులు ఇచ్చిన అధికారులు సాయంత్రానికి తొలగించారు.

లబోదిబోమంటున్న బాధితులు

ఎన్నో ఏళ్లుగా ఇక్కడ జీవనోపాధిని పొందుతున్న తమ బడ్డీలను తొలగించడం కక్షపూరితమైన చర్య అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు తీసుకుని స్థానిక నేతలు వీటిని వేరే వారికి కట్టబెట్టేందుకు తమ వ్యాపారాలను తొలగించారని, పక్కనే అనేక షాపులు ఉండగా వాటి జోలికి వెళ్లకుండా కక్షపూరితంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. బీసెంట్ రోడ్డు పరిసరాల్లో వేలాది ఆక్రమణలు ఉన్నాయని, వాటిలో సగం ప్రజాప్రతినిధులు మామూళ్లు తీసుకుని కేటాయించినవేనని, అధికారులు వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

పేదలకు ఊతం ఉచిత ఇసుక పథకం

● ఇసుక ట్రాక్టర్లను ప్రారంభించిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్
● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం

విద్యాధరపురం, జూలై 8: పేద మధ్యతరగతి ప్రజలకు ఊతం ఇచ్చేలా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెట్టిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు అనుబంధ రంగాల్లో పనిచేసేవారికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఉచిత ఇసుక పథకం కింద బుక్ చేసుకున్న లబ్ధిదారుల ట్రాక్టర్లను సోమవారం భవానీపురంలోని శివాలయం సెంటర్‌లో పండుగ వాతావరణంలో ఆయన ప్రారంభించారు. ఇదే సందర్భంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం పథకాన్ని అమలు చేయడం వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి దొరకక వీధినపడ్డారన్నారు. కూటమి అధికారంలోకి రావడంతోనే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. సారిపల్లి రాధాకృష్ణ, ఎన్. వెంకటేశ్వరరావు, బి. కనకాంరావు, సాయి సుధాకర్, అబ్దుల్ సత్తార్, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

నిర్మాణరంగ కార్మికుల కళ్లల్లో ఆనందం

చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంతో నిర్మాణరంగ కార్మికుల కళ్లలో ఆనందం వెల్లివిరిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్ ప్రసాద్ గౌడ్ అన్నారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇసుక పేరిట జగన్ ప్రభుత్వం చేసిన దోపిడీపై విమర్శలు గుప్పించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు విడుదల చేయడం పై ఆయన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.



ఇసుక ట్రాక్టర్‌ను ప్రారంభించి నడుపుతున్న ఎంఎస్ బేగ్



మాట్లాడుతున్న ఎరుబోతు రమణారావు



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గుర్రం కొండ, టీడీపీ నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

చిట్టినగర్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానం అమలు చేయటాన్ని హర్షిస్తూ టీడీపీ శ్రేణులు సోమవారం చిట్టినగర్ సర్కిల్-1 కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ నాయకులు గుర్రం కొండ పాల్గొని చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 46వ డివిజన్ అధ్యక్షుడు దీటి ప్రభుదాస్, బీజేపీ నాయకుడు భాస్కరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి లోకేష్, మురళీకృష్ణ, పాలవాయి దాసు, శ్రీను, నరేష్, జి.రాజు, సాదిక్, కిషోర్ నాయక్ పాల్గొన్నారు.

కార్మికులకు మంచి రోజులు వచ్చాయి

అజిత్‌సింగ్‌నగర్ : రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంలోని కార్మికులకు మంచి రోజులు వచ్చాయని టీడీపీ నాగవంశ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంపై హర్షం వ్యక్తం చేస్తూ భవన నిర్మాణ రంగంలోని కార్మికులు న్యూ రాజరాజేశ్వరిపేటలో సోమవారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎరుబోతు రమణారావు ముందుగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

జూనియర్ కాలేజీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

● తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, జూలై 8 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ కళాశాలను సందర్శించేలా ప్రయత్నిస్తానని ఆయన తెలిపారు. సోమవారం కృష్ణలంక 21వ డివిజన్‌లో కృష్ణలంక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాత దమ్మాలపాటి రంగారావు, ఈశ్వరి దంపతులు అందించిన యూనిఫాంలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కళాశాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా విద్యార్థులకు దాత దమ్మాలపాటి రంగారావు, ఈశ్వరి దంపతులు వారి స్వంత నిధులతో విద్యార్థులకు యూనిఫాంలను అందచేయడం అభినందనీయమన్నారు. కృష్ణలంకలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన దగ్గర నుంచి మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కళాశాలకు అవసరమైన ఏ సహాయం కావాలన్నా ఏర్పాటు చేయడంలో ముందుంటానని చెప్పారు. చదువు ద్వారా మనం ఉన్నత స్థితికి చేరుకోవచ్చని, చదువును నిర్లక్ష్యం చేయవద్దని గద్దె విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, నిమ్మల దుర్గారావు, పెరుమాళ్ల గురునాథం, ఆర్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, దాత దమ్మాలపాటి రంగారావు, ఈశ్వరి దంపతులు

స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

గల్లా కామేశ్వరరావు 34వ వర్ధంతిని పురస్కరించుకొని నవభారత్ స్కూల్ విద్యార్థులకు నోటు పుస్తకాలను తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం పంపిణీ చేశారు. కృష్ణలంక 20వ డివిజన్‌లోని ఎం హోటల్ సెంటర్‌లో పుల్కా వ్యాపారం చేసుకొనే అన్నదమ్ములు వెంకటేష్, మహేష్, గల్లా శ్రీనులు కామేశ్వరరావు జ్ఞాపకార్థం ఎమ్మెల్యే గద్దె చేతుల మీదుగా ఒక్కొక్క విద్యార్థికి 10 నోటు పుస్తకాలు చొప్పున 100 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు మోటేపల్లి చిన్నా, టీడీపీ, జనసేన నాయకులు కొడాలి సాయిబాబు, చింతా వెంకటేశ్వరరావు, పులమోలు లక్ష్మి, కమిలి కమల, గల్లా సుబ్బారావు, చిటికల ఏసుబాబు, వన్నెంరెడ్డి రాధాకృష్ణ పాల్గొన్నారు.

మూడో డివిజన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, జూలై 8: మూడో డివిజన్‌లో సమస్యలన్నింటిని పరిష్కరించి మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని తూర్పుఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు పరిధి 3వ డివిజన్‌లోని కామినేని నగర్ డొంక రోడ్డు ఏరియాలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం పర్యటించి, స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కామినేని నగర్ డొంక రోడ్డులో రూ.8.13లక్షలతో మురుగు కాలువ మరమ్మతు పనులకు గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్‌ను తాను దత్తత తీసుకుని డివిజన్‌లోని ప్రధాన సమస్యలు డ్రెయినేజీ, రహదారుల సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. వరదనీటి ముంపు సమస్య పరిష్కారం అయిన తర్వాత ఈ డొంకరోడ్డులోని వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హౌసింగ్ స్కీమ్‌లో భాగంగా ప్రభుత్వమే పక్కా ఇళ్ల నిర్మాణం చేయించేలా చూస్తానని అన్నారు.

ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మురికికూపంగా ఉన్న 3వ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాడి బాబూరావు, గుత్తికొండ కృష్ణమోహన్, గద్దె రమేష్, యలమంచిలి రాజేంద్ర ప్రసాద్, గుంజా ఏసుబాబు, నక్కా ఓంకార్, ఈశ్వర్ పేరేపి, కోడూరు ఆంజనేయ వాసు, తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

కృష్ణలంక, జూలై 8 : శ్రీ కనకదుర్గ పారాయణం బృందం వారిచే వరుసగా ఆరో ఏడాది కనకదుర్గ అమ్మవారికి ఆషాఢ సారెను సోమవారం బృందం సభ్యులు సమర్పించారు. బృందం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంథి రాము, గ్రంథి రాధిక పాల్గొన్నారు.

సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

● ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్



అర్జీలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

చిట్టినగర్, జూలై 8: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఏ.మహేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా ఇన్‌చార్జి కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 14 అర్జీలు వచ్చాయి. చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళులు



భవానీపురం బ్యాంక్ సెంటర్ వద్ద కేక్ కట్ చేస్తున్న షేక్ ఆసిఫ్, తదితరులు

విద్యాధరపురం, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని వన్‌టౌన్, భవానీపురం తదితర ప్రాంతాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన నివాళులర్పించారు. వన్‌టౌన్ కొత్తపేటలోని వైసీపీ నాయకుడు పోతిన మహేశ్ తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, ఎస్.సంజీవరావు, పి.పవన్, షేక్ సహీనా, టి.రఘు, పి.రవి, ఎస్.భాను, ఎం.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. నెహ్రూబొమ్మ సెంటర్ వద్ద పార్టీ నాయకులు గురుమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పోతిన మహేశ్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు, స్థానికులకు లడ్డూలు, అరటిపండ్లు పంపిణీ చేశారు. శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, సూరిబాబు, రామిరెడ్డి, మంగారెడ్డి, రామారావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

● 40వ డివిజన్ భవానీపురం బ్యాంక్ సెంటర్ వద్ద జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ షేక్ ఆసిఫ్ పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పేదలకు పండ్లు వితరణ చేశారు. 40వ డివిజన్ కార్పొరేటర్ వై.ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పోతిరెడ్డి సుబ్బారెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఎస్.వీఆర్ రమణయ్య, కొండలరావు, కే.కృష్ణారెడ్డి, కే.లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా 37, 38 డివిజన్లలో కూడా వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

7వ డివిజన్‌లో..

మొగల్రాజపురం: ఏడవ డివిజన్ బందిల దొడ్డి ప్రాంతంలో డివిజన్ కార్పొరేటర్ ఎం. మాధురి ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు సంపత్, కుటుంబరావు పాల్గొన్నారు.

అవుట్ ఏజెన్సీలో అన్నదానం

భవానీపురం: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా 41వ డివిజన్ అవుట్ ఏజెన్సీలో వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు జోసెఫ్ శివమణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని పశ్చిమ వైసీపీ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్, కార్పొరేటర్ మహ్మద్ ఇర్ఫాన్ ప్రారంభించారు. మసీదు సెంటర్‌లో పేదలకు పండ్లను ఇర్ఫాన్ పంచిపెట్టారు. ఇషాక్, రెహమాన్, బాజీలు పాల్గొన్నారు.

స్వల్ప వివాదం

ఊర్మిళానగర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నేతలు ఏర్పాటు చేసిన బ్యానర్‌పై వెలంపల్లి శ్రీనివాస్ ఫొటోను ఎందుకు వేశారని సీనియర్ నాయకులు సూరసాని రామిరెడ్డి ప్రశ్నించారు. దీంతో స్వల్ప వివాదం రేగింది. పశ్చిమ వైసీపీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, ముఖ్య నాయకులు ఆయన్ని వారించారు. ప్రోటోకాల్ ప్రకారం జిల్లా అధ్యక్షుడు అయినందునే వేశామని చెప్పారు. కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి పాల్గొన్నారు.



కొత్తపేటలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించిన పోతిన మహేశ్ తదితరులు



7వ డివిజన్‌లో పండ్లు పంచుతున్న కార్పొరేటర్



పంచారామాల అధ్యయనానికి స్టెల్లా విద్యార్థినులు

పటమట, జూలై 8 : మారిస్ స్టెల్లా కళాశాలలో మూడో సంవత్సరం బీఏ హిస్టరీ చదువుతున్న విద్యార్థినులు, కెప్టెన్ ఎన్.శైలజ, హిస్టరీ, టూరిజం డిపార్టుమెంట్ హెచ్‌వోడీ డాక్టర్ జి. బ్యూలా పర్యవేక్షణలో పంచరామాల అధ్యయన పర్యటనకు వెళ్లారు. అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోటలను సందర్శించారు. ఈ పర్యటనలో వారు కొన్ని శతాబ్దాల క్రితం చాళుక్యులు, చోళులు, కాకతీయుల, విజయనగర రాజులచే నిర్మించిన, పునర్నిర్మించిన ప్రదేశాల ఏపీగ్రఫీ, చరిత్రకు సంబంధించిన చిత్రాలను సేకరించారు.

విద్యార్థులకు పుస్తక వితరణ

వన్‌టౌన్, జూలై 8: స్థానిక బ్రాహ్మణవీధికి చెందిన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం మాజీ ప్రవచకుడు మంచం భాస్కర వెంకట దత్తాత్రేయ శర్మ జయంతి సందర్భంగా సోమవారం అడపా రాములు ప్రాథమిక పాఠశాల, బసవ అప్పలస్వామి మునిసిపల్ పాఠశాల, బావి కనకయ్య స్మారక మునిసిపల్ పాఠశాలల్లో నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, దత్తాత్రేయ శర్మ కుమారుడు మంచం వెంకట సుబ్రహ్మణ్యం, కుమార్తెలు లక్ష్మి, నాగవల్లి, అన్నపూర్ణలు పుస్తక వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. డోగిపర్తి శంకరరావు, హెచ్‌ఎం ప్రియాంక, శర్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ బాధితులకు పరామర్శ

వన్‌టౌన్, జూలై 8: జగ్గయ్యపేట మండలం బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలి గాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను 42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్సీ హరిప్రసాద్ సూచనల మేరకు ఆమె బాధితులను పరామర్శించి వారికి ధైర్యం కల్పించారు.వారికి తాము అండగా ఉంటామని తెలిపారు.

ముక్కుమూసుకోవాల్సిందే

● దర్శిపేట శ్రీనుకొట్టు వీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మల, మూత్రాలు

పటమట, జూలై 8 : 14వ డివిజన్ దర్శిపేట శ్రీను కిరాణా షాపు పక్క వీధిలో మ్యాన్‌హోల్ పొంగి మల, మూత్రాలు రోడ్డుమీదే ప్రవహిస్తున్నాయి. గత ఆర్నెల్లుగా దర్శిపేట వాసులు తీవ్ర దుర్గంధంతో నరకయాతన పడుతున్నారు. స్థానికులు వీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, వారు తూతూమంత్రంగా మొక్కుబడిగా క్లీన్‌చేయడంతో పనిచేసిన మరుసటి రోజు నుంచి మురుగునీరు ఆ వీధి అంతా కాలువలా ప్రవహిస్తోంది. ఈ వీధిలో జయశ్రీనిలయం నుంచి ఆ వీధి చివరి వరకు సుమారు 200 మంది కుటుంబాలు నివసిస్తున్నాయి. డివిజన్ వాసులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం అంటు వ్యాధుల సీజన్ కావడంతో దీర్ఘకాలికంగా మలమూత్రాలు రోడ్డు మీద ప్రవహించడంతో సైడ్ డ్రెయినేజీలు పూడుకుపోయి, ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోవడంతో సాయంత్రం అయిందంటే దోమలు పీక్కుతింటున్నాయి. అంటువ్యాధులు ప్రబలక ముందే సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పరిస్థితి దారుణంగా ఉంది



మా ఇంటిముందు పరిస్థితి దారుణంగా ఉంది. మురుగుకాల్వలాగా నీరు ప్రవహిస్తోంది. తలుపులు మూసినా దుర్గంధం భరించలేక పోతున్నాం. కార్పొరేషన్ ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మొక్కుబడిగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

చందన ఉదయభాస్కరరావు,స్థానికుడు



మ్యాన్‌హోల్ పొంగి బయటకు వస్తున్న మల,మూత్రాలు, రోడ్డు మొత్తం ప్రవహిస్తున్న డ్రెయినేజీ నీరు

గొడవ పడొద్దన్నందుకు దాడి

వన్‌టౌన్, జూలై 8: ఇరువర్గాలను గొడవ పడొద్దన్నందుకు ఓ వర్గానికి చెందిన ఇద్దరు ఓ వ్యక్తిపై దాడి చేసినట్లు సోమవారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం రాణిగారి తోట వైట్ హౌస్ బిల్డింగ్ వెనుక కొరిమి కోటయ్య (46) కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. ఇతను కాంక్రీట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి 8.30కు పక్క వీధిలో ఉంటున్న సోదరుడి కుమారుడు వెంకటేష్ కోటయ్యకు ఫోన్ చేసి కొంతమంది గొడవపడుతున్నారని చెప్పాడు. కోటయ్య అక్కడకు వెళ్లి వెంకటేష్‌తో గొడవపడుతున్న ప్రసాద్, శ్రీనులను ఆపి ఇక్కడ నుంచి వెళ్లిపోండన్నాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న ప్రసాద్, శ్రీనులు కోటయ్యను అసభ్యకరంగా దూషించి కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో కోటయ్య తలకు గాయమైంది. స్థానికులు అక్కడకు వెళ్లడంతో నిందితులు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రసాద్, శ్రీనులపై కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 9 జూలై 2024
cinema@andhrajyothy.com

విజయ్ సినిమా మైత్రీ చేతుల్లో..




తమిళ అగ్రకథానాయకుడు విజయ్, దర్శకుడు వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. ఈ సినిమాలో విజయ్ సరసన మీనాక్షి చౌదరి నటిస్తోంది. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో అందరి దృష్టినీ ఆకర్షించిన ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ విడుదల చేయనుంది. ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్ జయరామ్, స్నేహ, లైలా ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కల్పతి ఎస్ అఘోరం, కల్పతి ఎస్. గణేశ్, కల్పతి ఎస్.సురేశ్ నిర్మిస్తున్నారు.

వరుణ్‌తేజ్ వి జృంభణ



వరుణ్‌తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. ఓ యధార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రానికి కరుణకుమార్ దర్శకుడు. మీనాక్షి చౌదరి హీరోయిన్. బాలీవుడ్ నటి నోరా ఫతేహి కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్మించిన ఓ భారీ సెట్‌లో ప్రస్తుతం యాక్షన్ పార్ట్ చిత్రీకరణ జరుగుతోంది. సినిమాలో చాలా కీలకమైన ఓ ఫైట్‌ను విజయ్ మాస్టర్ సారథ్యంలో చిత్రీకరిస్తున్నారు. వరుణ్‌తేజ్ చాలా రిస్క్ తీసుకుని ఈ ఫైట్ చిత్రీకరణలో పాల్గొంటున్నారు. యాక్షన్ పార్ట్‌లో అతని విజృంభణను అదిరిపోయే లెవల్‌లో ఉంటుందని నిర్మాతలు చెప్పారు. అలాగే ఇంతవరకూ పోషించని ఓ విభిన్న పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించి ఆడియన్స్‌ను అలరించనున్నారు. అతని కెరీర్‌లో ఇదొక మైలు రాయిగా నిలుస్తుందని దర్శకుడు కరుణకుమార్ చెబుతున్నారు. వింటేజ్ వైజాగ్‌ను ఈ సినిమాలో చూడవచ్చని అంటున్నారు. టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు.

మహేశ్‌బాబు సినిమా అప్‌డేట్ అప్పుడేనా?



సోషల్ మీడియాలో నిరంతరం ట్రెండ్ అయ్యే విషయాల్లో దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి, మహేశ్‌బాబు సినిమా ఒకటి. ఈ సినిమా షూటింగ్ నుంచి ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని మహేశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రం గురించి రకరకాలుగా చర్చించుకుంటున్నారు. సినిమా షూటింగ్ అప్పుడంటూ.. ఇప్పుడంటూ మొదలైన వార్తలు కొన్ని రోజులుగా ఆగిపోయాయి. కానీ ఇప్పుడు మహేశ్‌బాబు పుట్టినరోజు దగ్గరపడుతున్న తరుణంలో ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్స్‌పై ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను లేదా అనౌన్స్‌మెంట్ వీడియోను లేదా సినిమా నేపథ్యాన్ని పరిచయం చేసే గ్లింప్స్ అయినా మహేశ్ పుట్టినరోజున వదులుతారేమో అని నెట్టింట చర్చిస్తున్నారు. కాగా, మహేశ్ ఈ సినిమా కోసం తన లుక్ మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ ఏ సినిమాలో కనిపించని విధంగా సరికొత్త లుక్‌లో పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి కథను రచయిత విజయేంద్ర ప్రసాద్ అందిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ ఇందులో విలన్‌గా నటిస్తున్నారనే వార్త వినిపిస్తోంది. అలాగే బాహుబలి తర్వాత నాజర్ మళ్లీ రాజమౌళి దర్శకత్వం వహించే ఈ చిత్రంలో నటిస్తారని కూడా అంటున్నారు. ఇతర పాత్రలు పోషించే నటీనటుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఊహాగానాలకు మహేశ్ పుట్టిన రోజైన ఆగస్టు 9న ఫుల్‌స్టాప్ పెట్టవచ్చని, ఆ రోజే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తారని అంతా ఎదురు చూస్తున్నారు.

సస్పెన్షన్ తొలగిస్తారని ఆశిస్తున్నా



బెంగుళూరు రేవ్ పార్టీ కేసులో నటి హేమ అరెస్టయిన సంగతి తెలిసిందే. దీంతో 'మా' అసోసియేషన్ నుంచి ఆమెను సస్పెండ్ చేశారు. తాజాగా, నటి హేమ ఓ లేఖ రాసి, 'మా' అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు అందజేశారు. అందులో "నేను దశాబ్ద కాలం పైగా 'మా'లో సభ్యురాలిగా ఉన్నాను. 'మా' నాకు అమ్మలాంటిది. డ్రగ్స్ కేసులో నాపై అనేక ఆరోపణలు రావడంతో నా అంతట నేనే డ్రగ్స్ శాంపిల్ టెస్ట్ చేయించుకున్నాను. అందులో నాకు నెగెటివ్ వచ్చింది. త్వరలోనే పోలీసులు చేసిన టెస్ట్‌లోనూ ఇదే ఫలితం వస్తుందనే నమ్మకం ఉంది. డ్రగ్స్ కేసులో నాపై జరిగిన దుష్ప్రచారంతో నేను ఎంతో మానసిక క్షోభకు లోనయ్యాను. నా విషయంలో 'మా' సభ్యులు అండగా ఉండాలని కోరుకుంటున్నాను. నాపై సస్పెన్షన్ తొలగిస్తారని ఆశిస్తున్నా" అని లేఖలో పేర్కొన్నారు. అలాగే, త్వరలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అపాయింట్‌మెంట్‌ను తీసుకొని తనకు న్యాయం చేయాలని హేమ కోరనున్నారు.

తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ను చేశారు

కమల్‌హాసన్



కమల్‌హాసన్ 'సేనాపతి'గా నటించిన చిత్రం 'భారతీయుడు2'. 1996లో తెరకెక్కిన 'భారతీయుడు'కు సీక్వెల్‌గా శంకర్ దర్శకత్వం వహించగా, సుభాస్కరన్ నిర్మించారు. సిద్ధార్థ్, బాబీసింహా, ఎస్.జే.సూర్య, రకుల్ ప్రీత్‌సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 12న 'భారతీయుడు 2' విడుదలవుతున్న సందర్భంగా సోమవారం చిత్రబృందం మీడియాతో సమావేశమై చిత్ర విశేషాలను పంచుకున్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ను చేసి ఈ స్థాయికి తెచ్చారు. ఈ సినిమాలో 'సేనాపతి' క్యారెక్టర్ చెప్పే డైలాగ్స్ సమాజంలో నుంచి పుట్టినవాటిలా ఉంటాయి. శంకర్ విజన్‌ను, మేకింగ్‌ను థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు. రెండు వేళ్ల మడత పెట్టడం అంటే.. ఒకటి ఓటు వేసేది. రెండోది మన బాధ్యతది చెప్పేది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ 'భారతీయుడు' టైమ్‌లో సీక్వెల్ తీస్తానని అస్సలు అనుకోలేదు. ఆ మూవీ తరువాత ఇన్నేళ్లలో ఎక్కడ లంచం తీసుకున్నారనే వార్తలు చదివినా నాకు సేనాపతి గుర్తుకు వచ్చేవారు. కానీ కథ కుదరక ఆగిపోయేవాడ్ని. సినిమాలో నేను రాసిన ప్రతీ సన్నివేశాన్ని కమల్‌హాసన్ తన నటనతో పదిరెట్లు పెంచారు' అని చెప్పారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ 'భారతీయుడు 2' సినిమా సమాజంలో జరిగే అవినీతికి ఓ అప్‌డేటెడ్ యాంటీ వైరస్ లాంటిది. శంకర్ దర్శకత్వం వహించిన 'బాయ్స్'తోనే కెరీర్‌ను ఆరంభించాను. మళ్లీ 20 ఏళ్ల తరువాత ఇందులో నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది. యువత సమాజం కోసం ఏం చేయాలో చెప్పే చిత్రమిది' అని చెప్పారు. నిర్మాత సురేశ్‌బాబు మాట్లాడుతూ 'కమల్ హాసన్ ఇండియన్ సినిమా హద్దుల్ని చెరిపేస్తూ ముందుకు సాగుతుంటారు. డైరెక్టర్ శంకర్ సోషల్ మెసేజ్‌తో పాటు ఎంటర్టైన్‌మెంట్ జోడించి సినిమా తీసే విధానం అద్భుతం' అని అన్నారు. బాబీసింహా మాట్లాడుతూ 'భారతీయుడు' చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ 28 ఏళ్ల తర్వాత 'భారతీయుడు 2'గా 'సేనాపతి' వస్తున్నాడు. ఈ చిత్రం మొదటి పార్ట్ కంటే పదింతలు హిట్ అవుతుంది' అని అన్నారు. రకుల్ ప్రీత్ మాట్లాడుతూ 'భారతీయుడు' సినిమా సీక్వెల్‌లో నేను నటిస్తానని కలలో కూడా అనుకోలేదు' అని చెప్పారు.

లక్కీ భాస్కర్ వచ్చేది ఎప్పుడంటే?



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తెలుగులో నటిస్తున్న తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. 1980-90 ల కాలంలో అసాధారణ స్థాయికి చేరుకున్న ఓ సాధారణ బ్యాంక్ క్యాషియర్ ప్రయాణాన్ని చూపించే సినిమా ఇది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 7న విడుదల కానుంది. చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ విషయాన్ని ప్రకటించింది. 'లక్కీ భాస్కర్' చిత్రం కోసం ఆర్ట్ డైరెక్టర్ బంగ్లాన్ 80ల నాటి ముంబై నగరాన్ని హైదరాబాద్‌లో భారీ సెట్స్‌తో పునర్నిర్మించారు. అలాగే ఆ కాలం నాటి బ్యాంకులను పోలి ఉండే భారీ బ్యాంక్ సెట్‌ను కూడా రూపొందించారు మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

కూతురికి పేరు పెట్టిన మంచు మనోజ్



మంచు మనోజ్, మౌనిక దంపతులకు ఏప్రిల్‌లో పాప పుట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ పాపకు బారసాల చేసి 'దేవసేన శోభా ఎంఎం' అని పేరు పెట్టినట్లు మంచు మనోజ్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'శివ భక్తుడిని కనుక సుబ్రహ్మణ్య స్వామి భార్య పేరు వచ్చేలా 'దేవసేన' అని పెట్టాం. మా అత్తగారు శోభా నాగిరెడ్డి జ్ఞాపకార్థం 'శోభ' అని యాడ్ చేశాం' అని వెల్లడించారు మనోజ్.

సిద్ధమవుతున్న షణ్ముఖ



మంచి కథాంశం ఎన్నుకుని ఆసక్తి కలిగించే నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. 'శాసన సభ' చిత్రాన్ని అందించిన సాప్పని బ్రదర్స్ నిర్మిస్తున్న రెండో చిత్రం ఇది. షణ్ముగం సాప్పని దర్శకుడు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఆది సాయికుమార్ గెటప్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌ను ఆది వెనుక షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి కనిపిస్తుండడం ఆసక్తిగా మారింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా తెరకు ఎక్కిస్తున్నాం. అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేస్తాం' అని చెప్పారు. తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

క్రైమ్ కామెడీ థ్రిల్లర్



వెన్నెల కిశోర్, రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల నటిస్తున్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, టైటిల్ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇటీవల ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ 'ప్రేమించానే పిల్లా' సాంగ్‌ను రిలీజ్ చేశారు. పూర్ణాచారి లిరిక్స్ అందించగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. సునీల్ కశ్యప్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: అవినాశ్ గుర్లింక, డీఓపీ: మల్లికార్జున్ ఎన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేశ్ రామ్‌బాల.

చతుర్... వితుర్



హాస్య నటులు శ్రీనివాసరెడ్డి, చమ్మక్ చంద్ర .. సినిమాలో ఉన్నారంటే చాలు హాస్యానికి కొదవుండదు. తాజాగా వీరిద్దరూ 'అరి' చిత్రంలో నటిస్తున్నారు. సినిమాలో వాళ్ల పేర్లు ఏమిటో తెలుసా? చతుర్, వితుర్. పేర్లలోనే కామెడీ ఉంది కదూ. సినిమాలో కూడా బాగా నవ్విస్తారని దర్శకుడు జయశంకర్ చెప్పారు. పండితుల వేషధారణలో ఉన్న వీరి గెటప్ ఫస్ట్ లుక్‌ని సోమవారం విడుదల చేశారు. వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 'అరి' విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. శ్రీనివాస్ రామిరెడ్డి, డాక్టర్ తిమ్మప్ప నాయుడు, శేషు మారంరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ప్రేమకు నిర్వచనం ఇచ్చే ఉషా పరిణయం



'నువ్వే నువ్వే', 'మన్మథుడు', 'మల్లీశ్వరి' వంటి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లను ప్రేక్షకులకు అందించిన పాపులర్ డైరెక్టర్ కె.వి జయ్‌భాస్కర్. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఉషా పరిణయం'. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఈ ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లో విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా నటిస్తుండగా, హీరోయిన్‌గా తన్వీ ఆకాంక్ష నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే నెల 2న విడుదల అవుతుందని మేకర్స్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ "ఈ సినిమా ప్రేమకు నేనిచ్చే నిర్వచనం. సినిమా లవర్స్‌కు ఫుల్ మీల్స్‌లా ఉంటుందీ చిత్రం. ఈ సినిమా అందరికీ నచ్చేలా అన్ని రకాల భావోద్వేగాలతో ఉంటుంది" అని చెప్పారు.

నిర్మాతగా ప్రభాస్ అభిమాని



రవి సిరోర్, నివిష్క పాటిల్ జంటగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఎవరు.. ఎందుకు?' షూటింగ్ పూర్తయింది. ఎస్.జి.ఆర్. దర్శకత్వంలో జి.వెంకటేశ్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ ను సీనియర్ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవి ఆవిష్కరించారు. లిరికల్ వీడియోను తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్యామలాదేవి మాట్లాడుతూ 'వెంకటరెడ్డి హిందుపూర్ ప్రభాస్ ఫ్యాన్ అసోసియేషన్ ప్రెసిడెంట్. ఆయన మా ఫ్యామిలీ మొత్తానికీ అభిమాని' అన్నారు. 'మా ఆరాధ్యదైవం కృష్ణంరాజుగారి సతీమణి చేతుల మీదుగా ఫస్ట్ లుక్ విడుదల కావడం ఆనందంగా ఉంది ఇది ఒక మంచి ఫ్యామిలీ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ అన్నారు.

ఐ కేర్

మెల్ల కన్ను మంచిదేనా?

కొన్ని కనుగుడ్డు సమస్యలను బాల్యంలోనే సరిదిద్దే వీలుంది. వీటిలో ముఖ్యమైనది... 'మెల్ల కన్ను'! ఈ సమస్యతో పుట్టిన పిల్లల్ని అలాగే వదిలేయకుండా సాధ్యమైనంత త్వరగా చికిత్స చేయించి కళ్లను సరిచేయించడం ఎంతో అవసరం!



బాల్యంలో 'స్ట్రాబిస్మస్'

నేరుగా, ఒకే తీరుగా ఉండకుండా హెచ్చుతగ్గులుగా ఉన్న కనుగుడ్ల సమస్యను వైద్య పరిభాషలో 'స్ట్రాబిస్మస్' అంటారు. కొందరికి రెండు కనుగుడ్లు ముక్కు వైపుకి తిరిగి (క్రాస్‌డ్ ఐస్) ఉండొచ్చు. ఇంకొందరికి ఒక కనుగుడ్డు పైకి, మరొకటి కిందకి ఉండొచ్చు. మరికొందరికి చెవుల వైపుకి తిరిగి (వాల్ ఐస్) ఉండొచ్చు. ఇలాంటి కనుగుడ్డు వంకరలు స్థిరంగా ఉండొచ్చు, లేదా అప్పుడప్పుడూ జరుగుతూనూ ఉండొచ్చు. పుట్టుకతోనే ఉండొచ్చు, లేదా పెరిగే క్రమంలో కనిపించవచ్చు. కొంతమందిలో ఏదైనా ప్రమాదం తర్వాతగానీ, లేదా జబ్బుపడిన తర్వాతగానీ మొదలవవచ్చు. స్ట్రాబిస్మస్ సమస్య మన దేశంలో 2% పిల్లలను బాధిస్తుంటే, వారిలో సగం మందికి పుట్టుకతోనే మెల్ల కన్ను ఉంటోంది. అయితే మెల్ల కన్ను సమస్య ఒక్కొకరిలో ఒక్కోలా ఉంటుంది. 'ఆల్టర్నేటింగ్ స్ట్రాబిస్మస్'లో మొదట ఒక కంటితో మొదలై తర్వాత రెండో కంటికి సమస్య తలెత్తుతుంది. దగ్గరి చూపు అవసరమయ్యే పనులు చేసే వారికి కూడా ఈ సమస్య రావొచ్చు.

లక్షణాలు ఇవే!

మూడేళ్లలోపు వయసులో పిల్లల కనుగుడ్లు ఎదిగే దశలోనే ఉంటాయి. ఆ సమయంలో తల్లితండ్రులు పిల్లల కనుగుడ్లలో వంకరలు, తేడాలు గమనించాలి. మెల్ల కన్ను వల్ల పిల్లలు తలను వంచి చూస్తుంటారు. అలాగే పిల్లలు అలసిపోయినప్పుడు, తక్కువ వెలుతురు ఉన్న ప్రదేశంలో ఉన్నప్పుడు, అనారోగ్యంగా ఉన్నప్పుడు ఒక కనుగుడ్డు తిరిగిపోవడం, కళ్లను పదే పదే ఆర్పుతూ ఉండడం, ఎండలోకి వెళ్లినప్పుడు ఒక కంటిని మూసి ఉంచడం, కళ్లను రుద్దుకోవడం, వస్తువులను కంటికి దగ్గరగా పెట్టుకుని చూడడం... పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యుల చేత పరీక్ష చేయించాలి. మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు కచ్చితంగా కంటి పరీక్షలు చేయించగలిగితే ఈ సమస్యలను ప్రారంభంలోనే సరిదిద్దే వీలుంటుంది. ఐదారేళ్ల వయసులో పిల్లల కంటిచూపు 20/20 లేదా పెద్దల కంటి చూపుతో సమానంగా ఉంటుంది. 20/20 అంటే.. 20 అడుగుల దూరం నుంచి కూడా నిర్దిష్ట పరిమాణంలో ఉన్న అక్షరాలను చదవగలగడం. అయితే ఈ సామర్థ్యం పిల్లలందరికీ ఉండదు. మూడు నుంచి ఐదేళ్ల వయసులో తలెత్తే స్ట్రాబిస్మస్‌ను గుర్తించి చికిత్స చేయించకపోతే ఆ తర్వాత అది శాశ్వత సమస్యగా ఉండిపోతుంది. దీనికితోడు మెల్ల కన్ను వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం కూడా దెబ్బతింటుంది.

చికిత్స తేలికే!

మూసుకుపోయే కన్ను: ఒక కన్ను కిందకు వాలిపోయే 'లేజీ ఐ' సమస్యను తొలినాళ్లలోనే పసిగట్టాలంటే పిల్లల కళ్లను తరచుగా గమనిస్తూ ఉండాలి. అలాగే పుట్టింది మొదలు ఆరు నెలలకోసారి కంటి వైద్యుల చేత పరీక్షలు చేయించాలి. పాక్షికంగా లేదా పూర్తిగా మూసుకుపోయే ఎలాంటి 'లేజీ ఐ' సమస్యనైనా చికిత్సతో సరి చేయించవచ్చు. వక్రీభవన లోపాలను కళ్లజోడుతో లేదా కాంటాక్ట్ లెన్సులతో సరిచేయొచ్చు. అలాగే 'ప్లిఆప్టిక్స్ క్యామ్ స్టిమ్యులేషన్, బైపోలార్ ట్రైనింగ్' అనే కంటి వ్యాయామాలతో కొంతమేరకు సమస్యలను అదుపు చేయొచ్చు. అవసరాన్నిబట్టి కంటి కండరాలకు సర్జరీ చేసి కనుగుడ్డును సరిచేయొచ్చు. ఈ సర్జరీ ఎంతో శులభం. పిల్లలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

హైబిపి

'డ్యాష్' డైట్

డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్‌టెన్షన్ అనే డ్యాష్ డైట్‌ను అమెరికాకు చెందిన డాక్టర్. మార్లా హెల్లర్ కనిపెట్టింది. రకరకాల ఆహారపదార్థాల ద్వారా శరీరానికి తగినన్ని పోషకాలను అందించి ఆరోగ్యాన్ని మెరుగు పరచటంతోపాటు రక్తపోటును తగ్గించటంలో ఈ డ్యాష్ డైట్ దిట్ట. రక్తపోటు రాకుండా ఉండాలన్నా, నియంత్రణలో ఉండాలన్నా ఈ డైట్‌ను అనుసరించటం మేలని వైద్యులు కూడా అంటున్నారు. ఈ డైట్‌ను అనుసరిస్తే రెండు వారాల్లోనే సిస్టాలిక్ బ్లడ్ ప్రెషర్ 8 నుంచి 14 పాయింట్లు తగ్గినట్టు ప్రయోగాత్మకంగా రుజువైంది. సోడియంను తగ్గించటంతోపాటు రక్తపోటును నియంత్రణలో ఉంచే పొటాషియం, కాల్షియం, మెగ్నీషియంలను పెంచటం డ్యాష్ డైట్ ప్రత్యేకత. ఈ డైట్‌లో భాగంగా తృణధాన్యాలు, పళ్లు, కూరగాయలు, తక్కువ కొవ్వు ఉండే పాల ఉత్పత్తులు తీసుకోవాలి. చేపలు, చికెన్, చిక్కుళ్లతోపాటు వారంలో ఒకటి రెండు రోజులు నట్స్,



సీడ్స్ తినాలి. తక్కువ పరిమాణాల్లో మాంసం, స్వీట్లు, కొవ్వులు కూడా తీసుకోవచ్చు.

- తృణధాన్యాల్లో భాగంగా రోజుకి ఒక హోల్ వీట్ బ్రెడ్ స్లయిస్ లేదా అర కప్పు బ్రౌన్ రైస్ లేదా పాస్తా తినొచ్చు.
- టొమాటో, క్యారెట్, బ్రక్కొలి, స్వీట్ పొటాటో, ఆకుకూరల్లో పీచు ఎక్కువగా ఉంటుంది. విటమిన్లతోపాటు పొటాషియం, మెగ్నీషియం కూడా సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి వీటిని రోజూ తినటం మేలు.
- పుల్లగా ఉండే నారింజ, బత్తాయి లాంటి సిట్రస్ ఫ్రూట్స్ తినాలి.
- పాలు, పెరుగు, జున్ను కాల్షియం, విటమిన్ డి ఎక్కువగా ఉండే పదార్థాలు. వీటిని తినటం వల్ల కూడా రక్తపోటు అదుపులో ఉంటుంది.

హెయిర్ కేర్

బట్టతలకు బ్రేక్!



తోచిన చిట్కాలు పాటిస్తూ, దొరికిన నూనెలన్నీ పూసేసినంత మాత్రాన బట్టతలకు బ్రేక్ పడదు. వెంట్రుకలు రాలుతున్నాయని గ్రహించిన వెంటనే అప్రమత్తమై వైద్యులను కలిస్తే బట్టతలను వాయిదా వేయొచ్చు. అదెలాగో తెలుసుకుందాం!

కుటుంబంలో బట్టతల ఉంటే తర్వాతి తరానికి సంక్రమించే అవకాశాలు ఎక్కువ! అలాగని బట్టతల కోసం ఎదురు చూస్తూ, రాలిపోయే వెంట్రుకలను చూసుకుని దిగాలు పడుతూ ఉండడం వల్ల ప్రయోజనం ఏముంటుంది? బట్టతలకు శాశ్వత పరిష్కారమనేది లేకపోయినా, వెంట్రుకలు రాలిపోకుండా చేసి, రాలిన వెంట్రుకల స్థానంలో కొత్త వెంట్రుకలను నాటే ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా ఎక్కువ మంది... 'రాలినన్ని వెంట్రుకలు రాలనిద్దాం! పూర్తిగా రాలిపోయిన తర్వాత హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకుందాం' అనే ధోరణితో ఉంటారు. కానీ వెంట్రుకలు రాలడం కనిపెట్టిన వెంటనే చికిత్స మొదలుపెడితే, మిగిలిన వెంట్రుకలు రాలిపోకుండా నియంత్రించుకోవచ్చు. కుటుంబంలో బట్టతల ఉన్నవాళ్లు మరికాస్త ముందుగా, అంటే వెంట్రుకలు రాలడం మొదలవక ముందే చికిత్స మొదలుపెడితే, బట్టతలకు అడ్డుకట్ట వేయొచ్చు.

అధిక రక్తపోటు, మధుమేహ సమస్యలున్నవాళ్లు వాటిని మందులతో అదుపులో పెట్టుకున్న తర్వాతే హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకోవాలి. తర్వాత నుంచి అందర్లాగే వ్యవహరించవచ్చు. తలస్నానం చేయొచ్చు. ఊడిపోతాయేమోననే భయం అవసరం లేదు. కొందరికి ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత పిఆర్‌పి అవసరం పడుతుంది. ఈ విషయాన్ని వైద్యులే సూచిస్తారు. అలాంటివాళ్లు వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి.



హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ఎప్పుడు?

బట్టతలకు వయసుతో సంబంధం లేదు. 20 ఏళ్లకే బట్టతలతో బాధపడుతున్న వాళ్లను చూస్తున్నాం. ఆ సమస్యతో సర్దుకుపోకుండా, వెంట్రుకలు రాలడం మొదలుపెట్టగానే చికిత్స తీసుకోవాలనే విషయం కూడా చాలా మందికి తెలియదు. ఈ సమస్య ఏ వయసులో మొదలైనా, ఎవరైనా నిరభ్యంతరంగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవచ్చు. 20 నుంచి 70 ఏళ్ల వయస్కులు ఈ ప్రక్రియను ఆశ్రయించవచ్చు. అయితే అంతకంటే ముందు బట్టతల ఏర్పడే దశల గురించి కొంత అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం. సాధారణంగా బట్టతలలో 8 దశలుంటాయి. 8వ దశలో 70 నుంచి 80% వెంట్రుకలు లేని వాళ్లకు ఎక్కువ వెంట్రుకలు అవసరమవుతాయి. అన్ని వెంట్రుకలు వాళ్ల శరీరం మీద లేకపోతే, వాళ్లకు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సాధ్యపడదు. అలాగే తొలి రెండు దశల్లో కూడా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకోవలసిన అవసరం లేదు. కాబట్టి రెండో దశ నుంచి ఆరో దశ వరకూ ఉన్న బట్టతలలకు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకోవచ్చు.

ఇతర సమస్యలతో....

పేను కొరుకుడు, స్కారింగ్ అలోపేసియా, సోరియాసిస్ మొదలైన సమస్యలున్నవాళ్లలో ఆ సమస్యల మూలంగా తల మీద వెంట్రుకలు ఊడిపోతుంటే, దాన్ని బట్టతలగా భావించడానికి వీల్లేదు. ఇలాంటి సందర్భాల్లో హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసినా, శరీరం ఆ వెంట్రుకలను రిజెక్ట్ చేస్తుంది కాబట్టి ఆ వెంట్రుకలు నాటుకోకుండా ఊడిపోయే అవకాశాలుంటాయి. కాబట్టి ఆ సమస్య ఏడాదిపాటు పెరగకుండా ఉండి, అసలు సమస్యకు చికిత్స చేసుకున్నా, వెంట్రుకలు మొలవని సందర్భాల్లో మాత్రమే హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఆశ్రయించాలి. లేదంటే చికిత్స విఫలమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొందరిలో స్కారింగ్ అలోపేషియా ఉంటుంది. చర్మానికి రక్తసరఫరా లేకపోవడంతో, ఆ ప్రదేశంలో వెంట్రుకలను నాటినా, శరీరం రిజెక్ట్ చేయొచ్చు. కాబట్టి సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని, స్కాల్ప్ బయాప్సీతో సమస్యను కచ్చితంగా గుర్తించి, సమస్యను సరిదిద్దుకున్న తర్వాత మాత్రమే హెయిర్ ట్రాన్స్‌ప్లెంటేషన్‌ను ఆశ్రయించాలి.

ఫెయిల్యూర్ ఎందుకు?

నాటిన వెంట్రుకలు ఊడిపోతున్నాయంటే, అందుకు చాలా కారణాలుంటాయి. సోరియాసిస్, అలోపేసియా లాంటి చర్మ సమస్యలతో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఆశ్రయించడంతో పాటు, ఆ చికిత్సలో సమర్థులైన వైద్యులను ఎంచుకోకపోవడం హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ విఫలమవడానికి ప్రధాన కారణం. సాధారణంగా ఈ ప్రక్రియ కోసం తల వెనకభాగంలో, మెడ పైన ఉన్న వెంట్రుకలనూ, లేదంటే గడ్డం, ఛాతీల్లోని వెంట్రుకలను హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఉపయోగిస్తారు. అయితే ఆ వెంట్రుకలను సేకరించేటప్పుడు, ఎంతో జాగ్రత్తగా వేరుతో సహా సేకరించాలి. ఆ క్రమంలో వేరు తెగిపోతే, ఆ వెంట్రుక నాటడానికి పనికి రాదు. వేరు లేని మొక్క ఎలా పెరగదో, వేరు లేని వెంట్రుక కూడా పెరగదు. బయటకు వెంట్రుక ఉన్నట్టు కనిపించినా, అది పెరగకుండా కొంత కాలానికి రాలిపోతుంది. కాబట్టి హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం అనుభవజ్ఞులైన డెర్మటాలజిస్ట్ లేదా ప్లాస్టిక్ సర్జన్‌ను ఎంచుకోవాలి. చాలా మంది హెయిర్ సెలూన్లనూ, చిన్నచిన్న క్లినిక్స్‌నూ, టెక్నీషియన్లనూ ఆశ్రయిస్తూ ఉంటారు. ఇది సరి కాదు.

బట్టతల రాకుండానే...

తల పలుచగా ఉండీ, చిక్కగా కనిపించాలనుకునేవాళ్లకు కూడా హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయవచ్చు. అలాంటప్పుడు తల మీద నాటిన వెంట్రుకలతో పాటు, ముందు నుంచీ ఉన్న వెంట్రుకలు రెండూ ఉంటాయి. కానీ నాటిన వెంట్రుకలు శాశ్వతంగా ఉండిపోతే, ముందు నుంచీ ఉన్న వెంట్రుకలు కొంత కాలానికి ఊడిపోవచ్చు. అప్పుడు తల మీద వెంట్రుకలు ఎబ్బెట్టుగా కనిపించే అవకాశాలుంటాయి. కాబట్టి ముందునుంచీ ఉన్న వెంట్రుకలను కాపాడుకోవడం కోసం, ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత, కొన్ని లోషన్లను వైద్యులు సూచిస్తారు. వాటిని వాడుకుంటే వెంట్రుకలు రాలిపోకుండా ఉంటాయి. వీళ్లే కాకుండా బట్టతల ప్రారంభంలో వెంట్రుకలు రాలడం మొదలైన సందర్భాల్లో కూడా ఈ లోషన్‌తో వెంట్రుకలు రాలకుండా చూసుకోవచ్చు. దీంతో వెంట్రుకలు రాలే ప్రక్రియ వాయిదా పడుతుంది.

ఎన్ని వెంట్రుకలు?

ఎన్ని వెంట్రుకలను నాటాలి అనేది ఎంత ఏరియాలో ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకుంటున్నారు? వాళ్ల దగ్గరి నుంచి సేకరించడానికి ఎన్ని వెంట్రుకలు ఉన్నాయి? అనే అంశాల మీద ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఒక సిటింగ్‌లోనే ట్రాన్స్‌ప్లాంట్ పూర్తయిపోతుంది. ఒకవేళ 5 నుంచి 6 వేల వెంట్రుకలు నాటవలసి వస్తే, రెండు సిట్టింగ్స్ అవసరమవుతాయి. వెంట్రుక కుదుళ్లలో ఒక వెంట్రుకే ఉంటుందనుకుంటాం. కానీ రెండు, మూడు, నాలుగు వెంట్రుకలు కూడా ఉంటూ ఉంటాయి. ఇలా ఒక గ్రాఫ్ట్ నుంచి ఎన్ని వెంట్రుకలు వస్తాయనేదాని మీద కూడా ఫలితాలు ఆధారపడి ఉంటాయి.



పిఆర్‌పి ఫలితం ఏ మేరకు?

ఐదారు నెలల క్రితం పోగొట్టుకున్న వెంట్రుకలు పెరగడానికి పిఆర్‌పి తోడ్పడుతుంది. కానీ ఎన్నో ఏళ్ల ముందు వెంట్రుకలు ఊడిపోయి, తల నున్నగా మారిపోయిన సందర్భాల్లో పిఆర్‌పి, డెర్మా రోలర్. ఇంజెక్షన్స్ లాంటి చికిత్సలు ఫలితాన్నివ్వవు. ఇలాంటి కేసుల్లో హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ఒక్కటే ఉత్తమమైన పరిష్కారం.

డాక్టర్ స్వప్న ప్రియ, డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్.

ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత ఇలా...

ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత, నొప్పి, వాపు సహజం. ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత రెండు నుంచి 15 రోజుల వరకూ వైద్యుల పర్యవేక్షణలో ఉండాలి. సెకండరీ ఇన్ఫెక్షన్లు తలెత్తకుండా



ఇన్‌డైజెషన్

అజీర్తి అంతం ఇలా!

అడపాదడపా బాధిస్తే ఫరవాలేదు. కానీ అదే పనిగా అజీర్తి వేధిస్తుంటే సమస్యను సీరియస్‌గానే పరిగణించాలి. కారణాలను వెతికి, వాటిని సరిదిద్దడంతో పాటు అవసరాన్ని బట్టి సమర్థమైన చికిత్స తీసుకోవాలి.



నోరూరించే పదార్థాలను చూసినా, వాటి వాసన ముక్కు పుటాలకు తాకినా నోట్లో నీళ్లూరతాయి. ఇలా నోట్లోనే కాదు పొట్టలోనూ స్రావాలు ఊరతాయి. అవే డైజెస్టివ్ జ్యూసెస్. ఇవి ముందుగానే విడుదలై రెడీగా ఉండటంతో పొట్టలోకి ఆహార పదార్థాలు చేరగానే జీర్ణక్రియ మొదలవుతుంది. అయితే పరిమితంగా తింటే పనంతా సజావుగా సాగిపోతుంది. అలాకాకుండా ఎడాపెడా లాగించేస్తే ఆ ఆహారాన్ని జీర్ణం చేసుకునేందుకు జీర్ణరసాలు సరిపోక పొట్టలో అసౌకర్యం మొదలవుతుంది. ఆ అసౌకర్యమే అజీర్తి. దీన్ని వైద్య పరిభాషలో 'డిస్పెప్సియా' అంటారు. అయితే భారీ భోజనం తిన్న వెంటనే తాత్కాలికంగా అసౌకర్యంగా అనిపిస్తే దాన్ని భుక్తాయాసంగా భావించాలి. అదే అసౌకర్యం రోజుల తరబడి బాధిస్తే అది కచ్చితంగా అజీర్తే!

అజీర్తి లక్షణాలు ఇవే!

- తినకపోయినా పొట్ట నిండుగా ఉన్న ఫీలింగ్
- త్రేన్పులు
- తల తిరుగుడు, వాంతులు
- పొట్టలో శబ్దాలు, అసౌకర్యం, నొప్పి
- అసిడిటీ

అజీర్తి నుంచి విముక్తి ఇలా!

- సోంపుతో సూపర్‌ఫాస్ట్ రిలీఫ్

రెండు టేబుల్ స్పూన్ల సోంపును నూనె లేకుండా వేయించి పొడి చేసుకోవాలి. గ్లాసు నీళ్లలో ఒక టీస్పూను పొడి కలుపుకుని రోజుకి రెండుసార్లు తాగలి. ఇలా చేస్తే కారంగా ఉండే పదార్థాలు తినటం వల్ల కలిగిన అజీర్తి వదులుతుంది.

అల్లంతో అజీర్తికి చెక్

- జీర్ణాశయంలో అరగకుండా మిగిలిపోయిన పదార్థాలను అరిగించటానికి అల్లం సహాయపడుతుంది. కాబట్టి ఒక టీస్పూను అల్లం తురిమి ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో కలపాలి. కొద్దిగా నిమ్మరసం, కొన్ని చుక్కల తేనె కూడా కలిపి నెమ్మదిగా తాగితే ఫలితం ఉంటుంది.

వాము దివ్యౌషధం

- వాము అజీర్తి నివారిణి అనే విషయం అందరికీ తెలిసిందే! వాముకు అల్లం చేర్చి మెత్తగా రుబ్బాలి. ఈ ముద్దను ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో కలిపి రోజుకి రెండుసార్లు తాగితే అజీర్తి నుంచి ఉపశమనం కలుగుతుంది.

నీళ్లతో అజీర్తి రిలీఫ్

ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజం. అజీర్తి లక్షణాలు వేధిస్తుంటే కొద్ది కొద్ది పరిమాణాల్లో నీళ్లు తాగుతూ ఉండాలి. ఒకేసారి ఎక్కువ నీళ్లు తాగితే ఫలితం ఉండకపోవచ్చు. కాబట్టి వీలైనన్ని ఎక్కువ నీళ్లు కొద్ది కొద్దిగా తాగుతూ ఉంటే జీర్ణక్రియ మెరుగై సమస్య పరిష్కారమవుతుంది.

సోడా ఉప్పుతో సో బెటర్

అజీర్తితో తలెత్తే అసిడిటీ వదలాలంటే ఒక గ్లాసు నీళ్లలో టీస్పూను సోడా ఉప్పు, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపి తాగాలి. దీంతో పొట్టలోని యాసిడ్ న్యూట్రలైజ్ అయి ఛాతీలో మంట తగ్గుతుంది.

- పొట్టలో తయారయ్యే హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఒక రోజులో దాదాపు 2 లీటర్ల పరిమాణానికి కూడా చేరుకోవచ్చు.
- జీర్ణక్రియలో భాగంగా మనం తీసుకున్న ఆహారం జీర్ణాశయంలో కనీసం రెండు నుంచి మూడు గంటల పాటు ఉంటుంది.
- శరీర ఉష్ణోగ్రతతో సమం చేయటం కోసం మన నోరు అక్కడికి చేరుకున్న ఆహారంసం ఉష్ణోగ్రతను పెంచటం లేదా తగ్గించటం చేస్తుంది.
- మనం ఒక ఏడాదిలో కనీసం 500 కిలోల ఆహారం తీసుకుంటాం.
- కొవ్వు కలిగిన పదార్థం జీర్ణమవటానికి కనీసం 6 గంటల సమయం పడుతుంది.
- పిండి పదార్థాలున్న పదార్థం జీర్ణమవటానికి రెండు గంటలు సరిపోతుంది.
- 11 లీటర్ల పదార్థాలు, జీర్ణ రసాలు జీర్ణ వ్యవస్థలో సర్క్యులేట్ అయితే చివరికి విసర్జించబడేది 100 మి.లీటర్లే!
- తీసుకున్న ఆహారంలోని 90 % పోషకాలు చిన్న పేగుల్లోనే శోషణ చెందుతాయి.
- ప్రతి 5-10 రోజులకు జీర్ణాశయం లోపల కొత్త రక్షణ పొర తయారవుతూ ఉంటుంది.

యాపిల్ సెడార్ వనిగర్

అర కప్పు నీళ్లలో ఓ టీస్పూను యాపిల్ సెడార్ వెనిగర్, కొద్దిగా తేనె కలిపి తాగాలి. ఇలా చేస్తే తిన్న ఆహారాన్ని అరిగించుకునేంత యాసిడ్ సరిపడా జీర్ణాశయంలో లేకపోయినా ఆహారం అరిగిపోతుంది.

డాక్టర్‌ని ఎప్పుడు కలవాలి?

అజీర్తి కోసం వైద్యుల్ని కలవాలా? అనుకుంటాం. కానీ కొన్ని సందర్భాల్లో సొంత వైద్యం సరిపోకపోవచ్చు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుల్ని కలవటం మంచిది.

- వరసగా వాంతులు
- రక్తపు వాంతులు, విరేచనాలు
- విపరీతమైన పొత్తి కడుపు నొప్పి
- రెండు వారాలకు మించి అజీర్తి

24 నుంచి 72 గంటలు

మనం తీసుకున్న ఆహారం పొట్టలోనే జీర్ణమవుతుందనుకుంటాం. కానీ ఆహారం నోట్లోకి చేరుకున్నది మొదలు, జీర్ణాశయంలో, చిన్న, పెద్ద పేగుల్లో....ఇలా అది కదిలే మార్గంలోని ప్రతి అవయవంలో దశలవారీగా జీర్ణమవుతూనే ఉంటుంది. కాబట్టే తీసుకున్న ఆహారం పూర్తిగా జీర్ణమవటానికి కనీసం 24 నుంచి 72 గంటల సమయం పడుతుంది. అలాగే జీర్ణాశయం కెపాసిటీ గురించి కూడా మనకు కొన్ని అపోహలున్నాయి. ఎంత ఆహారం తీసుకున్నా తోలు తిత్తి లాంటి జీర్ణకోశం సాగుతూనే ఉంటుందనుకుంటాం. కానీ నిజానికి జీర్ణకోశం కెపాసిటీ 1.5 లీటర్లే! ఇంత చిన్న జీర్ణకోశంలోకి అపరిమితంగా ఆహారాన్ని తోస్తే తిరగటానికి ఇబ్బందిపడే మిక్సీ జార్‌లా మన జీర్ణకోశం ఇబ్బంది పడుతుంది. ఫలితంగా అజీర్తి, పొట్టలో నొప్పి సమస్యలు మొదలవుతాయి.

ఎక్కువ తింటే ఏమవుతుంది?

పరిమితికి మించి తిన్నప్పుడు శరీరంలో ఈ మార్పులు జరుగుతాయి.

- **పొట్ట లావవుతుంది:** ఎక్కువ తిన్నప్పుడు ఆ పదార్థాలకు చోటు కల్పించటం కోసం జీర్ణాశయం సాగుతుంది. దాంతో దాని చుట్టుపక్కన ఉంటే అంతర్గత అవయవాలు నెట్టబడతాయి. దాంతో పొట్టలో నొప్పి మొదలవుతుంది.
- **పొట్ట బరువుగా:** ఆహారం మింగినప్పుడల్లా కొంత గాలి పొట్టలోకి చేరుకుంటూ ఉంటుంది. ఈ గాలి త్రేన్పుల రూపంలో బయటకొచ్చే ప్రయత్నం చేస్తుంది. అయితే త్రేన్పు బయటికొచ్చేస్తే ఫర్వాలేదు. అందుకు అడ్డంకి ఏర్పడితే పొట్టలో ఇబ్బంది మొదలవుతుంది.
- **ఛాతీలో మంట:** ఎక్కువ ఆహారం తీసుకున్నప్పుడు హైడ్రోక్లోరిక్ యాసిడ్ అన్నవాహికలోకి ఎగదన్నుతుంది. దాంతో ఛాతీలో మంట మొదలవుతుంది. జీర్ణం కావటానికి ఎక్కువ సమయం పట్టే కొవ్వు, తీపి పదార్థాలు తిన్నప్పుడు ఈ సమస్య బాధిస్తుంది.
- **శ్రమకు లోనయ్యే అర్గాన్స్:** పరిమితికి మించి ఆహారం తిన్నప్పుడు దాన్ని అరిగించుకోటానికి సరిపడా స్రావాలను విడుదల చేయటం అంతర్గత అవయవాలు అవసరానికి విుంచి శ్రమ పడాల్సి ఉంటుంది. ఇలా తరచుగా జరుగుతూ ఉంటే మెటబాలిజం, ఎండోక్రైన్ పనితీరు గాడితప్పి గ్రోత్ హార్మోన్ తగ్గటం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ మొదలైన సమస్యలు మొదలవుతాయి.

మెదడు చెప్పింది వినాలి

తీసుకునే ఆహారం ద్వారా పొట్టలోకి చేరుకునే కొవ్వు కణాలు 'లెప్టిన్' అనే హార్మోన్‌ను స్రవిస్తాయి. ఈ హార్మోన్ మన మెదడుకు సంకేతాలు పంపిస్తుంది. తిన్నది సరిపోయిందని, ఇక తినాల్సిన అవసరం లేదని ఈ హార్మోన్ పంపే సంకేతాలు అందుకున్న మెదడు ఆకలి తీరిందనే భావన కలిగేలా చేస్తుంది. దాంతో మనం తినటం ముగిస్తాం. కానీ త్వరత్వరగా తినేవాళ్లలో ఈ మెకానిజం గాడి తప్పుతుంది. మెదడుకు సిగ్నల్స్ వెళ్లక పొట్ట నిండినా ఇంకా తింటూనే ఉంటాం. దాంతో స్థూలకాయులుగా తయారయ్యే ప్రమాదం ఉంది.

అవగాహన

ఎముకలెందుకు గుల్లబారతాయి?

30 ఏళ్ల వయసుకి చేరుకునేసరికి ఎముకలు పూర్తి సాంద్రతను సంతరించుకుంటాయి. ఆ తర్వాత ఎముక పునర్నిర్మాణం మొదలవుతుంది. ఈ మార్పులన్నీ సక్రమంగా జరగాలంటే తగినంత క్యాల్షియం శరీరానికి అందుతూ ఉండాలి.

ఆహారం ద్వారా శరీరంలోకి చేరుకునే క్యాల్షియంను ఎముకలు పీల్చుకుంటాయి. ఒకవేళ రక్తంలో క్యాల్షియమ్ స్థాయి తక్కువగా ఉంటే ఎముకల మజ్జ నుంచి క్యాల్షియం రక్తంలోకి విడుదలవుతుంది. ఎముకలకే క్యాల్షియమ్ సరిపోకపోతే రక్తం నుంచి శోషించుకుంటాయి. ఇలా ఎముకలు, రక్తం...రెండిట్లో క్యాల్షియం స్థాయులు సక్రమంగా ఉన్నంతకాలం ఎటువంటి సమస్యా ఉండదు. ఎప్పుడైతే ఈ సమతౌల్యం అదుపు తప్పుతుందో అప్పుడే ఎముకలు గుల్లబారటం, బలహీనపడటం మొదలవుతుంది. అలాగే సహజసిద్ధంగానే 30 ఏళ్ల వరకూ పెరుగుతూ వచ్చిన ఎముకల సాంద్రత అప్పటి నుంచి తగ్గటం మొదలుపెడుతుంది. దాంతో ఆస్టియోపోరోసిస్, ఎముకలు తేలికగా విరిగిపోవటం మొదలైన సమస్యలు మొదలవుతాయి.

ఇలా జరగకుండా ఉండాలంటే....

30 ఏళ్ల లోపు వరకూ సాధ్యమైనంత ఎక్కువ క్యాల్షియమ్‌ను తీసుకోవటంతోపాటు, ఆ తర్వాత దాని పరిమాణాన్ని జీవనశైలి, వయసుల ఆధారంగా పెంచుతూ ఎముకల్ని బలంగా ఉంచుకోవాలి.

ఆహారంలో క్యాల్షియం:
క్యాల్షియం తగినంత లేని ఆహారం తీసుకోవటం వల్ల ఎముకల సాంద్రత తగ్గుతుంది. చిన్న వయసులోనే బోన్ లాస్ జరిగి ఎముకలు విరిగే అవకాశాలు పెరుగుతాయి.

అస్తవ్యస్త ఆహార వేళలు:
సమయానికి తినకపోవటం, తగినంత తినకపోవటం వల్ల కూడా క్యాల్షియమ్‌ను తగినంతగా శరీరం శోషించుకోలేదు.

పాలకు బదులు టీ, కాఫీలు:
పాలు తాగే అలవాటు అందరిలో కొరవడుతోంది. టీ, కాఫీలు తాగుతున్నాం కాబట్టి పాలు తాగినట్టే అనుకుంటే పొరపాటు. కానీ టీ, కాఫీల్లో ఉండే ఫైటేట్స్ క్యాల్షియమ్‌ను శరీరం శోషించుకోనివ్వకుండా అడ్డుకుంటాయి. కాబట్టి పాలను నేరుగా తాగాలి.

వ్యాయామం అవసరం:
వ్యాయామం వల్ల ఎముకల పటుత్వం పెరుగుతుంది. బాల్యంలో, యుక్త వయసులో వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి.

మద్యపానం, ధూమపానం:
ఈ వ్యసనాల వల్ల ఎముకల్లోని క్యాల్షియం అవసరానికి మించి రక్తంలోకి విడుదలవుతూ శరీరం నుంచి బయటికి వెళ్లిపోతూ ఉంటుంది. ఫలితంగా ఎముకలు గుల్లబారతాయి.

వయసురీత్యా:
వయసు పైబడేకొద్దీ ఎముకలు పలుచనై, బలహీనపడతాయి.

వంశపారంపర్యంగా:
తల్లితండ్రుల్లో ఆస్టియోపోరోసిస్ ఉంటే పిల్లలకు వంశ పారంపర్యంగా సంక్రమించే అవకాశం ఉంది.



పీఎస్‌బీల ప్రైవేటీకరణకు ఇదే సరైన సమయం

ఎస్‌బీఐ నివేదిక వెల్లడి

బ్యాంకుల సంఖ్యను మరింత కుదించాలి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) ప్రైవేటీకరణకు ఇదే సరైన సమయమని ఎస్‌బీఐ తన రీసెర్చ్ నివేదికలో ప్రభుత్వానికి సూచించింది. దాదాపు అన్ని పీఎస్‌బీలు నష్టాలు పూడ్చుకుని మంచి లాభాల్లో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ బ్యాంకులను కొనేందుకు ఎవరైనా ముందుకొస్తారని తెలిపింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) ప్రైవేటీకరణకు నీతి ఆయోగ్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్ఐసీ, కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకీ రంగం సిద్ధమైంది. దీంతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బ్యాంకుల ప్రైవేటీకరణపై వచ్చే కేంద్ర బడ్జెట్‌లో స్పష్టమైన ప్రకటన చేస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ విడుదల చేసిన నివేదిక ప్రాధాన్యత సంతరించుకుంది.

మరింత కుదింపు: ప్రైవేటీకరణతో పాటు ఇప్పుడున్న 12 పీఎస్‌బీలను మరింత కుదించాలని ఎస్‌బీఐ మరో సూచన చేసింది. దేశ ఉత్తర-దక్షిణ, తూర్పు-పశ్చిమ ప్రాంతాల్లో గట్టి పట్టు ఉన్న పీఎస్‌బీల్లో, ఆయా ప్రాంతాల్లోని మిగతా పీఎస్‌బీలను విలీనం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఇప్పటికే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విలీనాలతో పీఎస్‌బీల ఆర్థిక స్థితిగతులు మరింత మెరగుపడి ప్రైవేటు బ్యాంకులకు గట్టి పోటీ ఇస్తాయని నిపుణుల అంచనా. దీంతో ఎస్‌బీఐ తాజా నివేదికపై ప్రభుత్వం తప్పకుండా దృష్టి పెడుతుందని భావిస్తున్నారు. అయితే ఈ విలీనాల ప్రతిపాదనలను ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ విలీనాలు చివరికి తమ ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తుందని ఉద్యోగ సంఘాలు ఆందోళన చెందుతున్నాయి.

వినియోగాన్ని పెంచేలా బడ్జెట్: మరోవైపు కేంద్ర బడ్జెట్ దగ్గర పడుతోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 23న 2024-25 ఆర్థిక సంవత్సర పూర్తి బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించనున్నారు. దీంతో కార్పొరేట్ రంగం తన బడ్జెట్ కోరికల చిట్టాను కేంద్ర ఆర్థిక మంత్రికి విన్నవించింది. వినియోగ రంగం ముఖ్యంగా గ్రామీణ వినియోగ రంగం ఇంకా పుంజుకోలేదు. దీంతో వచ్చే కేంద్ర బడ్జెట్, దేశంలో వినియోగాన్ని పెంచేలా ఉండాలని కార్పొరేట్ రంగం ఆర్థిక మంత్రిని కోరింది. ఇందుకోసం తక్కువ పన్ను పోటు పరిధిలోకి వచ్చే అల్పాదాయ వర్గాల పన్ను మినహాయింపు ఆదాయ పరిమితిని మరింత పెంచాలని కోరింది.

కంపెనీలపైనా దయ చూపండి: ప్రస్తుత కార్పొరేట్ ట్యాక్స్ రేట్లపై కంపెనీలు అసంతృప్తితో ఉన్నాయి. ఈ పన్ను రేటును మరింత తగ్గించి, హేతుబద్ధం చేయాలని అసోచామ్ కోరింది. దీనికి తోడు పన్ను వసూలు వ్యవస్థను మరింత సంస్కరించాలని విజ్ఞప్తి చేసింది. మినహాయింపులను తొలగించి, పన్ను చెల్లింపు పరిధిలోకి వచ్చే వారి సంఖ్యను మరింత విస్తృతం చేయాలని సూచించింది. మూలధన పెట్టుబడులకు కోత పెట్టకుండా ఆర్థిక మంత్రి వచ్చే బడ్జెట్‌లో ద్రవ్య లోటును జీడీపీలో 4.9 శాతం లేదా ఐదు శాతం వద్ద కట్టడి చేసే అవకాశం ఉందని ఇక్రా పరపతి సంస్థ అంచనా.

మార్కెట్లోకి బెంజ్ ఎంట్రీ లెవెల్ ఈవీలు



న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ సోమవారం భారత మార్కెట్లోకి ఎంట్రీ లెవెల్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ)ను ప్రవేశపెట్టింది. ఇందులో ఆల్ ఎలక్ట్రిక్ ఎంట్రీ ఎస్‌యూవీ ఈక్యూఏ 250 ప్రారంభ ధర రూ.66 లక్షలు. ఏడు సీట్ల సామర్థ్యంతో కూడిన ఈక్యూబీ 250 ప్లస్ ఎస్‌యూవీ ధర రూ.70.90 లక్షలుగా ఉంది. ఐదు సీట్ల సామర్థ్యంతో కూడిన ఈక్యూబీ 350 ఎస్‌యూవీ ధర రూ.77.5 లక్షలు. ఈ ఏడాదిలోనే ఈక్యూఎస్ మేబ్యాక్ ఎస్‌యూవీ సహా ఎలక్ట్రిఫైడ్ జీ-క్లాస్ మోడళ్లను భారత మార్కెట్లోకి తీసుకురానుంది.

14 వరకు జోయాలుక్కాస్ జువెలరీ సేల్ ఆఫర్స్

హైదరాబాద్: జోయాలుక్కాస్ జువెలరీ సేల్-2024 ఈనెల 14తో ముగియనుంది. జూన్‌లో ప్రారంభమైన ఈ ఆఫర్‌లో భాగంగా బంగారం, వజ్రాలు, వెండి, ప్రీషియస్ ఆభరణాల మజూరీ చార్జీల (వీఏ)పై ఫ్లాట్ 50 శాతం తగ్గింపును జోయాలుక్కాస్ అందిస్తోంది. ఈ జువెలరీ సేల్ ఎంతో మంది వినియోగదారులను ఆకర్షించిందని జోయాలుక్కాస్ ఎండీ, ఛైర్మన్ జోయ్ అలుక్కాస్ తెలిపారు. ఈ సేల్‌లో భాగంగా వినియోగదారులు ఎన్నడూ లేని ధరలకు అత్యుత్తమ ఆభరణాలను కొనుగోలు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 14తో ముగియనున్న ఈ సేల్ జోయాలుక్కాస్‌కు చెందిన అన్ని షోరూమ్‌ల్లో అందుబాటులో ఉందని తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,580 ▼	67,450 ▼	99,500 ▲
ముంబై	72,746 ▲	66,635 ▲	91,733 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ

హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	118
వరంగల్	114	గుంటూరు	118
కరీంనగర్	114	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	129
కర్నూలు	114	నెల్లూరు	129
విశాఖపట్నం	114	అనంతపురం	118
గోదావరి	118		

స్టార్ ఫిన్‌సర్వ్ రిజిస్ట్రేషన్ రద్దు

ముంబై: హైదరాబాద్‌కు చెందిన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) స్టార్ ఫిన్‌సర్వ్ ఇండియా రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సోమవారం తెలిపింది. ప్రోగ్‌క్యాప్ పేరుతో సేవలందిస్తోన్న స్టార్ ఫిన్‌సర్వ్.. తన డిజిటల్ లెండింగ్ కార్యకలాపాల్లో ఆర్థిక సేవల ఔట్‌సోర్సింగ్‌కు సంబంధించిన నియమావళిని ఉల్లంఘించిన కారణంగా రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. కంపెనీ వ్యాపారపరమైన నిర్ణయాలకు కీలకమైన క్రెడిట్ అప్రైజల్, రుణ మంజూరు, కేవైసీ వెరిఫికేషన్ ప్రక్రియలను ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చిందని, తద్వారా డేటా గోప్యత, వినియోగదారు సమాచార భద్రత నియమావళిని అతిక్రమించిందని ఆర్‌బీఐ పేర్కొంది. స్టార్ ఫిన్‌సర్వ్‌తో పాటు ముంబైకి చెందిన పాలిటెక్స్ ఇండియా రిజిస్ట్రేషన్‌ను సైతం ఆర్‌బీఐ రద్దు చేసింది.

హైదరాబాద్‌లో సీ1 కేంద్రం విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని తమ గ్లోబల్ ఇన్నోవేషన్, క్యాపబిలిటీస్ సెంటర్‌ను (జీఐసీసీ) గణనీయంగా విస్తరిస్తున్నట్టు సీ1 (గతంలో కన్వర్జ్‌వన్) ప్రకటించింది. తమ వృద్ధి వ్యూహంలో భాగంగా ఈ కేంద్రాన్ని విస్తరించినందు వల్ల కంపెనీ వృద్ధి మరింతగా పెరగడంతో పాటు సామర్థ్యాలు మరింతగా మెరుగుపడతాయని, తద్వారా ప్రపంచ కస్టమర్లకు విలువ సృష్టించగలుగుతామని సీ1 తెలిపింది. గత ఏడాదే సీ1 ఈ కేంద్రాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ కంపెనీ జీఐసీసీపై పెట్టుబడులు రెట్టింపు చేసింది. జీఐసీసీని 40,000 చదరపు అడుగుల విస్తీర్ణం గల కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు అత్యాధునిక శిక్షణా కేంద్రాల్లో సీటింగ్ సామర్థ్యం కూడా రెట్టింపు చేసినట్టు సీ 1 కంట్రీ హెడ్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర బొద్దేజు అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ రూ.360 కోట్ల సమీకరణ

క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషన్స్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా రూ.360 కోట్లు సమీకరించనున్నట్లు పిట్టీ ఇంజనీరింగ్ వెల్లడించింది. క్యూఐపీలో భాగంగా రూ.5 ముఖ విలువ కలిగిన షేరును రూ.1,054.25 కు జారీ చేయనున్నట్లు తెలిపింది. ఈ నిధుల సమీకరణకు సోమవారం కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

జాంబియాలో లిథియం మైనింగ్‌లోకి నవ లిమిటెడ్

జాంబియాలో కంపెనీ అనుబంధ సంస్థ మాంబా కాలరీస్ లిమిటెడ్ (ఎంసీఎల్) రెండు కీలకమైన గనుల తవ్వకాల లైసెన్సులను దక్కించుకుందని నవ లిమిటెడ్ వెల్లడించింది. జాంబియాలోని సదరన్ ప్రావిన్స్‌లో లిథియం సహా మరికొన్ని ఖనిజ నిక్షేపాల తవ్వకాలకు సంబంధించి ఈ లైసెన్సులను అందుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ లైసెన్స్ కాలపరిమితి నాలుగేళ్లని పేర్కొంది.

రోష్నీ నాడార్‌కు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం



న్యూఢిల్లీ: దేశీయ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రాకు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం "నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్" లభించింది. భారత్‌లోని ఫ్రాన్స్ రాయబారి థియరీ మాథౌ ఈ అవార్డును సోమవారం రోష్నీకి ప్రదానం చేశారు. వ్యాపార ప్రపంచానికి తాను అందించిన సేవలు, ఫ్రాన్స్-భారత్ మధ్య ఆర్థిక సంబంధాలను ప్రోత్సహించేందుకు నిర్విరామ కృషితో పాటు సామాజిక, పర్యావరణ సంక్షేమం విషయంలో తిరుగులేని నిబద్ధతకు గుర్తింపుగా రోష్నీకి ఈ అవార్డు దక్కింది. ఈ పురస్కారం దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నాని రోష్నీ ఈ సందర్భంగా అన్నారు. భారత్- ఫ్రాన్స్ మధ్య సంబంధాన్ని ఇది నొక్కి చెబుతుందన్నారు. తమ కంపెనీకి వ్యూహాత్మక మార్కెట్లలో ఫ్రాన్స్ ఒకటని అన్నారు. ఫ్రాన్స్‌లో కంపెనీ వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరించడంతో పాటు మా వైవిధ్య సేవల ద్వారా ఫ్రెంచ్ వ్యాపారాల డిజిటల్ పరివర్తనానికి దోహదపడే విషయంలో హెచ్‌సీఎల్ టెక్ కట్టుబడి ఉందని రోష్నీ పేర్కొన్నారు.

ఏసీలు, ఎల్ఈడీల తయారీకి మరింత ఊతం

అక్టోబరు 12 వరకు పీఎల్ఐ దరఖాస్తులు

న్యూఢిల్లీ: ఏసీలు, ఎల్ఈడీ బల్బుల వంటి గృహోపయోగ వస్తువుల దేశీయ ఉత్పత్తిని మరింతగా ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం కింద ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే కంపెనీల కోసం కేంద్ర ప్రభుత్వం తాజాగా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 15 నుంచి అక్టోబరు 12 వరకు కంపెనీలు ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఇప్పటికే పీఎల్ఐ పథకం ప్రయోజనాలు పొందుతున్న సంస్థలు కూడా ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కాకపోతే ఈ సంస్థలు ఇందుకోసం మరిన్ని పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ పథకం కింద ప్రోత్సాహకాలు అందుకుంటున్న సంస్థలు ఇక ఏడాదికి ఒకసారి కాకుండా, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ ప్రోత్సాహకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది.

ఏపీ మార్కెట్లోకి ద్వారా కేజీఎఫ్ఎస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలోని పలు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఫైనాన్షియల్ ఇంక్లూజన్ విస్తరణకు కృషి చేస్తున్న ద్వారా క్షేత్రీయ గ్రామీణ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ద్వారా కేజీఎఫ్ఎస్) ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు ప్రారంభిస్తోంది. దీనికి తోడు ఆర్థిక సర్వీసులు సమర్థవంతంగా అందించడం లక్ష్యంగా 50 లక్షల డాలర్ల సబార్డినేటెడ్ డెట్, ఈసీబీల జారీ ద్వారా గ్లోబల్ జెండర్ స్మార్ట్ ఫండ్ పోర్ట్‌ఫోలియో మేనేజర్ అయిన ట్రిపుల్ జంప్ నుంచి మరో 50 లక్షల డాలర్ల సీనియర్ సెక్యూరిటీ డెట్ సమీకరించింది.

స్వల్ప నష్టాల్లో సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో ర్యాలీ కొనసాగేందుకు దోహదపడే కొత్త అంశాలేమీ లేకపోవడంతో ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణిని ప్రదర్శించారు. దాంతో సోమవారం ప్రామాణిక ఈక్విటీ సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. సెన్సెక్స్ ఒక దశలో 264.77 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ మళ్లీ కాస్త తేరుకుని 36.22 పాయింట్ల నష్టంతో 79,960.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 3.30 పాయింట్లు తగ్గి 24,320.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సగం నష్టపోయాయి.

అదానీ కృష్ణపట్నం పోర్టులో బంగ్లాదేశ్ బృందం

ముత్తుకూరు: భారత్-బంగ్లాదేశ్ దేశాల మధ్య సముద్ర సహకారం, వాణిజ్యం కోసం అవకాశాలను అన్వేషించడానికి తీరప్రాంత షిప్పింగ్ ఒప్పందంలో భాగంగా 13 మంది సభ్యుల బంగ్లాదేశ్ ప్రతినిధుల బృందం నెల్లూరు జిల్లాలోని అదానీ కృష్ణపట్నం పోర్టును సోమవారం సందర్శించింది. పరస్పర సముద్ర వాణిజ్యాన్ని పెంపొందించడానికి, సున్నితమైన మరింత సమర్థవంతమైన నావిగేషన్‌కు భరోసా ఇవ్వడానికి ఈ ఒప్పందం దోహదపడుతుందని పోర్టు అధికారులు చెప్పారు. ప్రతినిధి బృందంతో పాటు భారత ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కృష్ణపట్నం ఓడరేవు సాంకేతిక కార్యకలాపాలు, వాణిజ్య అవకాశాలు, సమగ్ర మౌలిక సదుపాయాలపై వివరణాత్మక ప్రదర్శనలను బృందం పరిశీలించింది. కాగా త్వరలోనే విశాఖ, హల్దియా, కోల్‌కతాలోని ఓడరేవులను కూడా సందర్శించనున్నట్లు బంగ్లాదేశ్ ప్రతినిధుల బృందం తెలిపింది.

స్పోర్ట్స్

గ్లోబల్ చెస్ లీగ్‌లో అశ్విన్

న్యూఢిల్లీ: భారత ఆఫ్ స్పిన్నర్ ఆర్.అశ్విన్ గ్లోబల్ చెస్ లీగ్‌లోని అమెరికన్ గాంబిట్స్ ఫ్రాంచైజీలో సహ యజమానిగా మారాడు. టెక్ మహీంద్రా, అంతర్జాతీయ చెస్ సమాఖ్య నిర్వహణలో జరుగుతున్న ఈ లీగ్ రెండో సీజన్ అక్టోబరు 3 నుంచి 12 వరకు లండన్‌లో జరుగుతుంది. తొలి సీజన్‌లో ఆడిన చింగారి గల్ఫ్ టైటాన్స్ వైదొలగడంతో అమెరికన్ గాంబిట్స్‌కు చోటు కల్పించారు. దీంట్లో అశ్విన్‌తో పాటు మరో ఇద్దరు యజమానులుగా ఉంటారు.

అతడితో ఐదేళ్లుగా మంధాన డేటింగ్!



బెంగళూరు: టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతీ మంధానాకు సంబంధించిన ఓ అనూహ్య విషయం బయటకు వచ్చింది. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్‌తో ఆమె ఐదేళ్లనుంచి రిలేషన్‌షిప్ కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని ముచ్చల్ స్వయంగా వెల్లడించాడు. తమ అనుబంధానికి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఫొటోను అతడు ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. ఈ చిత్రానికి 'హృదయాల' ఎమోజీతో స్పందిస్తూ తమ రిలేషన్‌షిప్‌ను టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి ధ్రువీకరించింది. 'మై క్యూటీస్' అంటూ పలాష్ సోదరి పాలక్ ఆ ఫొటోపై వ్యాఖ్యానించింది. పలాష్, మంధాన డేటింగ్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలను వారు తొలిసారి ధ్రువీకరించారు.

ఎవరీ పలాష్ ముచ్చల్?

29 ఏళ్ల పలాష్ మ్యూజిక్ కంపోజర్, నటుడు. అశుతోష్ గోవారికర్ దర్శకత్వంలో వచ్చిన 'ఖేలే హమ్ జీ జాన్ సే' అనే చిత్రంలో అభిషేక్ బచ్చన్, దీపికా పదుకోన్‌తో కలిసి నటించాడు. రిక్షా, అర్ధ్ అనే వెబ్ సిరీస్‌లను పలాష్ డైరెక్ట్ చేశాడు. పలాష్ అక్క పాలక్ ముచ్చల్ బాలీవుడ్ గాయని.

ఫైనల్ బెర్త్ ఎవరిదో?

స్పెయిన్ x ఫ్రాన్స్ 'యూరో' సెమీస్ నేడు

రా. 12.30 నుంచి సోనీలో..



మ్యూనిచ్: యూరోపియన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్స్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న స్పెయిన్.. రికార్డుస్థాయిలో నాలుగోసారి ఫైనల్ చేరాలనే పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి జరిగే తొలి సెమీస్‌లో మరో బలమైన జట్టు ఫ్రాన్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఇప్పటి వరకు టోర్నీలో ఇరుజట్ల ప్రదర్శన భిన్నంగా సాగింది. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ స్పెయిన్ విజేతగా నిలిచింది. క్వార్టర్స్‌లో పటిష్ఠ జర్మనీని ఓడించి సత్తా చాటింది. స్ట్రయికర్లు అల్వారో విలియమ్స్, ఓమ్లో, లామిన్ యమల్, అల్వారో మొరాటా ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు టోర్నీలో ఫ్రాన్స్ ఇప్పటి వరకు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. ఆ టీమ్ ఆటగాడు ఎవరూ నేరుగా ఒక్క గోల్ కూడా చేయలేదు. ఏవైనా గోల్స్ నమోదయ్యాయంటే అవి సెల్ఫ్ గోల్స్ లేదా పెనాల్టీ షూటౌట్‌ల ద్వారా వచ్చినవే. గాయపడిన స్టార్ ప్లేయర్ ఎంబప్పే దూకుడుగా ఆడలేకపోవడం కూడా మైనస్‌గా మారింది. క్వార్టర్స్‌లో పోర్చుగల్‌పై షూటౌట్‌లో నెగ్గింది. పైగా ఇటీవలి కాలంలో స్పెయిన్ చేతిలో ఫ్రాన్స్ కంగుతిన్న సందర్భాలే ఎక్కువ.

వింబుల్డన్



గాఫ్ మరో 'సారీ'

నాలుగో రౌండ్‌లో ఓటమి

రెండో సీడ్‌కు షాకిచ్చిన నవారో

జ్వెరెవ్ కూడా ఇంటిబాట



లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ మహిళల విభాగంలో సంచలనాలపై సంచలనాలు చోటుచేసుకుంటున్నాయి. మొన్న డిఫెండింగ్ చాంపియన్ ఒండ్రుసోవా, నిన్న టాప్‌సీడ్ స్వియటెక్ తిరుగుముఖం పడితే..ఈసారి రెండో సీడ్ కోకో గాఫ్ పోరాటం ముగిసింది. ఇక పురుషుల్లో నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ కూడా ఇంటిబాట పట్టాడు. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అమెరికాకే చెందిన 19వ సీడ్ ఎమ్మా నవారో వరుస సెట్లలో 6-4, 6-3తో టైటిల్ ఫేవరెట్, అమెరికా స్టార్ కోకో గాఫ్‌కు షాకిచ్చింది. దాంతో ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో గాఫ్ మరోసారి నాలుగో రౌండ్ గండాన్ని దాటలేకపోయింది. గతంలో రెండుసార్లు (2019, 2021) ఆమె నాలుగో రౌండ్‌లోనే పరాజయం చవిచూడడం గమనార్హం. గాఫ్ ఓటమి దరిమిలా ఇక మహిళల సింగిల్స్‌లో టాప్-10 క్రీడాకారిణుల్లో ఇద్దరే బరిలో మిగిలారు. నాలుగో సీడ్ రిబకినా, ఏడో సీడ్ జాస్మిన్ పోలిని మాత్రమే పోటీలో ఉన్నారు. పోలిని ఇప్పటికే ప్రీక్వార్టర్స్ చేరగా..ప్రత్యర్థి కలిన్‌స్కయా వాకోవర్ ఇవ్వడంతో నాలుగో సీడ్ రిబకినా క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టిన నవారో.. ఏడోసీడ్ పోలినితో అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల సింగిల్స్ ఇతర రౌండ్-16 మ్యాచ్‌లలో లులు సున్ 6-2, 5-7, 6-2తో లోకల్ స్టార్ ఎమ్మా రదుకానును ఓడించింది. ఈ విజయంతో లులు సున్ వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్ చేరిన తొలి న్యూజిలాండ్ క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ఇతర మ్యాచుల్లో 13వ సీడ్ జెలెనా ఓస్టాపెంకో 6-2, 6-3తో పుతిన్‌త్సెవాపై, 21వ సీడ్ స్విటోలినా 6-2, 6-1తో వాంగ్ గ్జినుపై విజయం సాధించి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

జ్వెరెవ్‌కు టేలర్ ఝలక్

ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ జ్వెరెవ్‌కు నాలుగోరౌండ్లో అనూహ్య షాక్ తగిలింది. అమెరికాకు చెందిన 13వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 4-6, 6-7(7), 6-4, 7-6(3), 6-3తో జ్వెరెవ్‌కు ఝలకిచ్చి ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో రెండోసారి క్వార్టర్స్‌లో అడుగు పెట్టాడు. ఇక, నాలుగో రౌండ్‌లో 9వ సీడ్ డిమినార్ 6-2, 6-4, 4-6, 6-3తో ఆర్థర్ ఫిల్స్‌పై, 27వ సీడ్ ముసేటి 4-6, 6-3, 6-3, 6-2తో పెరీకార్డ్‌పై నెగ్గారు.

గెలవాల్సిందే!

సిరీస్ సమంపై హర్మన్ సేన దృష్టి

జోష్‌లో దక్షిణాఫ్రికా

రాత్రి 7 నుంచి స్పోర్ట్స్ 18లో

నేడు ఆఖరి టీ20



చెన్నై: దక్షిణాఫ్రికాతో వన్డే, టెస్టు సిరీస్‌లో పూర్తిగా ఆధిపత్యం ప్రదర్శించిన భారత మహిళల జట్టు టీ20ల్లో మాత్రం వెనుకబడింది. ఇప్పటికే తొలి మ్యాచ్‌ను కోల్పోగా.. రెండో మ్యాచ్ వర్షార్పణమైంది. సఫారీల ఇన్నింగ్స్ సజావుగానే సాగినా.. భారత్ మాత్రం బరిలోకి దిగలేకపోయింది. అందుకే నేడు జరిగే ఆఖరి మ్యాచ్ హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి చావోరేవో లాంటిదే. ఈ మ్యాచ్ గెలిస్తేనే సిరీస్‌ను సమం చేసుకుని, ఓటమి లేకుండా మూడు ఫార్మాట్లనూ ముగించినట్టవుతుంది. ఇది జరగాలంటే వాతావరణం సహకరించడమే కాదు.. జట్టు బౌలింగ్ తీరు కూడా మారాల్సి ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో వీరి పేలవ ప్రదర్శనతో ప్రత్యర్థి 189, 177 పరుగులు చేసింది. పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ మినహా అంతా తేలిపోయారు. శ్రేయాంక, రాధా యాదవ్ చెరో వికెట్ తీసినా పరుగులు నియంత్రించలేకపోయారు. ఈనేపథ్యంలో సిరీస్ ప్రమాదంలో ఉంది కాబట్టి బౌలర్లు రాణించక తప్పదు. అటు బ్యాటింగ్‌లో ఓపెనర్ స్మృతి మంధాన, జెమీమా, హర్మన్ కీలకంగా మారారు. అయితే యువ ఓపెనర్ షఫాలీ ఆశించిన మేర ఆకట్టుకోలేకపోయింది. మరోవైపు దక్షిణాఫ్రికా తరపున ఓపెనర్ బ్రిట్స్ రెండు హాఫ్ సెంచరీలతో ఫామ్‌లో ఉంది. వోల్వార్ట్, కాప్, బోష్ తమ వంతుగా పరుగులు సాధిస్తున్నారు. ఇదిలావుండగా మంగళవారం వర్షం కురిసే అవకాశం 40 శాతంగా ఉండడంతో ఈ మ్యాచ్‌కు ఆటంకం కలిగే అవకాశం లేకపోలేదు.

ఎందుకీ వివక్ష?

మహారాష్ట్ర ప్రభుత్వంపై చిరాగ్ ఫైర్



న్యూఢిల్లీ: క్రికెట్టేతర క్రీడలపట్ల మహారాష్ట్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోందని టాప్ షట్లర్ చిరాగ్ షెట్టి విమర్శించాడు. టీ20 వరల్డ్‌కప్ గెలిచిన టీమ్‌లోని ముంబైకర్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్, శివమ్ దూబే, యశస్వి జైస్వాల్‌ను షిండే ప్రభుత్వం సన్మానించింది. అయితే, మిగతా క్రీడల పట్ల వివక్ష ప్రదర్శించడాన్ని డబుల్స్ టాప్ ప్లేయర్ షెట్టి తప్పుబట్టాడు. 2022లో భారత జట్టు ప్రతిష్ఠాత్మక థామస్ కప్‌ను నెగ్గినప్పుడు మహారాష్ట్ర ఆటగాడిగా తనను రాష్ట్ర ప్రభుత్వం గౌరవించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. 'ప్రభుత్వం ఇతర క్రీడలను చిన్నచూపు చూస్తోంది. థామస్ కప్ కూడా వరల్డ్‌కప్‌తో సమానం. రాష్ట్ర ప్రభుత్వం అన్ని క్రీడలను సమంగా చూడాల'ని అన్నాడు.

ఒక్కో క్రికెటర్‌కు రూ. 5 కోట్లు

బోర్డు ప్రైజ్‌మనీ పంపిణీ

ముంబై: టీ20 వరల్డ్‌కప్ విజేత భారత జట్టుకు బీసీసీఐ ప్రకటించిన రూ.125 కోట్ల నజరానాలో ఎవరికి ఎంత దక్కనుందో స్పష్టత వచ్చింది. ఈ మెగా టోర్నీ కోసం భారత జట్టు తరఫున మొత్తం 42 మంది వెళ్లగా, ఇందులో 15 మంది క్రికెటర్లకు రూ.5 కోట్ల చొప్పున అందనుంది. కోచ్ ద్రవిడ్‌తో పాటు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లకు రూ.2.5 కోట్ల చొప్పున, 8 మంది సహాయక సిబ్బందికి రూ.2 కోట్ల చొప్పున ఇస్తారు. ఐదుగురు సెలెక్షన్ కమిటీ సభ్యులకు, నలుగురు రిజర్వ్ ఆటగాళ్లకు రూ. కోటి చొప్పున దక్కనుంది. ఇక, టీమ్ వీడియో విశ్లేషకుడు, మీడియా అధికారులు, లాజిస్టిక్స్ మేనేజర్ కూడా ప్రైజ్‌మనీలో భాగం కానున్నారు.

లంక తాత్కాలిక కోచ్‌గా జయసూర్య

కొలంబో: శ్రీలంక క్రికెట్ జట్టు తాత్కాలిక కోచ్‌గా సనత్ జయసూర్యను ఎంపిక చేశారు. టీ20 వరల్డ్‌కప్‌లో జట్టు వైఫల్యంతో కోచ్ సిల్వర్‌వుడ్ రాజీనామా చేశాడు. త్వరలో భారత్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు లంక కోచ్‌గా జయసూర్య వ్యవహరిస్తాడు.



చెఫ్ డి మిషన్‌గా నారంగ్

పతాకధారిగా సింధు

పారిస్ ఒలింపిక్స్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత క్రీడా బృందానికి చెఫ్ డి మిషన్‌గా దిగ్గజ షూటర్ గగన్ నారంగ్ నియమితుడయ్యాడు. గతంలో మేరీకోమ్‌ను ఎంపిక చేసిన భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), ఆమె స్థానంలో గగన్ పేరును ప్రతిపాదించింది. ఆరంభ వేడుకల్లో భాగంగా జరిగే మార్చ్‌పాస్ట్‌లో భారత మహిళల బృందానికి పతాకధారిగా పీవీ సింధు పేరును ఐఓఏ ఖరారు చేసింది. వెటరన్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ శరత్‌కమల్‌తో కలిసి సింధు మార్చ్‌పాస్ట్‌లో భారత బృందాన్ని ముందుకు నడిపించనుంది. ప్రధాన పతాకధారిగా శరత్ పేరును ఐఓఏ ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక, చెఫ్ డి మిషన్‌గా ఉన్న మేరీకోమ్ అనూహ్యంగా ఆ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించడంతో డిప్యూటీ చెఫ్ డి మిషన్‌గా ఉన్న గగన్‌ను ఆ పదవిలో నియమించామని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపింది.

జగజ్జేతలకు మాల్దీవుల ఆహ్వానం

మాలె: టీ20 వరల్డ్‌కప్ విజేతగా నిలిచిన భారత్‌కు మాల్దీవులు రెడ్‌కార్పెట్ పరిచింది. పొట్టికప్ విజయోత్సవ సంబరాలను తమ దేశంలో నిర్వహించుకోవాల్సిందిగా ఆహ్వానం పంపింది. టీమిండియాకు ఆతిథ్యం ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నామని ఆ దేశ పర్యాటక శాఖ తెలిపింది. కాగా, ప్రధాని నరేంద్ర మోదీని పరుషంగా విమర్శించడంతో.. ఆ దేశ పర్యాటకాన్ని నిషేధించాలన్న పిలుపు బలంగా వినిపించింది. దీంతో అక్కడకు వెళ్లే భారత టూరిస్టుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. మళ్లీ పర్యాటకులను ఆకర్షించాలన్న ఎత్తుగడతోనే టీమిండియాకు ఆహ్వానం పలికారని నెటిజన్లు విమర్శిస్తున్నారు.

ట్రూఅప్ రూ.17,137కోట్లపైనే పేచీ

▸ నేడు ఇంధనరంగంపై శ్వేతపత్రం విడుదల

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వ పాలనకు సంబంధించి... 2022-23లోని రూ.8,114 కోట్లు, 2023-24లోని రూ.9,023 కోట్లు... మొత్తంగా రూ.17,137 కోట్ల ట్రూఅప్ చార్జీల భారాన్ని ఎవరు మోయాలన్నదానిపై సందిగ్ధత నెలకొంది. ఇక.. గత ప్రభుత్వం చెల్లించాల్సిన సబ్సిడీ మొత్తం రూ.14,479 కోట్ల చెల్లింపులపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం ఎలా ఉంటుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. మంగళవారం చంద్రబాబు ఇంధనరంగంపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. దీన్ని సోమవారమే విడుదల చేయాల్సి ఉన్నా.. ఒకరోజు వాయిదా పడింది. విద్యుత్తు పంపిణీ సంస్థలు ఈ ఏడాది మే నాటికి రూ.53,560 కోట్ల రుణాలను కలిగి ఉన్నాయి. రూ.34,090 కోట్ల నష్టాల్లో ఉన్నాయి. ఒకవైపు అప్పులు..మరోవైపు నష్టాల్లో కూరుకుపోయిన ఇంధనరంగాన్ని గాడిలో పెట్టడంపై చంద్రబాబు దృష్టి సారించనున్నారు.

పాక పాఠశాలకు పక్కా భవనం

▸ గిరిజన పిల్లల కోసం లోకేశ్ మంజూరు



అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజనులు తమ పిల్లల చదువు కోసం పాక నిర్మించుకున్న ఘటనపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పాఠశాల కోసం పక్కా భవనాన్ని నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ముంచింగిపుట్టు పరిధిలోని కిండుగూడాలో గిరిజనులు తమ పిల్లల చదువుల కోసం ఓ పాక నిర్మించుకున్నారు. పవన్ అనే జర్నలిస్టు దీనిని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇది మంత్రి దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు. పక్కా భవనాన్ని నిర్మించాలని ఆదేశించారు.

ఎక్స్‌లో ట్రెండింగ్.. దివ్యాంగ విద్యార్థుల సమస్యను త్వరగా పరిష్కరించి వారికి జాతీయ విద్యా సంస్థల్లో సీట్లు వచ్చేలా చేసిన మంత్రి లోకేశ్ సోమవారం ఎక్స్‌లో హాట్‌టాపిక్ అయ్యారు. 'థాంక్యూ నారా లోకేశ్' అనే హ్యాష్‌ట్యాగ్ ఎక్స్‌లో టాప్ ట్రెండింగ్‌లోకి వెళ్లింది.

అనర్హతపై హైకోర్టుకు ఎమ్మెల్సీ జంగా

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): అనర్హత వేటుకు గురయిన వైసీపీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేస్తూ ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయవద్దని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని శాసన మండలి కార్యదర్శి, మండలి చైర్మన్, విప్ లేళ్ల అప్పిరెడ్డికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు... విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. 'ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు' అంటూ శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా జంగా కృష్ణమూర్తిపై అనర్హత వేటు వేస్తూ శాసన మండలి చైర్మన్ గత నెల 15న ఉత్తర్వులు ఇచ్చారు. దానిని సవాల్ చేస్తూ జంగా కృష్ణమూర్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది గింజుపల్లి సుబ్బారావు వాదనలు వినిపించారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున న్యాయవాది సత్యశివదర్శన్ వాదనలు వినిపించారు.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

▸ హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి వ్యవహారంలో నమోదైన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలన్న అప్పిరెడ్డి అభ్యర్థనను తోసిపుచ్చింది. విచారణను ఈనెల 10కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... పిటిషనర్‌కు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. న్యాయమూర్తి విచారణను ఈ నెల 10కి వాయిదా వేశారు.

కొడాలి కేసులో 41ఏ ఇవ్వండి: హైకోర్టు

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): వలంటీర్ల ఫిర్యాదు ఆధారంగా వైసీపీ నేత కొడాలి నానిపై నమోదు చేసిన కేసులో సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ)నిబంధనలు పాటించాలని గుడివాడ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అర్నేశ్ కుమార్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని స్పష్టం చేసింది. ప్రతివాదులు నోటీసులు జారీ చేస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్ ఉద్యోగాలకు రాజీనామా చేయాలని మాజీ మంత్రి కొడాలి నాని తమను బెదిరించారని పలువురు వలంటీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ కొడాలి నాని హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది జి.రామకృష్ణ వాదనలు వినిపించారు.

ఆ స్థలంలోని నిర్మాణాలపై చర్యలు వద్దు: హైకోర్టు

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి, మారుతినగర్, వార్డు నం.23లోని వివిధ సర్వే నంబర్లలో మొత్తం 4.82 ఎకరాల తమ ప్రైవేటు భూమిలో జరిపిన నిర్మాణాల విషయంలో జోక్యం చేసుకోకుండా అధికారులను నిలువరించాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్యే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. సంబంధిత స్థలంలో నిర్మించిన సిమెంట్ రోడ్డును, రక్షణ కోసం నిర్మించిన గేటును తొలగించకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ వ్యాజ్యం సోమవారం లంచ్ మోషన్‌గా విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.... పిటిషనర్ల భద్రతను దృష్టిలో పెట్టుకొని అప్పట్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేశారన్నారు. అందుకు అయిన ఖర్చును కూడా కార్పొరేషన్‌కు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ న్యాయవాది వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. వివరాలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్... పిటిషనర్ల ప్రైవేటు ఆస్తి వ్యవహారంలో ఎలాంటి తొందరపాటు, చర్యలు తీసుకోవద్దని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

పెద్దిరెడ్డికి 2 ప్లస్ 2 భద్రత కల్పించాలి: హైకోర్టు

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మూడు వారాలు లేదా భద్రత రివ్యూ కమిటీ నిర్ణయం (ఎస్ఆర్‌సీ) వెల్లడించే వరకు 2 ప్లస్ 2 సెక్యూరిటీ కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ వేసేందుకు సమయం ఇస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి 2 ప్లస్ 2 సెక్యూరిటీ కల్పిస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై కూడా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. తనకు 5 ప్లస్ 5 సెక్యూరిటీని కొనసాగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ పెద్దిరెడ్డి వ్యాజ్యందాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

22 నుంచి అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఐదు రోజులపాటు ఇవి జరిగే అవకాశం ఉందని సమాచారం. ఆనవాయితీ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో ఇవి ప్రారంభమవుతాయి. తర్వాత రెండు రోజులపాటు ఆయన ప్రసంగంపై సభలో చర్చ జరిపి దానిని ఆమోదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేత పత్రాలను ఈ సమావేశాల్లో సభ ముందు ప్రవేశపెడతారు. మూడు రోజులపాటు వాటిపై కూడా చర్చ జరుగుతుంది. ఐదు రోజుల చర్చతో ఈ సమావేశాలు ముగుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ ఎకౌంట్‌ను మరో నాలుగు నెలలు పొడిగించే సూచనలు కనిపిస్తున్నాయి.

సరళ ప్రభుత్వం.. సమర్థ పాలన

ఇదే మా సర్కారు విధానం

▸ మీ సమస్య వినగానే చర్యలు ప్రారంభించాం

▸ దివ్యాంగ విద్యార్థులకు తెలిపిన మంత్రి లోకేశ్

అమరావతి(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి, జూలై 8: 'సరళమైన ప్రభుత్వం.. సమర్థ పాలన.. ఇదే మా విధానం' అని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. దేశం మొత్తం ఏపీ వైపు చూసేలా ఒక్క ఏడాదిలో అభివృద్ధి చేస్తామన్నారు. లోకేశ్ చొరవతో జాతీయ విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్ సీట్లు పొందిన దివ్యాంగ విద్యార్థులు సోమవారం ఉండవల్లిలో ఆయన్ను కలిశారు. సీట్లు కోల్పోకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించిన వారిని లోకేశ్ అభినందించారు. 'ఈ రోజు మిమ్మల్ని కలవడం నాకు చాలా సంతోషంగా ఉంది. మీరంతా చాంపియన్స్. హేట్సాఫ్. జాతీయ స్థాయిలో పేరున్న ఐఐటీ, ఎన్ఐటీల లో సీట్లు కొట్టడం అంత ఈజీ కాదు. దేవుడు పెట్టిన అన్ని పరీక్షల్లోనూ మీరు విజయం సాధించారు. ఇక మీకు తిరుగులేదు' అన్నారు. ఆయన సొంత ఖర్చుతో 25 మందికి ల్యాప్‌టాప్‌లు బహుమతిగా ఇచ్చారు. చదువు పూర్తయ్యాక అమరావతికి వచ్చి సేవ చేయాలని ఆ విద్యార్థులను కోరారు. వేగంగా దివ్యాంగ విద్యార్థులకు సర్టిఫికెట్లు వచ్చేలా చర్యలు చేపట్టిన ఉన్నతాధికారులు కోన శశిధర్, నిధి మీనాలను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 'మీ సమస్య నా దృష్టికి వచ్చిన వెంటనే అధికారులతో చర్చించాను. ఒక్క విద్యార్థికి కూడా అన్యాయం జరగకూడదని చెప్పా. ప్రత్యేక జీవో తేవాలని అధికారులన్నారు. ఆలస్యం చేయకుండా జీవో జారీచేశాం. దీంతో మీ 25 మందికి సీట్లు వచ్చాయి' అని లోకేశ్ వివరించారు. తనకు సవాళ్లంటే ఇష్టమని, అందుకే విద్యాశాఖను తీసుకున్నానని చెప్పారు. ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని, కేజీ టూ పీజీ విద్యలో సమూల మార్పులు తీసుకొస్తామని అన్నారు.



మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించిన దివ్యాంగ విద్యార్థులు



విద్యార్థికి లాప్‌టాప్ అందజేస్తున్న మంత్రి లోకేశ్

జగన్ పాలన మరో ఎమర్జెన్సీ!



బీజేపీ కార్యవర్గ సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు

▸ నోరు విప్పితే అట్రాసిటీ కేసులు పెట్టారు

▸ గుడులు కూల్చారు.. రథాలు కాల్చారు

▸ వైసీపీ పాలనపై నిప్పులు చెరిగిన పురందేశ్వరి

రాజమహేంద్రవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల జగన్ పాలన మరో ఎమర్జెన్సీని తలపించిందని, నోరు విప్పి ప్రశ్నించడమే పాపం అన్నట్టుగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి వేధించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నిప్పులు చెరిగారు. గుడులు కూల్చడంతోపాటు రథాలను కూడా కాల్చారని, ఇదేమని ప్రశ్నించిన వారిని జైళ్లలో పెట్టారని మండిపడ్డారు. గతంలో దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించిన ఇందిరా గాంధీ చీకటి పాలనను ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. అదేవిధంగా గత ఐదేళ్ల వైసీపీ పాలనను కూడా ప్రజలు మరిచిపోరని వ్యాఖ్యానించారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో బీజేపీ విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పురందేశ్వరి అధ్యక్షోపన్యాసం చేశారు. తాజా ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేస్తున్న ప్రకటనలపై ఆమె ఘాటుగా స్పందించారు. "గతంలో ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ గురించి ఇప్పటికీ మాట్లాడుకుంటున్నాం. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఇంచుమించు అలాంటి ఎమర్జెన్సీ వాతావరణమే నడిచింది. ఎవరు గళం విప్పినా వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి జైళ్లలో పెట్టారు. ఈ విషయాన్ని వైసీపీ నేతలు మరచిపోయారేమో కానీ రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. రాష్ట్రంలో విధ్వంసం జరుగుతోందని జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారు. బహుశా ఆయనకు జ్ఞాపకశక్తి సన్నగిల్లిందేమో. ఐదేళ్ల కిందట వైసీపీ అధికారం చేపట్టాక ప్రజావేదిక కూల్చివేత దగ్గర నుంచి అంతర్వేది రథం కాల్చివేత, పిఠాపురంలో ఆలయ విధ్వంసం వంటి ఎన్నో సంఘటనలు జరిగాయి. ఇవన్నీ విధ్వంసం కాదా?" అని పురందేశ్వరి నిప్పులు చెరిగారు.

డబులింజన్ సర్కారుతో అభివృద్ధి

ప్రధాని నరేంద్రమోదీ విజన్ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ అన్నారు. బీజేపీ విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మురుగన్ మాట్లాడుతూ.. డబులింజన్ సర్కార్ ద్వారా దేశంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగానే ఏపీలోనూ రాబోయే రోజుల్లో అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. సామాజిక న్యాయం చేయడంలో మోదీనే రియల్ హీరో అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలకు ముందు కొన్ని రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చిత్తుగా ఓడిపోయిందన్నారు. సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి పాల్గొన్నారు.

జగన్ విధ్వంసం అనంతం!

▸ సరిదిద్దేందుకు దశాబ్దాలు పడుతుంది

▸ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు

"గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా ధ్వంసమైంది. దీన్ని సరిచేసేందుకు దశాబ్దాల కాలం పడుతుంది" అని రాష్ట్ర మంత్రి, బీజేపీ నాయకుడు సత్యకుమార్ అన్నారు. బీజేపీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రంలోని ఎన్డీయే సర్కారు కట్టుబడి ఉందన్నారు. "గత ప్రభుత్వ చేతకానితనం వల్లే డయాఫ్రంవాల్ దెబ్బతింది. అమరావతికి మొదటి నుంచి బీజేపీ మద్దతు ఉంది. ఒకే రాజధాని అనేదే మా నినాదం. మొదట్లోనే కేంద్రం రూ.2,500 కోట్లు ఇచ్చింది" అని సత్యకుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో.. దేశంలో మూడోసారి ప్రధాని అయిన మోదీకి అభినందనలు తెలియజేస్తూ ఒక తీర్మానం, రాష్ట్రంలో అద్భుత ఫలితాన్నిచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ మరొక తీర్మానం చేసినట్టు వివరించారు.

జగన్ తప్పులను జనంలోకి తీసుకెళ్లండి

"ఇంట్లో కూర్చొవద్దు. వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు చేసిన తప్పిదాలను విస్తృతంగా జనంలోకి తీసుకువెళ్లండి. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పనులను కూడా ప్రజలకు చెప్పాలి" అని బీజేపీ జాతీయ, రాష్ట్ర స్థాయి సీనియర్ నాయకులు పార్టీ కేడర్‌కు హితబోధ చేశారు. జగన్ వల్లే రాష్ట్రం 30 ఏళ్ల వెనుక్కి వెళ్లిపోయిందన్నారు.

చెడ తిరుగుడు!

(మొదటి పేజీ తరువాయి)

'సలహాదారు'గా నియమించుకున్నారు. అందులో భాగంగానే ఆయనకు 'ఏపీ 16 టీజీ 0001' అనే ఇన్నోవాను కేటాయించారు. పాలన బాగుపడేందుకు, ప్రజలకు మేలు జరిగేందుకు ధనుంజయ రెడ్డి ఇచ్చిన సలహాలేమో తెలియదుకానీ... ఎన్నికల ముందు మాత్రం ఆయన కారు రాష్ట్రవ్యాప్తంగా చెడతిరిగింది. నిజానికి... మార్చి 16నే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దాని ప్రకారం ప్రజాప్రతినిధులు, సలహాదారులు, ఇతర వ్యక్తులు ప్రభుత్వ వాహనాలు వాడకూడదు. ఇదీ నిబంధన! ఏ రూల్‌నూ పట్టించుకోని జగన్ సర్కారు... దీనిని మాత్రం ఎందుకు పట్టించుకుంటుంది? ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత... ఏప్రిల్ నెలలో ధనుంజయ రెడ్డి ఇన్నోవా బీభత్సంగా తిరిగింది.

తనిఖీలు ఉండవనే.. గతంలో ఎన్నడూ లేనివిధంగా... జగన్ సర్కారు హయాంలో 'సీఎంవో' అని పెద్ద ఎర్ర అక్షరాలు రాసుకున్న ఇన్నోవాలు పెద్దసంఖ్యలో రోడ్ల మీద సంచరించేవి! వీటికి ఎదురులేదు. ఎవ్వరూ ఆపరు. 'సలహాదారు' ఆర్.ధనుంజయ రెడ్డి ఉపయోగించిన ఇన్నోవా కారుపైనా ఎర్ర అక్షరాలతో 'సీఎం సలహాదారు' అని బోర్డు ఉంటుంది. ఆ వాహనం ఎక్కడ తిరిగినా ఆపే వారు ఉండరు. దీంతో జగన్ అప్పగించిన పనికోసం సదరు సలహాదారు వాహనం ఏప్రిల్ నెలంతా రోజుకు సగటున 500 కిలోమీటర్లు తిరిగినట్లు సమాచారం! ఏప్రిల్‌లో రాష్ట్రంలో పూర్తిస్థాయి ఎన్నికల వేడి రాజుకుంది. జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో ప్రచారానికి, పంచడానికి 'డబ్బు మూటలు' చేరవేసేందుకే ధనుంజయ రెడ్డి వాహనాన్ని వాడుకున్నారా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. 30 రోజుల్లో 14,962 కిలోమీటర్లు... అంటే దాదాపు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల కేంద్రాలకు వెళ్లి రావొచ్చు. 'కాగల కార్యాన్ని' నెరవేర్చవచ్చు! తాడేపల్లి ప్యాలెస్ నుంచి రకరకాల మార్గాల్లో డబ్బు సంచులను తరలించారని, ఇందుకు ప్రభుత్వ వాహనాలనూ వాడుకున్నారనే అనుమానాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. దీనిని... ధనుంజయ రెడ్డి ఇన్నోవా 'ట్రిప్ మీటర్' బలపరుస్తోంది. ఇలాగా... 'సీఎంవో' ముద్రతో ఎన్నికల ముందు ఎన్ని వాహనాలు, ఎన్నెన్ని కిలోమీటర్లు తిరిగాయి? అందులో ఎవరు తిరిగారు? ఎక్కడికి తిరిగారు? ఏం చేశారు? దీనిపై విచారణ జరిపితేగానీ అసలు విషయం బయటికి రాదు.

ఎవరెవరివో ఆధార్‌లతో క్యూ

ఇసుక అవసరమో, లేదో తెలియదు

▸ లారీకి అదనంగా రూ.3 వేలట!

▸ గుంటూరుజిల్లాలో స్టాక్‌యార్డు వద్ద

▸ ఇసుక సరఫరాదారుల హల్‌చల్

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానాన్ని ఎంత పకడ్బందీగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చినా, అందులో చిల్లులను కొందరు సరఫరాదారులు వెతికి పట్టుకొని సొమ్ము చేసుకొనేందుకు అప్పుడే వ్యూహరచన మొదలుపెట్టారు. గుంటూరు జిల్లాలోని ఐదు స్టాక్‌యార్డుల వద్దకు ఇప్పటికే వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు క్యూ కట్టాయి. ప్రతీ వాహనదారుడి వద్ద ఎవరెవరివో ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లు, చిరునామాలు ఉన్నాయి. వాటిని చూపించి ఇసుక లోడింగ్ చేయాల్సిందిగా కోరుతున్నారు. అయితే లారీ డ్రైవర్లు సమర్పిస్తున్న ఆధార్, ఫోన్ నంబర్లు కలిగిన వారికి వాస్తవంగా ఇసుక అవసరమో, లేదో తెలియని పరిస్థితి. ఉచిత ఇసుక విధానంలో రోజుకు 20 టన్నుల వరకు ఇసుకని ఉచితంగా స్టాక్‌యార్డు నుంచి తీసుకెళ్లొచ్చన్న ఒక్క నిబంధన ఉంది. దాన్ని ఆసరాగా చేసుకొని సరఫరాదారులు సొమ్ము చేసుకొనే పనిలో పడ్డారు. వివరాల్లోకి వెళితే... గుంటూరు జిల్లాలో తాళ్లాయపాలెం, లింగాయపాలెం, మున్నంగి, కొల్లిపర, గుండిమెడలో స్టాక్‌యార్డులు ఉన్నాయి. వీటిల్లో ఇసుక నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. ఈ ఐదు చోట్లే దాదాపుగా 9 లక్షల 25 వేల 372.45 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నది. గుంటూరు జిల్లాలో నిర్మాణ రంగ అవసరాలకు ఈ నిల్వలు సుమారు రెండు నెలలకు పైగా సరిపోతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే కొందరు ఇసుక సరఫరాదారులు ఉచిత ఇసుక విధానంలోనూ ప్రవేశించి సొమ్ము చేసుకొనేందుకు వ్యూహరచన చేస్తున్నారు. తొలుత తమ కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లు, మొబైల్ నెంబర్లను స్టాక్‌యార్డులో ఇచ్చి టన్నుకు రూ. 250 చొప్పున లోడింగ్ చార్జీలు చెల్లించి గుంటూరు నగరానికి తీసుకొచ్చి బ్లాక్‌లో అమ్మేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. 20 టన్నులకు స్టాక్‌యార్డు వద్ద రూ. 5,000 చెల్లిస్తే సరిపోతుంది. ఇక రవాణ చార్జీలు 45 కిలోమీటర్ల వరకు అయితే 10 టైర్ లారీకి రూ. 7,500, 12 టైర్ లారీకి అయితే రూ. 8 వేలు నిర్ణయించారు. ఆ మేరకు రూ. 12,500 నుంచి రూ. 13 వేల వరకు అవుతుంది. ఈ మొత్తానికి అదనంగా మరో రూ. 3 వేలకు పైగా జోడించి రూ. 15,500 నుంచి రూ. 16 వేలకు లారీ ఇసుకని విక్రయించేందుకు నిమగ్నమయ్యారు. గతంలో ఏదైనా నిర్మాణం జరుగుతుంటే దానికి సంబంధించిన బిల్డింగ్ ప్లాన్ జత చేయమనేవారు. దాని ప్రకారం ఆ భవన నిర్మాణానికి ఇసుక ఎంత అవసరమౌతుందో లెక్కించి ఆ మేరకు సరఫరా చేసేవారు. ఇప్పుడు ఎలాంటి నిబంధన లేకుండా కేవలం ఆధార్ నంబరు ఉంటే చాలు రోజుకు 20 టన్నుల ఇసుక తీసుకెళ్లొచ్చన్న నిబంధన దుర్వినియోగమయ్యే ప్రమాదముంది.

అక్రమ నిల్వలపై విచారణకు స్పీకర్ ఆదేశం

నర్సీపట్నం, జూలై 8: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో ఇసుక అక్రమ నిల్వలపై విచారణ జరపాలని అధికారులను శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. సుమారు 65 వేల టన్నుల ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. దొంగను పట్టుకోకుండా డిపోలోని ఇసుకను బయటకు సరఫరా చేస్తే సాక్ష్యాలు కనుమరుగవుతాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్డీవో, ఇతర అధికారులు తక్షణమే విచారణ ప్రారంభించాలని ఆదేశించారు.

అమల్లోకి ఉచిత ఇసుక

▸ మధ్యంతర ఇసుక పాలసీ విడుదల

▸ జీవో 43ను జారీ చేసిన ప్రభుత్వం

▸ జగన్ హయాం పాలసీల ఉపసంహరణ

▸ ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీలతో కాంట్రాక్టు రద్దు

▸ ఇకపై ప్రైవేటు అమ్మకాలు బంద్

▸ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిపోల్లోనే ఇసుక

▸ అమలుకు మూడంచెల పర్యవేక్షణ

▸ బ్లాక్ అమ్మకాలకు పాల్పడితే కఠిన శిక్ష, జరిమానా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుకను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తరలివచ్చి ఉచితాన్ని ఆరంభించారు. సర్కారు మధ్యంతర ఇసుక పాలసీని ప్రకటిస్తూ జీవో నం. 43ను జారీ చేసింది. దీంతో ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చింది. అయితే ఇది పూర్తిస్థాయి పాలసీ కాదు. త్వరలో సమగ్ర పాలసీ రానుంది. అయితే, మధ్యంతర పాలసీ ప్రజలెదుర్కొంటున్న ఇసుక కష్టాలను తీర్చనుంది. ప్రైవేటు అమ్మకాలు, అడ్డగోలు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాను చట్టబద్ధంగా అరికట్టేలా మార్గదర్శకాలు ఇచ్చారు. ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జగన్ సర్కారు తీసుకొచ్చిన 2019, 2021 ఇసుక పాలసీలను ప్రభుత్వం ఉపసంహరించింది. దీని ప్రకారం ఇసుక అమ్మకాల కాంట్రాక్టు రద్దయింది. అలాగే, 18 జిల్లాల్లో ప్రతిమ ఇన్‌ఫ్రా, ఎనిమిది జిల్లాల పరిధిలో జీసీకేసీ కంపెనీలతో గనుల శాఖ అప్పట్లో కుదుర్చుకున్న ఇసుక తవ్వకాలు, అమ్మకం కాంట్రాక్ట్ కూడా రద్దయిపోయింది. ఈ మేరకు ఒప్పందాల రద్దుకు అవసరమైన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని గనుల శాఖ కార్యదర్శి యువరాజ్ మెమో జారీ చేశారు. అయితే, ఆ ఒప్పందం నుంచి తామే స్వచ్ఛందంగా వైదొలగుతామని ఆ రెండు కంపెనీల ప్రతినిధులు... గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి లిఖితపూర్వక నివేదిక ఇచ్చారు. దీంతో సోమవారం నుంచి ఇసుక తవ్వకాలు, అమ్మకాలు, నిల్వలు, రవాణా వంటి అంశాల్లో ఆ కంపెనీలు వేలుపెట్టడానికి వీల్లేదు. ఇప్పటికే వాటి నియంత్రణలో ఉన్న ఇసుక డంప్‌లను, స్టోరేజీ యూనిట్లను రెవెన్యూ అధికారుల సమక్షంలో గనుల శాఖ స్వాధీనం చేసుకుంది.



పాలసీ ముఖ్యాంశాలు.....

ఇసుక పాలసీ 2016, 2019, అప్‌గ్రేడ్ చేసిన పాలసీ 2021ని చంద్రబాబు ప్రభుత్వం సమీక్షించింది. పర్యావరణ పరిరక్షణ, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ఇప్పుడు సమగ్రమైన ఇసుక పాలసీ అవసరమని ప్రభుత్వం గుర్తించింది. దీంట్లో భాగంగా ఏం చేయాలో గనుల శాఖ డైరెక్టర్ కొన్ని ప్రతిపాదనలు చేశారు. వాటిని పరిగణనలోకి తీసుకొని, ప్రభుత్వం ఎలాంటి ఆదాయం ఆశించకుండా ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలని నిర్ణయించింది. ఉచిత ఇసుక నిర్వహణ (ఆపరేషనల్)కయ్యే ఖర్చులు వినియోగదారులే భరించాలి. అలాగే చట్టపరమైన ఫీజులు (సీనరేజీ, జీఎస్టీ)వినియోగదారులు భరించాలి.

నేరాలు... శిక్షలు

వాహనం	తొలిసారి జరిమానా	రెండో దఫా జరిమానా
ట్రాక్టర్	రూ.10వేల వరకు	రూ.10,001 నుంచి రూ.20వేల వరకు
10 టైర్ల లారీ	రూ.25వేల వరకు	రూ.25,001 నుంచి రూ.50వేల వరకు
10 కంటే ఎక్కువ టైర్లు ఉండే లారీ	రూ.50వేల వరకు	రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు
మెషినరీ (తవ్వకాలు జరిపేవి)	రూ.50వేల వరకు	రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు
ఎద్దుల బండి	రూ.2000	రూ.3000

ఎద్దుల బండి పదేపదే అక్రమ రవాణాలో దొరికితే 5వేలరూపాయల మేర ఫైన్ విధించాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా, అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాలో వాహనాలు రెండు దఫాలకంటే ఎక్కువగా పట్టుబడితే వాటిని వెంటనే సీజ్‌చేసి కొత్త న్యాయచట్టాల ప్రకారం కోర్టుముందు ఉంచాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఇవే లక్ష్యాలు....

ఉచిత ఇసుక అందించడానికి వెనక కొన్ని ప్రధాన లక్ష్యాలున్నాయని సర్కారు తన పాలసీలో పేర్కొంది. అవి... 1. ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచడం, ఇంకా సరైన ధరలకే లభించేలా చూడటం ప్రధాన లక్ష్యం. 2. ఇసుక వ్యవహారాల్లో పారదర్శకత, వాస్తవాలు కనిపించేలా చేయడం. 3. పూర్తిస్థాయి విజిలెన్స్, పర్యవేక్షణ ద్వారా అక్రమ ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాను అరికట్టడం. 4. సుప్రీం కోర్టు, హైకోర్టు, జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలు, మార్గదర్శకాలమేరకు పర్యావరణ పరిరక్షణకు లోబడే ఇసుక తవ్వకాలు ఉంటాయి. కాగా, ఉచిత ఇసుక విధానం అమలు, పర్యవేక్షణకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) ఏర్పాటు చేస్తారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కన్వీనర్‌గా ఉంటే ఈ కమిటీలో జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీ, సబ్‌కలెక్టర్ లేదా ఆర్‌డీఓ, జిల్లా సెబ్ అధికారిచ జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ), ఆర్‌టీఓ, భూగర్భ వనరుల విభాగం డీడీ, జలవనరుల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఈఈ), గ్రామీణ నీటి పారుదల విభాగం ఈఈ, పీసీబీ పర్యావరణ ఇంజనీర్, జిల్లా కలెక్టర్ సిఫారసు చేసే ఇతరులు సభ్యులుగా ఉంటారు.

విశాల ప్రజాప్రయోజనాల కోసం....

"నిర్మాణ రంగానికి ఇసుక అనేది ప్రధాన వనరు. నిర్మాణ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీ సంఖ్యలో ప్రజలు ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఇసుక ధరపై సరైన నియంత్రణ లేకపోతే సామాజిక, ఆర్థిక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపిస్తుంది. ఉపాధి, పారిశ్రామిక రంగాలు దెబ్బతింటాయి. సాగునీటి పనులు, మౌలిక వనరుల ప్రాజెక్టులు, రాజధాని భవనాల నిర్మాణం, ఇతర నిర్మాణ రంగానికి మౌలిక వనరు అయిన ఇసుక సాధ్యమైనంత తక్కువ ధరకు లభించేలా చూడటం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత. కాబట్టి సామాజిక ఆర్థిక రంగంపై ఎలాంటి విపరీత ప్రభావం చూపకుండా ఉండేందుకు, విశాల ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఇసుక అందరికీ అందుబాటులో ఉంచడం అవసరం." అని ప్రభుత్వం పేర్కొంది.

ఇసుక ధరల నిర్ణయం ఇలా..

ప్రభుత్వం.... ఇసుక సరఫరా నుంచి ఎలాంటి ఆదాయం తీసుకోదు. అయితే, ఇసుక నిర్వహణకయ్యే ఖర్చును వినియోగదారులే భరించాలి.

1. నిర్వహణ చార్జీలు అంటే, ఇసుక తవ్వకాలు, వాహనాల్లో ఇసుకను లోడింగ్ చేయడం, రీచ్ నుంచి డిపోకు లారీల్లో రవాణా చేసినందుకు అయ్యే రవాణా చార్జీలు, రీచ్‌ల్లో ర్యాంప్ రక్షణ, ఇతర పరిపాలనా ఖర్చులుంటాయి.
2. చట్టబద్ధమైన ఫీజులు, పన్నులు వినియోగదారులే భరించాలి. అవేమంటే ఏపీ మినరల్ మైన్స్ కన్సెషన్ రూల్స్-1966 ప్రకారం గ్రామ పంచాయతీలకు సీనరేజీ ఫీజులు, జిల్లా మినరల్ ఫండ్ (డీఎమ్ఎఫ్) ఖనిజాల అన్వేషణ, పరిశోధన (మెరిట్) ఫీజులతోపాటు జీఎస్టీని వినియోగదారులు చెల్లించాలి.

ఉచిత ఇసుక ఎలా తీసుకోవాలి...

గృహనిర్మాణం కోసం ఇసుక అవసరం ఉన్నవారు సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాండ్ డిపోకు వెళ్లాలి. తన ఆధార్, ఫోన్ నంబర్, ఇసుక డెలివరీ చేయాల్సిన అడ్రస్, వాహనం నెంబరు వంటివి సమర్పించాలి. ఆ తర్వాత అధికారి నిర్ణయించే చట్టబద్ధమైన ఫీజులను ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఈ చెల్లింపుల కోసం డిపోల్లో ప్రభుత్వ ఖాతాలకు సంబంధించిన క్యూఆర్‌కోడ్‌లు ఏర్పాటుచేశారు. వినియోగదారులు తమ ఫోన్‌ద్వారా స్కాన్‌చేసి ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, యూపీఐబీమ్ ద్వారా ఫీజులు చెల్లించవచ్చు. ఎవరు ముందుగా వస్తే వారికే ప్రాధాన్యత తరహాలో స్టాక్ లభ్యతను బట్టి ఇసుక కేటాయిస్తారు. ఇసుక డిపోలు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకే పని చేస్తాయి. ప్రభుత్వ డిపోలో కొన్న ఇసుకను తరలించేందుకు వినియోగదారుడే వాహనాలను సమకూర్చుకోవాలి. ఇంటి నిర్మాణం కోసమే ఇసుక తీసుకోవాలి. ఈ విధానం అమలుకు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌లు(డీఎల్‌టీఎఫ్) ఏర్పాటు చేస్తారు. ఇబ్బందులు, ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్, ఈమెయిల్ ఐడీలను ఏర్పాటు చేయనున్నారు.



ఇడుపులపాయలో వైఎస్‌కు నివాళులర్పిస్తున్న షర్మిల, అనిల్, పక్కన విజయమ్మ

వేర్వేరుగా నివాళులు

- ఉదయాన్నే వచ్చి వైఎస్ సమాధి వద్ద జగన్ ప్రార్థనలు
- ఆ తర్వాత వచ్చి నివాళులు అర్పించిన పీసీసీ చీఫ్ షర్మిల

కడప, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతినాడు ఇడుపులపాయలోని ఆయన సమాధి సాక్షిగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆయన సోదరి, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి మధ్య విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా సోమవారం ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద వారిద్దరూ వేర్వేరుగా నివాళులర్పించారు. జగన్ శనివారమే పులివెందులకు రాగా.. జయంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు షర్మిల, ఆమె భర్త బ్రదర్ అనిల్‌కుమార్, కొడుకు రాజారెడ్డి, కోడలు, కూతురు, తల్లి విజయలక్ష్మితో కలిసి ఆదివారం రాత్రి ఇడుపులపాయకు చేరుకున్నారు. అన్నాచెల్లెళ్లు కలిసి నివాళులర్పిస్తారని అటు కాంగ్రెస్ వర్గాలు, ఇటు వైసీపీ వర్గాలు వెల్లడించాయి. అయితే అందుకు భిన్నంగా జరిగింది. జగన్ సోమవారం ఉదయం 7.30 గంటలకు తన భార్య భారతి, ఎంపీ అవినాశ్‌రెడ్డి, మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మరికొందరితో కలిసి పులివెందుల నుంచి ఘాట్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే తల్లి విజయలక్ష్మి, మరికొందరు బంధువులు అక్కడ ఉన్నారు. వారితో కలిసి జగన్ నివాళులర్పించారు. 15 నిమిషాల్లో ప్రార్థన ముగించారు. ఘాట్ వద్ద కనీసం కూర్చోకుండానే తండ్రి విగ్రహానికి పూలమాల వేసి నేరుగా కడప బయల్దేరారు. అంతకుముందు కొడుకును చూసి విజయలక్ష్మి కన్నీరు పెట్టుకున్నారు. ఆమె కొంత కాలంగా షర్మిల వద్దే ఉంటున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో షర్మిలను కడప ఎంపీగా గెలిపించాలంటూ అమెరికా నుంచి వీడియో సందేశం కూడా పంపారు. ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. వైసీపీ ఓటమి తర్వాత తల్లీకొడుకులు కలుసుకోవడం ఇడుపులపాయలోనే. తల్లి కన్నీరు పెట్టుకున్నా.. ఆయన పెద్దగా స్పందించలేదు. అందరూ చూస్తుండడంతో తల్లి తలపై చేయి వేసి ఓదార్చి వెళ్లిపోయారు. అయినా ఆమె ఏడుస్తూనే ఉండడంతో జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి, బంధువులు సముదాయించారు. వైఎస్ జయంతి సందర్భంగా అన్నాచెల్లెలు కలిసి నివాళులర్పించేలా విజయలక్ష్మి తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు చెబుతున్నారు. అయితే అది ఫలించలేదు. ఇడుపులపాయ గెస్ట్‌హౌస్‌లో షర్మిల, ఆమె కుటుంబ సభ్యులు ఉన్నా కనీసం వారిని కలవకుండానే జగన్ వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. జగన్ వెళ్లిన గంట తర్వాత తల్లి, భర్త, పిల్లలు, కోడలితో కలిసి షర్మిల వైఎస్సార్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. తండ్రి సమాధి వద్ద కూర్చొని మౌనం పాటించారు. ఫాదర్ నరేశ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. సమాధిపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తల్లి విజయలక్ష్మి షర్మిలను ముద్దాడారు. అనంతరం ఘాట్ ఆవరణలోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ నాయకుడంటే ఎలా ఉండాలో నిరూపించిన నేత వైఎస్సార్ అని, ఆయన మహోన్నతమైన భావాలు కలిగినవారని, రాష్ట్రానికి సీఎంగా ఎంతో సేవ చేశారని గుర్తుచేశారు. అన్ని వర్గాల ప్రజలను ఆదరించి వారి హృదయాల్లో నిలిచిపోయారని తెలిపారు. ఆయన మరణంతో తల్లడిల్లి 700 మంది చనిపోయారన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ కృషిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ సోదరుడు సుధీకర్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



ఇడుపులపాయలోని వైఎస్ సమాధి వద్ద ఆయనకు నివాళులర్పిస్తున్న జగన్, విజయమ్మ, ఇతర కుటుంబ సభ్యులు

కడప నుంచే కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం!



తెలంగాణ సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

- ఉప ఎన్నిక వస్తే ఊరూరా తిరుగుతా: రేవంత్‌రెడ్డి
- ఏపీలో ప్రతిపక్షం లేదు.. షర్మిలదే విపక్ష పాత్ర
- 2029లో ఆమే ముఖ్యమంత్రి
- వైఎస్ జయంతి సభలో తెలంగాణ సీఎం
- సోనియా, రాహుల్ ప్రత్యేక సందేశం



విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వైఎస్‌కు నివాళులర్పిస్తున్న రేవంత్, షర్మిల, భట్టి, కేవీపీ, పొన్నం, దుద్దిళ్ల, దానం తదితరులు

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్‌కు దెబ్బ తగిలిన కడప జిల్లా నుంచే జెండా ఎగురవేద్దాం.. ఉప ఎన్నిక వస్తుందని ప్రచారం జరుగుతోంది.. వస్తే షర్మిల తరఫున ఊరూరా తిరిగే బాధ్యత నాదే.' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆంధ్రలో ప్రతిపక్షం లేదని, ప్రజల తరఫున ఆ పాత్ర పోషించేది పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాత్రమేనని తెలిపారు. ఆమెకు తోడుగా, ఏపీలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా తాము ఉంటామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీరెండు కళ్లుగా పాలించి రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని పదిహేనేళ్లుగా ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని చెప్పారు. మాజీ సీఎం వైఎస్ 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారమిక్కడ మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్‌లో పీసీసీ సభ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తన మంత్రివర్గ సహచరులతో కలిసి వచ్చిన రేవంత్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో సర్పంచ్‌ను కూడా గెలిపించుకోలేని స్థితిలో కాంగ్రెస్ ఉన్నప్పుడు ముళ్లబాటను ఎంచుకున్న షర్మిల.. 1999లో తన తండ్రి ప్రతిపక్ష నేతగా పోరాడిన స్ఫూర్తితో ఏపీ ప్రజల తరఫున కొట్లాడతారని అన్నారు. 1984లో పోరాటం మొదలు పెట్టిన వైఎస్ 2004లో సీఎం అయ్యారని, తండ్రిని కోల్పోయి అనివార్య పరిస్థితుల్లో 2009లో రాజకీయ ప్రవేశం చేసిన షర్మిల 2029లో ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. రాహుల్‌ను ప్రధాని చేయాలన్న వైఎస్ ఆశయానికి అనుగుణంగా పనిచేస్తున్న పీసీసీ అధ్యక్షురాలికి అడుగడుగునా తాము తోడుంటామన్నారు. 2007లో శాసన మండలిలో మొదటిసారి అడుగు పెట్టిన తాను ముందు రోజు రాత్రంతా ప్రజా సమస్యలపై ప్రిపేరై మరుసటి రోజు ప్రస్తావిస్తే వైఎస్ ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టినప్పుడు కూడా సభలో ఉండి కొత్త వారిని ప్రోత్సహించాలంటూ తన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేవారని అన్నారు. ఏళ్ల తరబడి కష్టపడినా కాంగ్రెస్‌లో పదవి రాలేదని ఎన్నడూ పార్టీని వదల్లేదని, 2004 పాదయాత్రతో అధికారంలోకి వచ్చారని చెప్పారు. అదే స్ఫూర్తితో రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా మండే ఎండల్లో.. మంచు కొండల్లో.. పాదయాత్ర చేసి ప్రజా సమస్యల్ని తెలుసుకుని ప్రతిపక్ష నేతగా పార్లమెంటులో ప్రధాని మోదీకి చెమటలు పట్టిస్తున్నారని అన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో పార్టీని అధికారంలోకి తెచ్చారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి జయంతి సభకు వెళ్లాలంటూ రాహుల్, ఖర్గే తమను ఆదేశించారని.. వారి తరఫున వచ్చిన తాము.. పీసీసీ చేసే ప్రజా పోరాటాల్లో వందశాతం అండగా నిలుస్తామన్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పేదల వైద్యానికి ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, ఇళ్లు లేని వారిని ఇందిరమ్మ ఇళ్లు అంటూ సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోతారని అన్నారు. తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ.. ఏపీ నేతలు కేవీపీ రామచంద్రరావు, పళ్లంరాజు, తులసిరెడ్డి, శైలజానాథ్, రుద్రరాజు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, వామపక్ష నేతలు కె.నారాయణ, రామకృష్ణ తదితరులు మాట్లాడారు. సోనియా గాంధీ పంపిన సందేశాన్ని ఏఐసీసీ ప్రతినిధి మెయ్యప్పన్ చదివి వినిపించారు. రాహుల్ వీడియో సందేశాన్ని సభలో ప్రదర్శించారు. కార్యక్రమంలో మాణిక్కం ఠాగూర్, దీపా దాస్‌మున్షీ, రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాన్న ప్రజల్లోనే..

అధికారం లేనప్పుడు ప్రజల్లోకి వెళ్లి..వచ్చాక పట్టించుకోని నేతల్లా కాకుండా ఎప్పుడూ ప్రజల కోసమే నాన్న(వైఎస్) తపన పడే వారని షర్మిల అన్నారు. రెండోసారి సీట్లు తగ్గినప్పుడు నువ్వు ప్రజల్ని అంతగా ఇష్ట పడినా వాళ్లు నీపై అంతగా చూపలేదని తానంటే పర్లేదంటూ అదే ప్రజల్లోకి వెళ్లిన వైఎస్ ప్రజాసేవలోనే దేవుడి దగ్గరకు వెళ్లిపోయారంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఆయన్ను ప్రాణంగా ఇష్ట పడే తనకు ఏమీ కాలేదన్నారు. దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్‌తోనే మంచి జరుగుతుందని ఎంతగానో విశ్వసించే తన తండ్రికి మత రాజకీయాలు చేసే బీజేపీ అంటే అసలు గిట్టదన్నారు. అదే బీజేపీతో తెరవెనుక రాజకీయాలు చేసే నాయకులు(జగన్) వైఎస్‌కు వారసులు ఎలా అవుతారని ప్రశ్నించారు.

భారత్ జోడో యాత్రకు వైఎస్ పాదయాత్రే స్ఫూర్తి

- ఆయన బతికుంటే ఏపీకి కష్టాలు ఉండేవి కావు: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తాను చేపట్టిన భారత్ జోడో యాత్రకు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్రే స్ఫూర్తి అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. వైఎస్ 75వ జయంతి సందర్భంగా ఆయనపై సోమవారం రాహుల్‌గాంధీ ప్రత్యేక వీడియో విడుదల చేశారు. వైఎస్ నిజమైన ప్రజానాయకుడని.. ఆంధ్రప్రదేశ్ ప్రజల బాధలను గ్రహించి, వారిని నమ్మి, వారి కోసమే జీవించారని తెలిపారు.

వైఎస్‌ది చెరగని ముద్ర: ఖర్గే

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దయాగుణం, దూరదృష్టి ఉన్న వైఎస్సార్ తన పాలనలో వినూత్న పథకాలు, కార్యక్రమాల ద్వారా ఏపీ ప్రజల జీవితాలపై చెరగని ముద్రవేశారని సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. వైఎస్ ఎల్లప్పుడూ ఆరాధనీయుడని తెలిపారు.

సీబీఐ పేరుతో మాజీ ఎమ్మెల్యేకు టోకరా

- రూ.50 లక్షలు లూటీ
- మనీలాండరింగ్ కేసు విచారణ అంటూ బెదిరింపు
- ఖాతాల్లోని సొమ్ము సీబీఐ అకౌంట్‌లో వేయాలని సూచన
- తనిఖీ చేశాక తిరిగిచ్చేస్తాం.. లేదంటే అరెస్టు చేస్తామని బెదిరింపు
- భయంతో 50లక్షలు వేసిన జయదేవ నాయుడు

పాకాల, జూలై 8: సీబీఐ అధికారుల పేరుతో మాజీ ఎమ్మెల్యేకే టోకరా వేసి రూ.50 లక్షలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఆర్ జయదేవ నాయుడు (85) తిరుపతి జిల్లా పాకాల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఘరానా మోసం వెలుగుచూసింది. జయదేవ నాయుడికి గత శనివారం ఓ మహిళ వీడియో కాల్ చేసి... మీ అకౌంటు నుంచి కొన్ని కోట్ల రూపాయల మనీ లాండరింగ్ జరిగిందని చెప్పింది. తాము అరెస్టు చేసిన నాయక్ అనే వ్యక్తి బ్యాంకు ఖాతాలను తనిఖీ చేస్తే మీ నంబరు కూడా అందులో ఉందని.. కాబట్టి మిమ్మల్ని కూడా అరెస్టు చేసే అవకాశముందని బెదిరించింది. మనీలాండరింగ్‌తో తనకెలాంటి సంబంధాల్లేవని జయదేవ్ చెప్పగా... తనపై ఆఫీసరుతో మాట్లాడుకోవాలని మరో వ్యక్తికి ఫోన్ కనెక్ట్ చేసింది. వెంటనే లైన్లోకి వచ్చిన మరో వ్యక్తి.. తాము ఫోన్ చేసిన విషయం ఎవరికైనా చెబితే వెంటనే అరెస్టు చేస్తామని బెదిరించారు. సీబీఐ అకౌంటు నంబరు పంపిస్తామని, ఆ అకౌంటుకు మీ ఖాతాల్లోని డబ్బు పంపిస్తే తనిఖీ చేసుకున్నాక మూడో రోజు తిరిగి మీ ఖాతాలకు వేసేస్తామని చెప్పారు. దీంతో జయదేవ నాయుడు శనివారమే బ్యాంకుకు వెళ్లి ఆరు అకౌంట్ల నుంచి ఆర్టీజీఎస్ ద్వారా రూ.50 లక్షలు వారు చెప్పిన అకౌంటు నంబరుకు పంపించారు. అమెరికాలో ఉండే కుమారుడు ఆదివారం ఫోన్ చేస్తే జరిగిందంతా వివరించారు. మోసపోయినట్టు గ్రహించిన కుమారుడు.. వెంటనే ఎస్పీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆదివారం తిరుపతి ఎస్పీ హర్షవర్ధన రాజును కలసిన జయదేవ నాయుడు జరిగిన విషయం వివరించారు. ఆయన సూచన మేరకు జయదేవ నాయుడు సోమవారం సాయంత్రం పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అక్టోబరు 3 నుంచి టెట్

- వచ్చే నెల మూడో తేదీ వరకు దరఖాస్తులు

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు రాష్ట్ర ప్రభుత్వం కొత్త షెడ్యూలు విడుదల చేసింది. అక్టోబరు 3 నుంచి 20వ తేదీ వరకు రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఆగస్టు 3 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. సెప్టెంబరు 22 నుంచి హాల్ టికెట్లు అందుబాటులోకి తెస్తారు. ఒక్కో పరీక్ష ముగిసిన వెంటనే 4వ తేదీ నుంచి ప్రాథమిక కీ విడుదల చేస్తారు. 5వ తేదీ నుంచి అభ్యర్థులు తమ అభ్యంతరాలు తెలియజేయవచ్చు. 27న తుది కీ విడుదల చేసి, నవంబరు 2న ఫలితాలు విడుదల చేస్తారు. సోమవారం పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. షెడ్యూలు మినహా మిగిలిన నిబంధనలు యథాతథంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ నెల 2వ తేదీన టెట్‌కు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆగస్టులో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అయితే మూడు నెలల గడువు ఇవ్వాలని అభ్యర్థులు, విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం షెడ్యూలులో మార్పులు చేసింది.

మెడ్ టెక్ జోన్ మటాష్

- వైసీపీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం
- బాబు హయంలో ఏర్పడిందన్న కారణంగా పక్కన పెట్టిన జగన్
- 'జోన్'ను సొంత జాగీరు చేసుకున్న ప్రైవేటు వ్యక్తి
- విశాఖ స్వామి, పూనం మాలకొండయ్య అండ
- సర్కారుకు రూ.404 కోట్లు వృథా
- మంత్రి ముందు విషయాలు దాస్తున్న అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైద్య పరికరాల ఉత్పత్తిలో దేశానికి తలమానికంగా ఉండాల్సిన మెడ్ టెక్ జోన్.. గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యమైంది. ప్రైవేటు వ్యక్తి జోక్యంతో అనధికార ఆంక్షలు, పెట్టుబడులు పెట్టేవారికి బెదిరింపులు పెరిగిపోయాయి. పైగా నిషేధిత చైనా కంపెనీలను ఆహ్వానించి పెట్టుబడులు పెట్టించిన వైనం వివాదంగా మారింది. ప్రోత్సాహకాల పేరిట సర్కారు సొమ్మును సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా విషయాలు అధికారులకు తెలిసినా.. ప్రస్తుత ప్రభుత్వానికి వివరించకుండా మాయ చేస్తున్నారు!

రాష్ట్రానికే కాదు.. దేశానికి కూడా కీలకమైన వైద్య రంగంలో అవసరమైన అన్ని పరికరాలను ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో విశాఖలో గత చంద్రబాబు సర్కారు ఏర్పాటు చేసిన మెడ్ టెక్ జోన్ నిర్వీర్యమైంది. వైసీపీ హయాంలో ఈ జోన్‌ను అభివృద్ధి చేయాల్సి ఉన్నా.. రాజకీయ కారణాలతో నాటి సీఎం జగన్ చూపిన నిర్లక్ష్యం ప్రాజెక్టును పటాపంచలు చేసింది. దాదాపు 270 ఎకరాల స్థలం. రూ.30 వేల కోట్ల పెట్టుబడులు. 25 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన లక్ష్యంతో ప్రారంభమైన ప్రాజెక్టు.. జగన్ జమానాలో ప్రైవేటు వ్యక్తి ఆధిపత్యానికి నలిగిపోయింది. రాష్ట్రాన్ని వైద్య రంగంలో మొదటి స్థానంలో నిలపాలన్న ఉద్దేశంతో తొమ్మిదేళ్ల కిందట అప్పటి టీడీపీ ప్రభుత్వం మెడ్‌టెక్‌జోన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. విశాఖపట్నం లాంటి నగరంలో కొన్ని కోట్ల రూపాయిల విలువైన భూమిని ప్రాజెక్టు కోసం కేటాయించింది. తొమ్మిదేళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూస్తే ప్రాజెక్టు పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. రూ.30 వేల కోట్లు కాదు.. రూ.300 కోట్లయినా పెట్టుబడులు రాలేదు. 25 వేల ఉద్యోగాలు కాదు కదా 250 మందికి కూడా ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేవు. మెడ్‌టెక్ జోన్ అభివృద్ధిలో కీలకమైన బోర్డు సరిగా వ్యవహరించకపోవడంతో ప్రాజెక్టు నిర్వీర్యమైంది. బోర్డులో ఉన్న అధికారులను చూసి పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. పైగా మెడ్‌టెక్ జోన్‌లో మౌలిక సదుపాయాల కల్పన పేరుతో ప్రభుత్వం నుంచి రూ.కోట్లు లాగేశారు. తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రం దాదాపు రూ.404.25 కోట్లు మెడ్‌టెక్ జోన్‌కు కేటాయించింది. టీడీపీ ప్రభుత్వం దాదాపు రూ.311.79 కోట్లు కేటాయించింది. వైసీపీ సర్కారు ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోయినా కరోనా సమయంలో దాదాపు రూ.92 కోట్లు కేటాయించింది. మరి ఈ నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వానికి వివరణ ఇవ్వాల్సిన బోర్డు సభ్యులు కూడా మౌనంగా ఉన్నారు. ఒక వైపు ప్రభుత్వం నుంచి భారీ స్థాయిలో మద్దతు లభిస్తున్నప్పటికీ కంపెనీలు మాత్రం పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గు చూపడం లేదు.

ఎస్‌పీవీ కింద ఏర్పాటు

గత టీడీపీ ప్రభుత్వం స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పీవీ) కింద మెడ్ టెక్ జోన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దీనికి ప్రభుత్వ సహకారం ఎక్కువగా ఉంటుంది. పైగా 'మేకిన్ ఇండియా'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి కంపెనీలకు పూర్తి మద్దతు లభిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం ఉన్నప్పటికీ ప్రాజెక్టు మాత్రం విఫలమైంది. బోర్డులోని ఒక కీలక వ్యక్తి మెడ్‌టెక్ జోన్‌ను తన సొంత జాగీరులా మార్చుకున్నారనే విమర్శలు ఉన్నాయి. తన అనుమతి లేకుండా ప్రభుత్వం ఉద్యోగులు కూడా లోపలికి వెళ్లే పరిస్థితి లేకుండా ఆంక్షలు విధించారు. చివరికి జిల్లా కలెక్టర్ కూడా మెడ్‌టెక్ జోన్‌లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆ స్థాయిలో ప్రాజెక్టును తన చేతుల్లో పెట్టుకున్నారు. ఎస్‌పీవీ ప్రాజెక్టు కాబట్టి ఏపీఐఐసీ అధికారులు, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో కంపెనీలతో అగ్రిమెంట్లు జరగాల్సి ఉంటుంది. కానీ, ఈ నిబంధనలు పాటించకుండానే సదరు వ్యక్తి తన ఇష్టానుసారం ప్రాజెక్టు నిర్వహణ చేపట్టారు. వైసీపీ హయాంలో సీఎంవోలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో విధులు నిర్వహించిన పూనం మాలకొండయ్య అండదండలతోనే ప్రైవేటు వ్యక్తి దీనిని తన సొంత జాగీరుగా మార్చుకున్నారు.

మంత్రికి అధికారుల మస్కా!

మెడ్ టెక్ జోన్‌పై కొత్త ప్రభుత్వం ఏమేరకు చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది. అసలు మెడ్‌టెక్ జోన్ పరిస్థితి ఎలా ఉంది? పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందా? అనే కీలక అంశాలను పరిశ్రమల శాఖ అధికారులు పట్టించుకోకుండా జోన్‌లో పెట్టుబడులు పెట్టేయండి అని దేశ, విదేశాల నుంచి వచ్చే పారిశ్రామిక వేత్తలకు సలహాలు ఇస్తున్నారు. గత వారంలో అబుదాబి నుంచి ఎంఎఫ్-2 కంపెనీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి ప్రాజెక్టు గురించి వివరించారు. ఆయన వెంటనే మెడ్‌టెక్ జోన్‌లో పెట్టుబడులు పెట్టండి అని అబుదాబి ప్రతినిధులకు చెప్పారు. మెడ్‌టెక్ జోన్‌లో పరిస్థితి మంత్రికి తెలియదు. కానీ, పరిశ్రమల శాఖ అధికారులకు తెలుసు.ఆరోగ్యశాఖ మంత్రి దగ్గర మాత్రం మెడ్‌టెక్ జోన్ అద్భుతం అన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి చెప్పింది విని అబుదాబి ప్రతినిధులు మెడ్‌టెక్ జోన్ నుంచి విచారణ చేస్తే ఏపీ పరువు పోతుందని విశాఖ అధికారులు చెబుతున్నారు. మెడ్ టెక్ జోన్‌పై విచారణ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

కంపెనీలపై భారీ పెనాల్టీలు

మెడ్‌టెక్ జోన్‌లో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకు రావడం లేదు. ఇలాంటి సమయంలో కంపెనీలకు ప్రయోజనాలు కల్పించి పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలి. కానీ, జోన్‌లో అంతా రివర్స్ పాలన జరిగింది. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే కంపెనీలను కాంపౌండ్‌లోకి కూడా రానివ్వకుండా అడ్డుకున్నారనే విమర్శలు వచ్చాయి. బోర్డులోని ప్రైవేటు వ్యక్తికి నచ్చి, ఆయన అంగీకరిస్తేనే జోన్‌లో పెట్టుబడులు పెట్టే స్థితిని కల్పించారు. అలా కాకుండా ఎవైనా కంపెనీ పెట్టుబడులు పెడితే భారీ పెనాల్టీలు విధించి బయటకు పంపించేస్తారు. రెండేళ్ల క్రితం ఒక మెడికల్ కంపెనీ దాదాపు రూ.పది నుంచి 15 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. సదరు కంపెనీ మౌలిక సదుపాయాలు సిద్ధం చేసుకుని, సిబ్బందిని నియమించుకుని ఉత్పత్తిని ప్రారంభించే సమయంలో ప్రైవేటు వ్యక్తి నుంచి సమస్యలు ప్రారంభమయ్యాయి. సదరు వ్యక్తి రూ.15 కోట్లు పెట్టుబడి పెట్టిన కంపెనీకి రూ.33 కోట్లు పెనాల్టీ విధించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఉంటే ఉండండి లేదంటే వెళ్లిపోండి అంటూ బెదిరింపులకు గురి చేశారు. దీంతో సదరు కంపెనీ మెడ్‌టెక్ జోన్‌లో ఉండలేమని వెళ్లి పోయింది. చివరికి చైనా కంపెనీలను తెచ్చారు. కాగా, చైనా కంపెనీలను దేశంలోకి అనుమతించవద్దని కేంద్ర ప్రభుత్వం 2020లో కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా కంపెనీల పెట్టుబడులను సైతం నిరాకరించింది. దేశ భద్రత దృష్ట్యా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, మెడ్‌టెక్ జోన్‌లోని ప్రైవేటు వ్యక్తి ఈ నిబంధనలు కూడా తోసిపుచ్చారు. సీటీ స్కాన్ మిషన్లు, ఎంఆర్ఐల్లో మ్యాగ్నిటెక్‌ను తయారు చేసే ఒక చైనా కంపెనీకి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిషేధం విషయాన్ని ముందుగానే గ్రహించిన సదరు వ్యక్తి 2019 చివరిలో చైనా కంపెనీతో మెడ్‌టెక్ జోన్‌తో పెట్టుబడులు పెట్టించారు. సదరు కంపెనీకి దాదాపు రూ.40 కోట్లు ప్రోత్సాహకాలుగా అందించారు. ఈ కంపెనీ ఇప్పటి వరకు ఏం ఉత్పత్తి చేసింది? కంపెనీ ఉత్పత్తి ప్రారంభమైందో లేదో కూడా తెలియదు. కానీ, ఏటా సదరు కంపెనీకి ఇన్‌సెంటివ్స్ వెళ్లిపోతున్నాయి. అసలు ఈ ఇన్‌సెంటివ్స్‌ను ఆ కంపెనీకి ఇస్తున్నారో.. కంపెనీ వెనుక ఉండి ప్రైవేటు వ్యక్తి సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నారో అన్న దానిపై అనేక అనుమానాలు ఉన్నాయి.

విశాఖ స్వామి అండదండలు

టీడీపీ హయాంలో తాను డాక్టర్ అని చెప్పుకొని ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించిన ప్రైవేటు వ్యక్తి, వైసీపీ హయాంలో కూడా చక్రం తిప్పారు. జగన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన స్వామిజీ మెడ్‌టెక్ జోన్ వ్యవహారాలు కూడా పర్యవేక్షించారు. దీంతో వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే సదరు ప్రైవేటు వ్యక్తి వెంటనే విశాఖ స్వామి ఆశ్రమానికి చేరిపోయారు. సదరు వ్యక్తి భక్తిని మెచ్చిన విశాఖ స్వామి జోక్యం చేసుకోవడంతో ప్రభుత్వం కూడా మెడ్ టెక్ జోన్‌పై దృష్టి పెట్టలేదు. పైగా, సీఎంవోలోని పూనం మాలకొండయ్య అండదండలు ఉండడంతో సానుకూలంగా మారింది.



అడ్మిషన్లలో అయోమయం

- ఇంజనీరింగ్, డిగ్రీ కౌన్సెలింగ్‌పై అస్పష్టత
- ప్రారంభం కాని ఇంజనీరింగ్ ఆప్షన్లు
- మరో నాలుగు రోజులే గడువు
- పాత అధికారులతోనే ఈ తిప్పలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్యాశాఖలో అడ్మిషన్ల గందరగోళం కొనసాగుతోంది. ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సుల కౌన్సెలింగ్‌పై అస్పష్టత నెలకొంది. షెడ్యూలు ప్రకారం అడ్మిషన్లు జరుగుతాయా అనే దానిపై అస్పష్టత నెలకొంది. మొదట ప్రకటించిన తేదీల ప్రకారం సోమవారం నుంచి ఇంజనీరింగ్ కోర్సులకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వం కొత్త ఫీజులు ఖరారు చేసింది. కానీ ఏఐసీటీఈ మంజూరు చేసిన సీట్లకు సోమవారం సాయంత్రం వరకూ ఉన్నత విద్యాశాఖ అనుమతులు ఇవ్వలేదు. దీంతో ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. సాయంత్రానికి సీట్లకు అనుమతుల జీవో జారీ చేసినా వాటిని కౌన్సెలింగ్‌లో పెట్టడానికి సాంకేతిక విద్యా శాఖ సమయం తీసుకుంది. మరోవైపు ఫీజుల అంశంలోనూ అదే అస్పష్టత కొనసాగుతోంది. 2023లో ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ మూడేళ్ల కాలానికి ఫీజులు సిఫారసు చేసింది. తొలుత కనిష్ఠ ఫీజు రూ.45 వేలు, గరిష్ఠ ఫీజు రూ.1.05 లక్షలుగా నిర్ణయించింది. ఆ సిఫారసులను గత ప్రభుత్వం ఆమోదించకుండా మార్చాలని ఒత్తిడి చేసింది. దీంతో కమిషన్ కనిష్ఠ ఫీజును రూ.40 వేలుకు తగ్గించింది. దీనిపై యాజమాన్యాలు కోర్టుకు వెళ్లగా కొద్ది రోజుల కిందట తీర్పు వచ్చింది. ఈ ప్రకారం కమిషన్ మొదటి సిఫారసులనే పరిగణనలోకి తీసుకోవాలి. అంటే కనిష్ఠ ఫీజు రూ.45 వేలుగా ఉండాలి. కానీ ఉన్నత విద్యా శాఖ అందుకు విరుద్ధంగా కనిష్ఠ ఫీజు రూ.40 వేలుగా నిర్ణయిస్తూ జీవో ఇచ్చింది. దీంతో ఫీజు విషయంలోనూ అస్పష్టత నెలకొంది. ఈ గందరగోళం మధ్య ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. షెడ్యూలు ప్రకారం ఐదు రోజులపాటు ఆప్షన్లు పెట్టుకోవచ్చు. సోమవారం ఆప్షన్లు ఎంచుకునే అవకాశం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అయితే ఆప్షన్ల ప్రక్రియలో ఒక రోజు వృథా కావడంతో గడువు పెంచుతారా? లేదా? అనే దానిపై కూడా సాంకేతిక విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదు.

డిగ్రీలోనూ గందరగోళం

డిగ్రీ కోర్సులకు కౌన్సెలింగ్‌లోనూ ఇంజనీరింగ్ తరహాలో గందరగోళం కొనసాగుతోంది. అనుమతులకు సంబంధించిన ఫీజులను గతేడాది కాలేజీలు చెల్లించాయి. ఒక్కో కాలేజీ రూ.30 వేలు చెల్లించగా.. ఆ ఫీజు మూడేళ్ల కాలానికని ఉన్నత విద్యామండలి తెలిపింది. అయితే ఇప్పుడు మళ్లీ ఫీజులు కట్టాలని ఆదేశించింది. గతేడాది కట్టామంటూ కాలేజీలు అనుమతులకు ఫీజులు చెల్లించలేదు. అలాగే ఇప్పటికీ కొన్ని కాలేజీలకు అఫిలియేషన్లు మంజూరు కాలేదు. డిమాండ్ ఉన్న బీసీఏ, బీబీఏ కోర్సులకు ఈ నెల 15 వరకు ఏఐసీటీఈకి దరఖాస్తు చేసుకునే గడువు ఉంది. కానీ ఈ లోపే తొలి విడత కౌన్సెలింగ్ పూర్తి చేసేలా షెడ్యూలు జారీ చేశారు. తొలి విడతలో అనుమతులు, అఫిలియేషన్లు పొందిన కాలేజీల వరకు కౌన్సెలింగ్ నిర్వహించాలని తాజాగా ఉన్నత విద్యామండలి అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఇంకా వందకు పైగా కాలేజీలకు అనుమతులు రావాల్సి ఉంది. మరోవైపు ఈ ఏడాది డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునే విధానాన్ని సంక్లిష్టంగా మార్చారు. అలాగే ఫీజు చెల్లించే సమయంలో యూపీఐ ద్వారా ఆప్షన్ లేకుండా చేశారు. విద్యార్థి చిరునామా విషయంలోనూ వెబ్‌సైట్ తప్పులు చూపిస్తోం ది. ఈ కారణాలతో విద్యార్థుల దరఖాస్తులు కూడా తగ్గిపోయినట్లు తెలుస్తోంది.

డిమాండ్ ఉన్న కోర్సులేవీ?

ప్రస్తుతం డిగ్రీలో బీసీఏ కోర్సుకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఆ కోర్సు చదివితే సాఫ్ట్‌వేర్ రంగంలోకి వెళ్లవచ్చని విద్యార్థులు ఎంచుకుంటున్నారు. గతేడాది వరకూ బీసీఏ, బీబీఏ, బీఎంఎస్ కోర్సులకు రాష్ట్రంలోనే అనుమతులు వచ్చేవి. ఈ ఏడాది నుంచి ఆ 3 కోర్సులకు మాత్రం ఏఐసీటీఈ అనుమతులు జారీచేస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వమే అనుమతులు ఇవ్వాలని కాలేజీలు కోర్టుకి వెళ్లాయి. దీంతో చాలా కాలేజీలకు ఏఐసీటీఈ అనుమతులు రాలేదు. మరోవైపు ఏఐసీటీఈ ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని గడువు పొడిగించగా.. కోర్టుకు వెళ్లిన కాలేజీల యాజమాన్యాలు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నాయి. 15 తర్వాతనే అనుమతులు వస్తాయి. కానీ షెడ్యూలు ప్రకారం 15వ తేదీలోగా విద్యార్థులు తమకు ఏ సీటు, ఏ కాలేజీలో కావాలనే ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలి. దీంతో బీసీఏ, బీబీఏ, బీఎంఎస్‌లోనే సీట్లు కావాలంటే రెండో విడత కౌన్సెలింగ్ వరకూ ఆగాల్సిందే. పాత అధికారులతోనే ఉన్నత విద్యామండలి కొనసాగుతున్నందున ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయనే వాదన వినిపిస్తోంది.

కనిష్ఠ ఫీజు 40 వేలు

- ఇంజనీరింగ్ ఫీజులు ఖరారు

ఇంజనీరింగ్ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఫీజులను ఖరారు చేసింది. ఇంజనీరింగ్ కోర్సులకు కనిష్ఠ ఫీజు రూ.40 వేలుగా నిర్ణయించింది. గరిష్ఠ ఫీజు రూ.1.05 లక్షలు. 2023-26 కాలానికి 210 ఇంజనీరింగ్ కాలేజీలు, బీఆర్క్(ఆర్కిటెక్చర్) కోర్సులు అందిస్తున్న 2 కాలేజీలకు ఫీజులు ప్రకటించింది. 210 ఇంజనీరింగ్ కాలేజీల్లో సగానికి పైగా అంటే.. 108 కాలేజీల్లో ఫీజులు కనిష్ఠ స్థాయిలో రూ.40 వేలుగా ఖరారు చేశారు. మరో 25 కాలేజీల్లో రూ.40 వేల-రూ.50 వేల వరకు ఉన్నాయి. బీఆర్క్ కోర్సులు అందిస్తున్న 2 కాలేజీల్లో ఫీజులు రూ.35 వేలుగా నిర్ణయించారు. 2023లో ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ సిఫారసు చేసిన ఫీజులనే ప్రభుత్వం ఆమోదించి, ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. కాగా, కొత్త ఫీజులపై ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. కనిష్ఠ ఫీజు రూ.40 వేలే ఉందని, ఇది ఇబ్బందిగా ఉందని అంటున్నాయి.

ఇంజనీరింగ్ అంతా సీఎస్ఈనే

- ఆ బ్రాంచ్‌కే భారీగా సీట్ల కేటాయింపు
- 1.81 లక్షల సీట్లకు 99,494 అవే

ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌కు డిమాండ్ పెరిగింది. ఇంజనీరింగ్ అంటే సీఎస్ఈనే అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది. ఈ ఏడాది కోర్సులకు కేటాయించే సీట్ల పరిమితిని ఏఐసీటీఈ ఎత్తివేయడంతో సీఎస్ఈ సీట్లు పెరిగిపోయాయి. గతేడాది వరకూ ఒక కాలేజీలో ఒక కోర్సుకు 240 దాటి సీట్లు కేటాయించాలంటే ఎన్‌బీఏ అక్రిడిటేషన్ తప్పనిసరి నిబంధన ఉండేది. ఈ ఏడాది ఆ పరిమితిని తొలగించడంతో కాలేజీలన్నీ సీఎస్ఈ సీట్లు భారీగా పెంచుకున్నాయి. ఈ ఏడాది రాష్ట్రానికి మొత్తంగా 1.81 లక్షల ఇంజనీరింగ్ సీట్లను మంజూరు చేయగా, వాటిలో 99,494 సీట్లు ఒక్క సీఎస్ఈ బ్రాంచ్‌లోనే ఉన్నాయి. కాగా ఏఐసీటీఈ మంజూరు చేసిన సీట్లకు అనుగుణంగా వర్సిటీ, ప్రైవేటు కాలేజీలకు సీట్లు భర్తీ చేసుకునేందుకు అనుమతిస్తూ ఉన్నతవిద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరులోని ఓ కాలేజీ సీఎస్ఈ జనరల్‌లో 960 సీట్లు సాధించింది. మళ్లీ సీఎస్ఈ-ఏఐలో 180 సీట్లు, సీఎస్ఈ-ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లో 180 సీట్లు ఆ కాలేజీకి కేటాయించారు. చిత్తూరులో ఓ కాలేజీకి సీఎస్ఈలో 540 సీట్లు, సీఎస్ఈ-ఏఐ, డేటా సైన్స్‌కు 300 సీట్లు, సీఎస్ఈ-క్లౌడ్ కంప్యూటింగ్‌కు 120 సీట్లు, సీఎస్ఈ-ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లో 360 సీట్లు వచ్చాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

దుర్గగుడి డిప్యూటీ ఈవోకు విధుల కేటాయింపు

వన్‌టౌన్: దుర్గగుడి డిప్యూటీ ఈవో లీలాకుమార్‌కు తాజాగా విధులు కేటాయించారు. అలాగే ఆయనకు చాంబర్ కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన దుర్గగుడి ఉప కార్యనిర్వహణ అధికారి (డిప్యూటీ ఈవో)గా నియామకమయ్యారు. ఆయనకు ప్రొటోకాల్, బంగారు, వెండి ఆభరణాల పర్యవేక్షణ, ఈవో లేని పక్షంలో ఇన్‌చార్జి ఈవో, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పరిపాలన సిబ్బందిపై పర్యవేక్షణ, హుండీలో కానుకల లెక్కింపు పర్యవేక్షణ, లెక్కింపునకు తేదీల ఖరారు వంటి బాధ్యతలు అప్పగించారు. 5 నెలలుగా ఆయన ఎలాంటి విధులు లేకుండానే కొనసాగుతున్న నేపథ్యంలో తనకు విధులు అప్పగించాలని దేవదాయ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈమేరకు కమిషనర్ తన ఉత్తర్వుల్లో లీలాకుమార్‌కు విధులు, చాంబర్‌ను కేటాయించారు. ప్రస్తుతం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ చాంబర్ ఖాళీగా ఉండడంతో ఆ చాంబర్‌ను లీలాకుమార్‌కు కేటాయించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వన్‌టౌన్: బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలపాలై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు బిళ్లా కృష్ణ (64) మృతి చెందినట్టు సోమవారం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వీర్లపాడు మండలం జగన్నాథపురానికి చెందిన బిళ్లా కృష్ణ కుటుంబసభ్యులతో ఉండేవాడు. జీవనోపాధి నిమిత్తం భార్యతో కలిసి చిట్టినగర్ మిల్క్‌ప్రాజెక్టు వద్ద ఉన్న అప్పలస్వామి కాలేజీలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు సొంతూరులోని కుమారుడు, కుమార్తె వద్దకు వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 4న కృష్ణ బైక్‌పై సొంతూరుకు వెళ్లాడు. మధ్యాహ్నం 12గంటలకు అక్కడి నుంచి నగరానికి బయలుదేరాడు. నల్లగుంట సెంటర్ వద్దకు వచ్చేసరికి బైకు అదుపు తప్పి కృష్ణ రోడ్డుపై పడ్డాడు. ఈ సంఘటనలో అతడికి గాయాలయ్యాయి. స్థానికులు 108లో గొల్లపూడిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. చికిత్స పొందుతున్న కృష్ణ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసునమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దుర్గమ్మ దర్శనానికి వచ్చిన యువతి అదృశ్యం

వన్‌టౌన్: దుర్గమ్మ దర్శనానికి వచ్చిన అనకాపల్లి జిల్లాకు చెందిన యువతి అదృశ్యమైనట్టు సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా నూనెపిట్రం మండలం పెద్ద బొడ్డిపల్లి గ్రామానికి చెందిన యువతి (18) కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 4న వేంకటేశ్వరస్వామి దర్శనం నిమిత్తం తిరుపతి వెళ్లారు. దర్శనానంతరం ఈ నెల 7న నగరంలోని కనకదుర్గమ్మ దర్శనార్థం ఇంద్రకీలాద్రికి వచ్చారు. దర్శనానంతరం కొండ దిగారు. కుటుంబసభ్యులతో నడుచుకుంటూ వస్తున్న యువతి కనిపించలేదు. తల్లితండ్రులు, బంధువులు వెదికినప్పటికీ ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారితో పాటు వచ్చిన శ్రీను అనే యువకుడు కూడా కనిపించకపోవడంతో అతడిపై అనుమానం ఉన్నట్టు యువతి తండ్రి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పలు రైళ్లకు రామవరప్పాడు స్టేషన్‌లో తాత్కాలిక హాల్ట్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ-రాయనపాడు మధ్య జరుగుతున్న థర్డ్ లైన్ పనుల కారణంగా 5రోజుల పాటు పలురైళ్లను నగరంలో కాకుండా రామవరప్పాడు రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేయనున్నారు. విశాఖపట్నం - లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-షిర్డీ నగర్, నర్సాపురం-నాగర్‌సోల్, మచిలీపట్నం-బీదర్, లోకమాన్య తిలక్ టెర్మినల్-విశాఖపట్నం, నాగర్‌సోల్-నర్సాపూర్, బీదర్-మచిలీపట్నం రైళ్లు విజయవాడ స్టేషన్‌లో ఆగవు. రామవరప్పాడు స్టేషన్‌లోనే ఆగుతాయి.

ఇంకా నిదానమేల..?

- నత్తనడకన వీఆర్ సిద్ధార్థ పై ఓవర్ వంతెన పనులు
- పెండింగ్ పడిన వంతెన సౌండ్ ప్రూఫింగ్ పనులు
- వంతెన మీదుగా వందడుగుల రోడ్డుపై ప్రయాణానికి ప్రజల ఎదురుచూపులు
- టీడీపీ ప్రభుత్వంలోనైనా సాకారమయ్యేనా?



వంతెనకు ఇరు వైపులా వాహనాల పార్కింగ్

పెనమలూరు, జూలై 8: కానూరు వందడుగుల రోడ్డును అనుసంధానించే వీఆర్ సిద్ధార్థ కళాశాల పంట కాల్వ రోడ్డు వంతెన ప్రయాణికులకు అందుబాటులోకి రాకపోవడంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై ప్రయాణానికి ఎప్పుడు అవకాశం వస్తుందా, బందరు రోడ్డుపై ట్రాఫిక్‌ను తప్పించుకొనే రోజులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పెండింగ్ పడిన వంతెన పనులు ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో బోడె ప్రసాద్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కళాశాల యాజమాన్యాన్ని ఒప్పించి బందరు రోడ్డుకు సమాంతరంగా పంట కాల్వరోడ్డులో రూ.11కోట్ల అంచనాతో 350 మీటర్ల పొడవున 50 అడుగుల ఎత్తున నిర్మాణం తలపెట్టిన వంతెన నిర్మాణ బాధ్యతలను స్వయంగా కళాశాల యాజమాన్యమే చేపట్టింది. దాదాపు 90శాతం పూర్తవగా ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన 10 శాతం పనులు అటకెక్కాయి. స్థానిక మునిసిపాలిటీ నిధులు రూ.50లక్షలు, సీఆర్డీయే రూ.50లక్షల నిధులతో సౌండ్ ప్రూఫింగ్, లైటింగ్ పనులు పూర్తి చేయడం, తదనంతరం కళాశాల యాజమాన్యం రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా తాడిగడప మునిసిపాలిటీ నుంచి 2 విడతల్లో రూ.40 లక్షల నిధులు సీఆర్డీఏకు దఖలు పడ్డాయి. కానీ సీఆర్డీయేను గత ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో నిధుల లేమితో వంతెన సౌండ్ ప్రూఫింగ్ పనులు, లైటింగ్ పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ పనులు పూర్తయిన అనంతరం కళాశాల యాజమాన్యం వంతెనపై రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. సౌండ్ ప్రూఫింగ్ పనులు పెండింగ్ పడడంతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందనే భావనలో కళాశాల యాజమాన్యం రోడ్డును పూర్తి చేసేందుకు చొరవ చూపలేదు. దీంతో టీడీపీ అధికారంలోకి వచ్చాక వంతెన పనులను శరవేగంతో చేపడతారని ప్రజలు ఎదురు చూస్తున్నా ఇంతవరకు ప్రారంభించలేదు. పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ప్రారంభమై ఆటోనగర్ మీదుగా సనత్‌నగర్, కానూరును అనుసంధానిస్తూ కొనసాగే పంటకాల్వ రోడ్డు కళాశాల వద్ద వంతెన పూర్తి కాకపోవడంతో వందడుగుల రోడ్డుతో కలవలేకపోతోంది. పైగా వంతెనపై ప్రయాణాలు లేకపోవడంతో రాత్రిళ్లు గంజాయి సేవనం, మద్యపానం లాంటి అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. దీంతో స్థానికులు అటు వైపు వెళ్లాలంటేనే బెంబేలెత్తుతున్నారు. మునిసిపల్, సీఆర్డీయే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కళాశాల యాజమాన్యం సంయుక్తంగా చర్చించి వేలమంది ప్రయాణికులకు సులువుగా ఉండే పంటకాల్వ రోడ్డు వంతెనను వీలైనంత త్వరలో పూర్తి చేస్తారని ప్రయాణికులు ఆశిస్తున్నారు.

రెండు నెలల్లో పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే

గత ప్రభుత్వంలో పెండింగ్ పడిన పంటకాల్వ రోడ్డు వంతెన పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు పూర్తి చేసి 2నెలల్లోనే వంతెన నిర్మాణం పూర్తికి కృషి చేస్తాం. చిన్న చిన్న ఇబ్బందులతో వంతెన పనులు పెండింగ్ పడ్డాయని గుర్తించాం. గత నెల 27న ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులతో వంతెన పూర్తి గురించి చర్చించాం. వీలైనంత త్వరలోనే వంతెన పూర్తిచేసి ప్రజల వెతలు తీరుస్తాం.


అసంపూర్తిగా వంతెన సౌండ్ ప్రూఫింగ్ పనులు


గూడవల్లిలోని భూములను పరిశీలిస్తున్న దుర్గగుడి ఈవో రామారావు


ధర్మపథం వేదికపై నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

గూడవల్లిలోని కోదండరామాలయ
భూముల వేలానికి రంగం సిద్ధం

వన్‌టౌన్, జూలై 8: దుర్గగుడి అనుబంధ దత్తాలయంగా ఉన్న గూడవల్లిలోని కోదండరామాలయ భూముల వేలానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు ఈవో రామారావు తెలిపారు. గూడవల్లిలో రోడ్డుపక్కనున్న సర్వే నెంబరు 207లోని 7.66 ఎకరాల భూమిని ఆయన సోమవారం పరిశీలించారు. అక్కడున్న భూమి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ భూమిని కౌలుకిచ్చేందుకు వేలం వేయడానికి సన్నాహాలు చేస్తున్నామని ఈవో తెలిపారు. సర్వేకు కూడా దరఖాస్తు చేశామని, సరిహద్దులు ఖరారు చేసుకుని, సంబంధిత చర్యలు తీసుకుంటామన్నారు, రోడ్డుపక్కనే విలువైన భూమి కోదండరామాలయానికి భూమి ఉందన్నారు. ఈవో వెంట ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో జే శ్రీనివాసు, ఆ ప్రాంత రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయ స్వర్ణతాపడానికి విరాళం

దుర్గమ్మ ప్రధాన ఆలయ గోపుర స్వర్ణతాపడానికి హైదరాబాద్ గుడిమల్కాపూర్‌కు చెందిన ఉల్లగంటి వనజ, సుబ్బారావు రూ.1,00,001, అమెరికాలోని ఫ్లోరిడా శాండిగోకు చెందిన రాచర్ల శరత్, కుటుంబ సభ్యులు రూ.1,00,001 విరాళం అందచేశారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన భక్తులు ఏఈవో రమేష్ ద్వారా చెక్కురూపంలో విరాళం అందచేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతలకు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన

దుర్గమ్మ ఆలయంలోని ధర్మపథం వేదికపై సోమవారం సాయంత్రం విశాఖపట్నానికి చెందిన సాయి సురేఖ అకాడమీకి చెందిన అల్లాడ భానురేఖ ఆధ్వర్యంలోని భక్తబృందం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలను ఇచ్చింది, 20 కీర్తనలకు కళాకారులు నాట్యం చేశారు.హావభావాలు, ఆహార్యంలో తమశైలిని ప్రదర్శించి ఆహూతుల నుంచి హర్షధ్వానాలను అందుకున్నారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భాస్కరరావు

మంత్రి నాదెండ్ల మనోహర్‌తో వర్తక ప్రతినిధుల సమావేశం

ధర్నాచౌక్, జూలై 8: స్థానిక ఏపీ సివిల్ సప్లయిస్ కార్యాలయంలో రాష్ట్ర ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో అన్ని జిల్లాల వర్తక ప్రతినిధులు, రైస్‌మిల్లు యాజమానులతో సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు మంత్రితో చర్చించారు. దేశవాళీ రకం కందిపప్పు రేషన్ కార్డుకు కేజీ రూ.160 చొప్పున, బియ్యం ఒక రకం రూ.49, వేరొక రకం రూ.48కి రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లలో విక్రయించేందుకు వర్తకులు, రైస్‌మిలర్స్‌ను భాస్కరరావు ఒప్పించడం జరిగింది. అనంతరం మంత్రికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు.


ప్రజా సమస్యలు వింటున్న డీఆర్వో శ్రీనివాసరావు

ప్రజల అర్జీలకు పరిష్కారం చూపండి: డీఆర్వో

కృష్ణలంక, జూలై 8: ప్రభుత్వ ఆకాంక్షను నెరవేర్చేలా అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వల్లభనేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్జీలను అలసత్వం లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, హౌసింగ్ పీడీ రజనికుమారి, డీఎంహెచ్‌ఓ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, మార్క్‌ఫెడ్ డీఎం నాగమల్లిక, వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, డీఐపీఆర్‌ఓ యు.సురేంద్రనాథ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


బహుమతులతో ఎంపికైనవారు, ముఖ్య అతిథులు

రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి పలువురి ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, జూలై 8: కృష్ణాజిల్లా చెస్ అండర్-19 టోర్నీలో తొలి 4 స్థానాల్లో నిలిచిన వారిని ఈ నెల 18, 19న నంద్యాల్లో జరిగే రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి పంపుతున్నట్టు నగరానికి చెందిన జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్ఎం.ఫణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడలో ఆదివారం ఈ టోర్నీ జరిగిందన్నారు. బాలుర విభాగంలో బి. వరుణ్‌తేజ్, ఈ లలిత్ కౌశిక్, యు.హర్షిత్‌సాయి, జి.అజయేంద్ర, బాలికల విభాగంలో కె.భువన, పి.నవ్య సాహితి, ఏ అక్షయ, పి.గీతిక తొలి 4స్థానాల్లో నిలిచారు. వీరికి త్రివేణి స్కూల్ డైరెక్టర్ ఎం. శైలజ, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణు, అన్నపూర్ణ మీల్స్ అండ్ క్యాటరింగ్ డైరెక్టర్ యు.అనురాధ పాల్గొని బహుమతులను అందజేశారు.


మునిసిపల్ కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

కొత్త ప్రభుత్వంలో పెరిగిన పనిభారం

వన్‌టౌన్, జూలై 8: కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కాకుండానే మునిసిపల్ కార్మికులపై పనిభారం పడిందని సీఐటీయూ అనుబంధ సంస్థ మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. సోమవారం కాశేశ్వరరావు మార్కెట్ వద్ద ఉన్న శానిటరీ కార్యాలయం వద్ద కార్మికులతో జరిగిన సమావేశంలో యూనియన్ నగరాధ్యక్షుడు జ్యోతిబసు, కార్యనిర్వాహక కార్యదర్శి జీ ప్రవీణ్, సిటీ కార్యదర్శి వీ సాంబులు మాట్లాడారు. అప్కోస్ కార్మికులకు నెల బకాయిలివ్వాలని, యూనిఫారం, చెప్పులు కొబ్బరినూనె ఇవ్వాలని, ఆదివారం పూర్తి సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకుండానే ఉద్యోగులపై పనిభారం పడిందన్నారు. కార్మికులను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు తీసుకు వెళుతున్నారన్నారు. రవాణా చార్జీలు అల్పాహారం తదితరాల వ్యయాన్ని కార్మికులే భరించాల్సి వస్తోందన్నారు. కార్మికుల పోస్టులను భర్తీచేయాలని కోరారు, ఈనెల 10న జరగనున్న డిమాండ్స్ డేలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వెలంపల్లి అనుచరుడిపై దాడి!

- నలుగురు టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు
- తమను కులం పేరుతో బుజ్జి దూషించాడని టీడీపీ కార్యకర్తల ఫిర్యాదు

విజయవాడ - ఆంధ్రజ్యోతి: మాజీ మంత్రి, వైసీపీ నేత వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అనుచరుడు పల్లపోతు మురళీకృష్ణ అలియాస్ కొండపల్లి బుజ్జిపై దాడి జరిగింది. నగరంలోని అయోధ్యనగర్‌లోని లోటస్ ల్యాండ్ మార్క్‌లోని ఆయన నివాస సమీపంలో సోమవారం ఉదయం ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో నలుగురు టీడీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. వైసీపీ నేత కొండపల్లి బుజ్జి ఫిర్యాదులో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు 2 ద్విచక్ర వాహనాలపై వచ్చి అకారణంగా తనపై దాడి చేసి కొట్టారని, హత్యాయత్నం చేశారన్నారు. ఈమేరకు అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి కె.మహేంద్రనాథ్ (బాబీ), గొట్టుముక్కల వెంకటేశ్వరరావు (వెంకీ), బెజ్జం జైపాల్, షేక్ గౌస్‌బాషాను



అదుపులోకి తీసుకున్నారు. వీరంతా టీడీపీ కార్యకర్తలే. వీరిలో బెజ్జం జైపాల్ టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. మరోవైపు కొండపల్లి బుజ్జి తమను కులంపేరుతో దూషించాడని ఆరోపిస్తూ బెజ్జం జైపాల్ అజిత్ సింగ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను, తన స్నేహితుడు ఎస్‌కే గౌస్ బాషా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా డాబాకొట్లు రైతు బజార్ సమీపంలో కొండపల్లి బుజ్జి మరో నలుగురు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ తమపై దాడి చేసినట్టు జైపాల్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పారిస్ ఒలింపిక్స్‌కు ధీరజ్ పయనం

విజయవాడ స్పోర్ట్సు, జూలై 8: ఫ్రాన్స్ దేశంలో ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే పారిస్ ఒలింపిక్స్‌లో బరిలో దిగేందుకు నగర యువ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ భారత జట్టు సభ్యులతో సోమవారం రాత్రి అక్కడకు పయనం కానున్నారు. నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ వద్ద శిక్షణ పొందుతున్న ధీరజ్ ఒలింపిక్స్‌లో వ్యక్తిగత, టీమ్,మిక్స్‌డ్ విభాగాల్లో బరిలో దిగుతున్నాడు. ధీరజ్ ఆరేళ్ల వయస్సులోనే ఓల్గా ఆర్చరీ అకాడమీలో దివంగత ఇండియా ఆర్చరీ కోచ్ లెనిన్ వద్ద శిక్షణ ప్రారంభించాడు. రికర్వ్ విభాగంలో మినీ నేషనల్స్, సబ్ జూనియర్ నేషనల్స్ స్కూల్ గేమ్స్, సింగపూర్ ఇండోర్ నేషనల్స్ లాంటి పోటీల్లో తొలుత విజయాలతో దూసుకెళ్లాడు. లెనిన్ మరణానంతరం చెరుకూరి సత్యనారాయణ ప్రత్యేక పర్యవేక్షణలో సబ్ జూనియర్, సీనియర్, ఖేలో ఇండియా, నేషనల్ గేమ్స్, ఆలిండియా ఇంటర్ వర్సిటీ తదితర దేశవాళీ టోర్నీల్లో ప్రతిభ చాటి రాష్ట్రానికి అనేక చాంపియన్ షిప్‌ల్లో మెడల్స్ అందించాడు. అంతర్జాతీయ పోటీలకు సన్నద్ధమై నాలుగేళ్ల నుంచి అవిరళ కృషితో జాతీయ జట్టులో స్థానం సంపాదించి ఏషియా కప్, ఏషియన్ చాంపియన్ షిప్, జూనియర్ వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్ 2018, పోలాండ్, వరల్డ్‌కప్ ఏషియా గేమ్స్-2022ల్లో దేశానికి బంగారు, రజత, కాంస్య పతకాలను అందించి విజయవాడకు గుర్తింపును తీసుకువచ్చాడు. 2023 వరల్డ్‌కప్‌లో సత్త చాటి పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. భారత జట్టులో తొలిసారిగా దేశానికి పురుషుల బెర్త్‌ను సాధించిన ధీరజ్ ఒలింపిక్స్‌కు 10 రోజులు ముందుగానే అక్కడకు బయల్దేరాడు. ఈ సందర్భంగా పతకాలతో ఒలింపిక్స్ నుంచి తిరిగి రావాలని ఓల్గా ఆర్చరీ అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ కోశాధికారి బొమ్మదేవర శ్రావణ్‌కుమార్, టెక్నికల్ కమిటీ ఛైర్మన్ బెవర వెంకటరమణ శుభాకాంక్షలను తెలిపారు.

అగ్నిమాపకశాఖ ఆధునికీకరణకు ప్రణాళిక

» తక్షణ అవసరాలకు తొలి ప్రాధాన్యం: హోంమంత్రి అనిత

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తుఫాన్లు, వరదలు, రోడ్డు, రైలు, అగ్ని ప్రమాదాలను పూర్తి స్థాయిలో ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమయ్యేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. సోమవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖపై మంత్రి సమీక్షించారు. వచ్చే ఐదేళ్లలో అగ్నిమాపకశాఖ ఆధునికీకరణకు ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తక్షణ అవసరాలకు ప్రాధాన్యమిచ్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. సమావేశంలో హోంశాఖ కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, ఫైర్ డీజీ శంకబ్రతబాగ్చి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: మంత్రి డోలా

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకూ సత్వరమే పరిష్కారం చూపుతామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల అసోషియేషన్ ప్రతినిధులు, రాష్ట్ర గ్రామ, వార్డ్ సచివాలయ అసోషియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. సాధ్యమైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. విభిన్న ప్రతిభావంతులకు అందించే వినికిడి యంత్రాలు, ప్లాస్టిక్ పరికరాలు వైసీపీ ప్రభుత్వం నిలిపేసిందని, వారందరికీ తాము ఆయా పరికరాలను అందిస్తామని హామీ ఇచ్చారు. విశాఖ జిల్లా గాజువాకకు చెందిన క్యాన్సర్ బాధితుడికి పింఛను మంజూరుకు హామీ ఇచ్చారు. తమపై పనిభారం పెరిగిపోతోందని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తమలో స్కిల్స్ అధికంగా ఉన్నవారిని పాఠశాలలు, కళాశాలల్లో వినియోగించుకోవాలని కోరారు. సచివాలయ వ్యవస్థపై అధ్యయనం చేసి నూతన విధానాలు రూపొందిస్తామని మంత్రి తెలిపారు.

ఇన్సూరెన్స్ ప్రీమియంలపై
జీఎస్టీని రద్దు చేయించండి

- ఎంపీ కేశినేని శివనాథ్‌కు వినతి



విద్యాధరపురం, జూలై 8: ఎల్ఐసీ ప్రీమియం, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీని పూ ర్తిగా రద్దు చేయించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) నేతలు కోరారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని చిన్నిని సోమవారం ఐసీఈయూ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను వివరించారు. ట్యాక్స్ మినహాయింపు రద్దు చేయడం, జీఎస్టీ విధించడం వలన పాలసీలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపడం లేదని తదితర సమస్యలపై పార్లమెంట్ సమావేశాలలో చర్చించాలని ఎంపీని కోరారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారు. అనంతరం వారు ఎంపీకి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సౌత్ సెంట్రల్ జోన్ జాయింట్ సెక్రటరీ జి.సురేష్, నేతలు సీహెచ్ కళాధర్, ఎండీ రహీముద్దిన్, వివిఎస్ సాయి, గుర్రం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీ చిన్నిని కలిసిన గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతలు



గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని చిన్నిని సోమవారం గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎం.శశిధర్, పలువురు నేతలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్, ప్రమోషన్ చానెల్ ఏర్పాటు, వంటి సమస్యలను గురించి ఎంపీకి వివరించారు. దీనిపై స్పందించిన ఎంపీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫెడరేషన్ నేతలు పి.హేమంతి, ఎంఎస్ఆర్ శాస్త్రి, కమలాకర్, కే.ప్రభు ఉన్నారు.

ఐఎఫ్‌టీయూకు అనుబంధంగా మారిన
బీసీడబ్ల్యూయూ భవన నిర్మాణ కార్మికులు



ధర్నాచౌక్, జూలై 8: జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (బీసీడబ్ల్యూయు)లో నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లోరి కార్యవర్గాలు పెద్దఎత్తున భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ)కు అనుబంధంగా కలిశాయి. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జాతీయ నేత ఎ.కృష్ణ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు తమ సంఘంలో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. భవన, ఇతర నిర్మాణరంగాల్లో పనిచేస్తున్న కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడంతో నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు ఇసుక ఇవ్వడంలో అనేక ఆంక్షలు పెట్టడంతో ఉపాధి లేక నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షుడు హరికృష్ణరెడ్డి అధ్యక్షత వహించగా ఎస్‌కే.మీరావలి, కనకరావు, కొప్పుల కుమార్, పెద్దిరాజు, బ్రహ్మయ్య, బత్తుల కాశీ, వెంకట సుబ్బారావు, తిరుమలశెట్టి సత్యనారాయణ, విజయరావు పాల్గొన్నారు.

అంబటికి మతిభ్రమించింది: మాజీమంత్రి ఉమా

గొల్లపూడి: అధికారం కోల్పోయిన తర్వాత మతిభ్రమించి మాజీమంత్రి అంబటి రాంబాబు మీడియా ముందుకొచ్చి మాట్లాడుతున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. గొల్లపూడిలో సోమవారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రెండు రాష్ట్రాల్లో పరిష్కారం కాని సమస్యలు, షెడ్యూల్ 9, 10 ఆస్తుల పంపకాలపై బాధ్యత తీసుకోకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో పరదాలు కప్పుకున్న జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు కడుపుబ్బరం కనబడుతోందన్నారు. ఫేక్ న్యూస్ తామే పంపి వివరణ ఇవ్వాలని మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. గుడివాడ గుట్కా నాని, వంశీ, జోగి రమేశ్, అంబటిలు పంచ భూతాలను దోచేసి సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారన్నారు.



తిరుమలలో గదులు హైజాక్!

- రూ.100 వసతి గది.. వెయ్యికి విక్రయం
- గదులు దొరకని భక్తులే టార్గెట్
- ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది

తిరుమల, జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులే వారి టార్గెట్. దర్శన సమయం వచ్చే వరకు నిరీక్షించడానికి వసతి అవసరం కనుక అలాంటి వారినే ఎరవేస్తారు!. టీటీడీ వంద, 50 రూపాయలకు అద్దె కిచ్చే గదిని ముందుగానే బుక్ చేసుకుని హైజాక్ చేసి, గదులు దొరకని భక్తులకు అప్పటికప్పుడు రూ.వెయ్యి రూపాయలకు అంటగడతారు. డిమాండ్‌ను బట్టి అంతకుమించి వసూలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనావైఫల్యం పుణ్యమాని పుణ్యక్షేత్రంలో రోజూ కొందరు ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది. తిరుమలలో గదుల దళారులను అరికట్టేందుకు పోలీస్, విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణలో ఇలా నివ్వెరపోయే అంశాలు బయటపడుతున్నాయి. మార్ఫింగ్ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో గదులను పొంది బ్లాక్‌లో విక్రయించేందుకు నార్త్ ఇండియా నుంచి కొంద రు తిరుపతి, రేణిగుంటల్లో తిష్ఠవేయడం ఆశ్చర్యపరుస్తోంది.

అక్రమార్జనకు దందా సాగించేదిలా!

ఆధార్ కార్డులో ఫొటో మార్ఫిడి చేసి గదులను బుక్ చేసుకోవడం ద్వారా అక్రమాలకు పాల్పడుతున్న వైనం మూడురోజుల క్రితం వెలుగు చూసిన విషయం తెలిసిందే. తొలుత సమీప బంధువు ఆధార్ కార్డుతో గదిని పొంది, ఆ తర్వాత గది కోసం నిరీక్షించే భక్తుడికి బ్లాక్‌లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు విక్రయించడం, విక్రయించే క్రమంలోనే ఆ భక్తుడి నుంచి ఆధార్ తీసుకోవడం, తిరిగి భక్తుడి నుంచి పొందిన ఆధార్ జిరాక్స్‌లోని ఫొటోను మార్చి దళారీ ఫొటో జతచేసి తిరిగి గదిని పొందే పెద్ద స్కాంను భద్రతాధికారులు గుర్తించారు. నవకిశోర్ అనే దళారిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఇదే తరహాలో 25 నుంచి 30 మంది దళారులు గదుల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నట్టు తేలింది. కేవలం గదుల ద్వారా అక్రమాలకు పాల్పడేందుకే మహారాష్ట్ర నుంచి కొంతమంది కుటుంబాలతో వచ్చి తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో గదులకు అద్దెకు తీసుకుని నివాసముంటున్నట్టు కూడా తేలింది. తెలంగాణ, కర్ణాటకల నుంచి కూడా మరికొంతమంది తిరుపతికి వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకున్నట్టు తెలిసింది. ఉదయం భక్తుల్లా తిరుమలకు వచ్చి గదుల ద్వారా వచ్చే సొమ్మును జేబులో వేసుకుని తిరిగి కొండదిగేస్తున్నట్టు విచారణలో తేలింది. దీన్నిబట్టి గదులను బ్లాక్‌లో విక్రయించడం ద్వారా ఏ స్థాయిలో సంపాదన ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒక్కొక్కరు కనీసం రూ.60వేల నుంచి లక్ష వరకు అక్రమంగా సంపాదిస్తుండగా.. సమయానికి గదులు దొరక్క భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే తిరుమలలో ఇలాంటి దుస్థితి నెలకొందని, కూటమి సర్కారు ప్రక్షాళన చేపట్టి ఇలాంటి అక్రమాలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

క్రిమినల్ చట్టాలపై తమిళనాట ఏకసభ్య కమిషన్

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈ నెల ఒకటి నుంచి అమల్లోకి తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలకు రాష్ట్రస్థాయిలో సాధ్యమైన సవరణలు పరిశీలించేందుకు తమిళనాడు ప్రభుత్వం మద్రాసు హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎం. సత్యనారాయణన్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసింది. కమిషన్ కొత్తచట్టాలను పరిశీలిస్తుంది. రాష్ట్రస్థాయి న్యాయవాదుల సంఘంతో సహా పలువురితో సంప్రతిస్తుంది. సాధ్యమయ్యే సవరణలపై నెలలోపు ప్రభుత్వానికి నివేదికను అందజేస్తుంది. రాష్ట్రాల అభిప్రాయాలు వినకుండా అమలులోకి తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ అంశంపై సోమవారం చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. సీనియర్ మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, హోంశాఖ కార్యదర్శి పి. అముద డీజీపీ శంకర్‌జివాల్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలలో ఎలాంటి సవరణలు చేయాలన్న విషయంపై ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించారు.

బెంగాల్‌లో వీసీల ఎంపికకు సుప్రీం కమిటీ

న్యూఢిల్లీ, జూలై 8: పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్ల ఎంపికకు సుప్రీంకోర్టు సోమవారం కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ యు.యు.లలిత్ ఆధ్వర్యంలో అయిదుగురు సభ్యులతో సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీని నియమించింది. ఈ మేరకు జస్టిస్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. వైస్‌ఛాన్సలర్ల నియామకంపై గవర్నర్ సి.వి.ఆనంద్ బోస్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం నెలకొంది. చాన్సలర్ హోదాలో గవర్నర్.. వైస్‌చాన్సలర్లను స్వయంగా నియమించడం చట్టబద్ధమేనని గత ఏడాది హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మధ్యేమార్గంగా న్యాయస్థానం ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటుకు గవర్నర్‌తో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగీకరించడంతో ఈ మేరకు ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. రెండు వారాల్లోగా ఈ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ కమిటీ ప్రతి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ పదవికి ముగ్గురు అర్హుల పేర్లను అక్షర క్రమంలో సిఫార్సు చేయాల్సి ఉంటుంది. ఎంపిక ప్రక్రియను మొత్తం మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. ఈ పేర్లపై రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యంతరం ఉంటే అందుకు కారణాలను వివరిస్తూ రెండు వారాల్లో గవర్నర్‌కు సమాచారం పంపించాల్సి ఉంటుంది. ఈ కమిటీ జరిపే ప్రతి ఫలప్రద సమావేశానికి రూ.3 లక్షలు వంతున జస్టిస్ లలిత్‌కు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

బెయిల్ ఇచ్చిన తర్వాత నిఘా రాజ్యాంగ వ్యతిరేకం

న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం ఒక నిందితుడికి బెయిల్ ఇచ్చిన తర్వాత అతడిపై పోలీసులు నిరంతర నిఘా ఉంచాలన్న షరతును విధించడం రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇది నిందితుడి వ్యక్తిగత స్వేచ్ఛలో చొరబడడమేనని న్యాయమూర్తులు జస్టిస్ ఎఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం సోమవారం ఇచ్చిన తీర్పులో స్పష్టం చేసింది. మాదకద్రవ్యాల కేసులో అరెస్టయిన ఒక నైజీరియన్ జాతీయుడికి బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ హైకోర్టు.. అతడు తన గూగుల్ మ్యాప్ వివరాలను స్థానిక పోలీసులకు అందజేయాలని షరతు విధించింది. దీనిపై అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. తానెక్కడో తెలిపే విధంగా గూగుల్ మ్యాప్ వివరాలను నిందితుడు తెలియజేస్తే ఇక బెయిల్ ఇచ్చి ప్రయోజనమేమిటని ప్రశ్నించింది. ఏ కోర్టూ ఇలాంటి షరతులను విధించలేదని స్పష్టం చేసింది. అది నిందితుడి వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూడడమేనని అభిప్రాయపడింది. నిందితుడు దేశం విడిచిపోకుండా నైజీరియన్ రాయబార కార్యాలయం జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరు కావాలంటూ విధించిన షరతుల్లో జోక్యం చేసుకోలేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించి, హేతుబద్ధమైన బెయిల్ షరతులు విధించేలా చూడడంలో కీలక పాత్ర పోషిస్తుందని న్యాయనిపుణులు భావిస్తున్నారు.

బీజేపీ ఎంపీ అభినందన సభలో మద్యం



బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో బీజేపీ ఎంపీ అభినందన సభలో పోలీసు బందోబస్తు నడుమ మద్యం పంపిణీ చేసిన వైనం పెనుదుమారం రేపింది. చిక్కబళ్లాపుర ఎంపీ .సుధాకర్‌కు నెలమంగల తాలూకా బావికెరె గ్రామ పరిధిలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. బీజేపీ-జేడీఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యకర్తలు, ప్రజల కోసం 650 కేసుల బీర్లు, 450 కేసుల మద్యం బాటిళ్లు సిద్ధం చేశారు. సభా ప్రాంగణంలోనే మద్యం పంపిణీ కౌంటర్ ఉండడంతో పెద్ద ఎత్తున తోపులాట జరుగుతుందని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ.. కార్యకర్తలకు మద్యం పంపిణీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, బహిరంగంగా మద్యం పంపిణీ చట్టవిరుద్ధమని, 20 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ మద్యం పంపిణీ చేయలేదని ఎంపీ సుధాకర్ స్పష్టం చేశారు.

ఫ్రాన్స్ పార్లమెంటులో హంగ్!

పారిస్, జూలై 8: ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీ(పార్లమెంటు)లో హంగ్ ఏర్పడనుంది. 577 స్థానాలున్న దిగువ సభకు ఆదివారం ఎన్నికలు నిర్వహించగా, ఏ కూటమికీ మెజారిటీ మార్కు 289 సీట్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సోమవారం రెండో రౌండు ఫలితాలు ప్రకటించే సమయానికి వామపక్ష పార్టీల కూటమి 180కిపైగా, దేశాధ్యక్షుడు మేక్రాన్‌కు చెందిన సెంటరిస్ట్‌ల కూటమి 160కిపైగా, మరైన్ లీ పెన్స్‌కు చెందిన అతివాద నేషనల్ ర్యాలీ పార్టీ నేతృత్వ కూటమి 140కిపైగా సీట్లు గెలుపొందాయి. దీంతో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు దేశాధ్యక్షుడు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఓటమి నేపథ్యంలో ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేస్తానని గాబ్రియేల్ అట్టల్ ప్రకటించారు.

కారుపై ఏనుగు దాడి.. తప్పించుకున్న కుటుంబం



ఏనుగుదాడిలో దెబ్బతిన్న కారు

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని కొడగు జిల్లా పొన్నంపేట వద్ద ఆదివారం ఓ కుటుంబం వెళుతున్న కారుపై ఏనుగుదాడి చేసింది. ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకొచ్చిన ఏనుగు తొండం, కాలుతో కారును ఛిద్రం చేసింది. కారులో ఉన్నవారు కిందకు దిగి పరుగులు తీసి ప్రాణాలతో బయటపడ్డారు. విరాజ్‌పేట్‌కు చెందిన యశ్వంత్ కుటుంబం కుర్చి గ్రామం మీదుగా వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కారులో ఉన్న యశ్వంత్, ఆయన భార్య, ఇద్దరు పిల్లలు పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. నిమిషాల వ్యవధిలో కారును ఏనుగు ధ్వంసం చేసింది. అటవీశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, నిరంతరం ఏనుగులు ఇలా రోడ్లపైకి వస్తుంటాయని కుర్చి గ్రామస్థులు మండిపడ్డారు.

‘ఉక్కు’ కోసం త్యాగాలు చేయండి

- జీతాలు, అలవెన్సులూ వదులుకోండి
- స్వచ్ఛందమే... బలవంతమేం లేదు
- ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం ప్రతిపాదన
- పీఎస్‌యూ ఇలాంటి ప్రతిపాదన చేయడం ఇదే ప్రథమం
- ఆరేళ్లుగా అమలుకాని వేతన ఒప్పందం
- సక్రమంగా కార్మికులకు అందని జీతాలు

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)



‘సంస్థను నిలబెట్టుకోవాలంటే మీరు త్యాగాలు చేయాల్సిందే. ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. తలోక చేయి వేయకపోతే మనుగడ కష్టం. ఎవరి స్థాయిలో వారు.. జీతాలు, అలవెన్సులూ వదులుకోవాలి. అంతా స్వచ్ఛందమే. బలవంతమేమీ లేదు. ఇష్టమైతే ఫార్మేట్‌లో వివరాలు పూర్తి చేయండి’ అంటూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ).. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ యాజమాన్యం తన కార్మికులకు, ఉద్యోగులకు విజ్ఞప్తి చేసింది. ‘ఉక్కు’ను నిలబెట్టడానికి కార్మికులు, మేధావులు అనేక ప్రతిపాదనలను ప్రభుత్వం ముందు ఉంచారు. వాటిని ఈషణ్మాత్రం పట్టించుకోకుండా యాజమాన్యం సంస్థ పరిరక్షణకేనంటూ కార్మికులు, ఉద్యోగుల పొట్టకొట్టడానికి చూడడం సరైంది కాదని కార్మికలోకం స్పష్టం చేస్తోంది. ఇప్పటికే కటింగుల పేరుతో అలవెన్సుల్లో కోత పెడుతున్నారని, జీతాలు ఏనాడూ సకాలంలో అందడం లేదని, అనేక మంది అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూలై 9 వస్తున్నా.. జూన్ నెల జీతం ఇంకా అందలేదని వారు గుర్తు చేస్తున్నారు. మానవ వనరుల విభాగం(హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్) ద్వారా ఈ వింత ప్రతిపాదనను యాజమాన్యం విడుదల చేసింది. కొంత కాలం పాటు ఉద్యోగులు ఇలాంటి త్యాగాలు చేయకపోతే సంస్థను నిలబెట్టుకోవడం కష్టమని ప్రకటించింది. విశాఖపట్నంలో ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఇలాంటి ప్రతిపాదన చేయడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. ‘ఎగ్జిక్యూటివ్ అధికారులు వారికి వచ్చే అలవెన్సులు ఏమేమి వెనక్కి ఇచ్చేస్తారో తెలిపాలి. నాన్ ఎగ్జిక్యూటివ్స్ అయితే ఎనర్జీ అలవెన్స్ ఎంత వదిలేస్తారో చెప్పాలి. అలాగే నాన్ ఎగ్జిక్యూటివ్‌లు క్యాంటీన్ రాయితీ వదులుకోవాలి. నైట్ షిఫ్ట్ అలవెన్స్, ఎల్‌టీఈ (ట్రావెలింగ్ అలవెన్స్), ఇంకా ప్రత్యేక అలవెన్సులు ఏమైనా ఉంటే వాటినీ వదులుకోవాలి’ అని సూచించింది.

ఇస్తోందే అంతంత మాత్రం...

స్టీల్ ప్లాంటు యాజమాన్యం గత ఆరేళ్లగా వేతన ఒప్పందం అమలు చేయడం లేదు. పాత వేతనాలనే ఇస్తోంది. నాన్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేసే సగటు ఉద్యోగికి రోజుకు బేసిక్+డీఏ కలిపి రూ.1,400 వస్తోంది. ఇవి కూడా సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులు అప్పులు చేయవలసి వస్తోంది. ఎనర్జీ అలవెన్స్ కింది రోజుకు రూ.10 మాత్రమే ఇస్తారు. ఇప్పుడు దానిని కూడా వదులుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. క్యాంటీన్ అలవెన్స్ కింద రోజుకు రూ.32 ఇస్తారు. ఇప్పుడు ఆ మొత్తం త్యాగం చేయాల్సిందిగా కోరుతున్నారు. రాత్రి పూట పనిచేస్తే ఆ రోజుకు రూ.90 ఇస్తారు. అత్యంత తక్కువ నైట్ అలవెన్స్ ఇదే. దీనినీ తీసుకుంటామని బెదిరిస్తున్నారు. ఎల్‌టీఈగా పెట్రోల్‌కి రోజుకు రూ.33 ఇస్తున్నారు. టౌన్‌షిప్‌లోని క్వార్టర్‌లో ఉంటూ ప్లాంటుకు రాకపోకలు సాగిస్తేనే రోజుకు పెట్రోల్‌కి రూ.80 ఖర్చు అవుతోంది. ఈ లెక్కన చూసుకుంటే యాజామాన్యమే తిరిగి ఉద్యోగులకు అదనపు మొత్తం ఇవ్వాలి. కానీ దానిని కూడా వదులుకోమంటోంది. స్పెషల్ అలవెన్స్ అంటూ కొందరికి రోజుకు రూ.40 ఇస్తున్నారు. కాలానుగుణంగా పెంచాల్సిన వాటిని పెంచకపోగా 2012లో ప్రకటించి, ఇప్పటికీ కొనసాగిస్తున్న ఆ మొత్తాన్నీ వదులుకోవాలని కోరుతోందంటూ ఉద్యోగులు, కార్మికులు మండిపడుతున్నారు.

ఎంత వదులుకున్నా...

త్యాగాల పేరుతో తాము ఎంత వదులుకున్నా.. ‘సంద్రమంత అవసరంలో, అది ఓ ఇసుక రేణువంతే’ అని వారు వివరిస్తున్నారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంటులో 16 వేల మంది ఉద్యోగులు, కార్మికులు ఉన్నారు. ఇప్పటికే జీతాల్లో సీపీఎఫ్, ఎస్‌బీఎఫ్ అంటూ కొంత కోత విధిస్తున్నారు. ఇప్పుడు మరికొంత యాజమాన్యానికి ఇస్తే కుటుంబాలతో బతికేదెట్లా? అని ప్రశ్నిస్తున్నారు. జీతాలు సక్రమంగా ఇవ్వని యాజమాన్యానికి ఇలాంటి ప్రతిపాదన చేసే అర్హత ఎక్కడదని నిలదీస్తున్నారు. తక్షణమే ఈ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అంతా కలసి సగటున నెలకు రూ.1,000 చొప్పున వదులుకుంటే.. నెలకు రూ.1.6 కోట్లు యాజమాన్యానికి మిగులుతాయి. ఈ మొత్తంతో ప్లాంటును ఆర్థిక కష్టాల నుంచి ఎలా గటెక్కిస్తారని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్లాంటును నెలబెట్టడానికి అనుసరించాల్సిన, చేపట్టాల్సిన చర్యలపై దృష్టిసారించకుండా గంభీరంగా త్యాగాల పేరుతో విజ్ఞప్తులు చేయడం సమస్యకు మసిపూసి మారేడుకాయ చేయడమేనని అంటున్నాయి. యాజమాన్యం కుయుక్తులను కట్టిపెట్టి సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.



తిరుమలలో హడలెత్తించిన పాము

తిరుమల, జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శిలాతోరణం వద్ద సోమవారం పాము(జెర్రిపోతు) భక్తులను హడలెత్తించింది. సుమారు ఏడు అడుగుల పొడవైన ఈపాము సోమవారం మధ్యాహ్నం ఎలుకను తరుముతూ శిలాతోరణం ముందు జనసంచారంలోకి వచ్చింది. పామును గమనించిన భక్తులు పరుగులు తీశారు. సమీపంలోని భద్రతాసిబ్బంది పాములు పట్టే టీ టీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారమిచ్చారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచి పెట్టాడు.

ఎన్‌సీసీ భూములు వైసీపీ గుప్పిట్లో..!

- మాజీ మంత్రి కొట్టు డైరెక్షన్‌లో తతంగం
- ప్లాన్ లేకపోయినా భవన నిర్మాణాలకు జీవీఎంసీ కమిషనర్ పరోక్ష సహకారం
- జనసేన కార్పొరేటర్ మూర్తి ఆరోపణలు



ఎన్‌సీసీ భూముల చిత్రాలను మీడియాకు చూపిస్తున్న జనసేన నేత మూర్తియాదవ్, టీడీపీ నాయకులు

విశాఖపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని అత్యంత ఖరీదైన మధురవాడ ఐటీ హిల్స్ ప్రాంతంలో ఎన్‌సీసీకి కేటాయించిన భూమిని వైసీపీకి చెందిన కొందరు నేతలు బినామీ పేర్లతో స్వాధీనం చేసుకున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. టీడీపీ నేతలతో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. “మధురవాడలో సర్వే నంబర్ 411, 412, 419/1, 419/2, 419/3లలోని 97.3 ఎకరాలను 2005లో అప్పటి ప్రభుత్వం ఎన్‌సీసీకి కేటాయించింది. దీనిలో 10 శాతం భూమిలో హౌసింగ్‌బోర్డు కార్పొరేషన్‌తో కలిసి పేదలకు ఇళ్లు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉద్దేశించారు. మిగిలిన దానిలో 173 విల్లాలు, క్లబ్‌హౌస్‌తో పాటు 22 కమర్షియల్ ప్లాట్‌లు, 32 రెసిడెన్షియల్ ప్లాట్లు అభివృద్ధి చేయాలి. వీటిని విక్రయించడం ద్వారా వచ్చిన ఆదాయంలో 3 శాతం సొమ్మును ప్రభుత్వానికి జమచేయాలి. ఈ నిబంధనతోనే ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం ధర ప్రకారం ఎన్‌సీసీ డబ్బులు చెల్లించడంతో 2010 ఫిబ్రవరిలో ఆ భూమిని కంపెనీకి అప్పగించారు. అయితే, ప్రాజెక్టు పట్టాలెక్కకపోవడంతో 2013, ఫిబ్రవరిలో అగ్రిమెంట్‌ను రద్దు చేసుకుంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీచేసింది. దీనిపై ఎన్‌సీసీ హైకోర్టుకు వెళ్లడంతో 2014, జనవరిలో కోర్టు స్టేటస్ కో ఇచ్చింది. 2016లో సదరు భూమిలో ప్రభుత్వవాటాగా చెల్లించాల్సిన మొత్తానికి 20 శాతం అదనంగా చెల్లిచేందుకు ఎన్‌సీసీ ముందుకు వచ్చింది. దీంతో ప్రభుత్వం ఆ భూమిని ఫ్రీహోల్డ్ చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ భూమిపై కమిటీ వేసి ఫ్రీహోల్డ్ చేయడానికి సుమారు రూ.97 కోట్లు చెల్లించాలని ఎన్‌సీసీని ఆదేశించింది. ఆ మొత్తం కట్టడంతో భూమిని సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేశారు. కానీ, అప్పటి మంత్రి కొట్టు సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, అప్పటి సీఎం జగన్ వ్యక్తిగత కార్యదర్శి కేఎన్ఆర్ తదితరులు ఆ భూమిపై కన్నేశారు. ఎన్‌సీసీ కంపెనీని బెదిరించి రూ.250 కోట్లకు ఆ భూమిని కొట్టు సత్యనారాయణ సోదరుడు కొట్టు మురళి డైరెక్టర్‌గా ఉన్న జీపీఆర్ఎల్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత ఎన్‌సీసీ పేరుతో వ్యవహారం జరుగుతున్నట్టు చూపించి లోపాయికారీగా చక్రం తిప్పారు. ఆ భూమిలో విల్లాల నిర్మాణానికి అనుమతి కోరుతూ జీవీఎంసీకి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆ భూమి కొండ పోరంబోకుగా ఉండడంతో దాని విలువలో 3 శాతం నాలా చార్జీలు చెల్లించి ల్యాండ్ కన్వర్షన్ చేసుకోవాలని, వీఎల్‌టీ కింద రూ.20 కోట్లు జీవీఎంసీకి చెల్లించాలని జీవీఎంసీ కోరింది. అదేసమయంలో ఆ భూమిలో చెరువు ఉన్నట్టు డాక్యుమెంట్లలో ఉన్నా, రెవెన్యూ రికార్డుల్లో మాత్రం కనిపించడం లేదని, కాబట్టి అధికారుల నుంచి స్పష్టత అవసరమని పేర్కొంటూ జీవీఎంసీ చీఫ్ సిటీప్లానర్ ఈ ఏడాది ఫిబ్రవరి 22న రిమార్కులు రాసి షార్ట్ ఫాల్‌లో పెట్టారు. అయినప్పటికీ జీవీఎంసీ కమిషనర్ మాత్రం దీనిని వెనక్కి పంపించకపోవడంతో ఇప్పుడు ‘డీమ్డ్ టుబీ అప్రూవల్’ అయింది. ఆ భూమిలో నిర్మాణాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. కమిషనర్ ఆదేశాల కారణంగానే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అడ్డుకోవడం లేదు” అని మూర్తి యాదవ్ వివరించారు.

ప్రత్యేక రోడ్డు కూడా

ఎన్‌సీసీ భూమికి రెండు వైపులా 80 అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డు ఉన్నా.. కేవలం వారికి మాత్రమే పనికొచ్చేలా మరో 80 అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డును పొందుపరిచారని మూర్తి యాదవ్ తెలిపారు. ఆ రోడ్డుకు అవసరమైన భూమిని ఉచితంగానే జీవీఎంసీకి గిఫ్ట్ డీడ్ ఇస్తామని చెప్పినప్పటికీ, దానికి మళ్లీ రూ.600 కోట్లు విలువైన టీడీఆర్ ఇవ్వాలని ఆ సంస్థ దరఖాస్తు చేయడం, జీవీఎంసీ అధికారులు జారీ చేసేందుకు సిద్ధం కావడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. వైసీపీ ముఖ్యనేతల ప్రోద్బలంతోనే ఎన్‌సీసీ భూమికి మాత్రమే ఉపయోగపడే రోడ్డుని జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి రూ.17 కోట్లు వెచ్చించి రోడ్డు నిర్మించాలని చూసిందన్నారు. దీనికి సంబంధించి మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఇటీవల వరకు పనిచేసిన శ్రీలక్ష్మి జీవో జారీచేశారని తెలిపారు. ఆగమేఘాల మీద ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారన్నారు.

మోదీ.. మీరో శక్తి

- మీ జీవితం ప్రజలకు అంకితం!
- ప్రధానితో రష్యా అధ్యక్షుడు పుతిన్



పుతిన్ అధికారిక నివాసంలో ప్రధాని మోదీ

మాస్కో, జూలై 8: రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ సోమవారం రష్యా చేరుకున్నారు. మాస్కో విమానాశ్రయంలో ఆయనకు రష్యా తొలి ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ఘన స్వాగతం పలికారు. అలాగే ఒకే కారులో మోదీతో కలిసి వెళ్లి, ఆయనకు బస ఏర్పాటు చేసిన హోటల్‌లో దింపారు. అనంతరం మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసానికి చేరుకున్నారు. ఆయన మోదీకి సాదర స్వాగతం పలికారు. వరసగా మూడోసారి ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన మోదీకి అభినందనలు తెలిపారు. ఆయన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని కొనియాడారు. “ముందుగా ప్రధానమంత్రిగా మళ్లీ ఎన్నికైనందుకు మీకు అభినందనలు. ఈ విజయం యాదృచ్ఛికంగా వచ్చింది కాదు. ప్రభుత్వాధినేతగా పదేళ్లుగా మీరు చేసిన పనులకు దక్కిన ఫలితం. మీకు సొంత ఆలోచనలు ఉంటాయి. మీరు చాలా శక్తిమంతమైన వ్యక్తి. భారత్, ప్రజల ప్రయోజనాలకు అవసరమైన ఫలితాలను ఎలా సాధించాలో మీకు బాగా తెలుసు. ఫలితాలు కూడా అలాగే వస్తాయి. భారత్ ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది” అని పుతిన్ మోదీతో చెప్పారు. ఆయనకు ధన్యవాదాలు తెలిపిన మోదీ.. సంస్కరణలు తేవడమే తన సిద్ధాంతమని చెప్పారు. తన ప్రభుత్వ విధానాలకు భారత ప్రజలు ఆమోదముద్ర వేశారన్నారు. మూడోసారి గెలిచిన తాను మూడు రెట్లు ఎక్కువగా పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్పందించిన పుతిన్.. ‘మీ జీవితాన్ని భారత ప్రజలకు అంకితం చేశారు. ఆ విషయం వారికీ తెలుసు’ అని చెప్పారు. అనంతరం ఇరువురు నేతలు కలిసి భోజనం చేశారు.

మోదీకి ఘన స్వాగతం..

రష్యాలో ప్రొటోకాల్ ప్రకారం పుతిన్ తర్వాత స్థాయిలో మంటురోవ్ ఉంటారు. అలాంటి వ్యక్తి స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి మోదీకి స్వాగతం పలకడం ద్వారా చైనాకు గట్టి సంకేతాలు ఇచ్చినట్లయింది. గతంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఉప ప్రధాని స్వాగతం పలకగా.. మోదీ కోసం తొలి ఉప ప్రధాని మంటురోవ్ వెళ్లడం విశేషం. ఈ చర్య ద్వారా రష్యా.. భారత్‌కు ఇస్తున్న ప్రాధాన్యాన్ని చెప్పకనే చెప్పినట్లయింది.

నర్సులపై దాడులను అరికట్టండి

- యూనియన్ అధ్యక్షురాలు దయామణి డిమాండ్
- రుయా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుపై దాడికి ఖండన

అమరావతి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులపై దాడులు పెరిగిపోయాయని నర్సుల యూనియన్ అధ్యక్షురాలు జి.దయామణి తెలిపారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉన్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుపై జరిగిన దాడిని సోమవారం ఒక ప్రకటనలో ఆమె ఖండించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి వైద్య సేవలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. గతంలో కూడా ఒంగోలు రిమ్స్, నెల్లూరు ప్రభుత్వాసుపత్రుల్లో ఇలాంటి దాడులు జరిగాయని గుర్తుచేశారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా నర్సులపై దాడులు ఆగడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి గాయపడిన స్టాఫ్ నర్సుకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు.

మోదీ విధానాలపై పోరాటం: ముప్పాళ్ల

కాకినాడ సిటీ, జూలై 8: ప్రధాని మోదీ హయాంలో దేశంలో మానవహక్కులు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులు హరించుకుపోయాయని, ఆయన విధానాలపై పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధం కావాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు పిలుపునిచ్చారు. కాకినాడలో మూడురోజులపాటు జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. రాజ్యాంగంలో హక్కులు, సమాచార హక్కు చట్టం అంశంపై ముప్పాళ్ల విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మను రాజ్యాంగం అమలు చేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సన్నాహకాలు చేస్తోందని విమర్శించారు.

అధ్యక్ష రేసు నుంచి తప్పుకోండి!



- బైడెన్‌కు ఐదుగురు ఎంపీల వినతి
- జోపై డెమొక్రాటిక్ పార్టీలో అసమ్మతి


వాషింగ్టన్, జూలై 8: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవాలంటూ ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌ను సొంత పార్టీ ఎంపీలే కోరుతున్నారు. ఈ ఏడాది నవంబరు 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా బైడెన్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే.. ఇటీవల ఆయన వృద్ధాప్య మతిమరుపు సమస్యలు ఎదుర్కొంటున్నారన్న విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డెమొక్రాటిక్ పార్టీకే చెందిన ఐదుగురు ఎంపీలు బైడెన్‌ను అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని విన్నవించారు. వీరిలో జెర్రీ నాడ్లెర్, మార్క్ టకానో, జో మొరెల్లే, టెడ్ లియూ, ఆడం స్మిత్‌లు ఉన్నారు. గత నెల 27న మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో బైడెన్ చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైడెన్ కొన్ని ప్రజలకు సమాధానాలు చెప్పలేక పోవడం, తడబడడం తెలిసిందే. ఈ నేపథ్యంలో డెమొక్రాటిక్ పార్టీ మైనారిటీ నాయకుడు హకీం జెఫ్రీస్ ఈ విషయంపై ఎంపీలతో ఫోన్‌లో చర్చించి వారి అభిప్రాయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సదరు ఐదుగురు చట్టసభల సభ్యులు బైడెన్‌ను తప్పుకోవాలని కోరడం గమనార్హం. వీరిలో కీలక సభ్యుడు టెడ్ లియూ అయితే బైడెన్‌ను తప్పించాల్సిందేనని మరింత గట్టిగా పట్టుబడుతున్నారు. వీరితోపాటు మరికొందరు కూడా బైడెన్ ఆరోగ్యంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నాలుగేళ్లపాటు అమెరికాను పాలించే పరిస్థితి ఆయనకు ఉందా? అనే ప్రశ్నలు సైతం లేవనెత్తుతున్నారు. కానీ, మెజారిటీ సభ్యులు మాత్రం బైడెన్‌వైపే మొగ్గు చూపుతున్నారు. ఇక, తనపై వస్తున్న విమర్శలను బైడెన్ తోసిపుచ్చుతున్నారు. అధ్యక్ష రేసులో తానే ఉంటానని, ట్రంప్‌ను ఓడించి తీరుతానన్న నమ్మకం తనకు ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల వర్షం.. 31 మంది మృతి

కీవ్, జూలై 8: ఉక్రెయిన్‌పై రష్యా సోమవారం క్షిపణులతో విరుచుకుపడింది. దేశ రాజధాని కీవ్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాలపై భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 31 మందికిపైగా పౌరులు మృతి చెందారని, 154 మందికిపైగా గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఉన్న దేశంలోనే అతిపెద్ద పిల్లల ఆస్పత్రి ఓఖ్‌మాత్‌డిత్‌తో పాటు దేశంలోని పలు భవనాలపై దాడులు జరిగాయని చెప్పారు. 40కిపైగా క్షిపణులతో తమ దేశంలోని అయిదు నగరాలను లక్ష్యంగా చేసుకుని రష్యా విరుచుకుపడిందని వారు పేర్కొన్నారు. అత్యాధునిక కింజాల్ సూపర్‌సోనిక్ క్షిపణులను రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ వాయుసేన తెలిపింది. దాదాపు 30 వరకు క్షిపణులను తాము ధ్వంసం చేసినట్లు పేర్కొంది. పిల్లల ఆస్పత్రి పాక్షికంగా దెబ్బతిందని, శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 9 జూలై 2024
diksuchi@andhrajyothy.com

క్లాట్ నోటిఫికేషన్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.4,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ అభ్యర్థులకు రూ.3,500
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ ఎన్ఆర్ఐ కోటా

సిద్దిపేట్ జిల్లా-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్‌లో బైపీసీ స్ట్రీమ్ కింద ఆరు సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. టీజీ ఈఏపీసెట్ 2024/ఏ ఇతర ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ స్ట్రీమ్‌లో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదివి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.5000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** బర్త్ సర్టిఫికెట్; ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సుకు సంబంధించిన మార్కుల పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధృవీకరణ పత్రాలు; ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధృవీకరణ పత్రం, ఆర్నెల్ల బ్యాంక్ స్టేట్‌మెంట్.
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీలో డిప్లొమా

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ(ఎస్‌వీవీయూ)- 'డిప్లొమా ఇన్ యానిమల్ హస్బెండరీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 990 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా యూనివర్సిటీ అనుబంధ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల్లో చదివినవారికి నిర్దేశించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు సెమిస్టర్లు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి మూడు సెమిస్టర్లు కోర్సు వర్క్‌లు; చివరి సెమిస్టర్‌లో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ప్రోగ్రామ్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ కోర్సు పూర్తిచేసినవారు 'బీవీఎస్సీ& ఏహెచ్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అనర్హులు. బీఎస్సీ(బయాలజీ స్ట్రీమ్) ప్రోగ్రామ్‌లు, బీ ఒకేషనల్(అగ్రికల్చర్/హార్టికల్చర్) ప్రోగ్రామ్‌లు, (బీఏ/బీకాం)(మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులు కాకుండా) ప్రోగ్రామ్‌లలో చేరవచ్చు.

సీట్లు

- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పది ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 30 చొప్పున మొత్తం 300 సీట్లు ఉన్నాయి.
- రాష్ట్రంలోని 12 ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో ఒక్కోదానిలో 50 సీట్లు చొప్పున మొత్తం 600 సీట్లు ఉన్నాయి.
- ప్రతి పాలిటెక్నిక్ కళాశాలలో అదనంగా పది శాతం సీట్లను ఈడబ్ల్యూఎస్ వర్గానికి నిర్దేశించారు.



ప్రభుత్వ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్ కళాశాలలు: గరివిడి, మడకశిర, వెంకటరామన్నగూడెం, ఆర్‌సీ పురం, పలమనేరు, రాపూర్, బనవాసి, కొమ్మెమర్రి, సాదుం, వెన్నలవలస

అనుబంధ పాలిటెక్నిక్‌లు


- మలినేని లక్ష్మయ్య యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్- సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా
- ఎస్ఎస్&ఎన్ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్- నర్సరావుపేట, గుంటూరు జిల్లా
- డా. అంజలీ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-నాగాయలంక, కృష్ణా జిల్లా
- శ్రీ వేంకటేశ్వర యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-ఎచ్చెర్ల, శ్రీకాకుళం జిల్లా
- చైతన్య భారతి యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-ప్రొద్దటూరు, కడప జిల్లా
- గోకుల్ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-బొబ్బిలి, విజయనగరం జిల్లా
- ఆదరణ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-హంపాపురం, అనంతపురం జిల్లా
- ఫైద యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా
- భూమా శోభానాగిరెడ్డి మెమోరియల్ ఏహెచ్‌పీ-ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లా
- అర్చన యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-ఈ అబ్బవరం, కడప జిల్లా
- శ్రీ వేంకటేశ్వర యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-టక్కోలు, కడప
- శ్రీనివాస యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-జమ్మలమడుగు, కడప జిల్లా.

అర్హత: అభ్యర్థులు ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఐసీఎస్ఈ అభ్యర్థులు సైన్స్ మార్కుల కింద ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో వచ్చిన యావరేజ్ మార్కులను; సోషల్ మార్కుల కింద హిస్టరీ, సివిక్స్, జాగ్రఫీ సబ్జెక్టుల్లో వచ్చిన యావరేజ్ మార్కులను ఎంటర్ చేయాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.880; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.440
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 22
- **వెబ్‌సైట్:** www.svvu.edu.in

జాతీయ అత్యవసర పరిస్థితి (1975)
ఒక సమగ్ర అవగాహన



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఎమర్జెన్సీ విధించిన రోజు రాత్రి వార్తాపత్రికల ముద్రణాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉద్యమకారులు, నాయకుల అరెస్ట్‌ల సమాచారం వ్యాప్తిచెందకుండా సమాచార సాధనాలపై పలు ఆంక్షలు విధించారు. పత్రికలు తీవ్రంగా సెన్సార్‌షిప్‌నకు గురయ్యాయి. రేడియోలో ప్రభుత్వం ఇచ్చిన వార్తా సమాచారం మాత్రమే ఎప్పటికప్పుడు ప్రసారం అవుతుండేది.

జనాభాను నియంత్రించేందుకు వివాహం కాని పురుషులకు కూడా బలవంతంగా కుటుంబ నియంత్రణ(వ్యాసెక్టమీ) ఆపరేషన్లు నిర్వహించారు. ముఖ్యంగా ప్రతిపక్ష యువ నాయకులను లక్ష్యంగా చేసుకున్నారని ఒక ఆరోపణ. ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్ గాంధీ ఈ కార్యక్రమం అమలుకు పూనుకోవడంతోపాటు పెద్ద ఎత్తున ఇతర అధికార దుర్వినియోగాలకు పాల్పడ్డాడని ఆరోపణలు వచ్చాయి. ప్రజల ప్రాథమిక హక్కులపై సైతం ఆంక్షలు విధించారు.

'ఏడీఎం జబల్‌పూర్ వర్సెస్ శివకాంత్ శుక్లా కేసు(1976)'లో అత్యవసర పరిస్థితి కాలంలో జీవించే హక్కు సహా అన్ని ప్రాథమిక హక్కులపై ప్రభుత్వం దేశ భద్రత దృష్ట్యా పరిమితులు విధించవచ్చని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీనితో ఎమర్జెన్సీ కారణంగా ప్రకరణ 359 ప్రకారం ప్రజలు జీవించే హక్కు సహా ఇతర హక్కులను కోల్పోయినట్లయింది.

అత్యవసర పరిస్థితి కాలంలో తమ చర్యల సానుకూలత కోసం, అధికారాన్ని నిలుపుకోవడానికి ఇందిర ప్రభుత్వం ప్రధానంగా మూడు రాజ్యాంగ సవరణలు చేసింది. అవి 1975లో 38వ, 39వ; 1976లో చేసిన 42వ రాజ్యాంగ సవరణ.

38వ రాజ్యాంగ సవరణ ప్రకారం రాష్ట్రపతి విధించిన అత్యవసర పరిస్థితిని, రాష్ట్రపతి-గవర్నర్లు-లెఫ్ట్‌నెంట్ గవర్నర్లు జారీ చేసే ఆర్డినెన్స్‌లను కోర్టుల న్యాయ సమీక్షాధికార పరిధి నుంచి తప్పించారు. 39వ రాజ్యాంగ సవరణను ఇందిరాగాంధీ తన ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును అధిగమించేందుకు చేసిన సవరణగా చెబుతుంటారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు సంబంధించిన అంశాలేవీ న్యాయ సమీక్ష పరిధిలోకి రాకుండా ఉండేలా ఈ సవరణను రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ అధికారాలు, ప్రధాని అధికారాలను మరింతగా పెంచేలా 42వ రాజ్యాంగ సవరణ రూపొందింది. రాష్ట్ర చట్టాలను అధిగమించేందుకు, దేశంలోని ఏ ప్రాంతంలోనైనా కేంద్ర దళాలు మోహరించేందుకు, జాతి విద్రోహ కార్యక్రమాల సందర్భంలో ప్రాథమిక హక్కులను ఆసాంతం నిరాకరించే చట్టాలు అమలు చేసేందుకు, కేంద్ర, రాష్ట్ర శాసన సభల కాలపరిమితిని సైతం పెంచేందుకు ఈ సవరణ వీలు కల్పించింది. ఈ విధంగా ఎమర్జెన్సీ కాలంలో ప్రకరణ 352 నుంచి 360 వరకు గల అత్యవసర అధికారాలు తీవ్ర మార్పులకు గురయ్యాయి. దేశవ్యాప్తంగా చట్టాలు చేసే అధికారం కేంద్రానికే లభించి అధికార కేంద్రీకరణకు కారణమైంది.

> **ఎమర్జెన్సీ ఎత్తివేత**
>
> 1977 జనవరి 18న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మార్చి 16 నుంచి 20 వరకు ఎన్నికలు జరిగిన అనంతరం 1977 మార్చి 21న ఎమర్జెన్సీని ఎత్తివేశారు.

ఎమర్జెన్సీ అత్యవసర పరిస్థితులు

- 1977 సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.
- అత్యవసర పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ అధికారాలు, ప్రాథమిక హక్కుల పరంగా భారీ సవరణలు చేసిన రాజ్యాంగాన్ని తిరిగి సంస్కరించేందుకు జనతా ప్రభుత్వం పూనుకుంది. మరో భారీ సవరణ చేసింది. అదే 1978లో రూపొందించిన 44వ రాజ్యాంగ సవరణ. దీని ప్రకారం అత్యవసర పరిస్థితి విధించిన సందర్భాల్లోనూ రాజ్యాంగ ప్రకరణ 21 ద్వారా వస్తున్న ప్రాథమిక హక్కు అయిన 'జీవించే హక్కు'ను రద్దు పరచరాదు. అదేవిధంగా 'బాహ్య కారణాల వల్ల' అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు మాత్రమే ప్రకరణ 19లోని స్వేచ్ఛలు పరిమితమవుతాయి. 'సాయుధ తిరుగుబాటు' కారణంగా అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు వీటిపై ప్రభావం ఉండదు. అత్యవసర పరిస్థితికి సంబంధించిన చట్టాలు మినహా ఇతర చట్టాల ద్వారా రాజ్యాంగ స్వేచ్ఛలపై పరిమితులు విధించేందుకు వీలు లేదు. హక్కుల రద్దు అంశాలకు సంబంధించిన ప్రకరణలైన 358, 359లను 44వ రాజ్యాంగ సవరణ పరిమితం చేసింది. అంతేకాకుండా రాష్ట్రపతి జారీ చేసిన అత్యవసర పరిస్థితి ప్రకటనను తిరిగి న్యాయ సమీక్షాధికార పరిధిలోకి తీసుకొచ్చారు.
- 'క్యాబినెట్', 'లిఖిత పూర్వక' అనే పదాలను ప్రకరణ 352(3)లో చేర్చి ప్రధాని అధ్యక్షతన గల 'క్యాబినెట్ స్థాయి మంత్రుల 'లిఖిత పూర్వక' సలహా మేరకు మాత్రమే రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తారని సూచిస్తూ జాతీయ అత్యవసర పరిస్థితి విధింపు విధానాన్ని కొంత క్లిష్టం చేశారు.
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన తేదీ నుంచి నెల రోజుల లోపు అత్యవసర పరిస్థితి ప్రకటనను ప్రత్యేక మెజారిటీతో పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఒకవేళ అత్యవసర పరిస్థితి ప్రకటించే సమయానికి లోక్‌సభ రద్దయి ఉంటే తిరిగి కొత్త లోక్‌సభ ఏర్పడిన రోజు నుంచి 30 రోజులలోగా ఆమోదించాల్సి ఉంటుంది. ఈలోగా రాజ్యసభ అత్యవసర పరిస్థితి ప్రకటనను ఆమోదించాలి. లేనిచో 30 రోజుల తరవాత అత్యవసర పరిస్థితి తనంతతానుగా రద్దయిపోతుంది.
- ఒకసారి పార్లమెంట్ ఆమోదం పొందితే అత్యవసర పరిస్థితి ఆరు నెలల వరకు అమలులో ఉంటుంది. ఈవిధంగా ఆర్నెల్లకోసారి పార్లమెంట్ ప్రత్యేక మెజారిటీతో ఆమోదించి అత్యవసర పరిస్థితిని ఎన్ని పర్యాయాలైనా పొడిగించవచ్చని సవరణ చేశారు.
- 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 352లోని 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో 'సాయుధ తిరుగుబాటు'అనే పదాన్ని చేర్చారు. కనుక జాతీయ అత్యవసర పరిస్థితిని(ప్రకరణ 352) విధించాలంటే విదేశీ దాడి, యుద్ధం వంటి బాహ్య కారణాలు; సాయుధ తిరుగుబాటు వంటి అంతర్గత కారణాల రీత్యా మాత్రమే వీలవుతుంది. అదేవిధంగా 44వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ అత్యవసర పరిస్థితి రద్దుకు సంబంధించిన తీర్మానాన్ని కేవలం సాధారణ మెజారిటీతో ఆమోదించినా సరిపోతుంది అని అత్యవసర పరిస్థితి రద్దును సరళతరం చేశారు. లోక్‌సభ సమావేశంలో లేకుంటే లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో 1/10వ వంతు మంది సభ్యులు లోక్‌సభ ప్రత్యేక సమావేశం కోసం స్పీకర్ లేదా రాష్ట్రపతికి నోటీసు పంపినపుడు 14 రోజుల్లోపు రాష్ట్రపతి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంటుందని 44వ రాజ్యాంగ సవరణ నిర్ధారించింది.
- 1975 నుంచి 77 మధ్య కాలంలో కొనసాగిన జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో సంభవించిన అధికార దుర్వినియోగం, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన వంటి అనేక ఆరోపణలపై నిజ నిర్ధారణకు జనతా ప్రభుత్వం 1977లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జయంతి లాల్ ఛోటా లాల్‌షా నేతృత్వంలో 'షా కమిషన్'ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 1978లో సమర్పించిన నివేదికలో పేర్కొన్న సంఘటనలపై విచారణ జరిపేందుకు జనతా ప్రభుత్వం ప్రత్యేక కోర్టులను కూడా ఏర్పాటు చేసింది. జనతా ప్రభుత్వం 1979లో కూలిపోయింది. 1980లో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ ప్రభుత్వం 'షా కమిషన్' నివేదికను ఉపసంహరించింది. సుప్రీంకోర్టు కూడా ప్రత్యేక కోర్టులు చెల్లవని తీర్పు చెప్పడంతో ఈ అంకానికి తెర పడింది.
- ఎమర్జెన్సీ కాలం నాటి పరిస్థితులు, ఇందిరాగాంధీ అవలంబించిన నిరంకుశ ధోరణి మాత్రం భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఎప్పటికీ ఒక మాయని మచ్చగానే మిగిలిపోయింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

చిన్నారి




నిజాయితీ

ఒక ఊరిలో రామయ్య, రాజయ్యఅనే ఇద్దరు వర్తకులు ఉండేవారు వారిద్దరికీ వ్యాపారంలో చాలా పోటీ ఉండేది. ఒకరోజు రాజయ్య దగ్గరికి తేజఅనే యువకుడు వచ్చిఏదైనా ఉద్యోగం ఇప్పించమని అడిగాడు. అందుకు రాజయ్య ఆ యువకుడిని అలా అడిగాడ 'ఏం బాబూ? నువ్వు ఇంతకు ముందు ఆ రామయ్య దగ్గర పని చేశావు రదూ, అక్కడ పని ఎందుకు మానేశావు? అని అడిగాడు. దానికి తేజ అక్కడ జీతం సరిపోవట్లేదు అని మానేశాను అండి అని చెప్పాడు. మరి కొన్ని రోజులు



పోయాక ఇక్కడ కూడా జీతం తక్కువ అని పని మానేస్తే ఎలా?అన్నాడు రాజయ్య ' జీతం నీకు కావలసినంత ఇస్తాను కానీ,ఆ రామయ్య వ్యాపారం గురించి నీకు తెలిసిన రహస్యాలు నాకు చెప్పాలి' అన్నాడు రాజయ్య. ఆ మాటలు విన్న తేజ 'అది మీరే మెచ్చరు అండీ. నేనలా చెబితే, రేపు మరలా నా వ్యాపార రహస్యాలు మరో చోట చెప్పవని నమ్మకం ఏమిటి?' అని మీరే అనుమానిస్తారు' అన్నాడు తేజ. ఆ మాటలకు రాజయ్య నవ్వి 'నీకు నిజాయితీఉందని చెబుతున్నావు. అదేకాక మంచి తెలివి తేటలు కూడా ఉన్నాయి' ఈ రోజునుండే పనిలో చేరుదువు గాని అంటూ తేజ కు ఉద్యోగం ఇచ్చాడు రాజయ్య.

7 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 353

6		8		2				7
	4	2					5	
	9				8			1
4			9				3	
			7		2			
	6				3			9
3			5				7	
	7					5	1	
5				1		9		4

సుడోకు - 352 సమాధానం

1	4	9	2	7	8	5	3	6
8	7	5	6	3	1	2	4	9
6	2	3	9	5	4	8	1	7
9	6	2	4	8	7	1	5	3
7	1	8	5	2	3	6	9	4
3	5	4	1	6	9	7	8	2
4	8	6	3	1	2	9	7	5
5	9	1	7	4	6	3	2	8
2	3	7	8	9	5	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.